సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 299

సోమవారం 20-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



‘జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు’



యువ భారత్ శుభారంభం

మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో విండీస్‌పై గెలుపు -14లో



బహుమతి పుచ్చుకుంటున్నారా?

పన్ను బాధ్యత తెలియాల్సిందే రూ.50,000కు మించితే పన్ను -15లో



సముద్ర గర్భంలో ఆక్సిజన్!

సముద్ర గర్భంలో చిమ్మచీకటిగా ఉన్న ప్రదేశాల్లోనూ ఆక్సిజన్ జాడను తొలిసారిగా కనుగొన్నామని శాస్త్రవేత్తలు ప్రకటించారు.

వివరాలు 6లో ▸



సైఫ్‌ను పొడిచింది బంగ్లాదేశీ

నటుడు సైఫ్ అలీఖాన్‌ను కత్తితో పొడిచిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతన్ని బంగ్లాదేశీయుడిగా తేల్చారు.

వివరాలు 6లో ▸



అమల్లోకి కాల్పుల విరమణ

హమాస్, ఇజ్రాయెల్ మధ్య 15 నెలల యుద్ధానికి తాత్కాలికంగా తెరదించుతూ కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది.

వివరాలు 6లో ▸



మహాకుంభ్‌లో అగ్నిప్రమాదం

ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో సిలిండర్లు పేలడంతో 18 గుడారాలను మంటలు చుట్టుముట్టాయి.

వివరాలు 6లో ▸

రాజధానిలో కొత్త ఐటీ పార్క్

హైదరాబాద్‌లో రూ. 450 కోట్లతో ఏర్పాటుకు ముందుకొచ్చిన క్యాపిటల్యాండ్

సింగపూర్‌లో రాష్ట్ర ప్రతినిధి బృందంతో చర్చలు, ఒప్పందం

ముగిసిన సీఎం సింగపూర్ పర్యటన.. చివరిరోజు పారిశ్రామికవేత్తలతో వరుస భేటీలు

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరిన రాష్ట్ర బృందం



క్యాపిటల్యాండ్ ఈడీ మనోహర్ కియాతానీకి జ్ఞాపికను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో సంస్థ సీఈవో గౌరీశంకర్, మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: సింగపూర్‌కు చెందిన క్యాపిటల్యాండ్ రియల్ ఎస్టేట్ సంస్థ హైదరాబాద్‌లో రూ.450 కోట్లతో అత్యాధునిక ఐటీ పార్కు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఐటీ పార్క్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆదివారం క్యాపిటల్యాండ్ ప్రతినిధి బృందంతో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, క్యాపిటల్యాండ్ సంస్థ పరస్పర అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. క్యాపిటల్యాండ్ కొత్త ఐటీ పార్కు హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని సీఎం రేవంత్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. బ్లూచిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలను ఈ ఐటీ పార్కులో అందుబాటులో ఉంచనున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్ సారథ్యంలో హైదరాబాద్ సుస్థిరంగా వృద్ధి చెందుతోందని, అక్కడ తమ సంస్థ కార్యకలాపాలను విస్తరించటం ఆనందంగా ఉందని క్యాపిటల్యాండ్ ఇండియా ట్రస్ట్ మేనేజ్‌మెంట్ సీఈవో గౌరీ శంకర్ నాగభూషణం పేర్కొన్నారు.

ఇప్పటికే పలు పెట్టుబడులు..

క్యాపిటల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్ పార్క్ (ఐటీపీహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్ పెర్ల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలో అందుబాటులోకి రానుంది. ఐటీపీహెచ్ రెండో దశ కూడా ఈ ఏడాది ప్రారంభమై 2028 నాటికి పూర్తి కానుంది. సింగపూర్‌లో జరిగిన ఈ చర్చల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఉన్నతాధికారులు, క్యాపిటల్యాండ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్ కియాతానీ పాల్గొన్నారు.

మెరీనా బేలో సీఎం పడవ ప్రయాణం

సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌లోని మెరీనా బేలో ఫెర్రీ ప్రయాణం చేశారు. మెరీనా బే తీరంలో నిర్మించిన ఆకాశహర్మ్యాలను తిలకించి, వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పర్యాటకాభివృద్ధికి

మిగతా 2వ పేజీలో ▶

చివరి రోజు వరుస సమావేశాలు

సింగపూర్ పర్యటనలో ఆదివారం సీఎం బృందం వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. ఇండియన్ ఓషన్ గ్రూప్ ఫౌండర్, సీఈవో ప్రదీప్తో బిశ్వాస్, డీబీఎస్ కంట్రీ హెడ్ లిమ్ హిమ్ చౌన్, డీబీఎస్ గ్రూప్ హెడ్ అమిత్ శర్మ, బ్లాక్ స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండీ, చైర్మన్ గౌతమ్ బెనర్జీ, బ్లాక్ స్టోన్ రియల్ ఎస్టేట్ సీనియర్ ఎండీ పెంగ్ వీ టాన్, మెయిన్ హార్ట్ గ్రూప్ సీఈవో ఒమర్ షాజాద్‌తో భేటీ అయింది. హైదరాబాద్‌లో పెట్టుబడుల అవకాశాలు, ప్రభుత్వ విధానాలను వివరించింది.

ప్రమాణ స్వీకార వేడుకల్లో భాగంగా వాషింగ్టన్‌లోని నేషనల్ గోల్ఫ్ క్లబ్‌లో అభిమానులు, మద్దతుదారులు కాలుస్తున్న బాణసంచాను తిలకిస్తున్న ట్రంప్ దంపతులు



నేడే పట్టాభిషేకం

అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో అతిరథ మహారథుల సమక్షంలో అట్టహాసంగా జరగనున్న కార్యక్రమం

- చలి తీవ్రత దృష్ట్యా ఆరుబయట బదులు 40 ఏళ్లలో తొలిసారిగా రోటిండా హాల్‌కు మారిన ప్రమాణ స్వీకార వేదిక
- ఆహూతుల సంఖ్య 500కు కుదింపు.. జాబితాలో అంబానీలు.. ట్రంప్ ఇచ్చిన విందు వేడుకకు హాజరు.. భారత్ తరపున హాజరవనున్న విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్
- కోర్టు అనుమతితో కార్యక్రమంలో పాల్గొననున్న 2021 క్యాపిటల్ హిల్‌పై దాడి కేసు నిందితులు!
- టిక్‌టాక్‌పై నిషేధాన్ని ఎత్తేస్తూ తొలి సంతకం చేస్తానన్న ట్రంప్.. 100కుపైగా ఉత్తర్వుల జారీ!

6లో

ఏప్రిల్‌లో ట్రంప్ భారత్ పర్యటన?

న్యూస్‌రీల్


ఎన్‌పీఏలో ఇండోర్ షూటింగ్ రేంజ్



సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ ట్రైనీల కోసం ఏర్పాటు చేయనున్న కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

- వివరాలు 3లో▶

అడ్మిట్ కార్డులు రెడీ



ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకూ జరిగే జేఈఈ మెయిన్స్‌కు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అందుబాటులోకి తెచ్చింది.

- వివరాలు 16లో▶


మరోసారి ఏసీబీ పిలుపులు?



ఫార్ములా–ఈ రేస్ కేసులో నిందితులను మరోమారు విచారణకు పిలవాలని ఏసీబీ భావిస్తోంది. ఏ–1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు ఏ–2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ–3.. హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డికి నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతోంది.

- వివరాలు 2లో▶

కేసీఆర్, హరీశ్, ఈటలకు సమన్లు?



కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ చివరి అంకానికి చేరింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ కోసం కమిషన్ పిలిచే అవకాశం ఉంది. సోమవారం వారికి సమన్లు జారీ చేయవచ్చని సమాచారం.

- వివరాలు 2లో▶



తక్షణమే ప్రక్షాళన..!

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితిపై విద్యా కమిషన్ సూచన

త్వరలోనే ముఖ్యమంత్రికి అధ్యయన నివేదిక



- వర్సిటీలు పుట్టెడు సమస్యల్లో ఉన్నాయని గుర్తింపు.. కనీస స్థాయి పరిశోధనలు కూడా చేపట్టలేని దైన్యస్థితిలో ఉన్నత విద్యాసంస్థలు
- తగిన నిధులు లేవు.. ఏళ్లకేళ్లుగా నియామకాల ఊసే లేదు
- ప్రతిష్ట దెబ్బతింటోందన్న భావన వ్యక్తం చేసిన విద్యా కమిషన్!
- తక్షణ చర్యలు చేపట్టకపోతే కనీస ప్రమాణాలు కూడా కరువయ్యే అవకాశం ఉందని ఆందోళన

వివరాలు 2లో▶

ఏజ్.. ఇక్కడ జస్ట్ నంబరే!

వృద్ధాప్యంలోనూ చురుగ్గా వ్యవసాయ పనులు

ఆ పల్లెల్లో ఆరోగ్య సిరులు.. చిరుధాన్యాల ఆహారమే ఆరోగ్య రహస్యం

దరిచేరని బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు

సంగారెడ్డి జిల్లాలోని సిరిధాన్యాల సాగు గ్రామాల్లో ‘సాక్షి’ ఫీల్డ్ విజిట్ 16లో



పానమంతా నీ మీదనే ఉన్నది..

ఓసారి కనపడు బిడ్డా..

దశాబ్దాలుగా అజ్ఞాతంలోనే సీనియర్ మావోయిస్టులు

- ఎన్‌కౌంటర్‌లో దామోదర్ మృతిచెందారన్న ప్రచారం నేపథ్యంలో తమవారి కోసం కుటుంబాల ఆవేదన
- ఎక్కడ ఎన్‌కౌంటర్ అయినా వారి గుండెల్లో ఆందోళన
- తమవాళ్లు ఎక్కడంటూ వెతుకులాట.. ఒక్కసారైనా చూడాలని ఆరాటం

5లో

వచ్చి చూసి పో కొడుకా..



నా పానం పోకముందే ఓసారి కనపడు బిడ్డా.. నా కండ్లతో చూసినంక పానం విడవాలని ఉంది. షుగర్, బీపీ, మెడ నొప్పులు, కాళ్ల నొప్పులతోటి బాధపడుతున్న. చెవులు వినపడతలేవు. నిన్ను చూడాలని నా కండ్లు ఎదురుచూస్తున్నాయి. పానమంతా నీ మీదనే ఉన్నది. నీకోసం గోలీలు మింగే బతుకుతున్న. ఒక్కసారి వచ్చి చూసి పో కొడుకా..

-మావోయిస్టు అగ్రనేత కంకణాల రాజిరెడ్డి తల్లి వీరమ్మ

బడే దామోదర్‌కు ఏమైంది?

- ఘటనాస్థలిలో మావోయిస్టు అగ్రనేత గాయపడినట్టుగా సమాచారం.. చనిపోయాడని నిర్ధారించని పోలీసులు
- ఫేక్ లేఖ అంటున్న దామోదర్ అనుచర వర్గాలు

5లో

రాష్ట్రంలో అత్యంత అసమర్థ ప్రభుత్వం

ఆర్థిక శాఖలో ఫైలు కదలాలంటే 7–10 శాతం కమీషన్ ఇవ్వాల్సిందే: ఈటల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యంత అసమర్థమైన ప్రభుత్వం ఉందని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అత్యంత అవినీతిమయ ప్రభుత్వం కూడా ఇదేనని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి అసమర్థ ప్రభుత్వాన్ని చూడలేదన్నారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంలో ఎలాంటి బిల్లులు క్లియర్ కావాలన్నా ఆర్థిక శాఖ అనుమతి తప్పనిసరైందని, ఫైలు కదలాలంటే 7 నుంచి 10 శాతం కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనని ఆరోపించారు. కార్యకర్తస్థాయిలోనే వసూళ్ల దుకాణాలు తెరిచారని, మళ్లీ అవకాశం వస్తుందో.. రాదోననే ఆందోళనతో అందినకాడికి దోచుకుంటున్నారని మండిపడ్డారు. దేశంలోనే అత్యంత పాతవైన బాలాజీనగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పేదల ఇళ్లను హైడ్రా, మున్సిపల్ అధికారులు కూల్చివేశారన్నారు. కేవలం పేదల ఇళ్లే లక్ష్యంగా కూల్చివేతలు జరుగుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారుల ఆగడాలు విపరీతంగా పెరిగాయని, డబ్బులిస్తేనే ఇళ్ల కూల్చివేతలు ఆగుతున్నాయన్నారు. బాలాజీనగర్, జవహర్‌నగర్‌లోని భూములపై ప్రభుత్వానికి హక్కు లేదని హైకోర్టు మొట్టికాయలు వేసినా ఎలా కూల్చివేస్తున్నారని ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణపై అవగాహన లేని వ్యక్తులు ఏదేదో మాట్లాడుతున్నారని, మిడిమిడి జ్ఞానంతో ఉన్నవారు, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రులు, అధికార యంత్రాంగంపై ఏమాత్రం పట్టు లేదని, అధికారులే బ్రోకర్లుగా మారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం తెచ్చేవన్నీ బూటకపు పెట్టుబడులు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టుబడులు తెస్తున్నానంటూ చెప్పేవన్నీ బూటకమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. ఆయన తెలంగాణ భవన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సీఎం దావోస్ పర్యటన వల్ల రాష్ట్రానికి కొత్తగా వచ్చిన పెట్టుబడులు రూ.862 కోట్లు మాత్రమేనన్నారు. అందులో రూ.630.5 కోట్ల పెట్టుబడుల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే రూ.14,500 కోట్ల పెట్టుబడుల కోసం అంగీకారం కుదిరిందని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి నిర్ణయాలతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలతో రూపాయి లాభం లేదని, ఫార్మాసిటీ, ఎయిర్ పోర్ట్, మెట్రో, ఫార్ములా ఈ రేస్ రద్దు చేశారని విమర్శించారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేస్తానంటూ.. తెలంగాణకు నష్టం చేస్తున్నారన్నారు.



స్కైలో సర్ఫింగ్

సీలో కాకుండా స్కైలో సర్ఫింగ్ చేస్తున్నట్లు కనిపిస్తున్న ఈ చిత్రం వరల్డ్ స్పోర్ట్స్ ఫొటోగ్రఫీ పురస్కారాల్లో మొదటి బహుమతిని గెలుచుకుంది. మొత్తం 13 వేల ఎంట్రీలు రాగా.. ఫ్రెంచ్ ఫొటోగ్రాఫర్ జెరోం తీసిన ఈ చిత్రం విజేతగా నిలిచింది. గతేడాది జరిగిన ఒలింపిక్స్‌లో సర్ఫింగ్ ఈవెంట్‌లో తన బెస్ట్ స్కోర్‌ను నమోదు చేసిన అనంతరం ఓ సర్ఫర్ దేవుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నప్పుడు ఈ ఫొటోను తీశారు.

పాల సముద్రంలా 'లంబసింగి'



ఆంధ్రా కశ్మీరుగా పేరొందిన లంబసింగికి పర్యాటకులు భారీగా చేరుకుంటున్నారు. ఇక్కడ కురుస్తున్న భారీ పొగమంచు మరింత ఆహ్లాదకరంగా ఉండి, పర్యాటకులను ఎంతో ఆకర్షిస్తోంది.. ఇక్కడ పొగ మంచు పాల సముద్రంలా దర్శనమిస్తోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, వైజాగ్

తక్షణమే సమూల ప్రక్షాళన!

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితిపై విద్యా కమిషన్ సూచన

త్వరలోనే ముఖ్యమంత్రికి అధ్యయన నివేదిక

వర్సిటీలు పుట్టెడు సమస్యల్లో ఉన్నాయని గుర్తింపు

కనీస స్థాయి పరిశోధనలు కూడా చేపట్టలేని దైన్యస్థితిలో ఉన్నత విద్యాసంస్థలు

తగిన నిధులు లేవు.. ఏళ్లకేళ్లుగా నియామకాల ఊసే లేదు

ప్రతిష్ట దెబ్బతింటోందన్న భావన వ్యక్తం చేసిన విద్యా కమిషన్!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు నిధులు, నియామకాల లేమితో కునారిల్లుతున్నాయని.. వాటిని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని విద్యా కమిషన్ తేల్చినట్టు సమాచారం. బోధన సిబ్బంది కొరత, తాత్కాలిక అధ్యాపకులతో నెట్టుకురావడం, అరకొర నిధులు వంటి కారణాలతో ఉన్నత విద్యాసంస్థల్లో ప్రమాణాలు దెబ్బతింటున్నాయని గుర్తించినట్టు తెలిసింది. ప్రస్తుతం కనీస స్థాయి పరిశోధనలైనా చేపట్టలేని దైన్యస్థితిలో వర్సిటీలు ఉన్నాయని.. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తక్షణమే చర్యలు చేపట్టకుంటే కనీస ప్రమాణాలు కూడా కరువయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వానికి స్పష్టం చేయనున్నట్టు సమాచారం. ఈ మేరకు త్వరలోనే ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించనున్నట్టు కమిషన్ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని యూనివర్సిటీల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం చేసి.. వివిధ వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాలు, నేరుగా పరిశీలించిన అంశాలు, తీసుకోవాల్సిన చర్యలతో ఈ నివేదికను సిద్ధం చేసినట్టు వెల్లడించాయి.

పోటీ ఎక్కడ?

మన వర్సిటీలు కనీసం జాతీయ స్థాయిలోనూ పోటీ పడలేని పరిస్థితి ఉందని విద్యా కమిషన్ గుర్తించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని 11 వర్సిటీల్లో రెండింటికి 'జాతీయ మదింపు, గుర్తింపు కౌన్సిల్ (న్యాక్)' గ్రేడ్ కూడా రాలేదని.. 'ఎ' ప్లస్ గ్రేడ్ దక్కించుకున్న వర్సిటీలు కేవలం రెండేనని కమిషన్ వర్గాలు తెలిపాయి. వర్సిటీల్లో 2,825 అధ్యాపక పోస్టులుండగా.. ప్రస్తుతమున్న రెగ్యులర్ సిబ్బంది 873 మంది మాత్రమేనని.. బోధన, బోధనేతర సిబ్బందిని కలిపి చూసినా 74 శాతం పోస్టులు ఖాళీయేనని పేర్కొన్నాయి. అంతా తాత్కాలిక సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారని తెలిపాయి.

ప్రాజెక్టులు డొల్ల.. పరిశోధనలు కల్ల..

- వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో కీలకమైన పరిశోధనలు క్రమంగా తగ్గుతున్నాయి. 2020–21లో రూ.52.45 కోట్ల విలువైన ప్రాజెక్టులొస్తే.. 2022–23 నాటికి ఇది రూ.24.75 కోట్లకు తగ్గింది. ఇక్కడ 1,267 మంది బోధన సిబ్బందికిగాను 340 మందే రెగ్యులర్ వారున్నారు. మిగతా అంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారే. వారికి పరిశోధనలకు మార్గదర్శకత్వం వహించే అవకాశం లేదు. జాతీయ స్థాయిలో గుర్తింపున్న ఈ వర్సిటీకి గతంలో మాదిరిగా కేంద్ర ప్రభుత్వ శాఖల పరిశోధన ప్రాజెక్టులూ అరకొరగానే వస్తున్నాయి.
- రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యకు ఆయువు పట్టు అయిన జేఎన్టీయూహెచ్ కొత్త సాంకేతిక పరిజ్ఞానం కోసం రూ.200 కోట్లు ఇవ్వాలని కోరినా పట్టించుకున్నవారు లేరు. వర్సిటీలో 410 మంది ఫ్యాకల్టీకిగాను ఉన్నది 169 మందే. దీనితో కీలకమైన ఇంజనీరింగ్ బోధనలో ప్రమాణాలు దెబ్బతింటున్నాయి.
- మెరికల్లాంటి గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాసరలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) క్రమంగా వైభవాన్ని కోల్పోతోంది. 2008 నుంచి 2024 ఏప్రిల్ వరకూ ఇక్కడ 21 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం దారుణం. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లేదు. ల్యాప్‌టాప్‌లు, ఆధునిక వసతులు అందుబాటులో లేవు. 90 మంది బోధన, 100 మంది బోధనేతర సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు.
- పాలమూరు వర్సిటీలో పరిస్థితి దారుణంగా ఉందని కమిషన్ దృష్టికొచ్చింది. పేరుకు రూ.10 కోట్ల నిధులు కేటాయించినా రూ.7 కోట్లు కూడా అందడం లేదని.. కొల్లాపూర్, వనపర్తి పీజీ కేంద్రాల్లో వేతనాలు, ఇతర ఖర్చులకే నెలకు రూ.1.28 కోట్లు అవుతున్నాయని అధికారులు అంటున్నారు. నిధుల కోసం విద్యార్థుల పరీక్షలు, ప్రవేశ పరీక్షలు, బోధన రుసుములపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. తాత్కాలిక అధ్యాపకులతో బోధన కొనసాగుతోందని అంటున్నారు.
- తెలంగాణ వర్సిటీకి 152 ప్రొఫెసర్ పోస్టులు మంజూరైతే... ఉన్నది 61 మందే. 12 సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులున్న ఈ వర్సిటీని అకడమిక్ కన్సల్టెంట్లు, పార్ట్ టైం అధ్యాపకులతో నెట్టుకొస్తున్నారు. వర్సిటీకి కనీసం రూ.250 కోట్ల తక్షణ నిధులు అవసమని అంచనా.
- కాకతీయ వర్సిటీలోనూ పరిశోధనలు సగం మేర తగ్గిపోయాయి. 405 అధ్యాపక పోస్టులకుగాను 83 మందే రెగ్యులర్ వారు. మిగతా అంతా తాత్కాలిక సిబ్బందే. నిజానికి ఇక్కడ కొత్తగా ప్రవేశపెట్టిన కోర్సులను కలిపితే వెయ్యి మంది వరకూ అధ్యాపకులు ఉండాలని అంచనా.

రాష్ట్రంలోని వర్సిటీలకు న్యాక్ గుర్తింపు ఇదీ..

యూనివర్సిటీ	న్యాక్ గ్రేడ్
ఓయూ	ఏ ప్లస్
కాకతీయ	ఏ ప్లస్
జేఎన్టీయూహెచ్	ఏ
పీయూ, ఎంజీయూ	బి
తెలంగాణ	బి
ఆర్జీయూకేటీ	బి
ఆర్కిటెక్చర్	బి
అంబేడ్కర్	-
శాతవాహన	-

యూనివర్సిటీలలో బోధన సిబ్బంది పరిస్థితి ఇదీ..

యూనివర్సిటీ	మొత్తం పోస్టులు	ఉన్న సిబ్బంది	ఖాళీలు
ఉస్మానియా	1,257	376	891
కాకతీయ	409	86	323
జేఎన్టీయూహెచ్	410	169	241
అంబేడ్కర్	86	34	52
తెలంగాణ	152	61	91
మహాత్మాగాంధీ	70	35	35
పాలమూరు	95	21	74
శాతవాహన	63	16	47
జేఎన్ ఫైనార్ట్స్	55	17	58
పీఎస్టీయూ	72	14	58
ఆర్జీయూకేటీ	146	19	127

యూనివర్సిటీల స్థాయి పెరగాలి



విశ్వవిద్యాలయాలకు ఇప్పుడు జాతీయ స్థాయిలో గుర్తింపు కాదు.. అంతర్జాతీయ గుర్తింపు అవసరం. అది సాధ్యం కావాలంటే వర్సిటీల స్థాయి, ప్రమాణాలు పెరగాలి. బోధన సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి. లైబ్రరీ, పరిశోధన అవకాశాలు, సరికొత్త టెక్నాలజీలను సమకూర్చాలి. ఈ అంశాలన్నింటిపై సమగ్ర అధ్యయనం చేశాం. త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వబోతున్నాం.

- ఆకునూరి మురళి, విద్యా కమిషన్ చైర్మన్

కేసీఆర్, హరీశ్, ఈటలకు సమన్లు?

నేడు జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ జారీ చేసే అవకాశం

చివరి అంకానికి చేరిన కాళేశ్వరం బరాజ్‌లపై విచారణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ చివరి అంకానికి చేరింది. ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్న జస్టిస్ చంద్రఘోష్ మంగళవారం నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునఃప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆయన పలు దఫాలుగా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించగా, ఇదే తుది విడత క్రాస్ ఎగ్జామినేషన్ కావొచ్చని అధికారవర్గాలు తెలిపాయి. గత క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరుకాలేకపోయిన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ఈ దఫాలో కమిషన్ ప్రశ్నించనుంది. దీంతో అధికారుల వంతు పూర్తికానుంది. బరాజ్‌ల నిర్మాణ సంస్థల ప్రతినిధులతోపాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆడిట్ నిర్వహించిన కాగ్ అధికారులను సైతం కమిషన్ ఇదే దఫాలో ప్రశ్నించనుంది. అనంతరం చివర్లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, నాటి ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ కోసం కమిషన్ పిలిచే అవకాశం ఉంది. సోమవారం వీరికి కమిషన్ కార్యాలయం నుంచి సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధమున్న నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్సీలు, ఇతర కీలక ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్లతో పాటు ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను ఇప్పటికే కమిషన్ ప్రశ్నించింది. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్‌ను మార్చడంతో పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ స్థలాల ఎంపిక, ఇతర అంశాల్లో కేసీఆర్, హరీశ్‌రావు కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పటికే పలువురు ఇంజనీర్లు, మాజీ ఇంజనీర్లు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు కమిషన్ ముందు వాంగ్మూలం ఇచ్చారు. వీరందరి నుంచి సేకరించిన సాక్ష్యాధారాల ఆధారంగా కేసీఆర్, హరీశ్‌రావును కమిషన్ ప్రశ్నించనుంది. కమిషన్ గడువు ఫిబ్రవరితో పూర్తికానుండగా, ఆలోపే ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

మరోసారి ఏసీబీ పిలుపులు?

ఫార్ములా ఈ రేస్ కేసులో విచారణ

కేటీఆర్ తదితరులకు త్వరలో నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ రేస్ కేసులో నిందితులను మరోమారు విచారణకు పిలవాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు. ఏ–1గా ఉన్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు ఏ–2.. ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ–3.. హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్‌ఎన్ రెడ్డిలకు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో కేటీఆర్‌కు రెండురోజుల్లోనే మరోమారు నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ఈనెల 9న కేటీఆర్‌ను ఏడు గంటలపాటు విచారించిన విషయం తెలిసిందే. తాజాగా శనివారం.. కార్ రేసు నిర్వహణలో స్పాన్సర్‌గా వ్యవహరించిన ఏస్ నెక్స్ట్‌జెన్, దాని అనుబంధ సంస్థ గ్రీన్‌కో ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను విచారించిన అధికారులు కీలక వివరాలు రాబట్టినట్టు తెలిసింది. రేస్ నిర్వహణ, అందుకు సంబంధించి జరిగిన ఆర్థిక లావాదేవీలు, రేస్ నుంచి సంస్థ తప్పుకోవడం..అందుకు దారి తీసిన పరిస్థితులు ఇలా పలు కోణాల్లో ఆయన్ను అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు.

ఈసారి మరింత లోతుగా..: చలమలశెట్టి ఇచ్చిన కీలక సమాచారం, గతంలో సేకరించిన పత్రాల ఆధారంగా మరోమారు కేటీఆర్‌ను లోతుగా ప్రశ్నించాలని ఏసీబీ భావిస్తున్నట్టు సమాచారం. అప్పటి మంత్రి ఆదేశాల మేరకు తాము కేవలం విధులు నిర్వర్తించామని అర్వింద్‌కుమార్, బీఎల్‌ఎన్ రెడ్డిలు తమ స్టేట్‌మెంట్లలో పేర్కొన్నారు. ఇక కేటీఆర్..మంత్రిగా తానే ఆదేశాలు జారీ చేశానని, రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యానే తాను ఆదేశించానని, నిధుల చెల్లింపులలో నిబంధనలు పాటించడం అన్నది అధికారులకు సంబంధించిన అంశమని పలుమార్లు స్పష్టం చేశారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని, మరోమారు కేటీఆర్, అర్వింద్‌కుమార్, బీఎల్‌ఎన్ రెడ్డిలను విచారించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అయితే ఈసారి కేటీఆర్ విచారణ సందర్భంగా కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్.. బొమ్మా బొరుసు

రాష్ట్ర అభివృద్ధిలో రెండు పార్టీలూ విఫలం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణలో రానున్న ఎన్నికల్లో బీజేపీదే విజయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అభివృద్ధిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలనను ప్రజలు చూస్తున్నారని, అభివృద్ధిలో ఈ రెండు పార్టీల వైఖరి బొమ్మ, బొరుసు మాదిరి ఉందని ఎద్దేవా చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని పలువురు యువకులు ఆదివారం కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రెండు పార్టీలు ఒకరి మీద ఒకరు తిట్టుకుంటూ కాలయాపన చేస్తున్నాయని, రెండు పార్టీలు కుటుంబ పార్టీలు, అవినీతి పార్టీలని ఆరోపించారు. ఈ రెండు పార్టీల నేతలు రాష్ట్ర ఖజానాను దోపిడీ చేశారని మండిపడ్డారు. విశ్వనగరమని చెబుతూ వీధుల్లో కనీసం లైట్లు కూడా లేవన్నారు. ప్రభుత్వ శాఖల్లో కిందిస్థాయి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. లిక్కర్ మీద వచ్చే డబ్బులు కూడా ఇతర వాటికి మళ్లిస్తున్నారని, దీంతో లిక్కర్ కంపెనీలు కూడా రాష్ట్రానికి మద్యం ఇవ్వమని చెబుతున్నాయన్నారు. బీజేపీపై నమ్మకంతో ప్రజలు 8 పార్లమెంటు సీట్లు కట్టబెట్టారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో చావుతప్పి కన్ను లొట్టపోయినట్టు బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదని, రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమన్నా రు. రాష్ట్రం అప్పుల కుప్పగా మారడానికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణమని మండిపడ్డారు. అవినీతి మచ్చ లేకుండా మూడు దఫాలుగా మోదీ ప్రభుత్వం దేశాన్ని పాలిస్తోందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తెలంగాణలో పర్యటించే నైతిక హక్కు రాహుల్ గాంధీకి లేదన్నారు.

కంటతడి ఆరలేదు..

ఆకేరు వరదతో సర్వం కోల్పోయిన రాకాసితండా రైతులు

ఇప్పటికీ సాగు యోగ్యంలోకి రాని భూములు

అన్నదాతల దైన్యంపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్




రాకాసితండాలోని పొలంలో మేటవేసిన రాళ్లు, ఇసుక దిబ్బలు

సాగు కోసం పొలంలో గుంటతీసి రాళ్లు వేసిన దృశ్యం



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఆగస్టు 31, 2024.. ఆకేరు వాగు నడిరాత్రి వేళ రైతు కంట వరద పారించింది. బువ్వపెట్టే భూమిని బీడుపెట్టింది. నాడు ఆకేరు సృష్టించిన విలయంతో పచ్చని పొలాల్లో ఇసుక, రాళ్లురప్పలు మేట వేశాయి. ఇళ్లు నేలకూలాయి. గొడ్డూగోదా, సామగ్రి.. సర్వం కొట్టుకుపోయాయి. ఎటుచూసినా ఐదారు మీటర్ల మేర పేరుకుపోయిన రాళ్లదిబ్బలు.. ఎకరాకు రూ.2 లక్షలు వెచ్చించి వీటిని తొలగిస్తే తప్ప సాగులోకి వచ్చే పరిస్థితి లేని భూములు.. ఏటా రెండు పంటలు పండించి.. ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేక చేష్టలుడిగి కూలీలుగా మారిపోయిన రైతన్న.. నాడు అతలాకుతలమైన వీరి జీవితాలు ఇప్పుడెలా ఉన్నాయి?.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలోని పరిస్థితులపై 'సాక్షి' పరిశీలన..

ఆరు నెలలుగా అదే దైన్యం..



ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని చూపుతున్న రైతు సహదేవ్

పోతుగంటి సహదేవ్ రెక్కలు ముక్కలు చేసుకుని 90 బస్తాల ధాన్యాన్ని నిల్వ చేశాడు. రేపోమాపో మిల్లుకు తీసుకెళ్లాలని అనుకుంటున్నంతలోనే వరద ముంచెత్తింది. 40 బస్తాలు నీళ్లపాలయ్యాయి. తడిసిన 50 బస్తాల ధాన్యాన్ని కొని ఆదుకుంటామన్న అధికారులు ఇప్పుడు చేతులెత్తేశారు. 6 నెలలుగా ఆ ధాన్యం అలాగే పడి ఉంది.


సాయం చేస్తేనే సాగు



పోతుగంటి బ్రహ్మం

పోతుగంటి బ్రహ్మం ఐదెకరాల ఆసామి. 2.20 ఎకరాల్లో వరి, ఎకరంన్నరలో మిర్చి, ఎకరంలో పత్తి వేశాడు. పంటపండి చేతికొస్తుందనుకున్న దశలో ఆకేరు వరదతో పొలమంతా ఇసుక మేటలు వేసింది. ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున ఐదెకరాలకు ఇచ్చిన రూ.50 వేలకు తోడు మరో లక్ష వెచ్చించి పొలాన్ని బాగు చేసుకున్నాడు. మిగతా భూమి పరిస్థితేమిటో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.

చి'వరి'కిలా మిగిలా..



పోతుగంటి వెంకన్న

పోతుగంటి వెంకన్న నాలుగెకరాల్లో వరి సాగు చేశాడు. వరద దెబ్బకు పంట మొత్తం రాళ్లురప్పల పాలైంది. రూ.2 లక్షలు ఖర్చుచేసి 200 ట్రిప్పుల మట్టి తోలించి పొలాన్ని సాగు యోగ్యం చేసుకుని ప్రస్తుతం వరి సాగుచేస్తున్న ఆయన.. బావులు పూడుకుపోవడంతో ఏటిలోని నీటిని మోటార్ల ద్వారా తరలిస్తూ తలకుమించిన భారాన్ని మోస్తున్నానని వాపోతున్నాడు.

రాజధానిలో కొత్త ఐటీ పార్క్

▶ మొదటి పేజీ తరువాయి

చేపట్టిన చర్యలను పరిశీలించారు.

ముగిసిన సింగపూర్ పర్యటన

సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మూడు రోజుల సింగపూర్ పర్యటన ముగిసింది. సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు అక్కడి నుంచి ఆదివారం రాత్రి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరారు. సోమవారం దావోస్‌కు చేరుకుంటారు. అక్కడ నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొంటారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేసే లక్ష్యంతో దావోస్‌కు వెళుతున్నట్టు రాష్ట్ర ప్రతినిధి బృందం పేర్కొంది. ఇక సింగపూర్‌లో తమ పర్యటన విజయవంతమైందని తెలిపింది. సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)తో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన కుదుర్చుకోవటం కీలక పరిణామం అని అధికార వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో రూ.3,500 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా ఒప్పందం, రూ.450 కోట్లతో భారీ ఐటీ పార్కు ఏర్పాటుకు క్యాపిటల్ ల్యాండ్ ఒప్పందం కీలక అంశాలని పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్‌తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయని చెబుతున్నాయి.

కాంగ్రెస్ పాలన పాపం.. రైతులకు శాపం

రైతులు మరణిస్తున్నా సీఎంకు పట్టింపు లేదు: మాజీమంత్రి హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన రైతులకు శాపంగా మారిందని, కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటివరకు 402 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రుణభారంతో ఆదిలాబాద్‌లో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందన్నారు. 'రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా? దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారు? రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే. వీటికి ముఖ్యమంత్రే బాధ్యత వహించాలి. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైంది' అని హరీశ్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు 500 బోనస్ హామీలు అమలు చేసే దాకా ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరణించిన రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పత్తి రైతుకు తేమ కష్టం



కష్టపడి పంట పండించిన రైతుకు చివరకు దాన్ని విక్రయించేందుకూ అగచాట్లు తప్పడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలోని భీంపూర్ మండలం కరంజి గ్రామానికి చెందిన సిల్వర్ దత్తు ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు పత్తి తీసుకొచ్చాడు. పంట పరిశీలించిన సీసీఐ అధికారులు తేమ శాతం 24, 25 ఉందంటూ కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. దీంతో తెచ్చిన పంటను తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక, అమ్ముకోలేక గత రెండు రోజులుగా వ్యవసాయ మార్కెట్ యార్డులోనే ఉంటున్నాడు. పత్తిని ఆరబెడుతూ అక్కడే కాపలా ఉండటం రైతుల దుస్థితికి నిదర్శనంగా నిలుస్తోంది. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా...

అర్హులైన ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూమి లేని ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు దఫాల్లో ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు సాయం చేయని హరీశ్‌రావు.. ఇప్పుడు ఉపాధి కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో మాదిరి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోమని, రాజకీయ పక్షపాతంతో వ్యవహరించకుండా గ్రామ సభల్లోనే, ప్రజల సమక్షంలోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులను గుర్తిస్తామని స్పష్టం చేశారు.

ఏపీకి కృష్ణా జలాలు తరలించారనడం అవగాహన లోపమే

మాజీ ఎంపీ వినోద్



సాక్షి, హైదరాబాద్: సాగునీటి శాఖ మంత్రిగా ఏడాది పూర్తి చేసుకున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి.. ఇంకా ఆ శాఖపై అవగాహన రాలేదని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్, ఆ పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, గట్టు రాంచందర్ రావు, చిలకమర్రి నరసింహ, ఇంతియాజ్ అహ్మద్ విమర్శించారు. వారంతా ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాలు తరలించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించడం ఆయన అవగాహన లేమికి నిదర్శనమన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు వివిధ సందర్భాల్లో కేంద్రంపై ఒత్తిడి తేవడం వల్లే సెక్షన్–3 ప్రకారం నీళ్ల కేటాయింపు వాదనలకు మార్గం సుగమమైందని స్పష్టం చేశారు. తెలంగాణ సమస్యల గురించి కాంగ్రెస్‌కు అవగాహన లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ కూడా కృష్ణా జలాలపై అవగాహన లేకుండా మాట్లాడుతోందన్నారు. ఈ అంశంపై ఎవరితోనైనా తాము చర్చకు సిద్ధమని వారు సవాల్ చేశారు.

పసుపు బోర్డు.. అర్వింద్ ఒక్కడి ఘనత కాదు

- 2014లోనే ఎంపీగా పార్లమెంట్‌లో కొట్లాడా.. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నిజామాబాద్ అర్బన్: జాతీయ పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమే అయినా.. బోర్డు ఏర్పాటు కేవలం ఎంపీ అర్వింద్ ఒక్కడితోనే సాధ్యం కాలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. పసుపు బోర్డు ఏర్పాటు చేసిన తీరు అభ్యంతరకరమని పేర్కొన్నారు. పసుపు బోర్డు ప్రారంభోత్సవాన్ని బీజేపీ సొంత కార్యక్రమంలా నిర్వహించారని మండిపడ్డారు. బోర్డు కోసం తాము డిమాండ్ చేసినప్పుడు ఎంపీ అర్వింద్ రాజకీయాల్లో కూడా లేరని చెప్పారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని 2014లో తాను ఎంపీగా అప్పటి వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు, మద్దతు కోరుతూ ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. పార్లమెంట్‌లో సైతం ప్రైవేట్ బిల్లును ప్రవేశపెట్టానని తెలిపారు. ఎంపీ అర్వింద్ గాలి మాటలు మాట్లాడడం మానేయాలని హితవు పలికారు.

బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలు చేయాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'కాసం'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర విభాగం రూపొందించిన డైరీని ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారిద్దరూ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రేషన్‌కార్డుల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ విరమణ వయసు పెంపు సరికాదు

- తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్

సాక్షి, హైదరాబాద్: పెన్షనర్ల చెల్లింపులు వాయిదా వేయడం కోసం ఉద్యోగ విరమణ వయసు పెంచాలని ప్రభుత్వం భావించడం సరైన నిర్ణయం కాదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ప్రకటించింది. ఈ ప్రతిపాదన విరమించుకుని, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.



జీబ్రా లైన్

హైస్పీడ్‌తో సాగుతున్న కార్ల రేసు మధ్యలోకి సడన్‌గా జీబ్రాలు వచ్చేస్తే.. సెకన్ల వ్యవధిలో జరిగే ఇలాంటి అనూహ్య పరిణామాన్ని లిప్తపాటులో క్లిక్‌మనిపించారు ఫొటోగ్రాఫర్ అనెస్తీవ్.. ఈ చిత్రం వరల్డ్ స్పోర్ట్స్ ఫొటోగ్రఫీ పోటీల్లో రెండో స్థానంలో నిలిచింది. ఇలా జరగడం అన్నది అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటన.. అదృష్టవశాత్తూ వాటికేం కాలేదని ఫొటోగ్రాఫర్ చెప్పారు.

దరఖాస్తులకు మరో చాన్స్

కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం స్వీకరణ

- రేపట్నుంచి జరిగే గ్రామసభల్లోనూ దరఖాస్తులు తీసుకోవాలి
- ఆత్మీయ భరోసా సొమ్ము మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ
- కలెక్టర్లకు సీఎస్ ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 21 నుంచి 24 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే గ్రామసభల్లోనూ ఈ మేరకు దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలతో ఆదివారం ఓ సర్క్యులర్‌ను పంపారు. దాని ప్రకారం గ్రామ సభల్లో కొత్త రేషన్‌కార్డులు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్ల చేర్పు కోసం దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుంది. అదే విధంగా ఒక కుటుంబం నుంచి వేరు పడుతున్న కుటుంబాలకు కొత్త కార్డులిచ్చేందుకు కూడా దరఖాస్తులు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా తదితర వివరాలను సేకరించాలి. అదేవిధంగా ప్రజాపాలన సేవా కేంద్రాలు, మీసేవ కేంద్రాల నుంచి వచ్చే దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఇక ఇప్పటికే వచ్చిన 1.36 కోట్ల మందికి సంబంధించిన 41.25 లక్షల కుటుంబాల దరఖాస్తుల పరిశీలనను పూర్తి చేయాలి. కులగణనలో భాగంగా కార్డు లేదని సమాచారం ఇచ్చిన వారి వివరాలను కూడా పరిశీలించాలి. వీటికి తోడు గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించిన తర్వాతే లబ్ధిదారుల జాబితాను ఖరారు చేయాల్సి ఉంటుందని సర్క్యులర్‌లో స్పష్టం చేశారు.

గ్రామసభల్లో ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి

ఇందిరమ్మ ఇళ్లకు కూడా గ్రామసభల్లో దరఖాస్తులు వస్తే తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. ఇప్పటికే రాష్ట్రంలో పక్కా ఇళ్లు లేని వారి వివరాలను కలెక్టర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో అందుబాటులో ఉంచామని, వాటి పరిశీలన వెంటనే పూర్తి చేయాలని సర్క్యులర్‌లో సూచించారు. రేషన్‌కార్డుల తరహాలోనే దరఖాస్తుదారుల అన్ని వివరాలను గ్రామ సభల్లో నమోదు చేసుకోవాలని, ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా వచ్చే దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను మదింపు చేయడం, ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోలేని వారి నుంచి దరఖాస్తులు తీసుకోవడం, ఇందుకు సంబంధించి ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే విధంగా గ్రామసభలు నిర్వహించాలని సూచించారు.

ఆ పంచాయతీల్లోనూ ఆత్మీయ భరోసా

భూమి లేని పేదల కుటుంబాలకు ఇచ్చే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయాన్ని ఆ కుటుంబంలోని మహిళల బ్యాంకు ఖాతాకు జమ చేయాలని సీఎస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నిబంధనలను ఇప్పటికే కలెక్టర్లకు, డీఆర్‌డీవోలకు పంపామని పేర్కొన్నారు. అదే విధంగా 2023–24 సంవత్సరంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం అయిన 156 గ్రామ పంచాయతీల్లోనూ ఈ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని సర్క్యులర్‌లో సీఎస్ స్పష్టం చేశారు.

షరతులు లేకుండా రైతుభరోసా: భట్టి



ఎర్రుపాలెం: రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ఎలాంటి షరతులు లేకుండా ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. క్షేత్రస్థాయి సర్వే ద్వారా గుర్తించిన లబ్ధిదారుల జాబితాలను గ్రామసభల్లో అందరి ముందు వెల్లడిస్తామని, ప్రజల సమక్షంలోనే అర్హులను ఎంపిక చేస్తామని చెప్పారు. అర్హత ఉండి.. జాబితాలో పేరు లేకుంటే గ్రామ సభలో చెబితే అక్కడే నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు, సకినవీడు గ్రామాల్లో భట్టి విక్రమార్క ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులకు వెళ్లే భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12 వేలు రెండు విడతలుగా అందజేస్తామని తెలిపారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పారు. సంక్షేమ పథకాల అర్హుల జాబితాలను ప్రజల సమక్షంలోనే రూపొందిస్తామని, ఈ విషయంలో అపోహలకు తావులేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వేతనాలు చెల్లించే పరిస్థితి ఉండేది కాదని, తమ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ బి.కళావతి బాయి, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, డీపీఓ ఆశలత, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

40 లక్షల మందికి కొత్త రేషన్‌కార్డులు: ఉత్తమ్




హుజూర్‌నగర్, పాలకవీడు: రాష్ట్రంలో 40 లక్షల కొత్త రేషన్‌కార్డులు అందజేయనున్నట్టు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పాలకవీడు, హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల్లో ఆదివారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో జాన్‌పహాడ్ ఉర్సు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తామన్నారు. పదేళ్లలో గుర్తుకు రాని అంశాలు.. పదవి కోల్పోగానే అందరికీ గుర్తుకొచ్చి, కొత్త ఆలోచనలు పుట్టుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇన్నేళ్లు బీసీలు గుర్తుకు రాలేదా?, రేషన్‌కార్డులు గుర్తుకు రాలేదా?, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు గుర్తుకు రాలేదా? అని విమర్శించారు. పది సంవత్సరాలు ఒక్క రేషన్‌కార్డు ఇవ్వని మీరు రేషన్ కార్డుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతీ ఎకరాకు రైతుభరోసా అమలు చేస్తాం ..పాత రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చుతామని చెప్పారు. రేషన్‌కార్డులో పేర్లు నమోదైన ప్రతి లబ్ధిదారుకు నెలకు ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తామన్నారు. చివరి లబ్ధిదారు వరకు కార్డులు అందజేస్తామని స్పష్టం చేశారు. ఉర్సుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ హుస్సేనీ, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పాల్గొన్నారు.

'సర్వే సిబ్బందికి హాజరు ధ్రువపత్రం ఇవ్వాలి'

సాక్షి, హైదరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విధులకు హాజరైన ఉద్యోగులకు హాజరు ధ్రువపత్రం అందజేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

'ఇందిరమ్మ'గా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు..!

- సొంత జాగా లేని అర్హులకు వాటి కేటాయింపు
- అర్హుల జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు
- దాదాపు లక్షన్నర ఇళ్ల పంపిణీకి అవకాశం



సాక్షి, హైదరాబాద్: పేదల కోసం గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లను ఇందిరమ్మ పథకంలో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లతోపాటు అసంపూర్తిగా ఉన్న వాటిని సిద్ధం చేసి.. ఇందిరమ్మ లబ్ధిదారులకు అందజేయబోతోంది. తొలి విడత ఇందిరమ్మ ఇళ్లను సొంత జాగా ఉన్న వారికే మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం తెలిసిందే. తాజాగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లున్న ప్రాంతాల్లో.. వాటిని సొంత జాగా లేని అర్హులైన నిరుపేదలకు అందజేయాలని నిర్ణయించింది. దాదాపు లక్షన్నర డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సొంత జాగా లేని 'ఇందిరమ్మ'లబ్ధిదారులకు అందనున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2.90 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. వాటిలో 2.28 లక్షల ఇళ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచింది. కానీ, లబ్ధిదారుల ఎంపిక చేయకుండానే ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడాన్ని కేంద్ర ప్రభుత్వం ఆక్షేపించి, ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులను పూర్తిగా ఇవ్వకుండా నిలిపేసింది. సొంత నిధులను కావాల్సినన్ని కేటాయించకపోవటంతో ఆ ఇళ్ల నిర్మాణం మందగించింది. చివరకు పథకమే గందరగోళంగా మారింది. ఇప్పుడు ఆ ఇళ్లలో దాదాపు 60 వేలను లబ్ధిదారులకు మంజూరు చేయగా, మిగతావి వృథాగా ఉన్నాయి. పూర్తయిన వాటిని, అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేసి.. ఇందిరమ్మ పథకం కింద పంపిణీ చేయాలని ఇప్పుడు ప్రభుత్వం నిర్ణయించింది. అసంపూర్తి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసింది. ఆ పనులు జరుగుతున్నాయి.

సొంత జాగా లేనివారికి కూడా జాబితాలో చోటు..

ఈ నెల 21 నుంచి ఊరూరా గ్రామ సభలు నిర్వహించి ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయబోతున్నారు. ఈ దఫాలో కేవలం సొంత జాగా ఉన్న వారికే ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. కానీ, సొంత జాగా లేనివారిలో అర్హులైనవారిని గుర్తించి, వారి జాబితాను కూడా సిద్ధం చేయాలని తాజాగా ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. గ్రామ సభల్లో వారి జాబితాను కూడా ప్రదర్శించాలని పేర్కొంది. ప్రజా పాలనలో భాగంగా అందిన దరఖాస్తుల్లో సొంత జాగా లేని వారి వివరాలను కూడా తనిఖీ చేసి, వారు అర్హులైతే ఆ జాబితాను కూడా సిద్ధం చేస్తున్నారు. తనిఖీ కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో, ఇక గ్రామ సభల్లో అర్హుల జాబితాను రూపొందించటమే తరువాయి. అలా సొంత జాగా లేని అర్హులున్న గ్రామాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉంటే.. వాటిని వారికి మంజూరు చేస్తారు. అందుకోసం కలెక్టర్లు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్‌పీఏలో ఇండోర్ షూటింగ్ రేంజ్

వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా



సాక్షి, హైదరాబాద్: సర్దార్ వల్లభ్‌బాయ్‌పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో ఐపీఎస్ ట్రైనీల కోసం ఏర్పాటు చేయనున్న కాంపోజిట్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌కు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. విజయవాడలో ఎన్‌డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న ఆయన.. అక్కడి నుంచే వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ షూటింగ్ రేంజ్ ఏర్పాటుతో ట్రైనీ ఐపీఎస్‌లకు అత్యాధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. దేశంలో మొట్టమొదటిసారి అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న ఇండోర్ షూటింగ్ రేంజ్‌గా ఇది నిలుస్తుందని వివరించారు. ఇండోర్ షూటింగ్ రేంజ్‌లో అన్ని సీజన్లలో కాలంతో పనిలేకుండా ఫైరింగ్ శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. ట్రైనీ ఐపీఎస్ అధికారుల ఫైరింగ్ స్కిల్స్‌ను పెంచేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్‌తో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రకృతి వేగాన్ని అనుసరించండి: దాని రహస్యం ఓర్పు.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 20 జనవరి 2025

పనీ - పాటా

పనీ-పాటా అనే నుడికారం ఊరికే పుట్టలేదు; శ్రామిక సంస్కృతిలో పని లేకుండా పాటా, పాట లేకుండా పనీ ఉండవు; అవి అన్యోన్యాలు. పాడుకుంటూ పనిచేస్తే పనిభారం తగ్గుతుందంటారు; అందుకే, ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూసొలుపేమున్నదని ఓ సినీకవి అన్నాడు. అసలు పాట రూపంలో కవిత్వమే కానీ, అభినయ రూపంలో నృత్య, నాటకాలే కానీ, ఆమాటకొస్తే ఇతర కళారూపాలే కానీ పుట్టింది పనితోనేనని పండితులు తేల్చారు. వైయక్తిక, సామూహిక శ్రమలో భాగమైన శారీరక చర్యలను కళారూపాలు అంటిపెట్టుకునే ఉండేవన్నారు. పనినీ, పాటనూ విడదీసి చూడడం నాగరికత ముదిరిన తర్వాతే వచ్చింది. పాట అనేది పనిలేనప్పుడు పాడుకునే వ్యాపకమైంది. రానురాను పాటను పక్కన పెట్టి పనికి మాత్రమే పట్టం కట్టే స్థితికి దారితీసి; తాజాగా వారానికి 70 గంటలు పనిచేయాలని ఒకరంటే, కాదు 90 గంటలు పనిచేయాలని మరొకరు అనే వరకు వెళ్లింది. కొన్నిరోజులుగా ఇదే పెద్ద చర్చనీయాంశం.

మనిషితో సహా సమస్త జీవరాశితోనే పని కూడా పుట్టింది; అది కర్మగా మారి కర్మయోగంగా తాత్విక శిఖరానికీ చేరింది; దాంతోపాటు కలలూ, కన్నీళ్ళ చరిత్రనూ మూటగట్టింది. వేల సంవత్సరాల వెనకటి వేట-ఆహార సేకరణ జనాల జీవనంలోకి తొంగి చూస్తే, వారు వారానికి పదిహేను గంటలే పనిచేసేవారని మానవశాస్త్ర నిపుణులంటారు. వారిది మొరటుదనం, అజ్ఞానం మూర్తీభవించిన దుర్భర జీవితమని కొందరంటే; కాదు, ఆ తర్వాతి కాలానికి చెందిన వ్యవసాయ జీవనంతో పోల్చితే వేట-ఆహారసేకరణ జనాలది అత్యున్నత సంస్కృతికి చెందిన సంపన్న సమాజమనీ, తగినంత తీరిక ఉండడమే అందుకు కారణమనీ మరికొందరు అన్నారు. ప్రకృతిని అధ్యయనం చేయడానికీ, చంద్రుడి వృద్ధిక్షయాలపై ఆధారపడిన కాలగణనాన్ని కూర్చడానికీ, కళారూపాల అభివృద్ధికీ ఆ తీరిక తోడ్పడిందనీ, వారే తొలి శాస్త్రవేత్తలూ, కళాకారులనీ – అప్పటి అనేక గుహాచిత్రాలు, కుడ్యచిత్రాల ఆధారంగా నిపుణులు నిరూపించారు. వ్యవసాయ జీవనం నుంచీ ఆ తీరిక అడుగంటి పారిశ్రామిక యుగానికి వచ్చేసరికి వారానికి 80 నుంచి 100 గంటలు పనిచేయవలసిన దుఃస్థితి దాపురించి, ఆ నిర్బంధ శ్రమకు వ్యతిరేకంగా ఉద్యమాలు తలెత్తడంతో వారానికి 40 గంటల పని ప్రామాణిక కొలమానంగా స్థిరపడిందని చరిత్ర చెబుతోంది.

నిజానికి పనీ-తీరికా అనేవి ఏదో ఒక నిర్ధారణకో, ఒకే ఒక్క నిర్వచనానికో అందని సంక్లిష్ట అనుభవాలు. ప్రతిసారీ పనిభారాన్ని దాని పరిమాణంతోనూ, గంటలతోనూ తూచలేం. ఇష్టంతో స్వచ్ఛందంగా చేసే పని అలాంటి కొలతలనూ, శ్రమనూ కూడా అధిగమిస్తుంది. నిర్బంధంగా విధించే పని తక్కువ పరిమాణంలో ఉండి, తక్కువ సమయాన్ని తీసుకునేదైనా భారంగానే తోస్తుంది. స్వతంత్రంగా కొయ్యపని చేసుకుంటూ అందులో కళాత్మకతనూ, తృప్తినీ ఆస్వాదించిన ఒక వడ్రంగి ఒక ఫ్యాక్టరీ కార్మికుడిగా మారడంతోనే వాటిని కోల్పోయి ఎలా నిరాసక్తంగా మారాడో కొడవటిగంటి కుటుంబరావు ఒక కథలో చిత్రిస్తారు. పనిగంటలు పెరిగితే ఉత్పాదకత పెరుగుతుందనుకోవడమూ సత్యదూరమేనని చెప్పి, ఐస్‌లాండ్, నెదర్లాండ్స్, డెన్మార్క్ లాంటి దేశాల అనుభవాన్ని ఉటంకించేవారూ ఉన్నారు. వారానికి 30–35 గంటల పనితోనే ఈ దేశాలు ఉత్పాదకతలోనూ, సంతోషభరిత జీవనంలోనూ అగ్రస్థానం వహించడాన్ని వారు ఉదాహరిస్తున్నారు.

పనీ-తీరికలలో ఏది ఎక్కువైనా జీవనశకటం ఒకవైపే ఒరిగిపోయి జీవితమే అస్తవ్యస్తమవుతుంది. జీవిక కోసమే మొత్తం సమయాన్ని వెచ్చిస్తే, జీవించడమే మరచిపోతామని ఒక సూక్తి. అన్నిటా సమతూకం పాటించడంలోనే సంతోష రహస్యం ఇమిడి ఉందన్నది మరొక ఉద్బోధ. అందుకే, 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నారు; అదే అన్ని సందర్భాలకూ వర్తించే సార్వకాలిక సూత్రం. నిజానికి పనికీ-తీరికకీ మధ్య అన్యోన్యతా, పరస్పరతా ఉన్నాయే తప్ప వైరుధ్యం లేదని, దేని విలువ దానిదేనని అనేవారూ ఉన్నారు. కుటుంబ సభ్యులతోనూ, విందు వినోదాలతోనూ ఆహ్లాదంగా గడిపే తీరిక సమయం పనిలో నిమగ్నతకూ, నాణ్యతకూ, ఉత్పాదకత పెరగడానికే తోడ్పడుతుందంటారు.

పనిలో ఇతర దేశాలతో పోటీ, అభివృద్ధీ అనేవి కొత్తగా వచ్చాయి. దేశాభివృద్ధిని కొత్తపుంతలు తొక్కించడానికి పని గంటలు పెంచాలనడం పూర్తిగా కొట్టిపారవేయవలసినదేమీ కాదు. కాకపోతే, ఇతర అనేకానేక దృష్టికోణాలను, వాస్తవాలను విస్మరించి ఏకపక్షంగా అలాంటి అభిప్రాయానికి రావడం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువన్నది ఒక విమర్శ. అభివృద్ధిలో పోటీ పడవలసిందే కానీ, ఇక్కడి మానవవనరుల అందుబాటునూ, వాటి అభివృద్ధినీ కూడా పరిగణనలోకి తీసుకుని తగిన ప్రణాళికతో ముందుకు వెళ్లాలనే వాదన వినిపిస్తోంది. వివిధ రంగాలలో ఇప్పటికే పెరిగిన పని భారం ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యాలపై తీవ్ర దుష్ప్రభావం చూపుతోందనీ, అందువల్ల ఉత్పాదకత మందగిస్తోందనీ ఆ యా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇంకోవైపు దేశంలో నిరుద్యోగం రేటు పెరుగుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. కనుక, పని గంటలను పెంచడం కన్నా పని చేసే చేతుల సంఖ్యను పెంచి పనిని పంచడమే అత్యుత్తమ పరిష్కారమనీ; అందుకు అవసరమైన అన్నిరకాల శిక్షణ సదుపాయాలనూ అభివృద్ధి చేయాలనే వాదన ముందుకు వస్తోంది.

పని నుంచి పాటను వేరు చేసినప్పుడు చిన్న పని కూడా పెనుభారమే అవుతుంది. పనికి పాటను జోడించడమే దానిని తేలికచేసే మార్గం. పనీ-పాటా కలిసినప్పుడు... పనే పాటవుతుంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.9.05 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** హస్త రా.7.54 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** తె.4.48 నుండి 6.32 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.37 నుండి 1.25 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.39 వరకు, **అమృతఘడియలు:** ప.1.11 నుండి 2.58 వరకు.

సూర్యోదయం : 6.39
సూర్యాస్తమయం: 5.45
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

ప్రపంచానికి ఏం రాసి పెట్టి ఉంది?

కామెంట్



కరణ్ థాపర్

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడు అయిననాటికీ, తిరిగి ఇప్పుడు నాలుగేళ్ల విరామంతో రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన నాటికీ ప్రపంచ పరిస్థితులు మారిపోయాయి. సవాళ్లు, చిక్కుముడులు, అడ్డంకులు, అనివార్యతలు ఆయన ముందుకొచ్చి నిలబడ్డాయి. అధ్యక్షుడిగా గెలిచీ గెలవగానే ఆయన చేసిన వివాదాస్పద నియామకాలలో అవసరమైతే మార్పులు చేయాలి. యుద్ధాలు చేసుకుంటున్న దేశాల మధ్య సయోధ్యను కుదిర్చేందుకు మధ్యవర్తిత్వం వహించాలి. వందల మిలియన్ల డాలర్లను తన గెలుపు కోసం ఖర్చుపెట్టిన ఎలాన్ మస్క్‌ను సంతృప్తిపరచాలి. ఆయనే హామీ ఇచ్చిన విధంగా అమెరికాను 'మళ్లీ గొప్ప దేశంగా' నిలబెట్టాలి. ఇక భారత్‌తో ఆయన ఎలా ఉండబోతారన్నది మన వైపు నుండి ఉత్పన్నం అయ్యే ప్రశ్న.

కొన్నిసార్లు భవిష్యత్తును అర్థం చేసుకోవటానికి ఉత్తమమైన మార్గం, దాని గురించిన ప్రశ్నలను లేవనెత్తటమే! ఆ ప్రశ్నలకు మీకు సమాధానాలు లభించకపోవచ్చు; కనీసం ఆందోళన కలిగించగల అవకాశం ఉన్న అంశాలనైనా మీరు గుర్తిస్తారు. అది మిమ్మల్ని, భవిష్యత్తు ముడి విప్పబోయే వాటికి సంసిద్ధం చేస్తుంది.

అమెరికా 47వ అధ్యక్షుడిగా డోనాల్డ్ ట్రంప్ – ఒక పదవీకాల విరామంతో – రెండోసారి పదవిని చేపడుతున్నారు. ఈ తరుణంలో... ముమ్ముందరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయన్న సందేహాలు సహజం. ఆ దిశగా కొన్ని ప్రశ్నలను నా వైపు నుంచి వేయనివ్వండి.

ట్రంప్‌తో సన్నిహితంగా పని చేసిన ఇద్దరు వ్యక్తులు... మాజీ 'చీఫ్ ఆఫ్ స్టాఫ్' జాన్ కెల్లీ, మాజీ 'డైరెక్టర్ ఆఫ్ కమ్యూనికేషన్స్' ఆంథోనీ స్కారమూచీ ఆయన్ని ఫాసిస్ట్ (తీవ్రమైన నియంతృత్వ వైఖరి కలిగిన జాతీయవాద పాలకుడు) అనేవారు. ఆ మాట నిజమేనని భవిష్యత్తు రుజువు చేయబోతోందా?

అధ్యక్షుడిగా గెలవగానే ట్రంప్ చేపట్టిన అనేక నియామకాలు వివాదాస్పదం అయ్యాయి. రక్షణ మంత్రిగా పీట్ హెగ్సేత్, ఆరోగ్య మంత్రిగా రాబర్ట్ కెన్నెడీ, ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కశ్ పటేల్ (కశ్యప్ పటేల్), 'డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్'గా తులసీ గబ్బార్డ్ నియామకాలు యథాతథంగా కొనసాగుతాయా, లేక మార్పులు జరుగుతాయా?

ఏమైనా, రెండు నియామకాలు మాత్రం ప్రశంసనీయార్హం అయ్యాయి. విదేశాంగ మంత్రిగా మార్కో రుబియో, జాతీయ భద్రతా సలహాదారుగా మైఖేల్ వాల్ట్జ్ – అయితే ఆ ఇద్దరూ నిజంగానే ట్రంప్ విదేశాంగ విధానాన్ని నిష్కర్షగా అమలు పరచగలుగుతారా?

ఇక పారిశ్రామికవేత్త, సామాజిక మాధ్యమం 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ ప్రభావం ఏ మేరకు ఉంటుందన్నది బహుశా, మరింత ముఖ్యమైన ప్రశ్న. ట్రంప్‌కు ఆయన అత్యంత సన్నిహితులుగా ఉన్నారన్నది పైకే కనిపిస్తోంది. పైగా ట్రంప్‌ను అధ్యక్షుడిగా గెలిపించటం కోసం ఆయన 27 కోట్ల డాలర్లను ఖర్చు చేశారు. అది ఆయన్ను వైట్ హౌస్‌లో రాజ్యాంగేతర అధికార శక్తిగా నిలబెట్టే ప్రమాదం ఉంటుందా?

బ్రిటన్ ప్రధాని పదవి నుంచి కీర్ స్టార్మర్‌ను తప్పించేందుకు ఎలాన్ మస్క్ చర్చలు జరిపారన్న ఆరోపణలు ఉన్నాయి. స్టార్మర్‌ను ఆయన 'ఏమాత్రం తగని మనిషి' అన్నారు. జర్మనీ ఎన్నికల్లో కూడా వేలు పెట్టారు. జర్మనీ చాన్స్‌లర్ షోల్జ్‌ను 'బుద్ధిహీనుడు' అన్నారు. ట్రంప్ ఆశీస్సులతోనే ఇదంతా జరిగి ఉంటుందా?

అన్ని దిగుమతులపై 20 శాతం సుంకాన్ని, చైనా ఎగుమతుల పైనైతే మరింత అత్యధిక సుంకాన్ని విధించే ఆలోచన ట్రంప్ మదిలో ఉన్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కెనడా, మెక్సికోలపై 25 శాతం వరకు సుంకం ఉంటుందని కూడా ఆయన బెదిరించారు. ఇది మనల్ని ఇబ్బందికరమైన వాణిజ్య యుద్ధంలోకి మళ్లిస్తుందా?



అమెరికా అధ్యక్షుడిగా నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న డోనాల్డ్ ట్రంప్

ఈ విషయంలో చైనా, దాని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో ట్రంప్ ఎలాంటి సంబంధాలను కొనసాగించే అవకాశం ఉంది? భారత్‌కు ఎలాంటి చిక్కులు ఎదురవుతాయి?

ఇక ఇప్పుడు రెండు పెద్ద విదేశాంగ విధానాలు విసిరే సవాళ్ల దగ్గరకు వద్దాం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఒక్కరోజులో ఆపేయగలనని ట్రంప్ గొప్ప ధీమాతో చెప్పారు. అయితే అది వట్టి ప్రగల్భమేనా, లేక ఆయన మనసు లోపలి నిజమైన ఉద్దేశమా? ఏ విధంగా చూసినా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి అది మంచి వార్తేమీ కాదు.

మళ్లీ ఇదే విషయానికి వస్తే, ఉక్రెయిన్ యుద్ధ నేపథ్యంలో 'నాటో' ఏ విధమైన భవిష్యత్తును ఎదుర్కోబోతోంది? ట్రంప్ ఆ సంస్థ సభ్య దేశాలను వాటి రక్షణ కోసం మరింత ఎక్కువగా నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తారా? లేకుంటే, నాటో ఐక్యతకు, ఉనికికి ఒక విపత్తులా పరిణమిస్తారా?

ఇంకొక అంతర్జాతీయ సవాలు ఇజ్రాయెల్-గాజా! ట్రంప్ ఇజ్రాయెల్‌కు, ముఖ్యంగా నెతన్యాహూకు మద్దతు ఇస్తున్నారు. అధ్యక్షుడిగా తన మొదటి హయాంలో యూఎస్ రాయబార కార్యాలయాన్ని జెరూసలేంకు మార్చారు. ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్న గోలన్ హైట్స్‌కు అధికార గుర్తింపునిచ్చారు. ఇప్పుడు నెతన్యాహూకు ఎలాంటి ధైర్యాన్నిస్తారు? ఇరాన్ మీద దాడి చేసేట్టుగానా?

మధ్య ప్రాచ్యం గురించి కనుక మాట్లాడుకుంటే, సిరియా మాటేమిటన్నది ప్రశ్న. గత నెలలో బషర్ అల్-అస్సద్ పదవీచ్యుతుడు అయినప్పుడు అక్కడ మనం ఒక రాజకీయ భూకంపాన్నే చూశాం. బైడెన్ ప్రభుత్వం డమాస్కస్ చేరుకోటానికి ప్రయత్నమన్నా చేసింది. కానీ ట్రంప్ వల్ల ఈ దౌత్య విధానం తారుమారవుతుందా?

మూడో అంతర్జాతీయ సమస్య కూడా ఉంది కానీ, ట్రంప్ దానిని ఎలా తీసుకుంటారనే దానిపై నేనేమీ చెప్పలేను. గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు ఆయన చెబుతున్నారు. పనామా కాలువను వెనక్కు తీసుకుంటాననీ, కెనడాను యూఎస్‌లో కలుపుకొంటాననీ కూడా ఆయన మాట్లాడారు. ఇవన్నీ ఆయన నిజంగానే చేస్తారా, లేక నిస్పృహ నుంచి బయట పడే ప్రయత్నంగా మాత్రమే అలా అంటున్నారా?

చివరిగా, భారతదేశంపై దృష్టి పెడదాం. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మోదీకి, ట్రంప్‌కు మధ్య సన్నిహిత వ్యక్తిగత సంబంధం ఏర్పడింది. ఆ స్నేహం ఇప్పుడు కూడా వికసిస్తుందా? లేదా పారిశ్రామికవేత్త అదానీ, పన్నూ(ఖలిస్తానీ నాయకుడు గుర్పత్‌వంత్ సింగ్ పన్నూను చంపడానికి ఇండియా ప్రయత్నించిందన్న కేసు) కేసుల విషయమై ట్రంప్ ఒత్తిడి చేస్తే అది వదలిపోతుందా?

అత్యంత ఆందోళన కలిగించే విషయం – ట్రంప్ తరచూ ఇండియా విధించే సుంకాలు మితిమీరి ఉంటున్నాయని ఆరోపించేవారు. అందుకు ఆయన చూపించే నిదర్శనం హార్లీ-డేవిడ్‌సన్ మోటార్ బైక్ దిగుమతులపై భారత్ విధించే సుంకాలు. ఇప్పుడు మళ్లీ, భారతీయ సుంకాలు మరొకసారి ట్రంప్ దృష్టిలోకి వస్తాయా?

ఎటూ కదలని ఇంకొక అంశం హెచ్-1బి వీసాలు. ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆ వీసాల గురించి 'దారుణం', 'అన్యాయం' అన్నారు. కానీ ఈసారి ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి (రిపబ్లికన్ నాయకుడు), శ్రీరామ్ కృష్ణన్ (కృత్రిమ మేధలో సీనియర్ విధాన సలహాదారు) హెచ్-1బి వీసాలకు గట్టి మద్దతుగా మాట్లాడారు. మస్క్ అయితే ఈ విషయమై యుద్ధానికైనా తెగబడతానని అన్నారు. కాబట్టి ఈ వీసాల విషయంలో ట్రంప్ రెండో హయాం, ట్రంప్ మొదటి హయానికి భిన్నంగా ఉండబోతోందా?

ఈ ప్రశ్నలు ఏవీ సమగ్రమైనవి కావు. కానీ, ఆందోళన కలిగించే అంశాల విస్తృతిని సూచిస్తాయి. అధ్యక్షుడిగా ట్రంప్ రెండో హయాం ఎంత అస్థిరత్వంతో ఉండబోతున్నదో ఇవి వెల్లడిస్తాయి. కనుక మీరు ఎగుడు దిగుళ్ల రాళ్ల దారిలో ప్రయాణానికి సిద్ధంగా ఉండండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా



అవసరమైన ఒప్పందం

ఇజ్రాయెల్, హమాస్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం అత్యంత అవసరమైనదీ, ఉపశమనం కలిగించేదీ! అది ఎంత సున్నితమైనది అయినప్పటికీ ముఖ్యమైనది. దీన్ని సాధ్యం చేయడానికి తెరవెనుక అవిశ్రాంతంగా పనిచేసిన వారికి అభినందనలు.

– అలర్ కరిస్, ఎస్తోనియా అధ్యక్షుడు



మళ్లీ వెనక్కి?

1998 నుంచి భూగర్భ అణుపరీక్షలు జరగలేదు. కానీ డోనాల్డ్ ట్రంప్ సలహాదారులు ఆయన ప్రభుత్వం వీటిని తిరిగి జరపవచ్చన్న సంకేతాలు ఇచ్చారు. అవే జరిగితే – చైనా, రష్యా, ఇండియా కూడా భూగర్భ పరీక్షలు జరిపే అవకాశం ఉంది. సీటీబీటీ (సమగ్ర అణ్వస్త్ర పరీక్ష నిషేధ ఒప్పందం) ఇప్పటికీ అమలులోకి రాలేదు.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు



పోటీ పడదామా?

బ్లింకిట్‌కు అతిపెద్ద పోటీదారు నడక. నెట్‌ఫ్లిక్స్‌కు అతిపెద్ద పోటీదారు నిద్ర. స్విగ్గీకి అతిపెద్ద పోటీదారు ఇంటి వంట!

– షాజన్ సామ్యూల్, రన్నర్



ప్రమాదం కాదా?

అంటే, మన (అమెరికా) డేటాను పొందగలిగే, సామాజిక మాధ్యమాల యాప్స్ ద్వారా దాన్ని ఏమార్చగలిగే చైనా సామర్థ్యం మనకు (అమెరికా పౌరులకు) ప్రమాదకరం: కానీ అదే డేటాను పొందగలిగే, సామాజిక మాధ్యమాల యాప్స్ ద్వారా దాన్ని ఏమార్చగలిగే అమెరికా సంపన్నుల ద్వారా మాత్రం మనకు ఏ ప్రమాదమూ లేదు. నాకు సరిగ్గానే అర్థమైందా?

– రాబర్ట్ రీక్, అమెరికా మాజీ కార్మిక మంత్రి



నరక నగరాలు

మీరు గనక ఢిల్లీ, ముంబయి నగరాల్లో జీవిస్తున్నట్టయితే, అభివృద్ధి చెందిన దేశాల స్థాయిలో పన్నులు చెల్లిస్తున్నట్టు; దానికి బదులుగా అత్యంత దారుణమైన సౌకర్యాలను పొందుతున్నట్టు! విషపూరిత గాలి మనల్ని మన ఇంట్లోనే ఖైదు చేస్తుంది. దారుణమైన రోడ్లు, పేలవమైన ట్రాఫిక్ నిర్వహణ, సంస్థాగత అవినీతి... ఎవరైనా ఈ 'మోదీ ఇండియా'ను వదిలి వెళ్తున్నారంటే వాళ్లను మనం నిందించనక్కర్లేదు.

– స్వాతీ చతుర్వేది, జర్నలిస్ట్



అతిక్రమణే తిరుగుబాటు

సోవియట్ సామ్యవాద రోజుల్లో, ఎక్కడ చూసినా కొరత రాజ్యమేలేది. కమ్యూనిస్ట్ పార్టీలో పైస్థాయి వాళ్లకు తప్ప, మిగిలిన ఎవరికైనా ఆహారం నుంచి కనీస అవసరాల దాకా అన్నింటికీ కొరత ఉండేది. నియమాలను అతిక్రమిస్తే తప్ప సాధారణ ప్రజలు బతకగలిగేవాళ్లు కాదు. అలా అతిక్రమించడాన్ని వ్యవస్థ మీద ఒక రకమైన తిరుగుబాటుగానూ భావించేవాళ్లు.

– వెలీనా త్చకరోవా, జియోపొలిటికల్ స్ట్రాటెజిస్ట్



లేకపోతేనా...

'స్వదేశ్' సినిమాను 2004లో చూసినప్పుడు, ఇండియాకు తిరిగివచ్చి నా దేశం కోసం ఏదైనా చేయాలని బలంగా అనిపించింది. కానీ సమస్య ఏమిటంటే, నేను అప్పటికే ఇండియాలో ఉన్నాను.

– శక్తి శెట్టి, వ్యంగ్య వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

మధ్యయుగాల వారసులు

ఒకే కాలానా
అనేక ప్రపంచాలలో
జీవిస్తున్న ఈ కాలానా,
ఎవరి కాలంలో వారు
ఎవరి మతంలో ఎవరికి వారే
ముసుగులు బిగించుకుని,
ఆర్య ద్రవిడ మూలవాసుల-
కొట్లాటలో
సమాధులను తవ్వుతున్నవాళ్లు!
'ఏ దేశమేగినా
పొగడరా నీ కుల సంఘాన్ని
ఎత్తరా మతం జెండాల'ని
ఎలుగెత్తి చాటుతున్న
మధ్యయుగాల వారసులే
ఈ ఉపఖండమంతా!!

– నిఖిలేశ్వర్
91778 81201

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

పురుష సమాజాన్ని ఎదిరించి...



డా॥ నాగసూరి వేణుగోపాల్

సమాజం దూరం పెట్టిన దేవదాసీ కుటుంబంలో పుట్టిన ముత్తులక్ష్మి రెడ్డి చిన్నప్పటి నుంచి ఆ వివక్షను చూస్తూ పోరాటశీలిగా మారారు. ఆమె ఎన్నో రకాలుగా తొలి యోధ: పురుషుల కళాశాలలో చేరిన మొదటి స్త్రీ, మద్రాసు ప్రభుత్వ వైద్యశాలలో మొదటి సర్జన్, మదరాసు కార్పొరేషన్‌లో మొదటి మహిళా కౌన్సిలర్, మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌కి మొదటి ఉపాధ్యక్షురాలు; మద్రాసులో మొట్టమొదటి పిల్లల ఆసుపత్రినీ, దక్షిణాదిలో తొలి క్యాన్సర్ ఆసుపత్రినీ ప్రారంభించారు. ఆమె సేవలకు గాను 1956లో పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు.

1886 జూలై 30న ముత్తులక్ష్మి తమిళ ప్రాంతమైన పుదుక్కోటలో జన్మించారు. తండ్రి మహారాజా కళాశాలలో ప్రధానోపాధ్యాయులు కాగా, తల్లి దేవదాసీ నేపథ్యం గల మహిళ. బాలికలకు తమిళంలో మాత్రమే బోధించే పాఠశాలను కాదని, బాలుర పాఠశాలలో పోరాడి ప్రవేశం పొందింది చిన్నతనంలోనే! 1902లో వందమంది మెట్రిక్యులేషన్ పరీక్షకు హాజరవ్వగా కేవలం పది మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అందులో ఒకే ఒక బాలిక ముత్తులక్ష్మి!

కూతురి మనోగత మెరిగిన తండ్రి, పురుషులను మాత్రమే చేర్చుకునే మహారాజా కళాశాలలో దరఖాస్తు చేసి పుదుక్కోట రాజు మార్తాండ భైరవ తొండమాన్ సాయంతో ప్రవేశం సాధించారు. చుట్టూ మూసి ఉన్న కారులో ఆమె ప్రయాణించేది. మగపిల్లలకు కనిపించకుండా, ఉపాధ్యాయులకు మాత్రమే కనిపించేలా ప్రత్యేక ఏర్పాటు చేసి ఆమెను తరగతి గదిలో కూర్చోబెట్టేవారు. ఆ తర్వాత మహారాజా ఆర్థిక సాయంతో మద్రాసు వైద్యకళాశాలలో చేరడానికి 1907లో తండ్రితో కలిసి మద్రాసు వెళ్లారు. 'ట్రిప్లికేన్ దాదా'గా ప్రాచుర్యం పొందిన డాక్టర్ ఎంసీ నంజుండరావు ఈ తండ్రీ కూతుళ్ళకు పరిచయమయ్యారు. ఆ ఇంటిలోనే సరోజినీనాయుడి పరిచయమూ కలిగింది. అలాగే మహాత్మా గాంధీ, అనిబిసెంట్ ప్రభావాలకీ లోనయ్యారు. మద్రాసు మెడికల్ కళాశాలలో ముత్తులక్ష్మి తొలి మహిళా విద్యార్థి కనుక

వైజ్ఞానిక వేగుచుక్కలు - 20



డా॥ ముత్తులక్ష్మి రెడ్డి

రకరకాల వివక్ష ఉండేది. అయినా 1912లో బ్యాచిలర్ మెడిసిన్ (ఎంబీ) డిగ్రీని పొందారు. అదే ఏడాది ఎగ్మూర్‌లోని గవర్నమెంట్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో హౌస్ సర్జన్‌గా ఉద్యోగం జీవితం ప్రారంభించారు.

పురుషాధిక్య సమాజాన్ని బాగా చవిచూసిన ముత్తులక్ష్మి వివాహం లేకుండా ఒంటరిగా జీవించాలనుకున్నారు. అయితే నమ్మకం కలిగించిన డాక్టర్ డీటీ సుందర రెడ్డిని 1914లో తన 28వ ఏట వివాహం చేసుకున్నారు. ఆమె ప్రైవేటు ప్రాక్టీస్‌తో పాటు, అవసరమైన ఇతర ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేసేవారు. బాలికల రక్షణ, విద్య; సురక్షితమైన ప్రసవం, మంచి ఆహారం, మహిళలకు ఉన్నత విద్య, సాంఘిక సంస్కరణ వంటివి ఆమెకు ఇష్టమైన విషయాలు. బాల్యవివాహాల నిర్మూలనకు పెద్ద ఎత్తున కృషి చేశారు. 1926–30 మధ్యకాలంలో ఆమె విధాన సభకు ఉపాధ్యక్షులుగా సేవలందించారు. బాలికల వివాహ వయస్సు 16 సంవత్సరాలుగా ఉండాలని శాసన సభలో చర్చించడమే కాకుండా, 1928లో మహాత్మా గాంధీకి మూడు పేజీల ఉత్తరం రాశారు. దీనితో ఏకీభవిస్తూ గాంధీజీ తన 'యంగ్ ఇండియా' పత్రికలో వ్యాసం రాశారు. దేవదాసీ వ్యవస్థ అంతమొందాలని చట్టసభలలో పోరాడారు. ఈ పోరాటంలో తారసపడిన ప్రత్యర్థుల్లో కామరాజ్‌కు రాజకీయ గురువైన సత్యమూర్తి ఒకరు.


బాలికలకు, మహిళలకు 1931లో అనాథ శరణాలయం స్థాపించారు. అదే 'అవ్వై హోమ్ అండ్ ఆర్ఫనేజ్'. తనకెంతో తోడ్పాటుగా ఉన్న చెల్లెలు 1923లో క్యాన్సర్‌తో మరణించడం ముత్తులక్ష్మికి పెద్ద విఘాతం. క్యాన్సర్ చికిత్సాలయం కోసం ఆమె ఆనాడే కంకణం కట్టుకున్నారు. తన కారును అమ్మి వేసి క్యాన్సర్ వ్యాధి అధ్యయనం కోసం కుమారుణ్ణి అమెరికా పంపారు. ఎంతోమంది నుంచి విరాళాలు సేకరించి 1952లో దక్షిణ భారతదేశంలోనే తొలి క్యాన్సర్ ఆసుపత్రిని అడయార్‌లో అప్పటి ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా ప్రారంభించారు. 1954 నుంచి సేవలు ప్రారంభించిన ఈ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ నేటికీ గొప్పగా సేవలందిస్తోంది. 1968 జూలై 22న కన్నుమూసిన ముత్తులక్ష్మి సేవలు చిరస్మరణీయం.

వ్యాసకర్త ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి
మొబైల్: 94407 32392

అనుగ్రహం

మోక్షం అంటే దుఃఖ స్పర్శే లేని నిత్య, నిరంతర ఆనంద అనుభవ స్థితి. కాబట్టి, మానవ జీవితానికి పరమ లక్ష్యం మరేదీ కాదు, మోక్ష ప్రాప్తి మాత్రమే అని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. మరి ఆ మోక్ష ప్రాప్తికి మార్గం ఏమిటి? నిరంతర సాధన!

ఈ సాధనలో మొదటి దశ, అనిత్యమైన ప్రాపంచిక విషయాల పట్ల సంపూర్ణ వైరాగ్యం అలవరచుకోవటం. **మోక్ష స్య హేతుః ప్రథమః నిగద్యతే, వైరాగ్యం అత్యంతం అనిత్య వస్తుషు**, అని 'వివేక చూడామణి'! ఆపైన, శమము, దమము, తితిక్ష (ఓర్పు), నిష్కామ కర్మాచరణ. ఆ తరవాత గురుముఖతః వేదాంత వాక్యాల శ్రవణం. దాని తరవాత, ఆ విన్న గురుబోధనల మననమూ, చింతనా. చివరకు 'నిది ధ్యాసన'. అంటే ఆ వేదాంత వాక్యాల తాత్పర్యం గురించిన ఏకాగ్ర ధ్యానమూ, విచారణా!



నిస్సందేహంగా ఇది చాలా కష్టతరమైన సాధన. ఎంతో నిలకడతో, ఆసక్తితో, పట్టుదలతో సాగించవలసింది. కృషి సాధకుడిదే గానీ, ఈ కృషి పట్టుదలగా సాగి, ఫలించాలంటే నాలుగు విధాలైన దివ్యానుగ్రహం ఉపకరిస్తుంది. వీటిని 'చతుర్విధ కృప'లు అంటారు. వీటిలో మొట్టమొదటిది ఈశ్వర కృప అని చెప్పవలసిన పనిలేదేమో! భగవంతుడి మీద భక్తిశ్రద్ధలూ, విశ్వాసమూ ఉన్న వారికి తత్త్వ విచారణ పట్ల ఆసక్తీ, ఏకాగ్రతా స్థిరంగా ఉంటాయి. రెండవది శాస్త్ర కృప. తను అధ్యయనం చేసే వేదాంత శాస్త్ర బోధనల మీద సాధకుడికి శ్రద్ధ ఉంటే, అతడిని ఆ శాస్త్రాలు అనుగ్రహించి, సులభంగా కరతలామలక మవుతాయి. మూడు – గురుకృప. సాధకుడికి ఆత్మజ్ఞానం బోధించే సద్గురువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో సమానం. గురువు అనుగ్రహం పొందిన సాధకుడికి వేదాంత చింతన నల్లేరు మీద బండి నడకలా సాగి, సత్ఫలాన్ని ఇస్తుంది. ఇక నాలుగవ కృప ఒకటుంది. ఇది ఆత్మ కృప లేక అంతఃకరణ కృప. నేర్చింది ఆమూలాగ్రంగా చిత్తంలో స్థిరంగా నిలవాలంటే, సాధకుడికి తన అంతఃకరణం చక్కగా సహకరించాలి. మనసు మొరాయించి, పరిపరి విధాల పరుగెత్తుతూ ఉంటే సాధకుడికి అది బలీయమైన అంతశ్శత్రువు. మనసు, అనుగ్రహం చూపించి, మాట వినకపోతే, సాధన చెట్టెక్కుతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

బిహార్‌కు అసెంబ్లీ బృందం

- ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్‌కు స్పీకర్, మండలి చైర్మన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఆదివారం బిహార్ రాజధాని పట్నాకు బయలుదేరి వెళ్లింది. ఈనెల 20, 21 తేదీల్లో పట్నాలో జరగనున్న 85వ అఖిల భారత ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఏఐపీవోసీ)లో పాల్గొనేందుకు స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు, ఇతర అధికారులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెళ్లారు. ఇదే కాన్ఫరెన్స్‌కు హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజులు తెలంగాణ బృందాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో కలిశారు.

వేలల్లో 'కోస్టా యాప్' బాధితులు!

- రూ.30 కోట్ల వరకు పెట్టుబడులు..!
- నష్టపోయిన వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖులు?

జనగామ: ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుని కోట్ల రూపాయలను గొల్లగొట్టిన కోస్టా యాప్ బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. జనగామ జిల్లాలో సుమారు 2 వేల మంది రూ.15 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారని ప్రాథమిక సమాచారం కాగా..మొత్తంగా 5 వేల మంది వరకు రూ.30 కోట్ల మేర నష్టపోయారని తెలుస్తోంది. కోస్టా యాప్ బాధితుల్లో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖులు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన పెద్దలు, జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న ఓ సర్కారు కార్యాలయంలో పని చేసే అధికారులు, సిబ్బంది కూడా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కోస్టా యాప్‌లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన బాధితుల్లో ఇప్పటివరకు 8 మంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. మరికొంత కూడా ఇందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. బాధితుల్లోని పలువురు ప్రముఖులు మాత్రం ఫిర్యాదు చేస్తే పరువు పోతుందనే ఆందోళనతో మిన్నకుండి పోతున్నారని, కేసు పెడితే డబ్బులు తిరిగి వస్తాయా లేదా అనే విషయమై న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నారనే చర్చ జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల గ్రూపులు ఉన్నట్లు సమాచారం కాగా బాధితుల్లో చాలామంది సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది.

కాలేజీకి వెళ్లమన్నారని..

- ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


సింధుజ

పాపన్నపేట(మెదక్): కాలేజీకి వెళ్లమన్నందుకు ఒక ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లిలో శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అరిగె కృష్ణ కూతురు సింధుజ (19) మెదక్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. నెల రోజులుగా కాలేజీకి వెళ్లకుండా ఇంట్లోనే దిగాలుగా కూర్చుంటోంది. కళాశాలకు వెళ్లాలని కుటుంబ సభ్యులు శనివారం ఆమెపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అదేరోజు ఇంట్లో ఉన్న తమ్ముడిని బయటకు పంపిన సింధుజ.. ఉరి వేసుకుంది. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు.

ఏ తల్లి నిన్ను కన్నదో..

- రోడ్డు పక్కన పసిగుడ్డు


చిక్లీ శివారులో రోడ్డు పక్కన నవజాత శిశువు

మాక్లూర్: అప్పుడే పుట్టిన పసిగుడ్డును రోడ్డు పక్కన వదిలేసి వెళ్లారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని చిక్లీలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. ఆదివారం తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో చిక్లీ గ్రామ శివారు ప్రాంతానికి కొత్తపల్లి వైపు నుంచి ఒక బైక్ వచ్చి ఆగింది. బైక్‌పై ఇద్దరు వ్యక్తులున్నారు. అప్పుడే పుట్టిన ఆడ శిశువును రోడ్డు పక్కన ఉంచి తిరిగి వెళ్లిపోయారు. ఆ సమయంలో గేదె పాలు పిండేందుకు లేచిన రైతు.. శిశువు ఏడుపు విని అటువైపు వెళ్లి చూశాడు. లుంగీలో చుట్టిన శిశువు కనిపించడంతో.. ఇంటికి వెళ్లి తన వదినకు విషయం చెప్పాడు. దీంతో ఆమె వచ్చి శిశువును తీసుకుని ఇంటికి వెళ్లింది. అనంతరం పంచాయతీ కార్యదర్శి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మాక్లూర్ పోలీసులు గ్రామానికి వచ్చి శిశువును జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవలు అందించాక శిశువును ఐసీడీఎస్ అధికారులకు అప్పగించామని మాక్లూర్ ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.



మేఘా స్టార్

నిజానికితడు స్కీయింగ్ చేస్తున్నది మంచు పర్వతాల్లోనే... కాకపోతే ఇక్కడ నింగీనేలా కలిసినట్లుగా అయి.. ఇలా మేఘాల్లో స్కీయింగ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని పీటర్ శ్లావిక్ అనే ఫొటోగ్రాఫర్ తీశారు. వరల్డ్ స్పోర్ట్స్ ఫొటోగ్రఫీ పోటీల్లో ఈ చిత్రం మూడో స్థానంలో నిలిచింది. ఈ ఫొటోకు 'స్వర్గం' అని ఫొటోగ్రాఫర్ క్యాప్షన్ ఇచ్చారు. సరిపోయింది కదూ..

నల్లమలలో బెబ్బులి

- జంగిల్ సఫారీ పర్యాటకులకు మరోసారి కనిపించిన పెద్దపులి



మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో జంగిల్ సఫారీకి వెళ్లిన పర్యాటకులకు పెద్దపులులు కనువిందు చేస్తున్నాయి. గత డిసెంబర్, జనవరిలో కలిపి ఇప్పటివరకు నాలుగుసార్లు అభయారణ్యంలో పర్యాటకులకు పెద్దపులులు తారసపడ్డాయి. తాజాగా ఆదివారం సాయంత్రం సఫారీ వాహనంలో ప్రయాణిస్తున్న పర్యాటకులకు ఫర్హాబాద్ సమీపంలోని వాచ్‌టవర్ సమీపంలో పొదల మధ్యన పెద్దపులి కనిపించింది. ఈ క్రమంలో కొందరు పెద్దపులిని తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.

పానమంతా నీ మీదనే ఉన్నది..

ఓసారి కనపడు బిడ్డా..

- ఎన్‌కౌంటర్‌లో దామోదర్ మృతి చెందారన్న ప్రచారం నేపథ్యంలో తమవారి కోసం మావోయిస్టు కుటుంబాల ఆవేదన
- ఎక్కడ ఎన్‌కౌంటర్ అయినా వారి గుండెల్లో ఆందోళన
- తమవాళ్లు ఎక్కడ అంటూ వెతుకులాట.. ఒక్కసారైనా చూడాలని ఆరాటం
- దశాబ్దాలుగా అజ్ఞాతంలోనే సీనియర్ మావోయిస్టులు


వేణుగోపాల్, లక్ష్మణ్‌రావు, కంకణాల రాజిరెడ్డి, ప్రసాద్‌రావు, బాలకష్ణ
రాజిరెడ్డి, కల్పన, సత్యం, రవి, తిరుపతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా నాలుగు దశాబ్దాలు.. అజ్ఞాతంలోకి వెళ్లిన తెలంగాణకు చెందిన పలువురు సీనియర్ మావోయిస్టుల జాడ నేటికీ తెలియలేదు. ఉడుకురక్తం.. విప్లవ భావాలతో 80, 90వ దశకంలో అడవిబాట పట్టిన ఆనాటి పట్టభద్రులు దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమానికి దిశ, దిశలా మారారు. కేంద్ర కమిటీ సభ్యులుగా.. దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీల్లోనూ కీలకంగా వ్యవహరించారు. తెలుగు రాష్ట్రాల్లో మావోయిస్టుల వేట తీవ్రం కావడంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా దండకారణ్యాల్లోకి వలస వెళ్లారు. అక్కడ నుంచే ఉద్యమాన్ని నడుపుతున్నారు. అయితే కరోనా అనంతరం పార్టీకి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. కొందరు కీలక నేతలు అనారోగ్యం, దీర్ఘకాలిక వ్యాధులు, వృద్ధాప్యం కారణంగా అడవిలోనే తనువు చాలిస్తుంటే.. మరికొందరు ఎదురుకాల్పుల్లో మరణిస్తున్నారు. దీంతో మిగిలిన వారు ఎలా ఉన్నారో? అనే ఆందోళన ఇక్కడ వారి కుటుంబ సభ్యుల్లో నెలకొంది. తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్ మరణించారన్న వార్తల నేపథ్యంలో కీలక నేతలందరి బంధువులు వారి క్షేమం గురించి ఆందోళన చెందుతున్నారు. తాము చనిపోయేలోగా వారిని ఒక్కసారైనా కళ్లారా చూసుకోవాలని తాపత్రయపడుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వారే అధికం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముప్పాల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి మావోయిస్టు పార్టీకి మాస్టర్‌మైండ్‌గా వ్యవహరిస్తున్నారు. 74 ఏళ్ల వయసులోనూ పార్టీ కోసం క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. పోతుల కల్పన అలియాస్ సుజాత (65) అనారోగ్యంతో బాధపడుతున్నారని సమాచారం. ఆమె మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ రాంజీ భార్య. పెద్దపల్లి జిల్లాకు చెందిన కంకణాల రాజిరెడ్డి, మల్లోజుల వేణుగోపాల్‌రావు, మల్లా రాజిరెడ్డి, పూల్లూరి ప్రసాదరావు, జగిత్యాలకు చెందిన తిప్పిరి తిరుపతి, కడారి సత్యనారాయణరెడ్డి (సిరిసిల్ల) వంటి నేతలు కేంద్ర కమిటీ సభ్యులుగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, దండకారణ్యం స్పెషల్ జోన్ కమిటీ సభ్యులుగా పలు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన వారే అధికంగా ఉన్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన గాజర్ల రవి (జయశంకర్ భూపాలపల్లి), మోడెం బాలకృష్ణ (హనుమకొండ) సెంట్రల్ కమిటీ మెంబర్, కందగట్ల యాదగిరి (హనుమకొండ) స్టేట్ కమిటీ మెంబర్, ముప్పిడి సాంబయ్య (హనుమకొండ) స్టేట్ కమిటీ మెంబర్‌గా కొనసాగుతున్నారు.

భర్త జాడ చెప్పండి



నా భర్త బెజ్జారపు కిషన్ 38 ఏళ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఆ తర్వాత ఆయన ఆచూకీ దొరకలేదు. దీనిపై ఎన్నోసార్లు మావోయిస్టు వర్గాలకు, పోలీసులకు విన్నవించినా ఫలితం దక్కలేదు. ఇప్పటికై నా నా భర్త ఎక్కడున్నాడు.. ఏం చేస్తున్నాడో చెప్పాలి. ఆయన కోసమే ఇంకా బతికున్నా.

– బెజ్జారపు పుష్ప

బడే దామోదర్‌కు ఏమైంది?

- సంఘటనా స్థలంలో మావోయిస్టు అగ్రనేత గాయపడినట్టుగా సమాచారం
- చనిపోయాడని అధికారికంగా నిర్ధారించని పోలీస్ యంత్రాంగం
- ఫేక్ లేఖ అంటున్న దామోదర్ అనుచర వర్గాలు


కాల్వపల్లిలో దామోదర్ తల్లి బతుకమ్మ, గ్రామస్తులు

ములుగు/ఎస్‌ఎస్ తాడ్వాయి: మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌కు ఏమైందంటూ సర్వత్రా చర్చ జరుగుతోంది. ఛత్తీస్‌గఢ్‌లోని పూజారి కాంకేర్‌-మారేడుపాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో దామోదర్ మృతి చెందాడని శనివారం మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగా పేరిట విడుదలైన లేఖ ఫేక్ అంటూ దామోదర్ అనుచరులు చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో దామోదర్ అక్కడే ఉన్నారని, ఆ సమయంలో గాయాలపాలైన ఆయన్ను అనుచరులు భద్రంగా మరోచోటకు తరలించినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం దామోదర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన ప్రాణానికి ఎలాంటి హాని లేదని సమాచారం. సాధారణంగా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు కుటుంబాలకు పోలీస్‌శాఖ తరఫున మరణవార్త తెలపడంతోపాటు మృతదేహాన్ని అప్పగిస్తారు. దామోదర్ మృతి చెందినట్టు ప్రచారం జరుగుతున్నా, అధికారికంగా పోలీస్‌శాఖ తరఫున కాల్వపల్లిలోని దామోదర్ తల్లి బతుకమ్మ, కుటుంబ సభ్యులకు, ములుగు జిల్లా పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. దీంతో దామోదర్‌కు ఎలాంటి హాని జరగలేదని, కొంతమంది కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాల్వపల్లివాసులు వాపోతున్నారు.


ఆస్ట్రేలియాలో ఘనంగా సంక్రాంతి సంబురాలు

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హాజరు



సాక్షి, హైదరాబాద్: ఆస్ట్రేలియా దేశంలో నివసిస్తున్న తెలుగు ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మెల్‌బోర్న్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంక్రాంతి సంబురాలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎ.పి.జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఎస్.శివసేనారెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎల్లలు దాటి వచ్చినా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రవాసులు కాపాడుతున్నారని ప్రశంసించారు. తెలంగాణలో ఉన్నది ప్రజా ప్రభుత్వమని, తెలుగు పారిశ్రామికవేత్తలు తమ తమ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టి మాతృభూమి రుణం తీర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకారమందించాలని కోరారు.

మొరాయించిన ఎల్లంపల్లి పంప్‌హౌస్ మోటార్లు


నంది పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోస్తున్న గోదావరి నీరు

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా నంది మేడారంలోని రిజర్వాయర్‌లోకి ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి గోదావరి నీటిని తరలించేందుకు చేస్తున్న ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటితో రిజర్వాయర్‌ను నింపాలని నీటి పారుదలశాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎల్లంపల్లి ప్రాజెక్టులోని రెండు విద్యుత్ మోటార్ల ద్వారా ఒకరోజే 247 క్యూసెక్కులను పంపింగ్ చేశారు. ఆ తర్వాత మోటార్లు మొరాయించాయి. దీంతో శనివారం రాత్రి కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన ఆరో ప్యాకేజీలోని నంది పంప్‌హౌస్‌లోని ఆరో విద్యుత్ మోటార్‌ను ఆన్‌చేసి నంది మేడారం రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేస్తున్నారు. ధర్మారం, వెల్గటూర్ మండలాల్లోని మిషన్ భగీరథ పథకం కింద నీటి సరఫరాకు మేడారం రిజర్వాయర్ నుంచే నీటిని శుద్ధి చేసి పంపిస్తారు. మిషన్ భగీరథ నీటిని తీసుకునేందుకు ఇన్‌టేక్ వెల్ వద్ద రిజర్వాయర్‌లో కనీసం 228 మీటర్ల నీటి మట్టం ఉండాల్సి ఉంది. ప్రస్తుతం ఆ స్థాయిలో నీటిమట్టం లేదు. దీంతో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నీటి పారుదల శాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులతో చర్చించి ఎల్లంపల్లి నీటిని రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేయించేలా చర్యలు తీసుకున్నారు. అయితే మోటార్లు మొరాయించటంతో కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధంగా ఉన్న ప్యాకేజీ- 6 నంది పంప్‌హౌస్ నుంచి ఒక్క మోటార్‌తో నీటిని రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు.

కిక్కిరిసిన యాదగిరిగుట్ట

- స్వామి ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా సమయం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు శ్రీస్వామివారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చి మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు అధికంగా రావడంతో.. ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా సమయం.. వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తుల రద్దీ పెరగడంతో ఆలయ క్యూకాంప్లెక్స్ నిండిపోయింది. భక్తుల రద్దీ కారణంగా ఆలయ పరిసరాలు, ప్రసాద విక్రయశాల, ఉత్తర, పశ్చిమ మాడ వీధులు, క్యూలైన్లు, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మండపాల్లో సందడి నెలకొంది. స్వామివారిని సుమారు 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో ఆలయానికి నిత్యాదాయం రూ.51,40,252 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

దైవ దర్శనానికి వెళుతుండగా..

బోల్తా పడిన వాహనం
- 47 మందికి గాయాలు... ఒకరి మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు...
- చెట్టు, బండరాయి లేకపోతే వాహనం లోయలో పడేదే...
- ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లో ఘటన


మాలేపూర్ ఘాట్ లోయలో బోల్తా పడ్డ ఐచర్ వాహనం

ఆదిలాబాద్‌టౌన్: దైవ దర్శనానికి వెళుతున్న క్రమంలో ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నార్నూర్ మండలంలోని మాలేపూర్ ఘాట్ వద్ద ఓ వాహనం బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 47 మందికి గాయాలు కాగా, వారిలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. క్షతగాత్రులను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌తోపాటు ఉట్నూర్‌లోని జిల్లా ఆస్పత్రి, నార్నూర్ ఏరియా ఆస్పత్రులకు తరలించారు. వివరాల్లోకి వెళితే.. గుడిహత్నూర్ మండలంలోని సూర్యగూడ, ఇంద్రవెల్లి మండలంలోని సాలెవాడకు చెందిన ఆదివాసీలు ఆదివారం కెరమెరి మండలంలోని జంగుబాయి పుణ్యక్షేత్రానికి ఓ వాహనంలో తరలివెళ్లారు. నార్నూర్ మండలం మాలేపూర్ రెండో మూల మలుపు ఘాట్ వద్ద డ్రైవర్ న్యూట్రల్ చేయడంతో ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. అయితే పక్కన చెట్టు, ముందు పెద్ద రాయి ఉండడంతో ఆగిపోయింది. డ్రైవర్ అందులో నుంచి దూకి పరారయ్యాడు. ఆ సమయంలో అందులో మహిళలు, చిన్నారులతోపాటు వృద్ధులు సుమారు 70 మంది వరకు ప్రయాణిస్తున్నారు. వీరిలో 47 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నార్నూర్ మండలంలోని కొత్తపల్లి, భీంపూర్ గ్రామస్తులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. గుడిహత్నూర్ మండలంలోని సూర్యగూడకు చెందిన కుమ్ర మల్కు(60) ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది.


ఘటనాస్థలం వద్ద క్షతగాత్రులు

ముందు డిజైన్లు..ఆపై టెండర్లు

- ఏదుల నుంచి డిండి ఎత్తిపోతలకు నీరు తీసుకునేలా నిర్ణయం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.61 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే డిండి ఎత్తిపోతల పథకం పనులకు చకాచకా అడుగులు పడుతున్నాయి. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీరు తీసుకోవాలని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఫ్లోరైడ్ పీడిత నియోజకవర్గాలైన మునుగోడు, దేవరకొండకు నీరందించే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులను చేపట్టేందుకు ఆమోదముద్ర వేసింది. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తీసుకోవడం, రిజర్వాయర్ల భూసేకరణ, పరిహారం పూర్తి చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లా సస్యశ్యామలం అవుతుంది. ఇందుకోసం ఏదుల నుంచి రోజుకు అర టీఎంసీ చొప్పున 60 రోజుల్లో 30 టీఎంసీల నీటిని తీసుకుంటారు.

త్వరలోనే గ్లోబల్ టెండర్లు

డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల నుంచి నీటిని తీసుకోవాలని భావిస్తున్న ప్రభుత్వం.. అక్కడి నుంచి ఉల్పర వరకు నీటిని తరలించే పనులను రూ.1,800 కోట్లతో చేపట్టాలని నిర్ణయించింది. వాటికి సంబంధించి త్వరలోనే గ్లోబల్ టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతోంది. ఏదుల రిజర్వాయర్ నుంచి 800 మీటర్ల అప్రోచ్‌చానల్, అక్కడి నుంచి 2.525 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ తవ్వి, తొమ్మిది మీటర్ల డయాతో 16 కిలోమీటర్ల టన్నెల్, ఆ తర్వాత 3.050 కిలోమీటర్ల ఓపెన్ కెనాల్ తవ్వుతారు. మొత్తంగా ఏదుల నుంచి 21.575 కిలోమీటర్ల తర్వాత నీరు దుందుభి నదిలోకి చేరి, అక్కడి నుంచి 6.325 కిలోమీటర్ల తర్వాత ఉన్న పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్‌కు చేరుతుంది. అయితే అక్కడ చెక్‌డ్యాం స్థానంలో రబ్బర్ డ్యాం , దానికి 1.5 కిలోమీటర్ల దిగువన ఉల్పర వద్ద బరాజ్‌ను నిర్మిస్తారు. వీటికి సంబంధించిన డిజైన్లపై సాగునీటిపారుదల శాఖ కసరత్తు చేస్తోంది. త్వరలోనే వాటిని ఖరారు చేసి, గ్లోబల్ టెండర్లు పిలవనున్నట్టు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

పర్యావరణ అనుమతులు పెండింగ్

పర్యావరణ అనుమతులు లేకుండానే చేపట్టిన డిండి పనులను ఆపేయాలని 2022 డిసెంబర్‌లో జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశించింది. అంతే కాదు రూ.92.85 కోట్ల జరిమానా కూడా విధించింది. దీంతో ప్రభుత్వం పర్యావరణ అనుమతులు సాధించే బాధ్యతను ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు (ఈపీటీఆర్ఐ) అప్పగించింది. ఇంతవరకు అనుమతుల వ్యవహారం కొలిక్కి రాలేదు.


గొట్టిముక్కల రిజర్వాయర్

భూసేకరణ, నిర్వాసితుల సమస్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఈ పథకానికి డిటైయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేయాలని 2007లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ఏర్పడే వరకు కూడా డీపీఆర్‌లు ప్రభుత్వానికి అందలేదు. చివరకు 2015లో జూన్ 11వ తేదీన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకానికి ఉత్తర్వులు (జీఓ 107) జారీ చేసింది. మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లోని 3.61 లక్షల ఎకరాల్లో ఆయకట్టుకు నీరందించేందుకు రూ.6,194 కోట్లతో ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించింది. అయితే పాలమూరు–రంగారెడ్డి డీపీఆర్‌ను ఆమోదించి, నిధులు కేటాయించి పనులను వేగంగా చేయించిన నాటి ప్రభుత్వం డిండి డీపీఆర్‌ను ఆమోదించలేదు. అయినా కొంత డబ్బు కేటాయించి 2015లో శివన్నగూడెంలో రిజర్వాయర్ల పనులను శంకుస్థాపన చేసి చేపట్టింది. ఉల్పరకు దిగువ నుంచి ప్రారంభమయ్యే ప్రధాన కాలువ, డిండి ప్రాజెక్టు ఎత్తు పెంపు, అప్రోచ్ చానల్స్, సింగరాజుపల్లి, ఎర్రవల్లి–గోకారం, ఇర్విన్, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్ల నిర్మాణాలకు సుమారు 16,030 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 12,052 ఎకరాల భూమినే సేకరించారు. భూసేకరణతో నిర్వాసితులు అయ్యే దాదాపు 1,899 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది. ఇప్పటివరకు ప్యాకేజీలు కుదరకపోవడంతో నిర్వాసితుల ఆందోళన చేస్తున్నారు. పర్యావరణ అనుమతులు సాధిస్తే అన్ని పనులు వేగిరం అవుతాయి.

డిండి పరిధిలో రిజర్వాయర్ల పరిధిలో ఆయకట్టు ఇలా

రిజర్వాయర్	సామర్థ్యం (టీఎంసీలు)	ఆయకట్టు
డిండి	2.468	30 వేలు
సింగరాజుపల్లి	0.810	13 వేలు
ఎర్రవల్లి–గోకారం	1.182	6 వేలు
ఇర్విన్	0.553	10 వేలు
గొట్టిముక్కుల	1.839	28 వేలు
చింతపల్లి	0.910	15 వేలు
కిష్టరాంపల్లి	5.686	లక్ష
శివన్నగూడెం	11.968	1.55 లక్షలు

నేడే పట్టాభిషేకం

అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ ప్రమాణ స్వీకారం

- చలి దృష్ట్యా ఇండోర్‌లో జరగనున్న కార్యక్రమం
- ఆహూతులు 500 మందే; జాబితాలో అంబానీలు
- టిక్‌టాక్‌పై నిషేధాన్ని ఎత్తేస్తూ తొలి సంతకం!



వాషింగ్టన్: రెండున్నర నెలల ఎదురుచూపులు ముగిశాయి. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా పాలనా పగ్గాలు చేపట్టనున్నారు. దేశ 47వ అధ్యక్షునిగా సోమవారం ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్‌లో రాజకీయ, పారిశ్రామిక రంగాలకు చెందిన అతిరథ మహారథుల సమక్షంలో అట్టహాసంగా కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని తొలుత ఆరుబయట తలపెట్టినా, గడ్డకట్టించే చలి కారణంగా రొటుండా హాల్ లోనికి మార్చారు. దాంతో రొనాల్డ్ రీగన్ తర్వాత గత 40 ఏళ్లలో ఇండోర్‌లో అధ్యక్ష ప్రమాణం చేస్తున్న తొలి నేతగా ట్రంప్ నిలవనున్నారు. ఈ నేపథ్యంలో ఆహూతులను కూడా వేలనుంచి 500 లోపునకు కుదించారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. చైనా ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్‌తో పాటు పలువురు దేశాధినేతలు తదితరులు కూడా హాజరవనున్నారు. 2021 క్యాపిటల్ హిల్ దాడి నిందితులు కూడా కోర్టు ప్రత్యేక అనుమతితో కార్యక్రమంలో పాల్గొంటుండటం విశేషం. ట్రంప్ శనివారం సాయంత్రమే కుటుంబసమేతంగా ఫ్లోరిడా నుంచి ప్రత్యేక విమానంలో వాషింగ్టన్ చేరుకున్నారు. రాత్రి స్టెర్లింగ్‌లోని ఆయన సొంత నేషనల్ గోల్ఫ్ క్లబ్‌లో మొదలైన ప్రమాణ స్వీకార వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, మద్దతుదారులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సందడి చేశారు. అనంతరం కాబోయే ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్, ఆయన సతీమణి ఉషా చిల్లకూరితో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండోసారి పగ్గాలు చేపడుతూనే ట్రంప్ తనదైన శైలిలో దూకుడు కనబరచనున్నారు. పాలన పగ్గాలు చేపట్టిన తొలి రోజే టిక్‌టాక్‌పై నిషేధాన్ని తాత్కాలికంగా ఎత్తేయనున్నట్టు ఆయన ఆదివారం ప్రకటించారు. అంతేగాక ఏకంగా 100కు పైగా అధికారిక ఉత్తర్వులు జారీ చేయబోతున్నారు. నవంబర్ 5న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి, ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ను ట్రంప్ ఓడించడం తెలిసిందే. ఆయన 2017–21 మధ్య తొలి దఫా అమెరికా అధ్యక్షునిగా పనిచేశారు. ట్రంప్ అభిమానులకు పోటీగా ఆయన వ్యతిరేకులు కూడా శనివారం నుంచే వైట్‌హౌస్ ముందు నిరసనలతో హోరెత్తిస్తున్నారు.



ట్రంప్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న అంబానీ దంపతులు

ఏప్రిల్‌లో భారత పర్యటన?

ఏప్రిల్‌లో ట్రంప్ భారత పర్యటన ఉండే అవకాశం కనిపిస్తోంది. అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వీలైనంత త్వరగా భారత్‌లో పర్యటించాలని ఆయన యోచిస్తున్నట్టు ఫైనాన్షియల్ డైలీ వెల్లడించింది. ''దీనిపై ఆయన ఇప్పటికే తన సలహాదారులతో లోతుగా చర్చిస్తున్నారు. డిసెంబర్ చివర్లో క్రిస్మస్ సందర్భంగా అమెరికాలో పర్యటించిన విదేశాంగ మంత్రి జైశంకర్‌తో ఈ దిశగా ఇప్పటికే ఒక దఫా చర్చలు కూడా జరిగాయి'' అని తెలిపింది. అంతకుముందే ప్రధాని మోదీని అమెరికాలో పర్యటించాల్సిందిగా ట్రంప్ ఆహ్వానించే అవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు వివరించింది. చైనాపై టారిఫ్‌లు తప్పవన్న తన వ్యాఖ్యల తాలూకు ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఆ దేశంలో కూడా ట్రంప్ పర్యటిస్తారని ఆయన సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.

కార్యక్రమానికి అతిరథులు

ప్రపంచ కుబేరులు, వ్యాపార దిగ్గజాలు ఎలాన్ మస్క్, మార్క్ జుకర్‌బర్గ్, జెఫ్ బెజోస్, ముకేశ్ అంబానీ దంపతులు తదితరులు ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొంటున్నారు. అంబానీ దంపతులు శనివారం రాత్రే ట్రంప్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం ఆయనతో పాటు క్యాండిల్ లైట్ డిన్నర్‌లో పాల్గొన్నారు. ట్రంప్ వ్యక్తిగతంగా ఆహ్వానించిన 100 మంది జాబితాలో భారత్ నుంచి వారు మాత్రమే ఉన్నారు.

ప్రమాణ స్వీకారం ఇలా...

- ట్రంప్ ఆదివారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆర్లింగ్టన్ జాతీయ స్మారకం వద్ద కార్యక్రమంలో, క్యాపిటల్ వన్ ఎరీనా ర్యాలీలో పాల్గొంటారు.
- సోమవారం ఉదయం సెయింట్ జాన్స్ ఎపిస్కోపల్ చర్చిలో ట్రంప్ ప్రార్థనలతో కార్యక్రమాలు మొదలవుతాయి.
- అనంతరం దిగిపోనున్న అధ్యక్షుడు జో బైడెన్ దంపతులు వైట్‌హౌస్‌లో ట్రంప్‌కు తేనీటి విందు ఇస్తారు.
- తర్వాత అంతా కలిసి క్యాపిటల్ హిల్ భవనానికి చేరుకుంటారు.
- లింకన్ బైబిల్‌పై ప్రమాణం చేసి అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు.
- తర్వాత ప్రారంభోపన్యాసం చేస్తారు. రెండో టర్ములో తన ప్రాథమ్యాలను క్లుప్తంగా వివరిస్తారని భావిస్తున్నారు.
- అనంతరం బైడెన్, కమలా హారిస్‌కు లాంఛనంగా వీడ్కోలు పలుకుతారు.
- తర్వాత ట్రంప్ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తూ వైట్‌హౌస్ ఓవల్ ఆఫీసులో అధికారిక పత్రాలపై సంతకాలు చేస్తారు. అధ్యక్షునిగా తొలి ఆదేశాలు జారీ చేస్తారు.
- అధికారిక విందు అనంతరం సాయుధ బలగాలపై సమీక్ష జరుపుతారు.

అమల్లోకి కాల్పుల విరమణ

ముగ్గురు బందీలను వదిలేసిన హమాస్



డెయిర్ అల్ బాలాహ్ (గాజా): పదిహేను నెలల భీకర యుద్ధానికి తాత్కాలికంగా తెర పడింది. శ్మశాన సదృశంగా కన్పిస్తున్న గాజా వీధుల్లో ఎట్టకేలకు శాంతిపవనాలు వీచాయి. ఇజ్రాయెల్, హమాస్ మధ్య విరమణ ఒప్పందం మూడు గంటలు ఆలస్యంగా ఆదివారం ఉదయం 11.30కు అమల్లోకి వచ్చింది. విడుదల చేయబోయే తమ బందీల జాబితాను హమాస్ వెల్లడించేదాకా కాల్పుల విరమణ అమల్లోకి రాదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కుండబద్దలు కొట్టడంతో తొలుత ఆందోళన నెలకొంది. జాబితా విడుదలను హమాస్ ఆలస్యం చేయడం ఉత్కంఠకు దారితీసింది. ఉదయం 11.15కు రోమీ గోనెన్ (24), ఎమిలీ దమారీ (28), డోరోన్ స్టెయిన్‌బ్రీచర్ (31) అనే ముగ్గురు మహిళలను హమాస్ వదిలేస్తున్నట్టు హమాస్ ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇజ్రాయెల్ బలగాలు వారిని సురక్షితంగా స్వదేశానికి తరలించాయి. బదులుగా ఇజ్రాయెల్ కూడా తొలి దఫాలో 90 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయనుంది. వారిని సురక్షితంగా గాజా చేర్చేందుకు రెడ్‌క్రాస్ వాహనశ్రేణి ఇజ్రాయెల్‌లోని ఓఫెర్ కారాగానికి చేరుకుంది. ఆరువారాల్లో హమాస్ 33 మంది, ఇజ్రాయెల్ దాదాపు 2,000 మంది ఖైదీలను విడుదల చేయనున్నాయి. మరోవైపు కాల్పుల విరమణ ఒప్పందాన్ని నెతన్యాహూ ప్రభుత్వ భాగస్వామి ఓజ్మా యెహూదిత్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రభుత్వం నుంచి వైదొలగింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు నేతలు మంత్రి పదవులకు రాజీనామా చేశారు.

గాజాలో ఆనందోత్సాహాలు

కాల్పుల విరమణతో గాజా స్ట్రిప్‌లో ఆనందం వెల్లివిరిసింది. వలస వెళ్లిన పాలస్తీనియన్లు భారీగా గాజాకు తిరిగొస్తున్నారు. అయితే ఆదివారం ఉదయం దాకా ఇజ్రాయెల్ సైన్యం గాజాపై దాడులు కొనసాగింది. దాంతో ఆదివారం ఒక్క రోజే 26 మంది మరణించారు.

దుమ్ము రేపుతున్న... ట్రంప్ మీమ్ బిట్‌కాయిన్

వాషింగ్టన్: అగ్రరాజ్య అధ్యక్ష పీఠంపై కూర్చోడానికి ఒక్కరోజు ముందే సొంత బిట్‌కాయిన్‌ను ట్రంప్ మార్కెట్లోకి తెచ్చారు. $TRUMP పేరిట తెచ్చిన ఈ కాయిన్ (టోకెన్)కు మార్కెట్లో అనూహ్య డిమాండ్ నెలకొంది. ఔత్సాహిత పెట్టుబడిదారులు దాన్ని ఎగబడి కొనుగోలు చేశారు. దాంతో దాని మార్కెట్ క్యాపిటలైజేషన్ గంటల్లోనే ఏకంగా 5.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు వార్తలొచ్చాయి. ''మొత్తంగా 100 కోట్ల టోకెన్లు తెస్తాం. ప్రారంభం రోజున 20 కోట్ల కాయిన్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టాం. మూడేళ్లలో దశలవారీగా 80 కోట్ల కాయిన్లను తీసుకొస్తాం'' అని $TRUMP మీమ్ కాయిన్లను జారీచేసిన వెబ్‌సైట్ ప్రకటించింది. ట్రంప్ ఆర్గనైజేషన్ అనుబంధ సంస్థ అయిన సీఐసీ డిజిటల్ ఎల్ఎల్‌సీ ఈ కాయిన్ విక్రయాల బాధ్యతలను చూసుకుంటోంది. సీఐసీ డిజిటల్ ఎల్ఎల్‌సీ గతంలో ట్రంప్ బ్రాండ్‌నేమ్‌తో పాదరక్షలు, సుగంధద్రవ్యాలు విక్రయించింది. ట్రంప్ పేరుతో గతంలో బైబిళ్లు, బంగారు బూట్లు, వజ్రాల వాచీలు కూడా అమ్ముడవడం తెలిసిందే. మీమ్ కాయిన్లను సాధారణంగా స్కామర్లు వినియోగిస్తారు. అధిక లాభాలు గడించాలన్న అత్యాశపరులైన పెట్టుబడిదారుల నుంచి సంపదను కాజేసేందుకు వాటిని వాడతారని క్రిప్టో కరెన్సీ మార్కెట్ వర్గాలు తెలిపాయి.

ఈసీ చిత్తశుద్ధికి అభినందనలు

- ఎన్నికలను సజావుగా నిర్వహించింది
- మన్ కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ: ప్రజా శక్తిని సాంకేతికత దన్నుతో కేంద్ర ఎన్నికల సంఘం మరింత బలోపేతం చేసిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. చిత్తశుద్ధితో ఎన్నికలను సజావుగా నిర్వహించిందంటూ అభినందించారు. ఆదివారం ఆయన 'మన్‌కీ బాత్'లో మాట్లాడారు. జనవరి 26న గణతంత్ర వేడుకల నేపథ్యంలో కార్యక్రమాన్ని చివరి ఆదివారానికి బదులు ఒక వారం ముందుకు జరిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకునే ఈసీ వ్యవస్థాపక దినోత్సవం జనవరి 25వ తేదీ సమీపిస్తున్న వేళ ఈసీని మోదీ పొగడటం విశేషం. '' 1951–52లో తొలిసారి ఎన్నికలు జరిగేటప్పుడు ప్రజాస్వామ్యం దేశంలో మనగలదా అని చాలా మంది అనుమానాలు వ్యక్తంచేశారు. అయితే వాళ్లందరి అనుమానాలను పటాపంచలుచేస్తూ భారత్ ప్రజాస్వామ్యానికి పుట్టిల్లుగా అవతరించింది. ఎప్పటికప్పుడు ఓటింగ్ విధానాన్ని ఆధునీకరిస్తూ, పటిష్టపరుస్తున్న ఈసీకి నా అభినందనలు'' అని మోదీ అన్నారు. '' ఈసారి గణతంత్ర దినోత్సవం చాలా ప్రత్యేకం. భారత గణతంత్రానికి ఇది 75వ వార్షికోత్సవం. ఇంతటి పవిత్ర రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగపరిషత్‌లోని మహనీయులకు నా సెల్యూట్. ఆనాటి వారి విస్తృతస్థాయి చర్చలు, రాజ్యాంగ సభలో సభ్యుల ఆలోచనలు, వారి ఉపదేశాలు మనకు గొప్ప వారసత్వ సంపద''అంటూ నాటి చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, బీఆర్ అంబేడ్కర్, శ్యామ ప్రసాద్ ముఖర్జీల ప్రసంగాల ఆడియో క్లిప్‌లను మోదీ వినిపించారు. '' భారత్ తరఫున తొలిసారిగా ప్రైవేట్ ఉపగ్రహాల కూటమి ఫైర్‌ఫ్లైను నింగిలోకి పంపి బెంగళూరుకు చెందిన అంకుర సంస్థ 'పిక్సెల్' చరిత్ర సృష్టించిన విషయాన్ని చెప్పేందుకు గర్వపడుతున్నా'' అని మోదీ అన్నారు.

వైద్య సాయానికి దల్లేవాల్ అంగీకారం

దీక్ష విరమించిన 121 మంది రైతులు



చండీగఢ్: పంజాబ్–హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీలో 55 రోజులుగా నిరశన దీక్ష సాగిస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఎట్టకేలకు వైద్య సాయం తీసుకునేందుకు అంగీకరించారు. దీంతో ఆయనకు సంఘీభావంగా నిరశన దీక్షలో పాల్గొంటున్న 121 మంది రైతులు దీక్షను విరమించారు. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత సహా పలు డిమాండ్లతో ఖనౌరీలోని రైతు శిబిరంలో దీక్ష చేస్తున్న దల్లేవాల్‌ను శనివారం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం కలిసింది. రైతుల సమస్యలపై ఫిబ్రవరి 14వ తేదీన చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపింది. అనంతరం ఆదివారం ఆయనకు వైద్యులు ఫ్లూయిడ్స్ అందించారు. అంతేకాదు, డీఐజీ మన్‌దీప్ సింగ్ సిద్ధు, పటియాలా సీనియర్ ఎస్పీ నానక్ సింగ్ ఇచ్చిన పండ్ల రసం తాగి 121 మంది రైతులు దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించారు. వీరిలో 111 మంది జనవరి 15న, మరో 10 మంది జనవరి 17వ తేదీన దీక్ష ప్రారంభించారు. కాగా, ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించే వరకు దల్లేవాల్ దీక్ష ఆపబోరని రైతు సంఘాల నేతల స్పష్టం చేశారు. 'కేంద్రం మమ్మల్ని చర్చలకు ఆహ్వానించే విషయంలో విజయం సాధించాం. దీనిని ఘన విజయమని చెప్పలేం కానీ, ఆ దిశగా అడుగు ముందుకేశాం'అని రైతు నాయకుడు కాకా సింగ్ కొత్రా వ్యాఖ్యానించారు. ముందుగా ప్రకటించిన విధంగానే, 26వ తేదీన ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. దల్లేవాల్‌తో పాటు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియా రంజన్ సారథ్యంలోని బృందం శనివారం చర్చలు జరిపిన విషయం తెలిసిందే.



ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమ ప్రాంతంలో మహా కుంభమేళా సందర్భంగా ఏర్పాటైన కుంభ్‌నగర్‌లో ఆదివారం టెంట్లను చుట్టుముట్టిన అగ్నికీలలు

మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం

సిలిండర్లు పేలి దగ్ధమైన 18 టెంట్లు

మహాకుంభ్ నగర్: ప్రయాగ్‌రాజ్‌లోని మహా కుంభమేళాలో పెను ప్రమాదం తప్పింది. సెక్టార్ 19లో గీతా ప్రెస్ టెంట్లో ఆదివారం సాయంత్రం నాలుగింటికి భారీ అగ్నిప్రమాదం జరిగింది. రెండు సిలిండర్లు పేలడంతో పలు గుడారాలను అగ్నికీలలు చుట్టుముట్టాయి. 18 టెంట్లు కాలిపోయాయి. తొలుత గుడారంలోని గడ్డికి మంటలంటుకున్నాయి. దాంతో ఎల్పీజీ సిలిండర్ పేలింది. మంటలు చెలరేగి చూస్తుండగానే పైకప్పుల దాకా వ్యాపించాయి. మేళా ప్రాంతాన్ని దట్టమైన పొగ మేఘాలు చుట్టుముట్టడంతో సమీప అఖాడాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. 15 అగ్నిమాపక యంత్రాలు గంటలోనే పరిస్థితిని అదుపులోకి తెచ్చాయి. మౌని అమావాస్య ఏర్పాట్ల సమీక్షకు కుంభ్‌నగర్‌లోనే ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘటనా స్థలిని పరిశీలించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ఫోన్ చేసి ప్రమాదంపై ఆరా తీశారు. ప్రభావిత ప్రాంతం నుంచి దట్టమైన నల్లటి పొగ వెలువడుతున్న క్లిప్పింగులను మహా కుంభమేళా అధికారిక ఎక్స్ హ్యాండిల్ పోస్ట్ చేసింది. ''ఇది చాలా విచారకరం! కుంభమేళాలో అగ్నిప్రమాదం దిగ్భ్రాంతికి గురిచేసింది. అంతా క్షేమంగా ఉండాలని గంగామాతను ప్రార్థిస్తున్నాం'' అని పేర్కొంది.

సైఫ్‌ను పొడిచింది బంగ్లాదేశీ

థానే జిల్లాలో అరెస్టు, 24 వరకు కస్టడీ

- దొంగతనం చేసేందుకే వచ్చాడన్న పోలీసులు
- బాలీవుడ్ స్టార్ ఇల్లని అతనికి తెలియదని వెల్లడి



షరీఫుల్ ఇస్లాం

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ నివాసంలో దూరి ఆయన్ను కత్తితో పొడిచింది 30 ఏళ్ల బంగ్లాదేశీ అని తేలింది. అతని పేరు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మొహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్. భారత్ వచ్చాక బిజయ్‌దాస్‌గా పేరు మార్చుకున్నాడు. అతన్ని థానే జిల్లా ఘోడ్‌బందర్ రోడ్డులోని హీరానందానీ ఎస్టేట్ వద్ద ముంబై పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరి 24వ తేదీ దాకా కస్టడీకి తీసుకున్నారు. దీని వెనక అంతర్జాతీయ కుట్రను తోసిపుచ్చలేమని కోర్టు అభిప్రాయపడటంతో ఆ కోణంలోనూ విచారణ జరుపుతున్నారు.

ఐదు నెలలుగా ముంబైలో...

బంగ్లాదేశ్‌లోని ఝులోకాటికి చెందిన నిందితుడు ఐదు నెలలుగా ముంబైలో హౌస్ కీపింగ్ ఏజెన్సీలో ఉద్యోగం, చిన్నాచితకా పనులు చేస్తున్నాడు. దొంగతనం చేయడమే అతని ఉద్దేశమని ప్రాథమికంగా తేలినట్టు పోలీసులు చెప్పారు. ''తాను దొంగతనానికి వెళ్తున్నది ఓ బాలీవుడ్ స్టార్ ఇంట్లోనని అతనికి తెలియదు. ఏడో అంతస్తు దాకా మెట్ల ద్వారా వెళ్లాడు. తర్వాత పైప్ ద్వారా 12వ అంతస్తుకు పాకి కిటికీ గుండా సైఫ్ ఇంటి బాత్రూంలోకి దూరాడు. అందులోంచి బయటికి రాగానే బయట కనిపించిన సిబ్బందిపై దాడి చేసి రూ.కోటి డిమాండ్ చేశాడు. అతన్ని సైఫ్ ముందు నుంచి పట్టుకున్నాడు. దాంతో సైఫ్ వీపుపై పొడిచాడు. తర్వాత నిందితుడిని గది లోపలే ఉంచి తాళం వేశారు. అతను లోనికి వెళ్లిన దారిలోనే పరారయ్యాడు. ఉదయం దాకా బాంద్రా బస్టాప్‌లో పడుకున్నాడు. లోకల్ ట్రైన్‌లో వర్లీకి చేరుకున్నాడు. అతని బ్యాగు నుంచి సుత్తి, స్క్రూడ్రైవర్, నైలాన్ తాడు స్వాధీనం చేసుకున్నాం'' అని వివరించారు. నిందితున్ని కోర్టుకు హాజరుపరిచిన సమయంలో అతని తరఫున వాదించడానికి ఇద్దరు లాయర్లు పోటీ పడటం విశేషం.

న్యాయం, సమానత్వం కోసం..

రాహుల్ 'వైట్ టీ-షర్ట్' ఉద్యమం



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాన్యులకు హక్కుల సాధనే లక్ష్యంగా ఆదివారం 'వైట్ టీ-షర్ట్' ఉద్యమం ప్రారంభించారు. తన ఉద్యమంలో భాగస్వాములు కావాలంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఆదివారం 'ఎక్స్'లో..'ఆర్థిక న్యాయం కోరుకునే వారు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలను నిరసించేవారు, సామాజిక సమానత్వం కోసం పోరాడేవారు, అన్ని వివక్షలను వ్యతిరేకించేవారు, దేశంలో శాంతి స్థిరతలను కోరుకునే వారు తెల్ల టీ-షర్ట్‌లను ధరించండి. ఉద్యమంలో పాల్గొనండి'అని కోరుతూ ఓ వీడియో షేర్ చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేదలు, ఉద్యోగులను పట్టించుకోవడం మానేసింది. ప్రభుత్వం దృష్టంతా కేవలం కొందరు పెట్టుబడిదారులను మరింత ధనవంతులను చేయడం పైనే ఉంది. అందుకే, అసమానతలు పెరుగుతూ పోతున్నాయి. తమ రక్తం, స్వేదంతో దేశం కోసం కృషి చేస్తున్న సామాన్యుల పరిస్థితి మరింత దిగజారుతోంది. వారు అనేక అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురి కావాల్సి వస్తోంది'అని రాహుల్ పేర్కొన్నారు. 'ఇటువంటి పరిస్థితుల్లో, వారికి న్యాయం, హక్కులు దక్కేందుకు గట్టిగా నినదించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ఇందుకు వైట్ టీ-షర్ట్ ఉద్యమం చేపట్టామన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనాలనుకునే వారు, ఇందుకు సంబంధించిన మరింత సమాచారం కావాలనుకునే వారు https://whitetshirt.in/home/hin అనే లింకును తెరవాలని, లేదా 9999812024 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఆయన కోరారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ 'భారత్ కిరీటంలో రత్నం'

అది లేకుండా జమ్మూకశ్మీర్ అసంపూర్ణమన్న రాజ్‌నాథ్ సింగ్



జౌన్‌పూర్ (యూపీ): పాక్ ఆక్రమిత కశ్మీర్ మన దేశపు కిరీటంలో రత్నం లాంటిదని, అది లేకుండా జమ్మూకశ్మీర్ అసంపూర్ణమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పెంపొందించే కుట్రను పాకిస్తాన్ కొనసాగిస్తోందని ఆయన ఆరోపించారు. జౌన్‌పూర్ జిల్లా నిజాముద్దీన్ పూర్ గ్రామంలో బీజేపీ సీనియర్ నేత జగత్ నారాయణ్ దూబే ఇంట్లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాజ్‌నాథ్ అక్కడ విలేకరులతో మాట్లాడారు. పాక్ ఆక్రమిత కశ్మీర్.. ఆ దేశానికి ఉగ్రవాదాన్ని, భారత వ్యతిరేక ప్రచారాన్ని ప్రోత్సహించడానికి ఉపయోగించే విదేశీ భూభాగం తప్ప మరేమీ కాదన్నారు. అక్కడ ఉగ్రవాద శిబిరాలు, లాంచ్ ప్యాడ్లను కూల్చివేయాలని, లేదంటే తగిన ప్రతిస్పందన ఎదుర్కోవాల్సి ఉంటుందని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. పాక్ నేత అన్వర్ ఉల్‌హక్ భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని రక్షణ మంత్రి మండిపడ్డారు. మత ప్రాతిపదికన భారత్‌కు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టేందుకు పాక్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, ప్రస్తుతం అత్యధికంగా 5జీని ఉపయోగిస్తున్న భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

గోమూత్రానికి వైద్య విలువలు

మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ కామకోటి • వైరల్‌గా మారిన వీడియో

చెన్నై: వ్యాధులను నయం చేసే శక్తి గోమూత్రానికి ఉందంటూ మద్రాస్ ఐఐటీ డైరెక్టర్ వి.కామకోటి చెప్పినట్లున్న ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. గోమూత్రం సేవించి తీవ్రమైన జ్వరం నుంచి బయటపడినట్లుగా ఓ ముని చెప్పిన మాటలను ఉటంకిస్తూ ఆయన..'ఆవు మూత్రానికి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, జీర్ణశక్తిని కలిగించే లక్షణాలున్నాయి. కొన్ని రకాల జీర్ణ సంబంధ వ్యాధులను ఇది నయం చేయగలదు'అని అన్నారు. ఈ నెల 15న గో సంరక్షణ శాలలో జరిగిన కార్యక్రమంలో కామకోటి దేశీయ ఆవు జాతుల వృద్ధి, ఆర్గానిక్ వ్యవసాయం ప్రాముఖ్యంపై ప్రసంగిస్తూ పైవ్యాఖ్యలు చేశారు. ఆర్గానిక్ వ్యవసాయం దేశ ఆర్థిక రంగానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. డీఎంకే సహా కొన్ని ద్రవిడ పార్టీలు కామకోటి వ్యాఖ్యలను సిగ్గుచేటుగా అభివర్ణించాయి. కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం స్పందిస్తూ కామకోటి ఐఐటీ చైర్మన్ హోదాకు తగరంటూ వ్యాఖ్యానించారు. అయితే, డైరెక్టర్ కామకోటి ఎంతో విస్తృతార్థంలోనే గోమూత్రాన్ని కొనియాడారని, స్వయంగా ఆయన ఆర్గానిక్ వ్యవసాయం చేయిస్తున్నారని సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి.

ఆ చల్లని సముద్రగర్భంలో... ఆక్సిజన్ పుడుతోంది!!

కాంతితో నిమిత్తం లేకుండానే • శాస్త్రవేత్తల సంచలన ప్రకటన



డీప్ ఓషన్ మిషన్‌కు చిక్కిన రాతి ముద్ద

భూమిపై జీవజాలం మనుగడకు ఆక్సిజన్ ప్రాణావసరం. అది తయారవాలంటే వెలుతురు, సూర్యకాంతి తప్పనిసరి. సూర్యకిరణాలతో కిరణజన్య సంయోగ క్రియ ఫలితంగా మొక్కల్లో ఆక్సిజన్ తయారవుతుందని చిన్నప్పుడే చదువుకున్నాం. అలాంటిది, సముద్రగర్భంలో కొన్ని కిలోమీటర్ల లోతులో కటిక చీకటితో కూడిన ప్రదేశాల్లోనూ తొలిసారిగా ఆక్సిజన్ జాడను కనుగొన్నట్టు శాస్త్రవేత్తలు ప్రకటించడం సంచలనంగా మారింది! అక్కడ కాంతితో పని లేకుండానే ఆక్సిజన్ తయారవుతుందని తొలిసారిగా గుర్తించారు. అది కూడా కఠిన శిలల నుంచి ఉద్భవిస్తుండటం శాస్త్రవేత్తలనే అబ్బురపరుస్తోంది. ఇదెలా సాధ్యమవుతోందో తెలుసుకునేందుకు మరింత లోతైన అధ్యయనానికి వాళ్లు నడుం బిగించారు. అనంత విశ్వంలో కాంతిమయ పదార్థం కంటే చీకటిమయమైన డార్క్‌మ్యాటరే ఎక్కువన్నది తెలిసిందే. ఈ నేపథ్యంలో డార్క్‌మ్యాటర్‌లో కూడా ఆక్సిజన్ ఉనికి ఉందని, జీవం మనుగడ సాగిస్తోందని ఎంతోకాలంగా సాగుతున్న వాదనలకు కొత్త బలం చేకూరింది.

ఎక్కడ కనిపెట్టారు?

బంగాళాదుంపల పరిమాణంలోని ముద్దల్లాంటి శిలల నుంచి స్వల్ప పరిమాణంలో ఆక్సిజన్ తయారవడాన్ని పరిశోధనలో గుర్తించారు. పసిఫిక్ మహాసముద్రంలో క్లారియన్–క్లిప్పర్‌టన్ జోన్ (సీసీజెడ్)లో 13,100 అడుగుల లోతులో సముద్రగర్భంలో వీటిని గుర్తించారు. ఈ శిలలు ఎలక్ట్రాలసిస్ ప్రక్రియ ద్వారా సముద్ర జలాన్ని ఆక్సిజన్, హైడ్రోజన్‌గా విడగొడుతున్నాయి. కిరణజన్యసంయోగ క్రియ ద్వారా మాత్రమే ఆక్సిజన్ తయారవుతుందన్న సిద్ధాంతాన్ని ఇది పటాపంచలు చేసిందని స్కాటిష్ అసోసియేషన్ ప్రొఫెసర్ ఆండ్రూ స్వీట్‌మ్యాన్ చెప్పారు. ఇదెలా సాధ్యమవుతోందన్నది తేల్చేందుకు మూడేళ్ల సుదీర్ఘ ప్రాజెక్టుకు తెర తీస్తున్నట్టు ప్రకటించారు. ఇందుకోసం ఏకంగా 36,089 అడుగుల లోతు దాకా తవ్వే రిగ్గులతో రంగంలోకి దిగుతున్నారు! ''ఈ 'చీకటి ఆక్సిజన్' కోసం జరిపే అధ్యయనంలో సమాధానాలు దొరికే కొద్దీ కొత్త ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సీసీజెడ్ మాదిరే సముద్రగర్భంలో ఇతర చోట్లా ఇలా ఆక్సిజన్ తయారవుతోందేమో కనిపెడతాం'' అని స్వీట్‌మ్యాన్ చెప్పారు.

భూగర్భంలోనూ ఆక్సిజన్...?

సముద్ర గర్భంలోని శిలల్లోనే గాక భూమి లోలోపలి పొరల్లోనూ ఆక్సిజన్ సమృద్ధిగా ఉన్నట్టు అమెరికాలో మసాచుసెట్స్‌లోని వుడ్స్ హోల్ మెరైన్ బయోలాజికల్ లేబొరేటరీ సూక్ష్మజీవుల శాస్త్రవేత్త ఎమీల్ రఫ్ ప్రకటించడం విశేషం. కెనడా ప్రియరీ భూముల్లోని అత్యంత లోతుల్లోనూ ఆక్సిజన్ ఉందని చెప్పారాయన. కాల్గరీ వర్సిటీకి చెందిన పలువురు ప్రొఫెసర్లు కూడా దీన్ని ధ్రువీకరించారు. ఈ ఆక్సిజన్ 40 వేల ఏళ్ల క్రితమే భూమి పొరల్లోకి చేరి ఉండాలని ఒక నివేదికలో పేర్కొన్నారు. సూక్ష్మజీవులు కూడా ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తున్నట్టు గుర్తించారు. ''కెనడా భూగర్భ శాంపిళ్లను ల్యాబ్‌లోని ఆక్సిజన్ పాడుచేసింది. అయినా కొత్తగా ఆక్సిజన్ పుట్టుకొచ్చింది. ఎక్కడి నుంచా అని చూస్తే ఆ నీటిలోని సూక్ష్మజీవులు కొత్తగా ఆక్సిజన్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించాం. అవి తన మనుగడ కావాల్సిన శక్తిని సమకూర్చుకోవడానికి ఒక నైట్రోజన్, రెండు ఆక్సిజన్ అణువులను రసాయనిక చర్యల ద్వారా అణుస్థాయి ఆక్సిజన్‌గా మారుస్తున్నాయి. భూగర్భ జలాల్లో ఆక్సిజన్‌పై ఆధారపడి బతికే సూక్ష్మజీవులకు అది ఈ పద్ధతిలోనే అందుతోందని రుజువైంది. మనం అసాధ్యమని అనుకున్నది సుసాధ్యమేనని ప్రకృతి నిరూపిస్తోంది'' అని రఫ్ అన్నారు.

మూడు కి.మీ. లోతులో

'చీకటి ఆక్సిజన్' జాడ కనిపెట్టేందుకు రఫ్ బృందం దక్షిణాఫ్రికాలో బంగారం, యురేనియం గనుల్లోకి వెళ్లింది. ఏకంగా 3 కి.మీ. లోతులో 120 కోట్ల ఏళ్ల నాటి శిలల్లో ఆక్సిజన్‌ను కనుగొన్నారు. రేడియోధార్మిక గుణమున్న యురేనియం అక్కడి నీటితో చర్య జరపడం వల్ల ఆక్సిజన్ తయారై ఉంటుందన్న అంచనాకొచ్చారు.

నాసా ఆసక్తి

కాంతితో నిమిత్తం లేకుండానే ఆక్సిజన్ ఉత్పత్తి సాధ్యమంటున్న తాజా పరిశోధనపై నాసా ఆసక్తి చూపుతోంది. చంద్రుని ఆవలివైపు కాంతి ప్రసారమే ఉండదు. అలాంటి చోట్ల ఈ 'శిలాజ ఆక్సిజన్' ద్వారా వ్యోమగాముల అవసరాలు తీర్చవచ్చని నాసా ఆశ పడుతోంది. మంచుతో కూడుకున్న శని, బృహస్పతి ఉపగ్రహాలు ఎన్సిలాడస్, యూరోపాలపై ఏ మేరకు పీడనం పెంచితే ఆక్సిజన్ ఉత్పత్తి చేయొచ్చో అని ఇప్పటినుంచే లెక్కలు వేస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్



అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్ అరెస్ట్
అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.15.5 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
-8లో



నుమాయిష్.. సోషల్ జోష్..
కంటెంట్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు పెద్ద ఎత్తున సందడి చేస్తున్నారు. ఇన్‌ఫ్లుయెన్సర్లలో నుమాయిష్ సోషల్ జోష్ నింపుతోంది.
- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 29.0/15.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుము కుంటుంది. గరిష్టంగా 29, కనిష్టంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

ఒకేసారి 573 మంది ఏఆర్ కానిస్టేబుళ్ల బదిలీ

- పీఎస్‌లు, ఇతర విభాగాలకు అటాచ్‌మెంట్
- శాంతి భద్రతలు, ఇతర విభాగాల పనితీరు మెరుగు
- ఉత్తర్వులు జారీ చేసిన కొత్వాల్ సీవీ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పని చేస్తున్న 573 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు ఒకేసారి బదిలీ అయ్యారు. ఇందులో పురుషులు 350 కాగా.. మహిళా కానిస్టేబుళ్లు 223 మంది. వీరందరినీ సిటీలోని లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లతో పాటు స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, హెచ్–న్యూ, సైబర్ క్రైమ్ విభాగాలకు అటాచ్ చేస్తూ నగర కొత్వాల్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కమిషనరేట్ పరిధిలోని శాంతి భద్రతలు, ఇతర విభాగాల పనితీరును మరింత మెరుగవుతుందని ఆనంద్ తెలిపారు. ఈమేరకు ఆదివారం బదిలీ సిబ్బందితో బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సహనంతో, వివిధ వర్గాల ప్రజల మధ్య పని చేయాల్సి ఉంటుందని సూచించారు. ఇది కేవలం అటాచ్‌మెంట్ మాత్రమేనని వారికి సీనియారిటీ లేదా విభాగం మార్పిడి హక్కులు ఉండవని, పోలీసు స్టేషన్‌లలో పెట్రోలింగ్, ప్రాథమిక విధులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్న సివిల్ పోలీసుల కొరతను అధిగమించడానికి అటాచ్‌మెంట్ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల్లో ఉన్నప్పుడు ఏదైనా చిన్న సమాచారం వచ్చినా, సంఘటన చూసినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమములో అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ అడ్మిన్ పరిమళ హనా నూతన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షితా కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్ నేర్చుకుని బాధితులకు పునర్జన్మ ప్రసాదించండి

గాంధీలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



ఉచిత సీపీఆర్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న వైద్యనిపుణులు

గాంధీఆస్పత్రి: ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేయడం నేర్చుకుని ప్రాణాపాయస్థితిలో ఉన్న బాధితులకు పునర్జన్మ ప్రసాదించాలని వైద్య నిపుణులు సూచించారు. గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్, జనహిత సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ అలుమ్నీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఉచిత సీపీఆర్ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, జీఎంసీ అలుమ్నీ అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజారెడ్డి, కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గుండెపోటుకు గురైనవారికి సీపీఆర్ చికిత్సతో ప్రాణాలు కాపాడిన వారంతా వైద్యులేనన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో సుమారు 70 శాతం మందికి హ్యాండ్స్ ఆన్ కార్డియాక్ పల్మనరీ రెససిటేషన్ (సీపీఆర్), బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్‌ఎస్)లపై అవగాహన ఉందన్నారు. ప్రతిఏటా ఉచిత సీపీఆర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న గాంధీ అలుమ్నీ సేవలను అభినందించారు. మూడు రోజుల పాటు నిర్వహించే సీపీఆర్ ఉచిత శిక్షణ తరగతులు సోమ, మంగళవారాల్లో కూడా కొనసాగుతాయని అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ లింగమూర్తి తెలిపారు. మొదటి రోజున సుమారు వెయ్యి మందికి ఉచిత శిక్షణ అందించామన్నారు. ఇప్పటి వరకు 30 వేల మందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలుమ్నీ అసోషియేషన్ ఏర్పాటై 25 ఏళ్లు నిండిన సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాంధీ అలుమ్నీ, గ్లోబల్ అలియన్స్ ప్రతినిధులు డాక్టర్ రవీందర్ సురకంటి, రాజశేఖర్, వేమూరి మూర్తి, మహేశ్వర్‌రెడ్డి, సన్నీడేవిస్, నర్సింగరావు, అమెరికా హార్ట్ అసోషియేషన్ ప్రతినిధి డెన్నీస్ మోకాలే, జనహిత సేవట్రస్ట్ ప్రతినిధి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్ శిక్షణ పొందుతున్న ఔత్సాహికులు









చిత్తారమ్మా.. మొర చిత్తగించమ్మా!

అశేష భక్తజనం. విశేష పూజలు. ఎటు చూసినా కోలాహలం. పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. తనువు పులకరించగా.. మనసు ఆనందించగా.. చిత్తారమ్మ ఉత్సవ శోభ భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. గాజులరామారం శ్రీ చిత్తారమ్మ దేవి జాతర స్వర్ణోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. చిత్తారమ్మా.. మా మొర చిత్తగించమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంతరెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని నగరంతో పాటు రాష్ట్ర, రాష్ట్రేతర భక్తులు సుమారు 3 లక్షల మందికిపైగా దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. – కుత్బుల్లాపూర్

ఆశలు ఫలించేనా?

పాత రేషన్ కార్డుల్లో కొత్త సభ్యులకు మోక్షం లభించేనా?

- పెండింగ్‌లో సుమారు 3 లక్షలకుపైగా దరఖాస్తులు
- దాదాపు 6.5 లక్షల మందికి పైగా కొత్త సభ్యులు
- ఆన్‌లైన్‌లో అర్జీలకు వెనులుబాటు.. ఆమోదం మాత్రం పెండింగ్
- ఎనిమిదేళ్లుగా దరఖాస్తుదారుల ఎదురు చూపులు



సాక్షి, సిటీబ్యూరో: ఈసారైనా ఆహార భద్రత (రేషన్) కార్డుల్లో కొత్త సభ్యులకు మోక్షం లభిస్తుందా? ఎనిమిదేళ్లుగా రేషన్ కార్డులోని సభ్యులు (యూనిట్లు) వివిధ సాకులతో తొలగింపునకు గురవుతున్నా.. కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఇటీవల రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 'మీ సేవ ద్వారా ఈపీడీఎస్ ఎఫ్ఎస్‌సీ లాగిన్‌లో కొత్త సభ్యుల చేర్పుల కోసం చేసుకున్న దరఖాస్తుల దీర్ఘకాలిక పెండెన్సీని సైతం అర్హత ప్రమాణాల ఆధారంగా క్లియర్ చేస్తాం' అని ప్రకటించడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

సుదీర్ఘకాలంగా పెండింగ్

బీఆర్ఎస్ ప్రభుత్వం రేపు మాపు అంటూ ఆశలు కల్పించింది. కొత్తగా అధికారంలోకి కాంగ్రెస్ కొలువుదీరి ఏడాది గడిచినా యూనిట్ల ఆమోదానికి ఊసే లేకుండా పోయింది. తాజాగా కొత్త రేషన్ కార్డుల మంజూరుకు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులను కూడా పరిశీలించేందుకు సిద్ధమమవుతోంది. వాస్తవంగా పౌర సరఫరాల శాఖ అధికారుల ఈపీడీఎస్ ఎఫ్ఎస్‌సీ ఆన్‌లైన్ లాగిన్‌లో రేషన్ కార్డుల్లో పాత సభ్యుల తొలగింపునకు ఆప్షన్ ఉన్నప్పటికీ.. కొత్త సభ్యుల దరఖాస్తుల ఆమోదానికి మాత్రం ఆప్షన్ లేకుండా పోయింది. దీంతో కొత్తగా వివాహమై అత్త వారింటికి వచ్చిన సభ్యులతో పాటు జన్మించిన కొత్త సభ్యుల చేర్పుల కోసం ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తులు చేసుకుంటున్నప్పటికీ ఆమోదం మాత్రం సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో పడిపోయింది.

హైదరాబాద్ పరిధిలో రేషన్‌కార్డులో కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తులు ఇలా..

పౌరసరఫరాల శాఖ సర్కిల్	కార్డులు	కొత్త సభ్యులు
మలక్‌పేట -1	12,805	21,616
యాకుత్‌పురా-2	18,825	33,267
చార్మినార్ -3	24,129	42,172
నాంపల్లి-4	5,430	8,502
మెహిదీపట్నం-5	17,143	29,499
అంబర్‌పేట -6	9,294	14,493
ఖైరతాబాద్ -7	15,047	24,330
బేగంపేట -8	10,926	17,840
సికింద్రాబాద్ -6	8,626	13,452

నిరంతర ప్రక్రియగా దరఖాస్తుల స్వీకరణ..

రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తుల స్వీకరణ కొనసాగిస్తూనే... లాగిన్‌లో ఆమోదించే ఆప్షన్‌ను మాత్రం ప్రభుత్వం నిలిపివేసింది. అయితే.. రేషన్ కార్డులోని సభ్యుల తొలగింపు నిరంతర ప్రక్రియగా తయారైంది. గత పదేళ్లలో రేషన్ కార్డులోని సుమారు 34,51,853 మంది లబ్ధిదారులను ఏరివేసిన ప్రభుత్వం.. సుమారు 6.5 లక్షల కొత్త సభ్యుల అమోదాన్ని మాత్రం పెండింగ్‌లో పడేసింది. గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో సగానికి పైగా సభ్యులు ఏరివేతకు గురయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డులన్నింటిని రద్దు చేసి వాటిని పూర్తిగా ఆహార భద్రత కార్డులుగా మార్పు చేసింది. పాత కార్డుదారులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ కార్డులు మంజూరు చేసింది. ఆ తర్వాత అనర్హులు, బోగస్, టాక్స్ పేయర్స్, ఇన్‌యాక్టివ్ పేరుతో కార్డులు, సభ్యులను ఏరివేస్తూనే వరుసగా రెండేళ్ల పాటు కార్డులో చేర్పులు, మార్పుల ప్రక్రియకు అవకాశం కల్పించి ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ వచ్చింది. ఆ తర్వాత పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులు కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగిస్తూనే ఆమోదించే లాగిన్‌ను మాత్రం నిలిపివేసింది. దీంతో దరఖాస్తుల పెండెన్సీ భారీగా పెరిగిపోయింది.

గత పదేళ్లలో రేషన్ కార్డుల యూనిట్ల తొలగింపు ఇలా

జిల్లా	మొత్తం యూనిట్లు	ప్రస్తుత యూనిట్లు	తొలగించిన యూనిట్లు
హైదరాబాద్	41,40.692	23,61,440	17,79,252
రంగారెడ్డి	27,27,993	18,21,881	9,06,112
మేడ్చల్	24,83,752	17,17,263	7,66,489

మూడు లక్షలపైనే దరఖాస్తులు..

ఎనిమిదేళ్లుగా రేషన్ కార్డులో కొత్త సభ్యుల చేర్పుల ప్రక్రియ పెండింగ్‌లో మగ్గుతోంది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రేషన్‌కార్డులు కలిగిన సుమారు 17,21,603 కుటుంబాలు ఉండగా అందులో 59,00,584 సభ్యులు ఉన్నారు. అందులో సుమారు మూడు లక్షల కుటుంబాలు తొమ్మిది లక్షల కొత్త సభ్యుల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో కనీసం క్షేత్ర స్థాయి విచారణ లేకుండా ఇన్‌స్పెక్టర్ల లాగిన్‌లో 70 శాతానికిపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, విచారణ పూర్తయి ఏఎస్‌వో, తహసీల్ లాగిన్‌లో 20 శాతం దరఖాస్తులు, డీఎస్‌వో లాగిన్‌లో 5 శాతం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆన్‌లైన్ నివేదిక స్పష్టం చేస్తోంది.

జేబీఎస్ వద్ద అంతర్జాతీయ స్థాయి ఇంటిగ్రేటెడ్

మెట్రో రైల్ హబ్

వినూత్నంగా మేడ్చల్, శామీర్‌పేట్ మెట్రో కారిడార్లు

- ఈ రెండు కారిడార్‌లతో ఎయిర్‌పోర్ట్ అనుసంధానం
- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రెండో దశలో సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టనుంది. జేబీఎస్ వద్ద ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ మెట్రో రైల్ హబ్ ఏర్పాటు దిశగా పరిశీలిస్తోంది. ఫలితంగా మేడ్చల్, శామీర్ పేట్ దిశగా సాగే కారిడార్లు కొత్త రూపురేఖలు సంతరించుకోబోతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్యారడైజ్ – మేడ్చల్ (23 కి.మీ), జేబీఎస్ – శామీర్ పేట్ (22 కి.మీ) ప్రతిపాదిత కారిడార్ అలైన్‌మెంట్ విషయంలో సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదారులు ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బేగంపేట్ విమానాశ్రయం, ప్యారడైజ్, బోయినపల్లి వరకు రహదారి వంపు ఎక్కువగా ఉండటం, విమానాశ్రయ అధికారుల ఆంక్షల కారణంగా, హెచ్ఎండీఏ తన ఎలివేటెడ్ మార్గాన్ని కొంత దూరం పాటు భూగర్భ మార్గంగా మార్చుకుంది. ఈ అలైన్‌మెంట్‌ను బేగంపేట విమానాశ్రయం (తాడ్‌బండ్/బోయినపల్లి వైపు) రన్‌వే కింద దాదాపు 600 మీటర్ల దూరం భూగర్భ సొరంగం ద్వారా తీసుకువెళ్తుంది. దీనికి సంబంధించిన సమస్యలను అధిగమించేందుకు మెట్రో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



పలు ప్రాంతాల పరిశీలన..

మేడ్చల్, శామీర్ పేట్ కారిడార్ల స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేయడం, ఇక్కడ ప్రపంచ స్థాయి ఇంటిగ్రేటెడ్ మెట్రో రైల్ హబ్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ఇందుకోసం జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి, రక్షణ శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. జేబీఎస్ – సికింద్రాబాద్ క్లబ్‌రోడ్, స్టాఫ్ రోడ్ (పికెట్ కేంద్రీయ విద్యాలయ స్కూల్ రోడ్), మడ్ ఫోర్ట్, టివోలీ, డైమండ్ పాయింట్, సెంటర్ పాయింట్, హస్మత్‌పేట్, బోయినపల్లి (సరోజిని పుల్లారెడ్డి బంగ్లా) రోడ్, తాడ్‌బండ్–ఆంజనేయ స్వామి ఆలయం –తాడ్‌బండ్ జంక్షన్, ఎయిర్ పోర్ట్ ఆఫీస్, బోయినపల్లి చెక్ పోస్ట్ తదితర ప్రాంతాల్లో మెట్రో ఎండీ కాలినడకన కలియతిరిగారు.

లాభ నష్టాలను బేరీజు వేయండి..

క్లిష్టమైన మలుపులను, విమానాశ్రయం కింద భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకువెళ్లే ఆవశ్యకతను నివారించే విధంగా, ప్రైవేట్ ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించే విధంగా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని అధికారులను ఎన్వీఎస్ రెడ్డి ఆదేశించారు. అలైన్‌మెంట్ వీలైనన్ని ఎక్కువ నివాస కాలనీలకు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలకు ప్రయోజనకరంగా ఉండాలని, స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ/రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలను పరిశీలించాలన్నారు. జేబీఎస్ వద్ద ప్రారంభంలో రెండు మెట్రో కారిడార్లను కలపడం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మేడ్చల్–జేబీఎస్–ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట– విమానాశ్రయ లింక్ కూడా ఏర్పడుతుందని, దాదాపు 60 కిలోమీటర్ల సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పర్యటనలో హెచ్ఏఎంఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్లు బి.ఎన్. రాజేశ్వర్, ఎం. విష్ణు వర్ధన్ రెడ్డి, ఎ.బాలకృష్ణ, డిప్యూటీ సీఈ (రైల్వేస్) జె.ఎన్. గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎండాకాలంలో కరెంటు సమస్యల కట్టడి

- వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం
- సర్కిళ్లకు ఇన్‌చార్జిల నియామకం



సాక్షి, సిటీబ్యూరో: రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సెక్షన్ల వారీగా విద్యుత్ లైన్ల పునరుద్ధరణ, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ లీకేజీల నియంత్రణ, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు చేపట్టింది. ఫిబ్రవరి మొదటి వారం లోగా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ లోడ్ రిలీఫ్ (ఎల్ఆర్)లకు అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించింది. గత వేసవి డిమాండ్‌ను, సరఫరాలో తలెత్తిన సాంకేతిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా వేసవి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. సర్కిళ్ల వారీగా డైరెక్టర్, సీఈ స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. వీరు రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా పర్యవేక్షిస్తుంటారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి, డిమాండ్, సరఫరాపై ఆరా తీయడంతో పాటు సాంకేతిక సమస్యలను ముందే గుర్తించి, సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడనున్నారు. ఈ మేరకు సీపీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదివారం నగరంలోని విద్యుత్ లోడ్ పర్యవేక్షణ, నియంత్రణ (ఎల్ఎంఆర్‌సీ) విభాగాన్ని సందర్శించారు.

నగరంలో సర్కిళ్ల వారీగా నియమితులైన ఇన్‌చార్జిలు

సర్కిల్	ఇన్‌చార్జి
రాజేంద్రనగర్	ఎస్.నరసింహులు, డైరెక్టర్, ఆపరేషన్స్
మేడ్చల్	కె.నందకుమార్, డైరెక్టర్, ప్రాజెక్ట్స్
హబ్సిగూడ	సాయిబాబా, డైరెక్టర్, కమర్షియల్స్
సరూర్‌నగర్	భిక్షపతి, సీఈ, కమర్షియల్
హైదరాబాద్ సెంట్రల్/వికారాబాద్	పి.ఆనంద్, సీఈ, పీఅండ్ఎం
హైదరాబాద్ సౌత్/ సైబర్‌సిటీ	రంగనాథ్ రాయ్, సీఈ ఎనర్జీ ఆడిట్
బంజారాహిల్స్	ప్రభాకర్, సీఈ, ఐపీసీ
సికింద్రాబాద్	నరసింహస్వామి, సీఈ, మాస్టర్‌ప్లాన్

బేగంపేటకు కొత్త హంగులు

- రూ.22.57 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి
- కళ్లు జిగేల్‌మనిపించేలా ముఖ ద్వారం
- వెయిటింగ్ హాళ్ల నిర్మాణం
- సైన్‌బోర్డుల ఏర్పాటు..
- అందుబాటులోకి మరిన్ని వసతులు



కొనసాగుతున్న బేగంపేట రైల్వేస్టేషన్ ముఖద్వారం పనులు

సనత్‌నగర్: బేగంపేట రైల్వేస్టేషన్ కొత్త సొబగులు అద్దుకుంటోంది. 'అమృత్ స్టేషన్స్' పథకం కింద ఎంపికైన ఈ స్టేషన్ ఆధునీకరణ పనులను గత ఏడాది ఫిబ్రవరి 26న ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రతిరోజు 20 వేల పైచిలుకు ప్రయాణికులు బేగంపేట కేంద్రంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఈ స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి 'అమృత్ స్టేషన్స్' పథకం కింద ఎంపిక చేసి అప్పట్లో రూ.22.57 కోట్ల వ్యయంతో పనులను కూడా చేపట్టారు. పనులు చకచకా జరుగుతున్నాయి. ముఖ్యంగా ఆధునిక ముఖద్వారం, పరిసరాల అభివృద్ధి, ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు అవసరమైన సౌకర్యాలు, వెయిటింగ్ హాళ్ల నిర్మాణం, ప్రయాణికులకు ఎప్పటికప్పుడు రైళ్ల రాకపోకల సమాచారం తెలియజేసే సైన్‌బోర్డుల ఏర్పాటుతో పాటు దీర్ఘకాలిక మాస్టర్‌ప్లాన్ ప్రణాళికను రూపొందించారు. ఈ పనులు పూర్తయితే ప్రయాణికులకు ఉత్తమ శ్రేణితో కూడిన అనుభూతి కలుగుతుందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి. బేగంపేట రైల్వేస్టేషన్ కొత్త రూపు సంతరించుకోనుండడంతో ఈ ప్రాంతానికి మరింత వన్నె రానుందని స్థానికులు భావిస్తున్నారు.

అందుబాటులోకి రానున్న సౌకర్యాలివే..

- కళ్లు జిగేల్‌మనిపించేలా ముఖద్వారం. ఇప్పటికే ఈ పనులు 90 శాతం పూర్తయ్యాయి.
- రోడ్ల విస్తరణతో ప్రయాణికులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం అందుతుంది.
- సూచిక బోర్డుల ఏర్పాటుతో పాటు పాదచారులు నడిచేందుకు వీలుగా ప్రత్యేక రహదారి నిర్మాణం.
- పార్కింగ్ ప్రదేశాలు, మిరుమిట్లుగొలిపే లైటింగ్.
- రైలు ప్రయాణికులకు ఆహ్లాదకర అనుభూతిని అందించేందుకు స్థానిక కళలు, సంస్కృతికి ప్రాధాన్యం.
- స్టేషన్ భవనాలు, సర్క్యులేటింగ్ ఏరియా కోసం రెండో ప్రవేశ ద్వారం ఏర్పాటు.
- ఉన్నతస్థాయి ప్లాట్‌ఫామ్‌లు, సరిపడా ప్లాట్‌ఫామ్ షెల్టర్ల నిర్మాణం.
- ఎల్ఈడీ స్టేషన్ సూచికా బోర్డులు, వెయిటింగ్ హాళ్లలో మెరుగైన సౌకర్యాలు.

కనుల పండువగా గట్టుమైసమ్మ జాతర

అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ పూజలు




అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్: కోరిన కోరికలు తీరుస్తూ కొంగు బంగారమై వెలుగొందుతున్న శ్రీ గట్టుమైసమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించిన జాతరకు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. నల్గొండ, మెదక్, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. డప్పుల మోతలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో జాతరలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు అమ్మవారికి బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ఆవహించిన వ్యక్తి భవిష్యవాణి వినిపించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయ శాఖ, మున్సిపల్ పాలకవర్గం అవసరమైన చర్యలు తీసుకుంది. ఎంపీ ఈటల రాజేందర్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మేయర్ వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ చక్రపాణి నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కల్యాణ మండపం సీజ్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కల్యాణ మండపాన్ని హౌసింగ్ బోర్డు అధికారులు సీజ్ చేశారు. శనివారం మధ్యాహ్నం హౌసింగ్ బోర్డు పశ్చిమ మండల అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా గోవర్ధనగిరిపై ఉన్న వేణుగోపాల స్వామి ఆలయ కల్యాణ మండపానికి తాళం వేసి సీజ్ చేయటం కాలనీలో చర్చనీయాంశంగా మారింది. కేపీహెచ్‌బీ కాలనీలో గత మూడు దశాబ్దాలుగా అనేక చోట్ల హౌసింగ్ బోర్డు స్థలాల్లో ఆలయాలు, వాటికి అనుబంధంగా కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించి భక్తుల సౌకర్యార్థం వినియోగిస్తున్నారు. అయితే వాటిని పట్టించుకోని అధికారులు వేణుగోపాల స్వామి ఆలయ కల్యాణ మండపాన్ని మాత్రమే సీజ్ చేయటం పలు అనుమానాలకు తావిస్తుంది.



ఆలయ కల్యాణ మండపానికి తాళం వేసిన దృశ్యం

కొలిక్కిరాని భూ వివాదం

కూకట్‌పల్లి ప్రాంతంలోని హౌసింగ్‌బోర్డు భూములను 2004 కంటే ముందు ప్రభుత్వ, ప్రైవేట్ జాయింట్ హౌసింగ్ వెంచర్‌లలో భాగంగా మలేసియాకు చెందిన ఐజేఎం కంపెనీకి కొంత భూమిని కేటాయించగా వారు మలేసియా టౌన్‌షిప్ పేరుతో నిర్మాణాలు చేపట్టి విక్రయించారు. దానికి ఎదురుగా సర్వే నెంబర్1009లో సుమారు 36 ఎకరాల భూమిని సిడ్కో, ఐజేఎం భాగస్వామ్య సంస్థకు హౌసింగ్ కమర్షియల్ భవనాల నిర్మాణం కోసం కేటాయించారు. అయితే ఈ వెంచర్‌లో నిర్మాణాలు ఆదిలోనే నిలిచిపోయాయి. సదరు భూమిని స్వాధీనంలోకి తీసుకున్న వెంచర్ నిర్వాహకులు చుట్టూ బారికేడ్స్ నిర్మించి వదిలేశారు. అప్పటి నుంచి హౌసింగ్ బోర్డుకు, నిర్మాణ సంస్థ ఐజేఎంకు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ 36 ఎకరాల పరిధిలోనే ఉన్న వేణుగోపాల స్వామి ఆలయాన్ని స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో గణనీయంగా అభివృద్ధి చేశారు. ఏటా తిరునాళ్లు, కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. కోర్టులో వివాదం ఉన్నా అటు ప్రైవేట్ భాగస్వాములు, ఇటు ప్రభుత్వ అధికారులు వేడుకల నిర్వహణలో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. తాజాగా కల్యాణ మండపాన్ని సీజ్ చేయటంతో హౌసింగ్ బోర్డు అధికారులు ఇక్కడి భూములను తిరిగి వేలం వేసేందుకు యత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే సదరు భూములను వేలం వేస్తే అడ్డుకుంటామని స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆలయ కల్యాణ మండపాన్ని సీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై వివరణ కోరేందుకు హౌసింగ్ బోర్డు ఈఈ కిరణ్‌బాబుకు 'సాక్షి' పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవటం గమనార్హం.

అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్ అరెస్ట్

రూ. 15.50 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

సైదాబాద్: విలాసవంతమైన జీవితం కోసం గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ. 15.5 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు జాట్ అలియాస్ రాజు రామగుండంలో నివాసం ఉంటూ ఐస్‌క్రీం వ్యాపారం చేసేవాడు. విలాసవంతమైన జీవనానికి అలవాటు పడిన అతను సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నాడు. ఒడిశాలోని చిత్రకుండకు చెందిన సుభాష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు సరఫరా చేసేవాడు. ఇటీవల అతనికి మహారాష్ట్ర చంద్రపూర్‌కు చెందిన పాత కస్టమర్ పురుషోత్తం నుంచి 62 కేజీల గంజాయి ఆర్డర్ వచ్చింది. దీంతో రాజు ఈనెల 11న ఒడిశా వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తిరిగి రామగుండం తిరిగి వచ్చాడు. మహారాష్ట్రకు వెళ్లేందుకు ప్రైవేట్ బస్సులో నగరానికి చేరుకున్నాడు. శనివారం సాయంత్రం నల్గొండ చౌరస్తా నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 62 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలోనూ పాల్వంచ, వైజాగ్‌లో ఇదేతరహా కేసులు ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఆయా కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన రాజు మళ్లీ గంజాయి దందా మొదలు పెట్టినట్లు తెలిపారు. అతడికి గంజాయి అమ్మిన సుభాష్, ఆర్డర్ చేసిన పురుషోత్తంలపై కూడా కేసులు నమోదు చేసామని ప్రస్తుతం వారు పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు నేతృత్వంలో అడిషనల్ డీసీపీ టి.స్వామి, మలక్‌పేట ఏసీపీ శ్యాం సుందర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.సైదులు, ఎస్‌ఐలు సాయిరాం, షేక్ కవియుద్దీన్, ఎం.మధులు నిందితుడిని అరెస్ట్ చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు హైడ్రా ప్రజావాణి

సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం ప్రధాన కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు హైడ్రా ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ ప్రజావాణి కొనసాగుతుంది. నగర ప్రజలు సంబంధిత పత్రాలతో హైడ్రా కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చు.

ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా సీఎస్ మంజీత్ బుచా



నాంపల్లి: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రెటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) సంస్థ హైదరాబాద్ చాప్టర్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. రెడ్‌హిల్స్‌లోని ఐసీఎస్ఐ కార్యాలయంలో జరిగిన మేనేజింగ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో 2025–26వ సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా సీఎస్ మంజీత్ బుచా, వైస్ చైర్మన్‌గా సీఎస్ శిల్పా బంగ్, కార్యదర్శిగా సీఎస్ పవన్ కంకణ, కోశాధికారిగా సీఎస్ కార్తీక్.ఏ, సభ్యులుగా సీఎస్ లక్ష్మీ నారాయణ గుప్తా, సీఎస్ తంగిరాల లలితాదేవి, సీఎస్ అక్షిత సురానా, ఎక్స్ అఫిషియో సభ్యులుగా సీఎస్ రాజవోలు వెంకటరమణ, సీఎస్ మహదేవ్ తిరునగరి నియమితులయ్యారు.

డీసీఎం బీభత్సం

- పలువురికి గాయాలు
- 7 ద్విచక్రవాహనాలు ధ్వంసం
- డ్రైవర్ పరారీ



ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డులో డీసీఎం అదుపు తప్పి పలువురికి గాయాలైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట్‌కు చెందిన బాలయ్య కుటుంబంతో సహా ఎల్‌బీనగర్ ఎన్టీఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. మనవరాలి పుట్టిన వెంట్రుకలు తీయించేందుకు శనివారం డీసీఎంలో 35 మంది యాదాద్రికి వెళ్లారు. విందు పూర్తి కాగానే ఆదివారం ఇంటికి తిరుగు ముఖం పట్టారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం పట్టణంలోని బైపాస్ రోడ్డుకు చేరుకోగానే అతివేగం కారణంగా వాహనం అదుపు తప్పి జాతీయ రహదారి– సర్వీస్ రోడ్డు మధ్య స్థలంలో ఒక పక్కకు దూసుకెళ్లింది. దీంతో గట్టు మైసమ్మ జాతరకు వచ్చిన భక్తులకు చెందిన 7 ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. వాహనంలో ఉన్న పలువురితో పాటు సర్వీస్ రోడ్డులో జాతరకు వచ్చిన పాదచారులకు గాయాలయ్యాయి. జాతర బందోబస్తు కోసం పోలీసులు వెంటనే క్షతగాత్రులను ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన రేణుక, మల్లమ్మ అనే మహిళలను గాంధీ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ర్యాపిడో డ్రైవర్ అరెస్ట్

అల్వాల్: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ర్యాపిడో డ్రైవర్‌ను నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.వరంగల్ జిల్లా, దామర గ్రామానికి చెందిన మంతూరి హరీష్ ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 16న అతను నేరేడ్‌మెట్ గీతానగర్ డీమార్ట్ వద్ద స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో నుండి బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా డిఫెన్స్ కాలనీ వద్ద నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా చైన్ స్నాచింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. చోరీ సొత్తును అతను మనప్పురం గోల్డ్‌లోన్‌లో కుదవ పెట్టినట్లు తెలిపాడు. నిందితుడు ఉపయోగించిన బైక్‌ను సైతం గత నవంబర్‌లో నిజామాబాద్ జిల్లా, గుడితండాలోని ఓ పొలం వద్ద నిలిపి ఉన్న వాహనాన్ని దొంగిలించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

మరో యువకుడికి తీవ్ర గాయాలు

సంతోష్‌నగర్: బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.శేఖర్ రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన సాయి అఖిల్ (22) ఈవెంట్ ఆర్గనైజర్‌గా పని చేస్తూ నగరంలోని టీకేఆర్ కమాన్ వద్ద నివాసముంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఈవెంట్ ఉందని ఇంట్లోనుంచి బయటికి వెళ్లాడు. తన స్నేహితులు మధు, శివలతో కలిసి బైక్‌పై టీకేఆర్ కమాన్ నుంచి చాంద్రాయణగుట్ట వైపు వెళుతున్నారు. హాఫీజ్‌బాబానగర్ రిచ్ కేక్ వాలా వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అఖిల్, మధులను స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన శివను చికిత్స నిమిత్తం ఆరాంఘర్‌లోని శ్రీనివాస్ ఆసుపత్రికి తరలించారు. సాయి అఖిల్ తల్లి మానస ఫిర్యాదు మేరకు కంచన్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందానగర్–లింగంపల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుమారు 25 ఏళ్ల వయస్సు గల ఓ గుర్తు తెలియని యువకుడు చందానగర్–లింగంపల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన ఓ రైలు ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై తెలుపు, నీలం రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



జస్వంత్ (ఫైల్)

ఉప్పల్: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రామంతాపూర్, వాసవి కాలనీ, వెంకట్‌రెడ్డి నగర్‌కు చెందిన జస్వంత్(23) ఓయూలో ఎమ్మెస్సీ మొదటి సంవ త్సరం చదువుతున్నాడు. శనివారం రాత్రి భోజనం చేసి నిద్రించేందుకు పెంట్‌హస్‌లోకి వెళ్లాడు. ఆదివారం ఉదయం అతడి తమ్ముడు సాయిచరణ్ పెంట్‌హస్‌లోకి వెళ్లి చూడగా గదిలో కనిపించలేదు. బాతురూమ్ గడియపెట్టి ఉండటంతో అతను బాత్‌రూమ్ తలుపులు తెరిచి చూడగా జస్వంత్ కరెంట్ వైర్‌తో ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజగోపాల్ నగర్ లే ఔట్‌లో నిర్మాణాలు చేపట్టరాదు




ధర్నాలో పాల్గొన్న రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ నేతలు

కవాడిగూడ: సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మండలం, ఐలాపూర్ పరిధిలోని రాజగోపాల్ నగర్ లే ఔట్‌లో ఎలాంటి క్రయ విక్రయాలు, నిర్మాణాలు చేపట్టరాదని ఐలాపూర్ రాజగోపాల్ నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లాడి సందీప్‌కుమార్, కోశాధికారి కె.రమేష్, ఉపాధ్యక్షుడు ఆర్.వి రామమూర్తి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు మాధవి డిమాండ్ చేశారు. సదరు లేఔట్‌లోని సర్వే నెంబర్ 119 నుంచి 220 వరకు మొత్తం 408 ఎకరాలపై కోర్టులో కేసు నడుస్తుందన్నారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం అసోసియేషన్ సభ్యులు సేల్ డీడ్ ద్వారా లే ఔట్‌లోని ప్లాట్లను కొనుగోలు చేశారన్నారు. అయితే స్థానిక రాజకీయ నాయకులు అధికారులతో కుమ్మక్కై తప్పుడు పత్రాలు సృష్టించి కొంత భూమిని కబ్జా చేశారని వారు ఆరోపించారు. కొందరు అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతులు, నల్లా కనెక్షన్లు, డ్రైనేజీ కనెక్షన్లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం ఇటీవల తమకు అనుకూలంగా తీర్పునివ్వడంతో పాటు ఆయా స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టం చేసిందన్నారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ధర్నాలో అసోసియేషన్ సభ్యులు శాస్త్రీ, కృష్ణ, డి సుదర్శన్, సి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి సెల్‌ఫోన్ అందజేత

మూసాపేట: ఓ ప్రయాణికుడు కూకట్‌పల్లి ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన మొబైల్ ఫోన్ ఆదివారం ఆర్టీసీ సిబ్బంది అతడికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే..కేపీహెచ్‌బీ నుంచి మెహిదీపట్నం రూట్ నెంబర్19ఎం/పీ బస్సులో మెహిదీపట్నంలో ఎక్కిన ప్రయాణికుడు మసాబ్‌టాంక్ వద్ద దిగి వెళ్లిపోయాడు. బస్సులో అతడు సెల్‌ఫోన్ మర్చిపోయినట్లు గుర్తించిన కండక్టర్ సరిత కూకట్‌పల్లి డిపోలో అందజేసింది. ప్రయాణికుడు డిపో అధికారులను సంప్రదించగా ఆదివారం డిపో ఎస్‌టీఐ మల్లేశం అతడికి మొబైల్ ఫోన్‌ను అందజేశాడు. డ్రైవర్ రాజ్‌కుమార్, కండక్టర్ సరితలను పలువురు అభినందించారు.

జీహెచ్‌ఎంసీ తాత్కాలిక ఉద్యోగి అదృశ్యం



నల్లకుంట: జీహెచ్‌ఎంసీ తాత్కాలిక ఉద్యోగి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపిన మేరకు.. జీహెచ్‌ఎంసీలో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న పి. సాయి కుమార్(30) నర్సింహా బస్తీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు ఈ నెల 4న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య రాణి అన్ని చోట్ల వెతికినా ఆచూకి తెలియరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నిధుల 'పురం'పర!

క్లైమాక్స్ మార్క్

- మున్సిపాలిటీలకు మిగిలింది ఐదు రోజులే
- గడువు ముగిసే వేళ కాసుల గలగల
- నిధుల వరద కురిపించిన ప్రభుత్వం
- సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు
- ఆయా పురపాలికల్లో జోరుగా అభివృద్ధి పనులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మున్సిపాలిటీలు/కార్పొరేషన్లకు ప్రభుత్వం నిధుల వరద కురిపించింది. గడువు ముగిసే వేళ పెద్ద మొత్తంలో నిధులు జమ చేయడంతో పాలక మండళ్లు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వచ్చిన నిధులను వార్డుల వారీగా విభజించి, ఆఘమేఘాల మీద సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారు. నిజానికి స్టాంప్స్ డ్యూటీ (టీడీ ఫండ్), మ్యూటేషన్ ఫీజులు 2019 నుంచి ప్రభుత్వం వద్దే పెండింగ్‌లో ఉన్నాయి. ఆస్తిపన్ను, ఇంటి నిర్మాణాలకు అనుమతుల ద్వారా వచ్చే ఫీజులు మున్సిపాలిటీల నిర్వహణకు కూడా సరిపోవడం లేదు. దీంతో జిల్లాలోని మెజార్టీ మున్సిపాలిటీలు ఐదేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్నచిన్న పనులకు ప్రభుత్వం విదిల్చే నిధులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్థానిక సంస్థలకు ఈ నిధులను విడుదల చేయించారు. ప్రస్తుత పాలక మండళ్ల గడువు ముగియనుండడం.. త్వరలోనే వాటికి ఎన్నికలు రానుండటం, మెజార్టీ స్థానాలపై కాంగ్రెస్ దృష్టి సారించడం తె లిసిందే. ఈలోపే ఆయా మున్సిపాలిటీల్లో తమ మార్క్ చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భారీగా నిధులు కేటాయించి, వాటికి శంకుస్థాపనలు చేయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవచ్చని భావిస్తున్నారు.

ఏ మున్సిపాలిటీకి ఎంతంటే..

- తుక్కుగూడ మున్సిపాలిటీకి రూ.32 కోట్లు.
- మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.17.74 కోట్లు.
- పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీకి రూ.35 కోట్లు. 24 వార్డులు ఉండగా, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం ఒక్కో వార్డుకు రూ.50 లక్షల చొప్పున కేటాయించారు.
- బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.87 కోట్లు. నాలుగైదు రోజుల్లో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి డివిజన్ల వారీగా నిధులు కేటాయించనున్నారు.
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి టీయూఎఫ్ఐడీసీ కింద రూ.6.35 కోట్లు. ఇప్పటికే ఈ నిధులను సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు కేటాయించారు.
- బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఖాతాలో రూ.96.73 కోట్లు.
- కొత్తూరు మున్సిపాలిటీ ఖాతాలో రూ.50 కోట్లు. వీటిలో పూలే విగ్రహం నుంచి వినయకాస్టిల్ కూడలి వరకు సీసీరోడ్డు పనులకు రూ.18 కోట్లు, ఎస్సీకాలనీ నుంచి కుమ్మరిగూడ చేగూర్ రోడ్డు వరకు సీసీ రోడ్డు పనులకు రూ.32 కోట్లు కేటాయించారు.
- తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఖాతాలో రూ.49 కోట్లు. త్వరలోనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించనున్నారు.
- శంకర్‌పల్లి మున్సిపాలిటీలో అమృత్ 2.0 కింద రూ.32.47 కోట్లు మంజూరు చేయించి, ఈ మేరకు ఇటీవల తాగునీటి సరఫరా పథకానికి శంకుస్థాపన కూడా చేశారు.

అధికారుల హడావుడి

ఐదేళ్లుగా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడిన ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఖాతాల్లో ప్రభుత్వం భారీగా నిధులు జమ చేయడం, పాలక మండళ్ల గడువు కూడా ముగియనుండటంతో అధికారుల్లో హడావుడి మొదలైంది. ఇప్పటి వరకు ప్రజలు, కౌన్సిలర్లు/కార్పొరేటర్ల నుంచి వచ్చిన అర్జీలతో పాటు వార్డుల వారీగా ఉన్న ప్రధాన సమస్యలు గుర్తించే పనిలో ఇంజనీరింగ్ విభాగం నిమగ్నమైంది. చేపట్టాల్సిన పనులకు అంచనాలు రూపొందిస్తున్నారు. చివరి ఈ ఐదు రోజుల్లో వార్డుల వారీగా నిధులు ఏరులై పారే అవకాశం లేకపోలేదు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే పలు పనులకు శంకుస్థాపనలు చేసిన సభ్యులు.. ఆఖరి రోజు మరిన్ని పనులను మొదలు పెట్టే అవకాశం ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని సోమవారం నిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, ట్రీ కట్టింగ్‌లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎర్రమంజిల్ ఏరియా, రోడ్ నెం.1, బాలాపురా బస్తీ ఏరియా, ఎర్రమంజిల్ చమాన్ పీటీ ఏరియా, పంచాయ తీరాజ్ ఆఫీస్, శ్రీకావేరి సాంబశివరావు రెసిడెన్సి, పోస్టాఫీస్ ఏరియా లేన్, జీవీకె మాల్ వెనుక వైపు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సత్కారం


శ్రీశైలంను సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

లిబర్టీ: సామాజిక సేవలు అందిస్తున్నందుకు సాయిదత్త పీఠం ప్రతినిధులు సామాజిక కార్యకర్త సిలివేరి శ్రీశైలంను సత్కరించారు. సామాజిక సేవ, పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన తదితర వాటిపై సేవలందిస్తున్నందుకుగాను శ్రీశైలంను సాయిదత్త పీఠం మేనేజింగ్ ట్రస్ట్ ప్రతినిధులు మురళీ, జంబుల విలాస్‌రెడ్డి అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే పరామర్శ

సనత్‌నగర్: తన వ్యక్తిగత సహాయకుడు వెల్లంకి హరీశ్ తండ్రి సుదర్శన్‌రావు ఇటీవల చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బీకేగూడలోని వారి నివాసానికి ఆదివారం వెళ్లి ఆయనను పరామర్శించారు. సనత్‌నగర్, రాంగోపాల్‌పేట బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు సంతోష్, అశోక్‌యాదవ్, శ్రీహరి, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, రాజేశ్ ముదిరాజ్, శేఖర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులపై కేటీఆర్‌ది కపట ప్రేమ'

సనత్‌నగర్: రైతుల ఆత్మహత్యలపై కేటీఆర్ చేసిన ట్వీట్ కపట ప్రేమ అని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమా అన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలే రైతుల కష్టాలకు ప్రధాన కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే రైతుల రుణమాఫీ కోసం రూ.21,000 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అలాగే వారి సంక్షేమానికి రూ.54,000 కోట్లు కేటాయించిందన్నారు.అదనంగా ఎకరానికి రూ.12,000, భూమి లేని రైతులు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000, రూ.2లక్షల వరకు రుణమాఫీ, మెరుగైన బియ్యానికి ఎంఎస్‌పీతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ వంటి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. రైతుల జీవితాలను మెరుగుపర్చడం, నిస్వార్థ సేవ చేయడం మాత్రమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ గ్రౌండ్‌లో విద్యార్థులకు కరాటేలో బెల్ట్ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. గ్రాండ్ మాస్టర్ కంతేశ్వర్, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కల్యాణ్, చీఫ్ ఎగ్జామినర్ శ్రీను, వెంకట్, అమీర్ మాస్టర్ల సమక్షంలో పరీక్షలు జరపగా పాటిగడ్డ జీహెచ్‌ఎంసీ శిక్షణ కేంద్రం విద్యార్థులు వివిధ రకాల బెల్ట్స్‌లో ప్రతిభ చూపి అవార్డులతో పాటు సర్టిఫికెట్లు పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను కోచ్ చందుముదిరాజ్ అభినందించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 32, దొండ 45, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 45, గోకరకాయ 28, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 28, చామగడ్డ 40, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 10-12, ముల్లంగి 4-5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

చికిత్స పొందుతూ విలేకరి మృతి

అమీర్‌పేట: చికిత్స పొందుతూ ఓ విలేకరి ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని బాపట్లకు చెందిన రమేశ్ (57) యూసుఫ్‌గూడ విలేకరిగా పని చేసేవాడు. సంక్రాంతి పండుగ రోజు అల్లుడితో కలిసి వేర్వేరు బైక్‌లపై ఎస్‌ఆర్‌నగర్‌కు వెళ్లారు. ఉమేశ్‌చంద్ర విగ్రహం నుంచి పాత పోలీస్ స్టేషన్ వైపు వెళ్తుండగా వెనకనుంచి ట్రిపుల్ రైడింగ్‌తో వేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు రమేశ్ బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ క్రమంలో అతడు కిందపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించి అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అర్జీలు 66,000.. అర్హులు 6,093!

- జాబితాలో పేరులేక ఉసూరుమంటున్న జనం
- పదేళ్లుగా ఎదురుచూపులే
- ఈసారి కూడా నిరాశే
- రేషన్‌కార్డు కోసం జనంపాట్లు

ఈసారి కూడా తెల్లరేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మందికి నిరాశే మిగిలేలా కనిపిస్తోంది. తెల్లరేషన్ కార్డు వస్తే ప్రతీ సంక్షేమ పథకానికి అర్హులమవుతామని వారు ఆశించగా వారి ఆశ ఆవిరిగానే మారిపోయే విధంగా మారింది. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో సుమారు తెల్లరేషన్‌కార్డుల కోసం 66,000 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 6,093 మందిని మాత్రమే అర్హులుగా తేల్చినట్లు తెలుస్తుంది. దీంతో చాలా మందికి తెల్లరేషన్ కార్డు అందకుండానేపోతుందని అర్థమవుతోంది.


కొత్త రేషన్‌కార్డుల సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది..

బంజారాహిల్స్: కొత్త రేషన్‌కార్డుల కోసం అర్హులైన పేదలు గత పదేళ్లుగా ఎదురుచూపులతోనే కాలం గడుపుతున్నారు. గతేడాది నవంబర్‌లో చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో తమకు రేషన్ కార్డులు లేవని వేలాదిమంది దరఖాస్తుల్లో పేర్కొన్నారు. అయితే తాజాగా కొత్త రేషన్‌కార్డుల కోసం చేపట్టిన సర్వేలో జాబితాలో వెతుక్కుంటే తమ పేర్లు లేవని తెలుసుకుని ఉసూరుమంటున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలో 81రేషన్ షాపులు ఉండగా, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తమకు రేషన్‌కార్డులు కావాలని వేలాదిమంది మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలనలోనూ, గత ఏడాది నవంబర్ 20న నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వేలోనూ ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారుగా 66,000 మంది తమకు రేషన్‌కార్డులు లేవని దరఖాస్తులు అందజేశారు. అయితే ప్రభుత్వం మాత్రం గత ఏడాది నిర్వహించిన సమగ్ర కుటుంబ కులగణన సర్వేలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో 6,093 మందిని అర్హులుగా పేర్కొంటూ జాబితా రూపొందించింది. అయితే సమగ్ర ఇంటింటి కుల గణన సర్వేలో ఈ రెండు నియోజకవర్గాల నుంచి 22,000 మంది తమకు రేషన్‌కార్డులు కావాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు చేపట్టిన సర్వేలో తమ పేర్లు లేకపోయేసరికి ఉసూరుమంటున్నారు. ఈనెల 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు జారీ చేయనుండడంతో తమ పేర్లు లేకపోయేసరికి దరఖాస్తుదారులు గగ్గోలు పెడుతున్నారు.

పేర్లు లేనివారి సంగతేంటి..?

గత ఏడాది నవంబర్‌లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేలో చాలా మంది పేదలు, మధ్యతరగతి ప్రజలు, ఎగువ మధ్య తరగతికి చెందిన వారు తమకు కార్డు లేదని చెప్పడంతో ఆ వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేసుకుని ఆ జాబితాను కంప్యూటరీకరించారు. అయితే వారం క్రితం వచ్చిన జాబితాలో వేలాది మంది పేర్లు లేకపోవడంతో వారంతా నిస్సహాయంగా వెళ్లిపోయారు. అనేక మంది కులగణన సర్వేలో కార్డు లేదని నమోదు చేసుకున్న జాబితాలో పేరు కనిపించడం లేదు. వీరి పరిస్థితి ఏమిటన్నది అంతుబట్టకుండా ఉంది. ప్రభుత్వం నుంచి దీని గురించి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రస్తుతం పరిశీలనకు వస్తున్న సిబ్బందిని కలిసి తమ పేర్లు ఉన్నాయో లేవో అంటూ చాలామంది ఆరా తీస్తున్నారు. అన్ని అర్హతలు ఉండి జాబితాలో పేరు లేకపోవడంతో ఆందోళన చెందుతున్న పేదలకు అటు సంబంధిత అధికారులు, ఇటు సర్వే చేస్తున్న సిబ్బంది సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదని, అది ప్రభుత్వం చేతిలో ఉందంటూ దాటవేస్తూ జారుకుంటున్నారు. ఇదిలా ఉండగా మరో రెండు రోజుల్లో కొత్త రేషన్‌కార్డుల పరిశీలన పూర్తిచేసి బస్తీ సభల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించనున్నారు.

ప్రమాదకరంగా వ్యాపారాలు!

ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే టీకొట్టు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో అనుభూతి బార్ అండ్ రెస్టారెంట్‌ను ఆనుకుని జీహెచ్‌ఎంసీ పార్కు పక్కన ఫుట్‌పాత్‌పై ఓ కరెంటు స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ మధ్యలో అక్రమంగా టీకొట్టును ఏర్పాటు చేశారు. దీనివల్ల ఇక్కడ ఏదైన విద్యుత్ ప్రమాదం జరిగితే ఇక్కడకు వచ్చిన వారు ప్రమాదానికి గురవుతారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక్కడి హోటల్ యజమాని సదరు వాణిజ్య భవనం సెట్‌బ్యాక్‌లో ఓ గదిని నిర్మించి హోటల్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఆ తర్వాత పాన్ డబ్బా, టీకొట్టు కోసం ఏకంగా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి కరెంటు స్తంభం పక్కనే ఏర్పాటు చేసి దర్జాగా కిరాయికి ఇచ్చాడు. ట్రాన్స్‌ఫార్మర్, కరెంటు స్తంభం మధ్యలో ఈ డబ్బా ఉండడం వల్ల ప్రమాదం పొంచి ఉందని స్థానికులు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన ఈ డబ్బాలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కరెంటు స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ మధ్యలో ఏర్పాటు చేసిన టీకొట్టు

ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు నిలుపరాదు


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్: ట్రాఫిక్ జాం కాకూడదనే ఉద్దేశంతోనే ఫ్రీలెఫ్ట్‌లను ఏర్పాటు చేశామని, కానీ కొంత మంది ఫ్రీలెఫ్ట్ వద్ద వాహనాలను నిలిపి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్‌ఐ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఫ్రీలెఫ్ట్‌లను బ్లాక్ చేయడం వల్ల తేలికగా ముందుకుసాగాల్సిన వాహనదారులు నిలిచిపోవాల్సి వస్తుందన్నారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని కేబీఆర్‌పార్కు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ముందు ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు జాం కాకుండా ఆయన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు నిలుపుతున్న వారిని పక్కకు జరిపి అవగాహన కలిగించారు. దానివల్ల ఏర్పడే ఇబ్బందులను తెలియజేశారు. ఫ్రీ లెఫ్ట్‌లో వాహనాలు నిలిపితే జరిమానాలు కూడా విధిస్తారని, ఈ విషయం గుర్తించుకోవాలని సూచించారు.

శ్రీశైలం బ్యాక్ వాటర్ తరలింపును అడ్డుకోండి

ప్రభుత్వానికి సామాజికవేత్త అశోక్ కుమార్ విజ్ఞప్తి

పంజగుట్ట: గుట్టుచప్పుడు కాకుండా తరలిపోతున్న శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను సంరక్షించాలని ప్రభుత్వానికి సామాజికవేత్త అశోక్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ఏర్పాటు చేసిన విద్యుత్ సంస్థ అనధికారికంగా శ్రీశైలం బ్యాక్ వాటర్ ను తరలించకుపోతున్నట్లు తమ క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించినట్లు తెలిపారు. సదరు సంస్థ సూర్యరశ్మి లేని సమయంలో నీటి ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. నీటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకే భారీ కాలువలను ఏర్పాటు చేసి పెద్ద పెద్ద ఎత్తున నీటిని తరలించకపోతుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్య నీటి వనరు అయిన శ్రీశైలం జలాలను అక్రమంగా తరలించుకుపోతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడం విస్మయాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ అక్రమ తరలింపుతో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరానికి తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. గత ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని ఇప్పటికైనా సీఎం రేవంత్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి ఈ అక్రమ తరలింపును అడ్డుకోవాలని కోరారు.



మానుకోటకు తరలివెళ్లిన ఉద్యమకారులు



రహమత్‌నగర్: మానుకోటలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఉద్యమకారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు ఇంద్రకుమార్, భాస్కర్ సాగర్, కంకట సురేందర్ కురుమ, యండి గౌస్, జగ్గులు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అనేకమంది ఉద్యమకారులు వీరోచితంగా పోరాడారని, వారి సేవలకు నేడు గుర్తింపు లేకుండాపోయిందన్నారు. ఉద్యమకారులకు గుర్తించి వారికి రాజకీయంగా, సామాజికంగా చేయూతనివ్వాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. కుమారస్వామి, ముత్యాల యాదగిరి, ఖాజా, నరసింహ రజకలతో పాటు పెద్ద ఎత్తున మానుకోటకు తరలివెళ్లారు.

రహమత్‌నగర్ డివిజన్‌లో 70శాతం సర్వే పూర్తి

రహమత్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తిస్థాయిలో అయ్యేంత వరకు తమ సిబ్బంది సేవలందిస్తారని రహమత్‌నగర్ డివిజన్ వార్డు ఏఎంసీ బాలరాజు స్పష్టం చేశారు. రహమత్‌నగర్ డివిజన్ కొనసాగుతున్న సర్వేను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో సర్వే వేగవంతంగా కొనసాగుతుందన్నారు. ఇందు కోసం ఇరవై మంది సిబ్బంది సేవలందిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు దాదాపు 70శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. కొన్ని బస్తీల్లో కొనసాగాల్సి ఉందన్నారు. సర్వే కోసం వచ్చే సిబ్బందికి వివరాలు అందించాలని స్థానికులకు ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని బస్తీల్లో సర్వే పూర్తి అవుతుందని ఎవరూ నిరుత్సాహ పడకూడదని ఆయన సూచించారు. సంక్రాంతి సెలవుల కారణంగా కొన్ని రోజులు సర్వే జరగలేదని బాలరాజు పేర్కొన్నారు.


ఇందిరానగర్ ఫేజ్-2 బస్తీలో సర్వేలో సిబ్బంది

25న దేశభక్తి గేయాలు, నృత్య సంబరాలు

కాచిగూడ: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వే జన సుఖినోభవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో దేశభక్తి గేయాలు, నృత్య సంబరాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్‌ఎస్ నారాయణ తెలిపారు. సాహిత్యం, సంగీతం, నృత్యం, మిమిక్రీ, మ్యాజిక్, కరాటే, కుంగ్‌ఫూ, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ తదితర విభాగాల్లో ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ సంబరాల్లో పాల్గొనాలకునే కవులు, కళాకారులు, రచయితలు, క్రీడాకారులు ఈనెల 22వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.96523 47207లో సంప్రదించాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం


రాంకుమార్

ఖైరతాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు కనిపించకుండాపోయిన సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ ఆనంద్‌నగర్‌లో నివాసముండే నేహా రత్తి బ్యూటీపార్లర్‌గా పని చేస్తుంది. మూడు నెలల క్రితం ఢిల్లీ నుంచి వచ్చిన ఆమె తండ్రి రాంకుమార్ (67) ఆమె వద్దే ఉంటున్నాడు. శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాంకుమార్ తిరిగి ఇంటికి రాలేదు. అతడి కోసం చుట్టూపక్కల, తెలిపిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం

సనత్‌నగర్: అధికారంలో ఉన్నా.. లేకున్నా.. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని డీఎస్‌ఎం కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని రోడ్లపై తెల్లవారుజామున 2, 3 గంటల వరకు ఆకతాయిలు తిష్ట వేస్తున్నారని, దీంతో బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ రాత్రి వేళల్లో తప్పనిసరిగా పెట్రోలింగ్ నిర్వహించాలని సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును ఆదేశించారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ లైన్ తొలగించాలని, వేలాడుతున్న వైర్లను తొలగించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మసీదు వరకు రోడ్డు నిర్మించాలని కోరగా, ప్రతిపాదనలు తయారు చేయాలని జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లను ఆదేశించారు. ఫతేనగర్ ఫ్లైఓవర్ విస్తరణ, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ప్రాంతం నుంచి బాలానగర్ వరకు అండర్‌పాస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన కూడా చేశామని, అయినా ఇప్పటివరకు ఆ పనులకు సంబంధించి నిధులు విడుదల చేయలేదన్నారు. త్వరలోనే విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని చెప్పారు. ఆయన వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, జీహెచ్‌ఎంసీ డీఈ వాసుదేవ రెడ్డి, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సయ్యద్, ఎలక్ట్రికల్ ఏఈ శేఖర్, స్ట్రీట్‌లైట్ ఏఈ నారాయణ, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఖలీల్‌బేగ్, సురేశ్‌గౌడ్, రాజేశ్‌ముదిరాజ్, శేఖర్, ఫాజిల్, కరీముల్లా, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని అనుమతులు ఉన్నా వేధింపులు

చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్: అన్ని అనుమతులు, సరైన పత్రాలు కలిగి ఉండి ఇంటి నిర్మాణం చేపడుతుండగా కొంతమంది ఇబ్బందులకు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... షేక్‌పేట మండలం సర్వే నెంబర్ 391 (న్యూ) బంజారాహిల్స్ రోడ్డునెంబర్-5లో మహ్మద్ షాకిర్ ఎస్‌ఆర్‌ఐకి 1222 గజాల స్థలం ఉంది. ఈ స్థలంలో రెండు గదులు నిర్మించి చాలా ఏళ్లుగా తన బంధువైన తాహెర్ అలీని కేర్ టేకర్‌గా ఉంచారు. గత ఏడాది జులైలో జీహెచ్‌ఎంసీ నుంచి భవన నిర్మాణ అనుమతులు పొందారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఈ స్థలం తమదంటూ కొంతకాలంగా రాజు, విమల్‌కుమార్, అంజిరెడ్డిలు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తాహెర్ అలీ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో తమకు హైకోర్టు ఉత్తర్వులు సైతం ఉన్నాయని, వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బీజేపీలో చేరికలు

బంజారాహిల్స్: హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన యువకులు ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిల సమక్షంలో బీజేపీలో చేరారు. హిమాయత్‌నగర్‌కు చెందిన అభిషేక్‌యాదవ్‌తో పాటు అనుచరులు పెద్ద సంఖ్యలో కమలం కండువా కప్పుకుని బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై బీజేపీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా వారు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, నాయకులు పందిళ్ల ప్రసాద్, శ్రీధర్, నర్సింగ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


కిషన్‌రెడ్డి, చింతల రామచంద్రారెడ్డిల సమక్షంలో బీజేపీలో చేరుతున్న యువకులు

ప్రతి పౌరుడు మతసామరస్యాన్ని పాటించాలి

లిబర్టీ: ప్రతి పౌరుడు మతసామరస్యం పాటించాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వర్ రావు కోరారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రపంచ మత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతం మానవహితం కోసం పని చేయాలని సూచించారు. అన్ని మతాలను ప్రజలు గౌరవించాలని కోరారు. మతాన్ని అనుసరించేవారు మతాన్ని గౌరవించాలని ఏ మతాన్ని ద్వేషించకూడదని రాజేశ్వరరావు స్పష్టం చేశారు. అన్ని మతాలు ఒక్కటేనని, దేవుడు ఒక్కటేనని మతాల సారాంశం కూడా ఒక్కటేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.శ్రీనివాసరావు, మైనుద్దీన్, అఫ్జల్, లాజరస్, పి.వి.సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కుల కోసం ఉద్యమించాలి

లిబర్టీ: దళితుల హక్కుల కోసం అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు కోరారు. ఆదివారం శాసన సభ్యులు గడ్డం వివేక్‌ను వెన్న సదానందు కలిశారు. ఈ సందర్భంగా దళిత హక్కుల కోసం రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం కలిసికట్టుగా పోరాటం చేయాలని వివేక్‌ను విన్నవించారు. దళితులపై జరుగుతున్న దాడులు అణచివేత, వివక్షత, అంటరానితనం, గ్రామాల బహిష్కరణ వంటి అంశాలపై పోరాట కార్యక్రమం రూపొందించాలని సదానంద్ కోరారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావటం లేదని, ప్రైవేట్ రంగంలో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలని వంటి అంశాలపై అన్ని వర్గాలను దగ్గర సంఘాలను కలుపుకుని పోరాటం చేయాలని విన్నవించారు. దీనికి స్పందించిన గడ్డం వివేక్ దళితుల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేస్తానని తన తండ్రి చూపిన మార్గంలో పయనిస్తానని తెలిపారు.


గడ్డం వివేక్‌తో వెన్న సదానందు

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డు


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బాలరాజు

రహమత్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు అందించబడతాయని కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు ప్రభుత్వం పంపిణీ చేయనున్న నేపథ్యంలో ఆదివారం హెచ్‌ఎఫ్‌నగర్ ఫంక్షన్‌హాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎన్ రెడ్డి మాట్లాడుతూ కులగణన, ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను వారి జీవన ప్రామాణికంగా పరిశీలించి ఆధారంగా రేషన్‌కార్డులు అందజేయబడతాయని ఆయన తెలిపారు. కొత్తగా దరఖాస్తులు చేసుకుని వారు ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పట్టణవాసుల వార్షిక ఆదాయం రూ. 2 లక్షలకు మించి ఉండకూడదని ప్రభుత్వ నిర్ణయించిందన్నారు. తమతమ బస్తీల్లో రేషన్‌కార్డు లేని పేదలను గుర్తించి వారితో గ్రామ సభల్లో దరఖాస్తులు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. రహమత్‌నగర్ డివిజన్ ఎఎంసీ బాలరాజు మాట్లాడుతూ ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డులు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సోమవారం, 20, జనవరి, 2025

వర్గీకరణపై కాలయాపన తగదు

• మందకృష్ణ మాదిగ


ఓయూలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై కాలయాపన తగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ ఆడిటోరియంలో మాదిగ లెక్చరర్స్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎంఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న అధ్యక్షత వహించగా మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణకు అన్ని వర్గాల మద్దతు ఉన్నా జాప్యం చేయడం దారుణమన్నారు. ఫిబ్రవరి 7న జరిగే వేల గొంతులు లక్ష డప్పుల సాంస్కృతిక సమరానికి సైరన్ కార్యక్రమంలో లెక్చరర్స్ భాగస్వాములుకావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు యాదగిరి, నర్సయ్య, జాన్ విల్సన్, మల్లయ్య, ఇస్మాయిల్, లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు కత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యా ప్రమాణాలను పెంపొందించండి


కార్యక్రమంలో పాల్గొన్న జేఎన్‌టీయుహెచ్ ఇన్‌చార్జి వీసీ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టారెడ్డి తదితరులు

• ఉన్నత విద్యామండలి చైర్మన్

కేపీహెచ్‌బీకాలనీ: సాంకేతిక విద్యాబోధనతో పాటు వృత్తి విద్యా కోర్సులలో ఎప్పటికప్పుడు మెరుగైన ప్రమాణాలను పాటించాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి. బాలక్రిష్టారెడ్డి తెలిపారు. ఆదివారం జేఎన్‌టీయూహెచ్‌లో అనుబంధ ఇంజనీరింగ్, ఫార్మసీ, స్టాండలోన్ ఎంబీఏ కళాశాలల చైర్మన్, సెక్రటరీలు, ప్రిన్సిపాళ్లతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను వీసీ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో కళాశాల నిర్వహణ కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన వీసీ.. కళాశాలలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం ప్రభుత్వం దృష్టికి కూడా వెళ్లిందని వచ్చే మార్చి నెలలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వస్తాయని తెలిపారు. యూజీసీ, ఏఐసీటీఈ నిబంధనలకు అనుగుణంగా మెరుగైన విద్యా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులలో సిలబస్ నవీకరణ, నూతన కోర్సుల నిర్వహణ రూపకల్పనపై ఉన్నత విద్యామండలి విశ్వవిద్యాలయాల ఆదేశాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతిక విద్యాబోధన ఉండాలన్నారు. రెక్టార్ డాక్టర్ కె. విజయ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, అటానమస్, నాన్ అటానమస్ కళాశాలల డైరెక్టర్‌లు డాక్టర్ ఎస్. తారా కళ్యాణి, రవీంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజామియా ఆసుపత్రి


చారిత్రక సౌరభాలు

గుబాళించేలా...


నగరంలోని వారసత్వ భవనాలకు కార్పొరేట్ సొబగులు!

- ఇప్పటికే మూసీ నది పునరుజ్జీవానికి నిర్ణయించిన సర్కారు
- తాజాగా మూసీ వెంట ఉన్న చారిత్రక కట్టడాల పునరుద్ధరణకు నిర్ణయం
- ప్రైవేట్ సంస్థలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయం
- ఎంపిక, పరిరక్షణ, నిర్వహణ బాధ్యత మొత్తం ఎంఆర్‌డీసీఎల్‌దే

భాగ్యనగరి నడిబొడ్డున వడ్డాణంలా పొదిగి ఉన్న మూసీ నదికి పునరుజ్జీవం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన తరుణంలో సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకుంది. మూసీ నది వెంబడి ఉన్న వారసత్వ ప్రదేశాలు, కట్టడాల పరిరక్షణలో ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్ కంపెనీలను భాగస్వామ్యం చేయాలని సర్కారు భావిస్తోంది. నిర్లక్ష్యానికి గురై శిథిల స్థితిలో ఉన్న మూసీ వంతెనలు, వారసత్వ కట్టడాల పునరుద్ధరణ బాధ్యతలు మూసీ నది అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్)కు అప్పగించారు. దీంతో చారిత్రక భవనాల ఎంపిక, పరిరక్షణ, నిర్వహణ బాధ్యతలు ఎంఆర్‌డీసీఎల్‌దే. – సాక్షి, సిటీబ్యూరో


లాడ్ బజార్‌లోని షాహి జిలుఖానా


సర్దార్ మహల్

టోలీ మసీదు


అభివృద్ధి చేయనున్న వారసత్వ భవనాలివీ..

హైదరాబాద్‌లో 55 కి.మీ. మేర ప్రవహించే మూసీ నది వెంబడి ఉన్న వంతెనలతో పాటు సర్దార్ మహల్‌లోని పాత మున్సిపల్ ఆఫీసు, హుస్సేని ఆలం వద్ద పురానాపూల్ దర్వాజా, కార్వాన్‌లోని టోలీ మసీదు, చార్మినార్‌లోని నిజామియా ఆసుపత్రి ఆయుర్వేదిక్ బ్లాక్, లాడ్ బజార్‌లోని షాహి జిలుఖానా, గుడిమల్కాపూర్‌లోని మెట్ల బావులు, బ్రిటీష్ రెసిడెన్సీ, సాలార్జంగ్ మ్యూజియంల పునరాభివృద్ధిపై ఎంఆర్‌డీసీఎల్ దృష్టి సారించనుంది.


పురానాపూల్ బ్రిడ్జి

ఒకప్పుడు హైదరాబాద్‌కు జీవనాధారమైన మూసీ.. కాలక్రమేణా నిర్లక్ష్యం, ఆక్రమణలు, కాలుష్యం కారణంగా మురికికూపంగా మారింది. నీటి కొరత, పర్యావరణ క్షీణతతో మూసీ నది పునరుద్ధరణ అత్యంత కీలకంగా మారింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ పునరుజ్జీవానికి సంకల్పించారు. నది సుందరీకరణతో పాటు మూసీ వెంట ఉన్న వారసత్వ కట్టడాలను పరిరక్షించి, పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇటీవలే న్యూయార్క్‌కు చెందిన వరల్డ్ మాన్యుమెంట్స్ ఫండ్ (డబ్ల్యూఎంఎఫ్) మూసీ పరిసర ప్రాంతాల్లోని తెలంగాణ హైకోర్ట్, స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, సిటీ కాలేజ్, బ్రిటీష్ రెసిడెన్సీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి భవనాలను వరల్డ్ మాన్యుమెంట్స్ వాచ్–2025లో చేర్చిన సంగతి తెలిసిందే.

భవిష్యత్ తరాల కోసం..

నగరం సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, భౌగోళిక అంశాలను తిరిగి అనుసంధానించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో వారసత్వ కట్టడాల పరిశోధన, అధ్యయనం, ప్రణాళిక, భౌగోళిక పరిరక్షణ సులువవుతుంది. దీంతో మూసీ నది వెంట ఉన్న హైదరాబాద్ చారిత్రక ప్రాంతాలు, భవనాలు భవిష్యత్తు తరాల కోసం పరిరక్షిస్తారు. దీంతో నగరం సాంస్కృతిక, చారిత్రక సౌరభం, ఔన్నత్యం మెరుగవుతుంది. అలాగే ఆయా వారసత్వ కట్టడాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయనున్నారు. దీంతో ఆదాయ మార్గంతో పాటు చారిత్రక కట్టడాల పరిరక్షణకు వీలు పడుతుంది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బలహీన వర్గాలకు సముచిత స్థానం


పాలమూరు యూనివర్శిటీ వీసీ శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, చలకాని వెంకట్ యాదవ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ పదవులు ఇవ్వడం అభినందనీయమని ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో యాదవ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్శిటీ వైస్ చాన్సులర్ జీఎస్ శ్రీనివాస్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..పారదర్శకత కలిగిన నాయకులను వివిధ హోదాలలో నియమిస్తూ సముచిత స్థానం కల్పించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజయవంతం అయ్యారని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో యాదవులకు ఏ ముఖ్యమంత్రి ఇవ్వని పదవులు రేవంత్‌రెడ్డి ఇచ్చారని అన్నారు. యాదవ మేధావుల ఫోరం అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. యాదవులు జనాభా దామాషా పద్ధతిలో అన్ని రంగాలలో వాటాకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కులగణనను వెంటనే పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ సంఘం రెడ్డి, సుందర్‌రాజుయాదవ్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ముక్కామల వెంకన్న యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్, డి. మన్మోహన్‌యాదవ్, ఆర్.ఎస్ గౌతం, కాంగ్రెస్‌పార్టీ అధికార ప్రతినిధి సీహెచ్ బద్రినాద్ యదవ్, యాదవ మేధావుల ఫోరం ఉపాధ్యక్షుడు శ్రీనాగ సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాశం యాదగిరి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రైతాంగ సమితి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాశం యాదగిరి మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ మార్కెటింగ్‌ను ప్రైవేటు పరం చేసిందని దాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 3 వ్యవసాయ చట్టాలు 2021లో రద్దు చేసినప్పటికి దొడ్డి దారిన మళ్లీ ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని సూచించారు. రైతు డిమాండ్ల అమలుకు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న దేశ రైతు నాయకులు జగిత్‌సింగ్ గల్లే వాల్‌కు ప్రాణహాని జరగకుండా కాపాడాలని ఆయన ప్రాణానికి హాని జరిగితే కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నిర్వాసిత రైతులకు ఇంటికి ఇళ్లు, భూమికి భూమి, ఇంటికో ఉద్యోగం ఇచ్చే 2013 చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి అధ్యక్షులు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. గోపాల్, పిపిఎఫ్ కన్వీనర్ నాగభూషణం, హైదరాబాద్ కన్వీనర్ రాంబాబు, పృధ్వీరాజ్ నాయకులు ఇంద్రసేనా, లక్ష్మపతి తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి తెలంగాణ జిల్లాల టీ-20 క్రికెట్ టోర్నీ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సతీష్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ జిల్లాల అండర్–17 టీ–20 క్రికెట్ టోర్నీ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. ఆదివారం హైదర్‌గూడలో తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్య నిపుణులు, అమెరికా వైద్యుల సంఘం అధ్యక్షుడు కత్తుల సతీష్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధి చెందాలని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు సరైన అవకాశాలు దక్కాలని ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..ఈ టోర్నీలో ఉమ్మడి 9 జిల్లాల జట్లు పాల్గొంటున్నాయని ఈ పోటీల్లో గెలుపొందిన జట్లను మార్చిలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో అవకాశం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ వైద్యులు రమణమూర్తి గోకుల, శ్రీనివాస్‌రెడ్డి, క్రికెట్ సంఘం సభ్యులు మహ్మద్ మతీష్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శోభన్‌బాబు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారు'

గన్‌ఫౌండ్రీ: అందాల నటుడు శోభన్‌బాబు తెలుగు ప్రజల గుండెల్లో సోగ్గాడిగా చిరస్థాయిగా నిలిచి ఉంటారని సినీనటి జయసుధ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శోభన్‌బాబు సేవా సమితి ఆధ్వర్యంలో శోభన్‌బాబు 89వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గాయని ఆమని సారథ్యంలో 12 గంటల పాటు సాగిన శోభన్‌బాబు సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం ప్రముఖ సినీ నటుడు నరేష్‌కు శోభన్‌బాబు సిల్వర్ క్రౌన్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి, జడ్జి మాధవరావు, దర్శకుడు రేలంగి నర్సింహారావు, సినీనటులు పవిత్ర నరేష్, శివబాలాజీ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోధర్‌గుప్తా, శోభన్‌బాబు సేవా సమితి అధ్యక్షుడు సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

అలరించిన భామా కలాపం

నాంపల్లి: పేరిణి, ఆంధ్రనాట్య గురువులైన సంధ్యా పవన్ కుమార్తె శ్రీనర్తన ప్రదర్శించిన భామా కలాపం ఆకట్టుకుంది. భారత కళా ప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ అభివృద్ధి పరిచిన భామా కలాపానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆదివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో వాగ్దేవి ఆర్ట్స్ అకాడమీ, స్వర నర్తన సంస్థల సంయుక్త నిర్వహణలో భామా కలాపం ప్రదర్శించారు. ఆద్యంతం నర్తకి చక్కటి అభినయంతో నర్తించి ప్రేక్షకులను అలరింపజేసింది. పద్మశ్రీ ఉమా మహేశ్వరి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కళాకృష్ణ, బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి, యువ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మధుసూదన అతిథులుగా హాజరై అభినందించారు.

'హరేకృష్ణ మూమెంట్' కార్యక్రమాలు అభినందనీయం


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న బుర్రా వెంకటేశం తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలు, అభ్యాసాలను పెంపొందించడానికి హరేకృష్ణ మూమెంట్ చేస్తున్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో హరేకృష్ణ అంతర్జాతీయ హెరిటేజ్ ఫెస్ట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమేధన పేరిట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. ఇటువంటి పోటీలు పిల్లలో సృజనాత్మకతను పెంపొందిస్తాయని తెలిపారు. హరేకృష్ణ మూమెంట్, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ అధ్యక్షులు సత్యగౌర చంద్ర దాస ప్రభుజీ మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా నిర్వహించిన ఈ పోటీలలో దాదాపు 23 వేల మంది విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, తమ తోటి విద్యార్థులతో కలిసి నైతిక, సాంస్కృతిక విలువలతో పాటుగా ఒక జట్టుగా పనిచేయడం నేర్చుకున్నారని వెల్లడించారు. హెరిటేజ్ ఫెస్ట్ అంటే కేవలం సాంస్కృతిక పోటీలు మాత్రమే కాదని ప్రస్తుత ప్రపంచంలో విస్తరిస్తున్న సాంకేతికత, ఉరుకుల పరుగుల జీవన శైలి వల్ల సమాజంలో ఏర్పడుతున్న సాంస్కృతిక విభజనను తగ్గించి సమగ్ర అభివృద్ధికి దోహద పడుతుందని తెలియజేశారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

నగరంలో నేడు

- సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ భవనంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్డియో పల్మనరీ రెసిసిటేషన్ (సీపీఆర్)పై ఉచిత శిక్షణ
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు..
- నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమం.. హాజరు కానున్న గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో ఎల్బీ నగర్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో 6వ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2025 ఉదయం 8 గంటల నుంచి..

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఘనంగా లోహ్రి మేళా




ఖైరతాబాద్: పంజాబీ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జలవిహార్‌లో లోహ్రి మేళా వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంజాబీ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా భోగి మంటలు వేసి ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సంప్రదాయ పంజాబీ వంటకాలు, సంగీతం, నృత్యాలతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పంజాబీ సేవా సమితి అధ్యక్షుడు ఉమేష్ ధక్రాల్, దీపక్ జైరత్, నవీన్ పాసి, రాజ్‌కుమార్ గనోత్రా తదితరులు పాల్గొన్నారు.

'మందకృష్ణ, ఎమ్మెల్యే వివేక్ రహస్య మిత్రులు'

ఉప్పల్: రాష్ట్రంలో జరుగుతున్న వర్గీకరణ ఉద్యమంలో భాగంగా వర్గీకరణ వద్దని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అంటున్నారు.. వర్గీకరణ కావాలని మందకృష్ణమాదిగ వేయి గొంతులు..లక్ష డప్పులు కార్యక్రమం నిర్వహిస్తున్నారు.. అయితే వీరిద్దరూ అత్యంత రహస్య ఆప్తమిత్రులని డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. ఆదివారం ఉప్పల్‌లో మాదిగ విద్యార్థి యువ గర్జన సన్నాక సమావేశాన్ని మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకుడు మీసాల మల్లేశం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి డాక్టర్ పిడమర్తి రవి హాజరై మాట్లాడారు. వివేక్, మందకృష్ణ, ఇద్దరూ మాదిగలను, మాలలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా మాదిగ జాతి అంతా వర్గీకరణ ఉద్యమంలో భాగస్వామ్యం అయి 12 శాతం రిజర్వేషన్ జిల్లాల వారీగా వర్గీకరణ జరిగే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిరుపతి, ఎమ్మార్పీస్ రాష్ట్ర కోఆర్డినేటర్ నరసింహారావు పాల్గొన్నారు.

కథ చెప్పే కళ..

- చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా సామూహిక కళా ప్రదర్శన
- విభిన్న ఇతివృత్తాలతో 25 మందికి పైగా కళాకారుల ఆర్ట్ ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో: కళ, కళాత్మకత, సృజనాత్మక ఇలా.. విభిన్న సామాజిక ఇతివృత్తాలను, జీవన శైలులను, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. అయితే ఈ కళాత్మక సృష్టిలో ఒక్కో కళాకారునిదీ ఒక్కో పంథా. ఈ వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి నగరంలోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా నిలిచింది. ఇన్నోవేటివ్ హ్యాండ్స్ నేతృత్వంలో 25 మందికి పైగా కళాకారులు రూపొందించిన అద్భుత చిత్రాలతో చిత్రమయి అలరిస్తుంది. ఈ నెల 21 వరకు కొనసాగనున్న ప్రదర్శన చిత్ర నేపథ్యాలకు కథలను కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. నగరవాసులు, ఔత్సాహికులు ప్రదర్శనను ఆస్వాదిస్తున్నారు. ఇందులో ఆనంద్ గడప, శంకర్ పామర్తి, జయప్రకాశ్, కీర్తి, మహేందర్ పురం, వైశాలి కాలిదిండి వంటి 25 మందికి పైగా ప్రముఖ ఆర్టిస్టుల పెయింటింగ్‌లు సందర్శకులను హత్తుకుంటున్నాయి. కళాకారుల దృష్టి కోణాన్ని ఆవిష్కరించేందుకు ఈ ప్రదర్శన చేపట్టామని క్యూరేటర్ జంగయ్య పోలెపోగు తెలిపారు.



భవానీనగర్, రెయిన్‌బజార్‌లలో ఫ్లాగ్‌మార్చ్


భవానీనగర్ పీఎస్ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

గౌలిపురా: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని తలాబ్‌కట్టా, మురాద్ మహల్ రోడ్డు, బీబీబజార్ రోడ్డు, ఓల్టా ఎక్స్ రోడ్డు, అమన్‌నగర్ తదితర ప్రాంతాల్లో 35 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) బలగాలు, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వర్లు, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, ఎస్ఐ దామోదర్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రెయిన్‌బజార్ పీఎస్ పరిధిలో...

డబీర్‌పురా: రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సైతం పోలీసులు ఆర్ఏఎఫ్ బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పీఎస్ పరిధిలోని గంగానగర్ నాలా, బ్రహ్మణ్‌వాడీ, నాగబౌలి, జాఫర్ రోడ్డు, బడేబజార్, గౌస్ కేఫ్, మౌలాకా చిల్లా తదితర ప్రాంతాల్లో ఈ ఫ్లాగ్‌మార్చ్ కొనసాగింది. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్లు, రెయిన్‌బజార్ డీఐ మదన్‌మోహన్, ఎస్ఐ పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 20, జనవరి, 2025



సందడిగా జాతీయ కరాటే చాంపియన్ షిప్

గచ్చిబౌలి: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జాతీయ కరాటే పోటీలు సందడిగా కొనసాగాయి. వందలాది మంది క్రీడాకారులు ఆయా విభాగాల్లో పోటీ పడ్డారు. రెండో రోజు చిన్నారులు స్టంట్‌లతో ఆకట్టుకున్నారు. ఎనిమిది సంవత్సరాలకు పై బడిన క్రీడాకారులు కరాటేలో పోటీ పడ్డారు. జపాన్ కరాటే అసోసియేషన్ సభ్యులు చిన్నారులకు మెళకువలు నేర్పించారు. జాతాయ పోటీలకు మరో రోజు గడువు ఉండటంతో పోటీలు తుది దశకు చేరుకున్నారు. జాతీయ పోటీల్లో గెలుపొందిన వారు చివరి రెండు రోజులు అంతర్జాతీయ పోటీల్లో తమ ప్రతిభను కనబరచనున్నారు.



అపురూపం..

సప్తపర్ణిలో ఆకట్టుకున్న పోటర్స్ ప్రదర్శన

బంజారాహిల్స్: వారాంతంలో భాగంగా సప్తపర్ణిలో జరిగిన హైదరాబాద్ పోటర్స్ ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంది. దేశంలో అనేక ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు 42 స్టాల్స్ నెలకొల్పారు. ముక్కు పోగుల నుంచి పిట్టల వరకూ ఇక్కడ దర్శనమిచ్చాయి. ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులు చిన్న పిల్లల నుంచి పెద్దల వరకూ అందరినీ అలరించాయి. భిన్న శైలితో కళాకారులు చేసిన వస్తువులు ఎంతో ముచ్చటగొలిపాయి.



మూడోసారి జాతీయ స్థాయి ప్రదర్శన..

నగర కేంద్రంగా జాతీయ స్థాయి ప్రదర్శన ఇది మూడో సారి. దేశ నలుమూలల నుంచి కళాకారులు ఉత్పత్తులను ప్రదర్శించారు. క్లే, సిరామిక్‌తో మాతమే చేసిన వస్తువులను అనుమతిస్తాం. గతంలో కంటే ఈసారి మంచి స్పందన వచ్చింది. ఈ ప్రోత్సాహంతో మున్ముందు మరిన్ని ప్రదర్శనలు నిర్వహిస్తాం.

– విలాసినీ రెడ్డి, హైదరాబాద్ పోటర్స్ మార్కెట్ నిర్వాహకులు..

ఆరేళ్లుగా సిరామిక్ వస్తువులపైనే..

హైదరాబాద్ కేంద్రంగా స్టూడియో నెలకొల్పి ఆరేళ్లుగా సిరామిక్ వస్తువులు తయారుచేస్తున్నాం. సాఫ్ట్‌వేర్ వృత్తి నుంచి వైదొలిగి ఈ కళపై ఆసక్తితో ఈ వర్క్ చేస్తున్నాం. చేతి మునివేళ్లతో కళాఖండాలు చేస్తే వచ్చే అనుభూతి అత్యంత మధురమైనది. కళల పట్ల మక్కువ ఉన్న నగర ప్రజలు మద్దతు ఇస్తున్నారు.



– సంజన, రవ్వ శ్రావణ్, స్టాల్ నిర్వాహకులు

ముచ్చటగొలిపే వస్తువులెన్నో..

కళాకారులు చేతులతో చేసిన వస్తువులను వారే ప్రదర్శనలో ఉంచి స్వయంగా అమ్ముతుంటారు. మన ఇళ్లల్లో నిత్యం ముచ్చటగొలిపే వస్తువులెన్నో దర్శనమిస్తున్నాయి. మూడు వేలకు పైగా ప్లాస్టిక్ రహిత వస్తువులు ఒకేసారి చూడడం కన్నులకు విందుగా ఉంది. వీకెంట్ టైం సరిగ్గా సద్వినియోగం చేసుకున్నామనిపిస్తుంది. – అజయ్ రెడ్డి, ఔత్సాహికుడు



కంటెంట్ క్రియేటర్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్‌లు పెద్ద ఎత్తున హైదరాబాద్‌లో సందడి చేస్తున్నారు. సాధారణంగా నగరంలో కొత్తగా ప్రారంభించిన కేఫ్ అయినా లేదా ఏదైనా ఆసక్తికరమైన ఈవెంట్ అయినా, ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ వీడియోల్లో తక్షణమే ప్రత్యక్షమవుతుంది. అయితే వందల సంఖ్యలో వెరైటీ ఉత్పత్తులు, వేర్వేరు ప్రాంతాలకు చెందిన స్టాల్స్.. ఉండే నుమాయిష్ ఎగ్జిబిషన్ ఇన్‌ఫ్లుయెన్సర్లలో సోషల్ జోష్ నింపుతోంది.. దీంతో వీరికి చేతినిండా పని పెడుతోంది. ఈ క్రమంలో దీని గురించిన మరిన్ని విషయాలు.. - సాక్షి, సిటీబ్యూరో





రీల్స్ కేరాఫ్‌గా..

ఆహార ప్రియుల సాహసాల నుంచి షాపింగ్ స్ప్రీల వరకూ.. ఫీడ్‌లో స్క్రోల్ చేయడానికి ఎల్లప్పుడూ ఏదో ఒక ప్రత్యేకతతో నుమాయిష్ షాపింగ్, ఆహార ఉత్పత్తులను మాత్రమే కాకుండా సృజనాత్మక సోషల్ మీడియా కంటెంట్‌ను కూడా అందిస్తుంది. ఈ విషయాన్ని శరవేగంగా వ్యాపిస్తుండడంతో నుమాయిష్ రీల్స్, వీడియోలకు కేరాఫ్‌గా మారింది. దీంతో ఇన్‌ఫ్లుయెన్సర్లు, సోషల్ మీడియా నిర్వాహకులతో ఎగ్జిబిషన్ సందడిగా మారుతోంది.



నుమాయిష్.. సోషల్ జోష్..

నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సోషల్ మీడియా సందడి

తరలివస్తున్న యూ ట్యూబర్స్, ఇన్‌ఫ్లుయెన్సర్లు

వైవిధ్యభరిత ఉత్పత్తులకు సామాజిక మాధ్యమాల్లో పట్టం

మెన్ @ నుమాయిష్ రీల్‌కి వేల సంఖ్యలో వ్యూస్, లైక్స్..

హైదరాబాద్‌లోని నాంపల్లి మైదాన ప్రాంతం ఇప్పుడు కిక్కిరిసిన దుకాణాలతో, సందర్శకులతో కిటకిటలాడుతోంది. జనవరి 3న ప్రారంభమైన ఈ ఐకానిక్ ఈవెంట్ ఫిబ్రవరి 18, 2025 వరకూ సందర్శకులను అలరించనుంది. మరోవైపు ఈ 84వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ఈసారి సోషల్ మీడియా వేదికగా భారీ ప్రచారం అవుతోంది. విభిన్న రకాల కంటెంట్స్ చేసేందుకు వీలుండడంతో ఇది క్రియేటర్‌లకు గమ్యస్థానంగా మారింది. స్థానికులకు, సందర్శకులకు ఎల్లప్పుడూ ఇష్టమైన హైదరాబాద్ ఐకానిక్ వార్షిక ఫెయిర్ ఇన్‌స్టా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు, యూట్యూబర్ల ప్రవాహానికి నిలయంగా మారింది.





రోజుకొకటి.. అదే వెరైటీ..

కొంతమంది కంటెంట్ క్రియేటర్స్.. ఒక్కో రోజును ఎగ్జిబిషన్‌లోని ఒక్కో విభాగాలకు అంకితం చేస్తున్నారు. ఉదాహరణకు, ఒక రోజు రుచికరమైన స్ట్రీట్ ఫుడ్ గురించి, మరొక రోజు సంప్రదాయ చేనేత స్టాల్స్ గురించి.. తర్వాతి రోజు రైడ్‌లు.. ఎంటర్‌టైన్‌మెంట్ జోన్‌లను ఇలా విభజించి చూపిస్తున్నారు. ఈ సమాచారం వీక్షకులకు వినోదాన్ని మాత్రమే కాకుండా నుమాయిష్ సందర్శనను ప్లాన్ చేయడంలో కూడా ఉపకరిస్తోంది. వీరి కంటెంట్‌కు సోషల్ మీడియాలో భారీ స్పందన లభిస్తోంది. నగరంతో పాటు దేశవ్యాప్తంగానూ అనేక మందిని ప్రభావితం చేస్తోంది.

అడుగడుగునా కెమెరాలు..

నుమాయిష్‌లోని కలర్‌ఫుల్ స్ట్రీట్స్ మీదుగా నడుస్తుంటే.. సందడిగా ఉన్న స్టాల్స్‌కు ముందు పలు కెమెరాలను అమర్చడాన్ని గమనించవచ్చు. ఇన్‌స్టా, లేదా యూట్యూబ్ ద్వారా ఈ గ్రాండ్ ఎగ్జిబిషన్‌లోని ప్రతి మూలనూ కవర్ చేస్తూ ప్రతిరోజూ వందల సంఖ్యలో కంటెంట్ అప్‌లోడ్ చేస్తున్నారు. లక్నో చికన్ కారీ స్టాల్స్ నుంచి కాశ్మీరీ షాపుల వరకూ నోరూరించే ఫుడ్ కోర్ట్ నుంచి వినోద ప్రదేశంలో థ్రిల్లింగ్ రైడ్‌ల వరకూ దేనికదే వెరైటీగా కినిపిస్తోంది. దీంతో మెటీరియల్‌కు కొరత లేకపోవడం వీరికి మరింత ఉత్తేజాన్ని అందిస్తోంది.

క్రేజీగా..మెన్ ఎట్ నుమాయిష్?..

ఈ సంవత్సరం 'మెన్ ఎట్ నుమాయిష్' పేరుతో ఓ రీల్ ఇంటర్నెట్‌లో క్రేజీగా మారింది. మగవాళ్లు తమ కుటుంబాలతో కలిసి షాపింగ్ ట్రిప్‌లలో చురుకుగా పాల్గొంటున్నట్లు చూపే ఈ రీల్ వేగంగా వైరల్ అయ్యింది. ఈ రీల్‌కి ఇన్‌స్టాలో ఒక్క రోజులో 1.5 మిలియన్లకు పైగా వీక్షణలు, 75,000 పైగా లైక్‌లు రావడం విశేషం. షాపింగ్ బ్యాగ్‌లను మోసుకుంటూ భార్యల్ని అనుసరించే భర్తలు, పిల్లలను ఎత్తుకుని ఆడిస్తుంటే మహిళలు షాపింగ్‌లో మునిగిపోవడం.. రీల్‌ని సూపర్ హిట్ చేశాయి.





అక్షరమే.. ఆకర్షణగా..



- క్యాలిగ్రఫీ కళలో రాణిస్తున్న నవకాంత్
- జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలుగు క్యాలిగ్రఫీకి ప్రాచుర్యం
- హాబీగా మొదలై.. జీవనయానంగా మారిన వైనం
- చదివింది బీటెక్ అయినా క్యాలిగ్రఫీలో గుర్తింపు

అక్షరాల పొందుకతో భావాన్ని పలికించడం అందరికీ తెలిసిందే.. అవే అక్షరాలకు అందమైన రూపం ఇచ్చి ప్రాణం పోయడం కొందరికి మాత్రమే తెలుసు.. అక్షరాలనే అద్భుతమైన ఆర్ట్‌గా మలుస్తూ..గుర్తింపు తెచ్చుకుంటున్నారు పలువురు. అలాంటి వారిలో ఒకడు క్యాలిగ్రఫీ కళాకారుడు నవకాంత్. అంతరించిపోయింది అనుకున్న ఓ ప్రాచీన కళ పునరుజ్జీవానికి కట్టిపడేసే అక్షర శైలితో నాంది పలికాడు. అసలు అలాంటి కళ ఒకటి ఉందని మనలో ఎంతమందికి తెలుసు. ఈ నేపథ్యంలో దీని గురించిన మరిన్ని విశేషాలు..

- సనత్‌నగర్

క్యాలీగ్రఫీ..ఈ కళ గురించి చాలా మందికి తెలిసి ఉండకపోవచ్చు. ఇప్పటి తరానికైతే దాదాపు తెలియకపోవచ్చు. అయితే ప్రింటింగ్ ప్రెస్‌లు, కంప్యూటర్లు రాక మునుపు ఎక్కువ ఆదరణ కలిగిన క్యాలిగ్రఫీ.. ఆధునిక టెక్నాలజీ రాకతో కాలగమనంలో కలిసిపోయింది. చేతితో రాసే కాలంలో అందమైన దస్తూరీ కోసం చాలా మంది క్యాలిగ్రఫర్లనే ఆశ్రయించేవారట. కంప్యూటర్లు, ఫోన్ల రాకతో క్యాలిగ్రాఫర్లు కనుమరుగయ్యారు. దీంతో క్యాలీగ్రఫీ అంతరించిపోయింది. అయితే నగరానికి చెందిన నవకాంత్ ఆ కళను పట్టుకుని జాతీయ, అంతర్జాయ వేదికలపై ఎగ్జిబిషన్లతో క్యాలిగ్రఫీ కళకు ప్రాచుర్యం కల్పిస్తున్నాడు.





అక్షర యజ్ఞంలా..

కప్పులు, సాసర్‌లు, గిన్నెలు, పిల్లనగ్రోవి..ఇలా.. ఇంట్లోని ప్రతి వస్తువుపైనా అక్షరాలను పొందుపరిచాడు. అలాగే గోడల నిండా అక్షరాలతో అలంకరించాడు. రోజుకు కనీసం రెండు నుంచి మూడు క్యాలిగ్రఫీ ఆర్ట్స్ వేస్తే గానీ నిద్రపట్టదు. దేశంలో తెలుగు క్యాలిగ్రఫీ చేసిన మొట్టమొదటి వ్యక్తిగా నవకాంత్ నిలిచాడు.

జాతీయ, అంతర్జాతీయ వేదికలపై..

హైదరాబాద్, కొల్హాపూర్, బెంగళూరు, ముంబయి, న్యూఢిల్లీ, సూరత్, ఒంగోలు, కేరళ వంటి జాతీయ, దక్షిణకొరియా, నెదర్లాండ్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై క్యాలిగ్రఫీ కళను ప్రదర్శించి పలువురి ప్రశంసలు పొందారు. అనేక వర్క్‌షాప్‌లు నిర్వహించారు. అలాగే క్యాలిగ్రఫీ కళను అద్దిన గిఫ్టలను బహుమతులుగా ఇచ్చే సంస్కృతి పెరగడంతో వాటిని రూపొందిస్తున్నాడు.

పాఠశాల స్థాయి నుంచే..

వనపర్తి జిల్లాకు చెందిన నవకాంత్ బీటెక్ పూర్తి చేసి నగరంలోని అత్తాపూర్‌లో స్థిరపడ్డాడు. పాఠశాల స్థాయి నుంచి అతని రాత శైలి భిన్నంగా ఉండేది. ఎంతగా అంటే తాను చదివే క్లాస్ విద్యార్థులే కాదు.. పాఠశాలలోని అందరూ నవంత్ తోనే పేర్లు రాయించుకునేవారు. అంతటి స్టైల్‌లో అక్షరాలను పొందుపరిచేవాడు. దీంతో అతనికి తెలియకుండానే అక్షరశైలి వంటపట్టింది. భిన్నంగా రాసే అక్షర శైలిని క్యాలిగ్రఫీ అంటారన్న విషయం మొదట్లో అతనికి తెలియదు. అబిడ్స్‌లో చూసిన క్యాలిగ్రఫీ పుస్తకాన్ని చూసి, అందులో ప్రతి అక్షరం అచ్చం తన రాత లాగే ఉందని గ్రహించి అప్పుడు అర్థం చేసుకున్నాడు. ఏకంగా ఆ క్యాలీగ్రఫీ పుస్తకం రాసిన రచయిత చిరునామా కనుక్కొని ఎక్కడో ముంబాయిలో ఉన్న అతని ఇంటికి వెళ్లి ఆ కళ గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నాడు. అక్కడే కొన్ని రోజులు ఉండి మరిన్ని మెళకువలు నేర్చుకున్నాడు.



ఓర్పు.. నేర్పు ఉండాలి..

ఫైన్‌ఆర్ట్స్ కోర్సుల్లో క్యాలిగ్రఫీ కూడా ఒక సబ్జెక్టుగా ఉంటుంది. భాష ఏదైనా భావం ఉట్టిపడేలా వివిధ ఆకృతుల్లో రాయడం క్యాలిగ్రఫీ ప్రత్యేకత. తెలుగు రాష్ట్రాల్లో ఈ కళలో రాణించే వారు చాలా అరుదు. ఒకవేళ నేర్చుకోవాలనే తపన ఉన్నా.. 10–15 రోజుల్లో వదిలేసేవారే ఎక్కువ. ఈ కళ నేర్చుకోవాలంటే ఓర్పు.. నేర్పు అవసరం. యోగా, మెడిటేషన్ తరహాలో ఏకాగ్రతతో ఉంటనే క్యాలిగ్రఫీ కళలో రాణించగలరని అంటాడు నవకాంత్. 40 ఏళ్లుగా ఈ కళనే తన జీవనాధారంగా మలచుకున్నాడు.












7వ శతాబ్దం నాటి కరెన్సీ ఎగ్జిబిషన్

చార్మినార్: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని 7వ శతాబ్దం నాటి అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువులు సేకరణల ప్రదర్శన పాతబస్తీలోని ఉర్దూ ఘర్‌లో ఈ నెల 25, 26, 27 తేదీల్లో కొనసాగుతుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగే ప్రదర్శనకు ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రి తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 85002 12306.

క్లుప్తంగా...



పొగ మంచులో మహా ద్వార గోపురం

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం నిర్ణీత సమయంలో జరుగుతోంది. ఆదివారం అర్ధరాత్రితో వైకుంఠ ద్వార దర్శనం ముగిసింది. శనివారం తిరుమల శ్రీవారిని 75,931 మంది దర్శించుకోగా.. 25,717 మంది తలనీలాలు సమర్పించారు. అదేవిధంగా శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.4 కోట్లు లభించింది. కాగా, ఘాట్‌రోడ్డులో పొగ మంచు దట్టంగా కమ్మేసింది. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని టీటీడీ భద్రతా సిబ్బంది సూచించింది.

శ్రీవారి సన్నిధిలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని ఆదివారం మంత్రి సవిత, సినీ నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్‌లు ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి, బాల నటుడు రేవంత్, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, నిర్మాత దానయ్య, సినీ నటుడు రాజకుమార్ దర్శించుకున్నారు.

దుర్గమ్మ సేవలో కేంద్రమంత్రి బండి సంజయ్



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడలోని కనకదుర్గమ్మను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.



చిత్తారమ్మ జాతరకు వెల్లువెత్తిన భక్తులు

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ పరిధిలోని గాజుల రామారం శ్రీ చిత్తారమ్మ దేవి ఆలయ జాతర స్వర్ణోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. చిత్తారమ్మా.. మమ్మల్ని దీవించు తల్లీ.. అంటూ భక్తజనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్త జనంతో ఆ ప్రాంతమంతా జనసంద్రమైంది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ తదితరులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని నగరంతో పాటు రాష్ట్ర, రాష్ట్రేతర భక్తులు సుమారు 3 లక్షల మందికి పైగా దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– కుత్బుల్లాపూర్



కొమురవెల్లికి పోటెత్తిన భక్తజనం

మహా జాతర ప్రారంభం

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం బ్రహ్మోత్సవాలు (మహాజాతర) అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో ప్రారంభమయ్యే ఈ జాతర మూడు నెలల పాటు కొనసాగనుంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాలన్నీ మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. మహిళలు బోనాలతో తరలివచ్చారు. మల్లన్న స్వామికి, గుట్టపై వెలిసిన రేణుక ఎల్లమ్మకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో స్వామి వారి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది. హైదరాబాద్‌కు చెందిన భక్తులు సోమవారం ఆలయ తోటబావి ప్రాంగణంలో నిర్వహించే పెద్దపట్నం, అగ్నిగుండాలకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.

ప్రజల భద్రతకు ఎన్‌డీఆర్‌ఎఫ్ భరోసా

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా

సాక్షి, అమరావతి: విపత్తులు సంభవించినప్పుడు ప్రజల భద్రతకు భరోసానిస్తూ జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) నిరుపమాన సేవలు అందిస్తోందని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్, దక్షిణ క్యాంపస్ భవనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం మూడింతల అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆరు నెలల్లోనే రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్ల విలువైన సహకారం అందించామని తెలిపారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంతోపాటు రాజధాని అమరావతి నిర్మాణానికి హడ్కో ద్వారా రూ.27 వేల కోట్ల సహాయం అందిస్తున్నామని చెప్పారు. 2028 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అమిత్ షా మనిషిలా కాకుండా మెషిన్‌లా పని చేస్తున్నారని, ఆయన పనితీరు చూస్తుంటే అసూయ కలుగుతోందన్నారు. పీపీపీ విధానంలో 'గోదావరి – బనకచర్ల' అనుసంధానానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఈ బృహత్తర కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ విపత్తులను తక్షణం ఎదుర్కొనేందుకు గ్రామ స్థాయిలోకూడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమిత్ షా గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరారు.



ఎన్డీఆర్‌ఎఫ్ పరికరాలను పరిశీలిస్తున్న అమిత్‌షా, చంద్రబాబు తదితరులు

తొక్కిసలాట ఘటనపై దృష్టి


తిరుపతిలో ఇటీవల చోటు చేసుకున్న తిరుమల శ్రీవారి భక్తుల తొక్కిసలాట ఘటనపై కేంద్ర హోమ్ శాఖ సైతం దృష్టి సారించిందని ఆ శాఖ మంత్రి అమిత్‌షా వీహెచ్‌పీ నేతల భేటీలో వెల్లడించారు. అధికారిక కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయనతో ఆదివారం ఉదయం వీహెచ్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు నేతృత్వంలో సంఘ ప్రముఖులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇటీవల విజయవాడలో వీహెచ్‌పీ నిర్వహించిన హైందవ శంఖారావం సభ గురించి వారు అమిత్‌షాకు వివరించారు. దేశ వ్యాప్తంగా ఆలయాలను ప్రభుత్వ పరిధి నుంచి పూర్తిగా తప్పించి, స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు కేంద్రం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి తొక్కిసలాట అంశం వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై కేంద్ర హోం శాఖ కూడా పరిశీలిస్తోందని కేంద్ర మంత్రి వీహెచ్‌పీ నేతలకు వివరించారని తెలిసింది.

ప్రజలు ఏమనుకుంటున్నారు..?

రాష్ట్రంలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు ఎలాంటి భావంతో ఉన్నారని కేంద్ర మంత్రి అమిత్ షా.. రాష్ట్ర బీజేపీ నేతలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం ఉదయం ఆయన బస చేసిన హోటల్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర సహాయ మంత్రి భూపతి శ్రీనివాసవర్మ, రాష్ట్ర పార్టీ సంఘటన కార్యదర్శి మధుకర్‌లతో కొద్దిసేపు సమావేశమై రాష్ట్ర రాజకీయాలపై చర్చించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలపై పెద్ద ఎత్తున ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర నేతలకు సూచించారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని దిశా నిర్దేశనం చేశారు. నామినేటెడ్ పదవుల పంపకం సహా కూటమి పార్టీల మధ్య సమన్వయం ఎలా ఉందన్న దానిపై కూడా ఈ భేటీలో చర్చ జరిగింది.

2014 నుంచి 2019 వరకు ఏపీలో విధ్వంసం

చంద్రబాబు సమక్షంలోనే అమిత్‌షా సంచలన వ్యాఖ్యలు



natural calamities strike, NDRF comes to the rescue, and when man-made calamities occur, the Narendra Modi government comes to the help. Shri Shah said that in the five years from 2014 to 2019 Andhra Pradesh has faced significant setbacks due to the man-made disaster, affecting the immense potential of the state. He said that to make up for the developmental losses during the period, Prime

ఏపీలో 2014-19 మధ్య మానవ తప్పిదాలతో విధ్వంసం సృష్టించారని అమిత్‌షా చెప్పిన విషయాన్ని ప్రెస్‌నోట్‌లోనూ స్పష్టంగా పేర్కొన్న పీఐబీ

సాక్షి, అమరావతి: 'అపార సహజ వనరులు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2019 వరకు విధ్వంసం సృష్టించారు. అది మానవ తప్పిదాలతో సృష్టించిన విధ్వంసం (మ్యాన్ మేడ్ డిజాస్టర్). దాంతో ఆ ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. అభివృద్ధి పూర్తిగా అడుగంటింది' అని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. గన్నవరం మండలం కొండపావులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమిత్ షా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో ఆ ఐదేళ్లలో జరిగిన విధ్వంసానికి మూడు రెట్లు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కాగా, అమిత్ షా హిందీ ప్రసంగాన్ని తెలుగులో అనువదించిన బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాత్రం చంద్రబాబుపట్ల స్వామి భక్తి ప్రదర్శించారు. అమిత్ షా ప్రసంగాన్ని తెలుగులోకి అనువదిస్తూ '2019 నుంచి ఐదేళ్లపాటు రాష్ట్రంలో జరిగిన విధ్వంసం' అని మార్చి చెప్పారు. అమిత్ షా 2014 నుంచి 2019 వరకు అని స్పష్టంగా ప్రసంగిస్తే... పురందేశ్వరి మాత్రం 2019 నుంచి ఐదేళ్లపాటు అని అనువదించారు. కానీ అమిత్ షా ప్రసంగాన్ని అధికారికంగా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వ సమాచార విభాగం 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో'(పీఐబీ) మాత్రం అసలు విషయాన్ని వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది. '2014 నుంచి 2019 వరకు మానవ తప్పిదం సృష్టించిన విధ్వంసంతో ఆంధ్రప్రదేశ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది' అని అమిత్ షా ప్రసంగించినట్టు ఆ ప్రకటనలో అధికారికంగా పేర్కొంది. మరోవైపు అమిత్‌షా నేరుగా హిందీలో చేసిన ప్రసంగం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మోదీ మనసులో ఉన్న మాటనే అమిత్ షా చెప్పారని పలువురు వ్యాఖ్యానించారు. అంటే చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంసం సృష్టించిందని, అది మానవ తప్పిదంతో జరిగిన విధ్వంసమేనని అమిత్‌షా చెప్పారని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు.

కోర్టుల్లో ఏఐ ప్రయోజనాలపై విశ్లేషణ అవసరం

- న్యాయస్థానాలు–మీడియా పరస్పర సహకారంతో పనిచేయాలి
- జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో న్యాయమూర్తులు



ప్రసంగిస్తున్న జస్టిస్ కురియన్ జోసెఫ్

విశాఖ–లీగల్: 'కోర్టులు–మీడియా పరస్పర సహకారం, సమన్వయంతో పని చేయాలి. జవాబుదారీతనంతో కూడిన పనితీరును ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలి' అని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపైనా విశ్లేషణ అవసరమని అభిప్రాయపడ్డారు. విశాఖపట్నంలోని ఏయూ కన్వెన్షన్ హాలులో రెండు రోజులుగా కొనసాగుతున్న సౌత్ జోన్–2 జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సు ఆదివారం ముగిసింది. చివరి రోజు 'జ్యుడీషియరీ అండ్ మీడియా, అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్ త్రూ ఎమెర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్' అనే అంశాలపై చర్చ నిర్వహించారు. ముందుగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన 'కోర్టులు–మీడియా పాత్ర' అనే అంశంపై చర్చ జరిగింది. రిసోర్స్ పర్సన్లుగా కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవన్ రామచంద్రన్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌషిమి భట్టాచార్య వ్యవహరించారు. అనంతరం 'అడ్వాన్సింగ్ జ్యుడీషియల్ గవర్నెన్స్'పై జస్టిస్ కురియన్ జోసెఫ్ అధ్యక్షతన చర్చ నిర్వహించారు. జస్టిస్ కురియన్ జోసెఫ్ మాట్లాడుతూ సమాచారాన్ని చేరవేయడంలో మీడియా పాత్ర, తీర్పులు, ఇతర కోర్టు ప్రొసీజరల్ అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర ఆవశ్యకతను న్యాయమూర్తులు తెలుసుకోవాలని, వినియోగంపై విశ్లేషణ చేసుకోవాలని సూచించారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవన్ రామచంద్రన్ మాట్లాడుతూ వ్యక్తిగత అభిప్రాయాలను వార్తలుగా రాయకూడదని, నిజాలను నిర్ధారించుకుని వాస్తవాలను వార్తలుగా ప్రచురించాలని సూచించారు. ట్రయల్ అంశాలను ముందుగా బహిర్గతం చేయకూడదని హితవుపలికారు. జస్టిస్ ఎం.సుందర్ కోర్టు వ్యవహారాల్లో ఏఐ పాత్ర గురించి వివరించారు. ఏఐ అనేది న్యాయమూర్తులకు సహకారిగా మాత్రమే ఉంటుందని, ప్రత్యామ్నాయం కాదని అభిప్రాయపడ్డారు. న్యాయమూర్తులు ఏఐ టెక్నాలజీని పరిగణనలోకి తీసుకోవచ్చని, కానీ.. దానినే తుది నిర్ణయంగా, అంతిమ ప్రామాణికంగా తీసుకోకూడదని పేర్కొన్నారు. జస్టిస్ ఏఎం ముస్తాక్యు మాట్లాడుతూ కేరళలో కోర్టు వ్యవహారాల నివేదికలను రూపొందించేందుకు ఏఐ, గూగుల్ నోట్‌బుక్ సాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సదస్సు ముగింపు సందర్భంగా ఏపీ జ్యుడీషియల్ అకాడమీ ప్రెసిడెంట్ జస్టిస్ రవినాథ్ తిల్హారీ వందన సమర్పణ చేశారు. విశాఖ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ, ఇతర సీనియర్ న్యాయమూర్తులుపాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు దావోస్‌కు పయనం

సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనకు బయలుదేరారు. ఆదివారం గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి దావోస్ వెళ్లే అధికారుల బృందంతో కలిసి ఆయన ఢిల్లీ చేరుకున్నారు. అర్ధరాత్రి 1.30 గంటలకు ఢిల్లీ నుంచి జ్యూరిచ్‌కు వెళ్లారు. సోమవారం ఉదయం జ్యూరిచ్‌లో జరిగే పలు సమావేశాల్లో సీఎం పాల్గొంటారు. పలువురు పారిశ్రామిక వేత్తలతో భేటీ అవుతారు. అనంతరం తెలుగు పారిశ్రామిక వేత్తలతో జరిగే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో జ్యూరిచ్ నుంచి దావోస్ వెళతారు. అక్కడ జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొంటారు.

చంద్రబాబుకు అమిత్ షా మందలింపు

- లోకేశ్ వసూళ్లతో ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డ పేరు
- కుమారుడిని అదుపులో పెట్టుకోవాలని హితవు
- వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబు




సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు క్విడ్ ప్రో కో కింద కాజేసిన కరకట్ట అక్రమ నిర్మాణంలో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా కు విందు ఇవ్వడం దారుణమని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆక్షేపించారు. తన కుమారుడు నారా లోకేశ్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వాలంటూ చంద్రబాబు ప్రాధేయ పడ్డారని చెప్పారు. దీనిపై అమిత్ షా అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. నారా లోకేశ్ అన్ని అంశాల్లో జోక్యం చేసుకుంటూ చేస్తున్న వసూళ్ల వల్ల ఎన్డీఏ ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మందలించారని తెలిపారు. అంతేకాకుండా లోకేశ్‌ను అదుపులో పెట్టుకోవాలని కూడా చంద్రబాబుకు హితవు పలికారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కేంద్రం జోక్యం చేసుకుని పరిష్కరించాల్సిన అనేక సమస్యలు నేటికీ అలాగే ఉన్నాయన్నారు. కేంద్ర మంత్రి హోదాలో అమిత్‌షా రాష్ట్రానికి వచ్చినప్పుడు ఈ సమస్యలపై ఆయనకు సీఎం చంద్రబాబు వివరిస్తారని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారని అందరూ ఆశించారని చెప్పారు. కృష్ణా జలాల సమస్య నేటికీ అపరిష్కృతంగానే ఉందన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు తెలంగాణ నుంచి రావాల్సిన బకాయిలను ఒక కొలిక్కి తీసుకువచ్చారని తెలిపారు. వీటన్నింటి గురించి మాట్లాడకుండా అమిత్ షా విందులో జరిగింది ఒకటైతే, దానిని బయటకు రానివ్వకుండా జగన్ నివాసాలపై చర్చ అంటూ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఎన్డీఏలో పవన్ కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేయడం వల్లే చంద్రబాబు అంగీకరించారని, ఇప్పుడు తన కుమారుడికి కూడా డిప్యూటీ సీఎం కావాలన్న కోరికను ఆయన ముందు వ్యక్తం చేశారని తమకు సమాచారం ఉందన్నారు. ఇందుకు అమిత్ షా విముఖత వ్యక్తం చేయడంతో.. ఆ విషయం బయటకు రాకుండా ఉండేందుకు ఈ విందులో వైఎస్ జగన్ నివాసాలపై చర్చ జరిగినట్లు ఎల్లో మీడియాలో అబద్ధపు కథనాలు రాయించారని ధ్వజమెత్తారు.

బాబూ... ఇందులో ఒక్కటైనా వచ్చిందా?

2014-19 మధ్య నాలుగుసార్లు చంద్రబాబు, ఒకసారి లోకేశ్ దావోస్ పర్యటన

భారీ పెట్టుబడులు ఆకర్షించామంటూ ఏటా కథనాలు ■ కానీ.. ఒక్క పెట్టుబడీ సాధించలేకపోయిన బాబు సర్కార్



సాక్షి, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణ అంటూ ఏటా స్విట్జర్లాండ్‌లోని దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు వెళ్లడం, దానికి అనుకూల మీడియా బాకా ఊదడం తెలిసిందే. విభజన తర్వాత రెండోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారిగా దావోస్ పర్యటనకు వెళుతున్న చంద్రబాబు అనుకూల మీడియాకు అదనంగా జాతీయ మీడియా ఎన్డీటీవీ, సీఎన్‌బీసీ టీవీ18, బిజినెస్ టుడే పత్రికలకు రూ.కోట్లు వెచ్చించి మరీ ప్రచారం చేయించుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ ప్రచారం మాట అటుంచి.. 2014–19 మధ్య దావోస్ పర్యటనల్లో ప్రకటించిన పెట్టుబడుల ఒప్పందాలు ఏమయ్యాయి.. ఇందులో ఒక్కటైనా మీకు గుర్తుందా బాబు అంటూ మేధావులు ప్రశ్నిస్తున్నారు. ప్రపంచంలోని కుబేరులతో ఫొటోలు తీయించుకుని ప్రచారం చేయించుకోవడమే కానీ.. దావోస్ పర్యటనలతో రాష్ట్రానికి ఏ ఒక్క ప్రాజెక్టయినా తీసుకొచ్చినట్టు చంద్రబాబు చెప్పగలరా... అని ప్రశ్నిస్తున్నారు. 2015 నుంచి 2018 వరకు వరుసగా నాలుగుసార్లు చంద్రబాబు దావోస్ పర్యటనకు వెళితే ఎన్నికల ఏడాది 2019లో అప్పటి ఐటీ మంత్రి నారా లోకేశ్ బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. మొత్తం దావోస్ పర్యటనకు రూ.55 కోట్ల వరకు ప్రజాధనం వ్యయం చేయగా, రూ.1 కోటి పెట్టుబడి కూడా రాలేదని అప్పటి దావోస్ పర్యటనలో పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారి దావోస్‌కు వెళ్లిన అప్పటి సీఎం చంద్రబాబు పదేళ్ల తర్వాత మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను కలుసుకోవడంతో పాటు సీఈవో సత్య నాదెళ్లతో చర్చలు జరిపామని, విశాఖలో బిజినెస్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నట్టు భారీగా ప్రచారం చేసుకున్నారు. ఆ ప్రకటన వచ్చి పదేళ్లయినా ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్ మన రాష్ట్రం వైపు చూడకపోగా తాజాగా సత్య నాదెళ్ల హైదరాబాద్ పర్యటనకు వచ్చి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వెళ్లారే కానీ.. మన రాష్ట్రం వైపు కన్నెత్తి చూడలేదు. అంతేకాదు ఇన్ఫోసిస్, విప్రో, డెలాయిట్, పెగా సిస్టమ్స్ ఇలా అనేక ఐటీ కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నట్టు ఊదరగొట్టారే కానీ.. ఒక్కటంటే ఒక్కటీ ఆయన హయాంలో తీసుకురాలేకపోయారు.

వైఎస్ జగన్ ఒకసారి పర్యటనతో రికార్డుస్థాయి ఒప్పందాలు

కేవలం రూ.11.9 కోట్ల వ్యయంతో 19 మంది అధికారుల బృందంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో 2022లో దావోస్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ సమావేశాల్లో రూ.1.26 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోవడమే కాకుండా వాటిని వేగంగా అమల్లోకి తీసుకురావడం ద్వారా రికార్డు సృష్టించారు. టెక్ మహీంద్రా సీఈవో సీపీ గుర్నానితో మర్యాదపూర్వక భేటీలో బయో ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆలోచన ఉన్నట్టు చెప్పగానే రాజమండ్రిలో స్థలం కేటాయించి రూ.200 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయడమే కాకుండా ఉత్పత్తిని కూడా ప్రారంభించారు. అలాగే రూ.60 వేల కోట్లతో అదానీ గ్రూపు గ్రీన్ ఎనర్జీ ప్లాంట్, గ్రీన్‌కో రూ.37 వేల కోట్లతో, అరబిందో రూ.28 వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్‌ల ఏర్పాటుకు దావోస్‌లో ఒప్పందం కుదుర్చుకుని వాటిని అమల్లోకి తీసుకువచ్చారు. ఎటువంటి ప్రచార ఆర్భాటం లేకుండా వైఎస్ జగన్ పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకువస్తే.. 2016లో టాటా గ్రూప్ చైర్మన్ సైరస్ మిస్త్రీ చంద్రబాబుతో భేటీ అయి తెలుగు పచ్చళ్లు, తెలుగు వంటలు గురించి చర్చించారని, ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడిగా ఉన్న కుటుంబరావు ఆంధ్ర పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన పాలకూర పప్పు, బెండ వేపుడిని పారిశ్రామికవేత్తలు మెచ్చుకుంటున్నారని ప్రచారం చేసుకోవడంతోనే సరిపోయిందని ఒక అధికారి వ్యాఖ్యానించారు.

2014-19 మధ్య దావోస్‌లో చంద్రబాబు పర్యటించి ప్రకటించిన కొన్ని ముఖ్యమైన పెట్టుబడుల ప్రకటనలు ఇవీ. ఇందులో ఒక్కటీ వాస్తవ రూపం దాల్చలేదు

2015లో
- మైక్రోసాఫ్ట్ ఫౌండర్ బిల్‌గేట్స్, సీఈవో సత్య నాదెళ్లతో సమావేశం
- విశాఖకు మైక్రోసాఫ్ట్‌తో పాటు ఇన్ఫోసిస్, విప్రో డేటా సెంటర్లు అంటూ ప్రకటన
- రాష్ట్రంలో భారీ హార్డ్‌వేర్ పరిశ్రమ ఏర్పాటుకు విదేశీ సంస్థ ముందుకొచ్చిందంటూ ప్రచారం

2106లో
- మియర్ బర్గర్, ఫిస్లోం సంస్థల సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్లు
- రూ.2 వేల కోట్లతో ఫెర్జి టెక్స్‌టైల్స్ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు
- ఇండానీ గ్లోబల్ గోల్డ్ రిఫైనరీతోపాటు నెస్లే, వెల్స్‌పన్ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి

2017లో
- ఐటీ, హెల్త్‌కేర్ రంగాల్లో జనరల్ అట్లాంటిక్ రూ.43 వేల కోట్ల పెట్టుబడులు
- విశాఖలో యూకేకి చెందిన ఇంటర్నేషనల్ హాస్పిటల్స్ 500 పడకల హాస్పిటల్ ఏర్పాటు
- విశాఖ ఫార్మాసిటీలో నోవార్టిస్ ఆర్ అండ్ డీ కేంద్రం ఏర్పాటు


2018లో
- కృష్ణపట్నం వద్ద సౌదీ ఆరామ్‌కో చమురు శుద్ధి కర్మాగారం
- గూగుల్, యాక్సెంచర్ డేటా సెంటర్లు రాష్ట్రంలో ఏర్పాటు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో హిటాచీ పెట్టుబడులు

2019లో
- జేఎస్‌డబ్ల్యూ రూ.3,500 కోట్ల పెట్టుబడుల ఒప్పందం
- డెలాయిట్, పెగా సిస్టమ్స్ రాష్ట్రంలో యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి

నాలుగు రకాల కుంభమేళాలు

4 సం.ల కొకసారి జరిగేది – కుంభమేళా
6 సం.ల కొకసారి జరిగేది – అర్ధ కుంభమేళా
12 సం.ల కొకసారి జరిగేది – పూర్ణ కుంభమేళా
12 సం.ల కొకసారి జరిగే పూర్ణ కుంభమేళాలు
12 సార్లు పూర్తయితే (144 సం.లకు) – మహా కుంభమేళా.

ప్రయాగ, హరిద్వార్, ఉజ్జయిని మరియు నాసిక్ ఈ నాలుగు పుణ్యక్షేత్రాలలో ఈ నాలుగు కుంభమేళాలు జరుగుతాయి. బృహస్పతి వృషభ రాశిలో ఉన్నప్పుడు ప్రయాగలో, కుంభ రాశిలో ఉన్నప్పుడు హరిద్వార్‌లో, సింహ రాశిలో ఉన్నప్పుడు ఉజ్జయిని మరియు నాసిక్‌లో కుంభమేళాలు జరుపుకుంటారు.



కుంభమేళాలో స్నానం ఎందుకు చేయాలి?

కార్తీకమాసంలో వెయ్యిసార్లు గంగాస్నానం, మాఘమాసంలో వంద సార్లు గంగాస్నానం, వైశాఖంలో నర్మదానదిలో కోటిసార్లు స్నానం చేస్తే ఎంత ఫలితం వస్తుందో, ప్రయాగలో కుంభమేళా జరిగే సమయంలో ఒక్కసారి స్నానంచేస్తే ఆ పుణ్యఫలాన్ని పొందవచ్చని స్కాందపురాణం చెబుతోంది.

నాగసాధువులు

ఆది శంకరాచార్యులవారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాధు,సంతు సమాజమును ఒక్క చోటికి చేర్చి,13 అఖారాలను ఏర్పరిచి సనాతన ధర్మరక్షక వ్యవస్థను ఏర్పరిచారు. తరువాత కాలములో అనేక ధర్మాచార్యులు ఈ వ్యవస్థను దశదిశలా విస్తరింపజేసారు. అటువంటి సాధువులలో కొందరిని నాగసాధువులని పిలుస్తారు. వీరు కుంభమేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. వీరికి శరీరంతో తాదాత్మ్యం ఉండదు. మనం జీవిస్తున్న సమాజానికి అతీతంగా ఉండే ఆ యోగుల తత్త్వం మనకు అంతుపట్టదు. అందుకే వారు మనకు సాధారణ సామాజిక జీవితంలో ఎదురుపడరు.

స్నానం చేసేటప్పుడు ఏం చేయాలి?

భక్తితో గంగను తలచుకుంటూ నదిలో మూడు మునకలు వేయాలి.
- పవిత్రమైన నదిని అపరిశుభ్రం చేయకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- స్నానం తరువాత దగ్గరలో ఉన్న ఆలయాలను దర్శించుకోవాలి.

కుంభమేళాకి పోలేనివారికి...

పురాణాలు, జ్యోతిష్యశాస్త్రం కుంభమేళాలో చేసే పవిత్ర స్నానవిశిష్టతను ఎంతో కీర్తించాయి. అయితే ఆరోగ్యరీత్యా, వయోభారంవల్ల అక్కడికి పోలేనివారు అక్కడినుంచి తెచ్చిన నీటిని తాము స్నానం చేసే నీటిలో కలుపుకొని స్నానం చేయవచ్చు. అదీ కుదరకపోతే తామున్న చోటే గంగానదీ పేరును తలచుకుని స్నానం చేయవచ్చు.

ఐక్యత మరియు ఏకత్వాల పండుగ కుంభమేళా. శాశ్వతమైన, అనంతమైన దివ్య స్వభావాన్ని కుంభమేళాలో అనుభవించగలం. నదీ ప్రవాహంలాగే జనప్రవాహం కూడా కుంభమేళా వైపు సాగి సముద్రంలో నదులు సంగమించినట్టు వివిధ ప్రదేశాలవారు ఏకమయ్యే సంగమస్థలం కుంభమేళా.

అందరి చూపు-కుంభమేళా వైపు

గత కొద్ది రోజులుగా ప్రయాగలో జరుగుతున్న మహాకుంభమేళా భారతదేశంలోని ప్రజలనే కాదు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రజల దష్టిని ఆకర్షిస్తోంది. పలు మతాలకు చెందినవారు కుంభమేళా కోసమే ఇక్కడికి వచ్చి, పవిత్ర స్నానం చేసి ఆనందపరవశులవుతున్నారు. భారతీయ ఆధ్యాత్మికత పట్ల ఆకర్షితులవుతున్నారు.

స్టీవ్ జాబ్స్ భార్య కుంభమేళాపై ఆసక్తితో కుంభమేళాలో ఉండే గురువులు సాధువుల వద్ద సనాతన ధర్మంలోని పలు అంశాలనుతెలుసుకుంటూ మోక్షమార్గాన్ని అన్వేషిస్తున్నారు. ఎంతోమంది విదేశీ పరిశోధకులు ఈ కుంభమేళాను ఆసక్తితో గమనిస్తున్నారు.

ఆధ్యాత్మిక ప్రపంచం

ప్రపంచం నలుమూలల నుంచి చేరుతున్న జన సందోహంతో అక్కడ నూతన ప్రపంచం ఏర్పడింది. కుంభమేళా కి వచ్చినవారు ముఖ్యంగా యువతరం ఈ వాతావరణాన్ని ఆసక్తిగా గమనిస్తోంది. ఆధ్యాత్మిక గురువుల నుంచి ఆసక్తిగా అనేక అంశాలను తెలుసుకుంటున్నారు యువత.

మహా కుంభమేళా

సంస్కృతి సంప్రదాయం మహా సమ్మేళనం



ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవం... సాంస్కృతిక-సామాజిక మేలుకలయిక దాదాపుగా 40కోట్లమంది పుణ్యస్నానాలు... నాగసాధువుల ప్రత్యేక ఆకర్షణ.

నీటి నుంచే ఈ సమస్త విశ్వాన్ని సృష్టించాడట సృష్టికర్త. అందుకే ప్రాణులన్నింటికీ నీరు తల్లిలాంటిదని చెబుతున్నాయి పురాణాలు. ఆ నీరే గలగలా పారే నదులుగా దర్శనమిస్తోంది. నదుల వల్లనే నాగరికతలు ఏర్పడ్డాయి. మనిషి మనుగడకు, సంస్కృతి సాంప్రదాయాలకు, వైభవానికి నదులు సాక్షి భూతంగా నిలిచాయి. వేదభూమిగా పిలిచే ఈదేశంలో ప్రవహించే నదులు తీర్థము అనే పేరుతో దైవస్వరూపాలుగా వర్ణించబడి, గంగా గోదావరి నర్మదా కావేరి మొదలైన పేర్లతో గౌరవింపబడుతున్నాయి. అలాంటి తీర్థాలెన్నో ఈ భూమిపై ప్రవహిస్తూ ఈ భూమిని దివ్యభూమిగా మారుస్తున్నాయి.

తీర్థం అంటే పుణ్యమైన, లేదా పవిత్రమైన నీరు అని అర్థం. అటువంటి తీర్థాలని సేవించి వాటిలో స్నానం చేస్తే పాపాలు తొలగి అంతఃకరణ శుద్ధి కూడా కలుగుతుంది. తీర్థాలన్నింటిలోకీ ప్రధానమైనది గంగానది. గంగా నదిని తలిచినా చాలు... సకల పాపాలు తొలగుతాయని మనకి పురాణాలు చెబుతున్నాయి. నదీజలాల్లో అమతత్వం ఉందని అవి రోగాలను నివారించి దీర్ఘాయుష్షను కలిగిస్తాయని యజుర్వేదంలో చెప్పబడింది.

'ఓ జలమా! పవిత్రమైన నీటితో మాకు తప్తి కలిగించు'' ''అప్స్వంతరమత మప్సుభేషజం'' అంటూ ప్రార్థించడం ఈ వేదంలోని పవిత్రభావన. నదీ స్నానంవల్ల శారీరక శుద్ధి, ఆయుర్వృద్ధి కలుగుతాయి.

మహాకుంభమేళా అంటే?

దేవతలు–రాక్షసులు క్షీరసాగరాన్ని చిలుకగా అందులోనుంచి అమతం పుట్టింది. శ్రీమహావిష్ణువు మోహినీ అవతారం ధరించి దేవతలకు అమతాన్ని పంచుతున్నప్పుడు దానినుంచి నాలుగు చుక్కలు హరిద్వార్‌లోని గంగానదిలో, ఉజ్జయినిలోని క్షిప్రా నదిలో, నాసిక్‌లోని గోదావరిలో, ప్రయాగలోని త్రివేణి సంగమంలో పడ్డాయి. జ్యోతిష్యశాస్త్రం సూచించిన కొన్ని ప్రత్యేకమైన రోజులలో, ఆయా ప్రదేశాలలోని నదుల్లో స్నానం చేయడం వల్ల మనం కూడా అలా పడ్డ ఆ అమతత్వాన్ని పొందవచ్చని పెద్దలు చెబుతారు. ఆ ప్రత్యేకమైన రోజులకే కుంభమేళ అని పేరు. కుంభమేళా సమయంలో అమృతస్నానం చేయడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. ఋగ్వేదంలో దీని ప్రస్తావన కనిపిస్తుంది.

దాస్యవిముక్తికి...

అమృతబిందువులు నేలపై పడటం వెనుక మరో పౌరాణిక కథనం కూడా ఉంది. గరుత్మంతుడు తన తల్లి దాస్యవిముక్తి కోసం అమృతాన్ని తేవలసిన అవసరం ఏర్పడింది. అలా అమృతాన్ని తెస్తున్న మార్గంలో నాలుగుచుక్కలు ఆ అమృతభాండం నుంచి నేల జారి నాలుగు పుణ్యతీర్థాలలో పడ్డాయి. ఆ ప్రదేశాలలోనే కుంభమేళాలను ఆచరిస్తున్నారు.



విస్తృత ఏర్పాట్లు-స్థానికులకు ఉపాధి

ప్రపంచం వ్యాప్తంగా కుంభమేళాకు తరలివస్తున్న ఆధ్యాత్మిక జిజ్ఞాసులందరినీ దష్టిలో పెట్టుకొని ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక వసతులతో ఏకంగా ఒక టెంట్ గ్రామాన్ని ఏర్పాటు చేసింది ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం. అందులోకి ప్రవేశిస్తే చాలు ఆధ్యాత్మిక ప్రపంచంలోకి కళ్ళ ముందర నిలబడుతుంది.

అనేక ఆధ్యాత్మిక సంస్థలు అక్కడికి వచ్చినటువంటి వారందరికీ లోటు లేకుండా ఉచితంగా అన్న ప్రసాదాలను అందజేస్తూ భక్తుల ఆకలిని తీరుస్తున్నాయి.

ఆధ్యాత్మికతోపాటు ఆర్థిక పరిపుష్టిని కూడా కలిగించనుంది కుంభమేళ. ప్రస్తుతం జరుగుతున్న కుంభమేళా కోసం సుమారుగా 7,500 కోట్లతో ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా కుంభమేళా జరిగినన్ని రోజులు సుమారు 2లక్షల కోట్ల మేర వ్యాపారం జరగనుందని ఆల్ ఇండియా ట్రేడర్స్ ఫెడరేషన్ అంచనా వేస్తోంది. దీని ద్వారా 30 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుంది.

కుంభమేళా టెంట్ గ్రామంలోకి ప్రవేశించినప్పటి నుండి వయోవద్ధులను, నడవలేని వారిని స్నాన ఘాట్ ల వరకు చేర్చేందుకు, నదీ మధ్యలోకి వెళ్లి వద్దకు వెళ్లి స్నానం చేయడానికి పడవ వారికి, తినుబండారాల దుకాణాల వారికి యాత్రికుల ద్వారా ఆదాయం కూడా బాగా సమకూరుతోంది.

యాత్రికుల భద్రత –పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపట్టింది. కోట్ల కొద్ది జనం వస్తోన్నా పరిశుభ్రత విషయంలో ఇబ్బందు లేమీ లేవని కుంభమేళాకు వెళ్లి స్నానం చేసిన వారు చెబుతున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఈ విషయంలో పర్యవేక్షణ చేస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారని వారంతా సంతోషం వెలిబుచ్చుతున్నారు.

జలమార్గాన్నీ క్రమబద్ధీకరిస్తోంది

సంగమ స్థలం వరకు ప్రయాణించే పడవల విషయంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. బోట్లతో నిరంతరం పోలీసులు నదిలో పహారా కాస్తు నదిలో పడవలు బోట్లు జామ్ ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ట్రైన్లు విమానాలు బస్సులు అన్నింటిలోనూ టికెట్లు దొరికే పరిస్థితి లేకపోవడంతో సొంత ఏర్పాట్లతో కుంభమేళాకి వెళుతున్న వారికి తగినట్టుగా పార్కింగ్ వ్యవస్థని ఏర్పాటు చేసింది.

ఆనందకరమైన వాతావరణంలో ఆధ్యాత్మిక అనుభూతితో కొత్త విషయాలను తెలుసుకున్నామన్న సంతప్తితో భక్తులు తిరుగు ప్రయాణమవుతున్నారు

– అప్పాల శ్యాంప్రణీత్ శర్మ
వేద పండితులు



ప్రయాగ ప్రత్యేకత

మకరే యే దివానాథే వృషగే చ బృహస్పతౌ।
కుంభయోగో భవేత్తత్ర ప్రయాగే చాతిదుర్లభః ॥

అంటే మాఘ అమావాస్యనాడు బృహస్పతి వృషభరాశిలో ఉన్నప్పుడు ప్రయాగలో కుంభపర్వం జరుగుతుంది. ప్రయాగలో మూడు కుంభస్నానాలు ఉన్నాయి. ఇక్కడ మొదటి కుంభస్నానం మకర సంక్రాంతి నుండి ప్రారంభమవుతుంది. రెండవ స్నానం మౌని అమావాస్య నాడు జరుగుతుంది. మూడవ స్నానం వసంత పంచమి రోజున జరుగుతుంది. ఈ మూడింటి కలయికే 'కుంభమేళా'.

సినిమా

ధనుష్ హానెస్ట్ రాజ్?



హిట్ ఫిల్మ్ 'సార్' (2023) (తమిళంలో 'వాతి') తర్వాత హీరో ధనుష్–దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో మరో మూవీ రానుందా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. దుల్కర్ సల్మాన్‌తో 'లక్కీ భాస్కర్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తీసిన వెంకీ అట్లూరి నెక్ట్స్ మూవీ ఎవరితో ఉంటుందనే చర్చ కొన్ని రోజులుగా ఇండస్ట్రీలో జరుగుతోంది. ఇటీవల సూర్యకు వెంకీ అట్లూరి ఓ కథ వినిపించారనే టాక్ తెరపైకి వచ్చింది. తాజాగా హీరో ధనుష్‌కు వెంకీ ఓ కథ వినిపించారట. ఈ కథకు ధనుష్ అంగీకారం తెలిపారని, ప్రస్తుతం ఈ స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దే పనిలో వెంకీ అట్లూరి ఉన్నారని భోగట్టా. అంతే కాదు... ఈ సినిమాకు 'హానెస్ట్ రాజ్' అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం. మరి... ధనుష్–వెంకీ అట్లూరిల కాంబినేషన్ రిపీట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

కేరళ కాలింగ్

కేరళ కాలింగ్ అంటున్నారు హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, హీరోయిన్ జాన్వీ కపూర్. ఈ ఇద్దరూ జంటగా హిందీలో 'పరమ్ సుందరి' అనే లవ్ స్టోరీ ఫిల్మ్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. తుషార్ జలోటా దర్శకత్వంలో దినేష్ విజన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. కాగా నెల రోజుల లాంగ్ షూటింగ్ షెడ్యూల్ కోసం సిద్ధార్థ్, జాన్వీ అండ్ టీమ్ కేరళ వెళ్లారని బాలీవుడ్ సమాచారం. ఈ షెడ్యూల్‌లో మేజర్ టాకీ పార్ట్, యాక్షన్ సీక్వెన్స్, ఓ లవ్ సాంగ్ చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట. ఇక ఈ సినిమాలో నార్త్ అబ్బాయి పరమ్ పాత్రలో సిద్ధార్థ్, సౌత్ అమ్మాయి సుందరి పాత్రలో జాన్వీ కపూర్ కనిపిస్తారు. రెండు విభిన్న సాంప్రదాయాలు, సంస్కృతులకు చెందిన ఓ అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటే ఏం జరిగింది? అన్నదే ఈ చిత్రకథ అని బాలీవుడ్ టాక్. 'పరమ్ సుందరి' సినిమాను ఈ ఏడాది జూలై 25న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు.



● సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్



● వరుణ్ తేజ్

ఈ తూరి నవ్వించేకి వస్తుండా

వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఓ ఇండో–కొరియన్ హారర్ కామెడీ చిత్రం రూపొందనుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. జనవరి 19 (ఆదివారం) వరుణ్ తేజ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌పై 'వెన్ హంటింగ్ టర్న్స్ హిలేరియస్' అనే ట్యాగ్‌లైన్ ఉంది. ఈ చిత్రం షూటింగ్‌ని మార్చిలో ప్రారంభించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు. ''కదిరి నరసింహ సామి సాచ్చిగా ఈ తూరి నవ్వించేకి వస్తుండా!' అంటూ ఈ సినిమాను ఉద్దేశించి, 'ఎక్స్'లో పేర్కొన్నారు వరుణ్ తేజ్. ఈ మూవీకి తమన్ సంగీతం అందించనున్నారు. వరుణ్ తేజ్ కెరీర్‌లోని హిట్ మూవీ 'తొలిప్రేమ' (2018) తర్వాత మళ్లీ ఈ హీరో సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ సినిమా కథనం రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందని, ఈ చిత్రానికి 'కొరియన్ కనకరాజు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని తెలిసింది.

ప్రేమంటే?

● భరత్ నారంగ్, సుమ, నవనీత్ శ్రీరామ్, ప్రియదర్శి



ప్రియదర్శి హీరోగా, ఆనంది, సుమ కనకాల ప్రధాన పాత్రల్లో నటించనున్న సినిమాకు 'ప్రేమంటే?' అనే టైటిల్ ఖరారైంది. 'థ్రిల్–యూ ప్రాప్తిరస్తు' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. నవనీత్ శ్రీరామ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, స్పిరిట్ మీడియా పతాకాలపై జాన్వీ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సీన్‌కి దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో రానా క్లాప్ ఇచ్చారు. ''నిర్మాతగా జాన్వీ నారంగ్‌కు ఇది తొలి సినిమా. సునీల్, భరత్ నారంగ్‌ల మార్గదర్శకత్వంలో జాన్వీ నారంగ్ కంటెంట్–బేస్డ్ సినిమా ప్రపంచంలోకి తన ప్రయాణాన్ని ప్రారంభించారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమా పూజా కార్యక్రమంలో సునీల్ నారంగ్, అభిషేక్ నామా, సుధాకర్ రెడ్డి, రామ్మోహన్ రావు, జనార్ధన్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సహ–నిర్మాత: ఆదిత్య మెరుగు.

అమ్మ బయోపిక్ రూపొందించాలన్నది నా డ్రీమ్ – వీకే నరేశ్



''సినీ పరిశ్రమలో విజయవంతంగా 52 ఏళ్లు పూర్తి చేసుకోవడం హ్యాపీగా ఉంది. వృత్తిపట్ల అంకితభావం, క్రమశిక్షణ, ప్రేక్షకాదరణ వల్లే ఇది సాధ్యపడింది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలకు, ప్రేక్షకులకు, ఫ్యాన్స్‌కు ధన్యవాదాలు చెబుతున్నా'' అని సీనియర్ నటుడు వీకే నరేశ్ అన్నారు. జనవరి 20న ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో వీకే నరేశ్ మాట్లాడుతూ– ''ఈ ఏడాది రిలీజైన 'గేమ్ చేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలు వందకోట్ల కలెక్షన్స్‌ను దాటడం మన సక్సెస్. ముఖ్యంగా 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం రూ. 300 కోట్లను దాటుతుందని విన్నప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. ఇందులో నేను చేసిన ముఖ్యమంత్రి పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకోవడం సంతోషంగా ఉంది. నా కెరీర్‌లో 2025 బిజీయస్ట్ ఇయర్. ఏకకాలంలో తొమ్మిది సినిమాల్లో నటిస్తున్నాను. వీటిలో'బ్యూటీ' అనే సినిమాలో లీడ్ రోల్ చేస్తున్నాను. ఈ ఏడాది రెండు పెద్ద కార్యక్రమాలనూ తీసుకున్నాను. 'సినిమా మ్యూజియమ్ అండ్ లైబ్రరీ అండ్ క్రియేటివ్ స్పేస్ ఫర్ యంగ్ పీపుల్' అనే కార్యక్రమాన్ని శ్రీమతి ఘట్టమనేని ఇందిరా దేవి గారి పేరుతో ప్రారంభించాం. అందులో విజయకృష్ణ మందిరం ఏర్పాటు చేయడం జరిగింది. నేను, పవిత్ర దీనిని ఓ మిషన్‌లా తీసుకుని కళాకారుల ఐక్య వేదిక సంస్థ పేరుపై ఏర్పాటు చేశాం. జంధ్యాల, కృష్ణ, విజయ నిర్మల గార్లు నా గురువులు. నాకు సినిమాల్లో ఓనమాలు నేర్పించిన జంధ్యాల గారిని చరిత్రలో ఒక భాగంగా ఉంచాలని ఆయన పేరుతో డబ్బింగ్, పోస్ట్ ప్రొడక్షన్ థియేటర్‌ను ప్రారంభించాం. రైటర్ సాయినాథ్‌గారి సహకారంతో ఆయనపై తయారు చేసిన పుస్తకాన్ని అమ్మగారి (దివంగత ప్రముఖ నటి–దర్శకురాలు విజయ నిర్మల) బర్త్ డే సందర్భంగా ఫిబ్రవరి 20న లాంచ్ చేస్తాం. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక విజయకృష్ణ అవార్డ్సని ఫ్యాన్స్ సమక్షంలో రిలీజ్ చేయబోతున్నాం. అమ్మ విజయ నిర్మలగారి బయోపిక్ చేయాలనే డ్రీమ్ ఉంది. అది నేనే రాయగలను. ఇక 'చిత్రం భళారే విచిత్రం, శ్రీవారికి ప్రేమలేఖ' చిత్రాలకు పార్టు 2 చేయాలని ఉంది'' అని అన్నారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

భయపెడుతూ నవ్విస్తుంది

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హిందీ చిత్రం 'భూల్ భులయ్యా 3' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



సాధారణంగా సినిమాలలో ఓ రెండింటికి ప్రత్యేక స్థానం ఉంటుంది. ఒకటి హ్యూమర్ అయితే మరొకటి హారర్ జోనర్. కానీ ఆ రెండూ కలిపి సినిమా తీస్తే అదే ఈ సినిమా 'భూల్ భులయ్యా 3'. ఇది 'భూల్ భులయ్యా' సిరీస్‌లో వచ్చిన మూడవ సినిమా. నిజానికి మొదటి భాగానికి, మిగతా రెండు భాగాలకి కథతో పాటు పాత్రధారులలో కూడా తేడా ఉంది. 'భూల్ భులయ్యా' మొదటి భాగం 'చంద్రముఖి' సినిమా ఆధారంగా తీసింది. కానీ మిగతా రెండు భాగాలను మాత్రం అదే థీమ్‌తో కాస్త విభిన్నంగా రూపొందించారు. ఇప్పుడు 'భూల్ భులయ్యా 3' సినిమా కథ విషయానికి వస్తే... 200 సంవత్సరాల క్రితం రక్తఘాట్ రాజ్యంలో జరిగిన కథ. అప్పటి రాజ కుటుంబం వల్ల జరిగిన సంఘటనలో మంజులిక అనే ఓ దెయ్యం కనిపిస్తుంది. ఈ దెయ్యాన్ని అదే రాజ్యంలోని అంతఃపుర గదిలో భద్రంగా బందిస్తారు ఆ రాజ్యానికి చెందిన రాజగురువు. 2024లో వారసత్వ సంపదగా ఆ అంతఃపురాన్ని ఓ హోటల్‌గా మార్చాలని రాజకుటుంబం వారసులు ప్రయత్నించగా బందీగా ఉన్న మంజులిక దెయ్యం బయటపడి వారిని చాలా ఇబ్బంది పెడుతుంది. ఆ విషయం చూసే ప్రేక్షకులకు గిలిగింతలు పెట్టిస్తుంది. ఈ మంజులికను కట్టడి చేయడానికి ఫేక్ మాంత్రికుడైన రూహాన్‌ను ఆ రాజ్యానికి తెప్పించుకుంటారు. రూహాన్ రక్తఘాట్‌కు వచ్చినప్పటి నుండి కథ అనేక మలుపులు తిరుగుతూ ఊహించని క్లైమాక్స్ ట్విస్ట్‌తో ముగుస్తుంది. ఈ సినిమాలో ముఖ్యంగా ముగ్గురి గురించి చెప్పుకోవాలి. అందులో మొదటగా హీరో రోల్ వేసిన కార్తీక్ ఆర్యన్... తన ఈజ్ ఆఫ్ యాక్టింగ్‌తో హారర్ ఎమోషన్‌ని కూడా హ్యూమర్ ఎమోషన్‌తో చక్కగా పలికించాడు. ఇక విశేష పాత్రలలో నటించిన నాటి తార మాధురీ దీక్షిత్, నేటి వర్ధమాన తార విద్యాబాలన్ వారి నటనతోనే కాదు అద్భుత నాట్యంతోనూ సినిమాని ప్రేక్షకులకు మరింత దగ్గర చేశారు. దర్శకుడు అనీస్ ఈ సినిమాని ఎక్కడా బోర్ కొట్టించకుండా ఓ పక్క భయపెడుతూ మరో పక్క గిలిగింతలు పెడుతూ ప్రేక్షకులను కదలనివ్వకుండా స్క్రీన్‌ప్లే నడిపాడు. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతున్న ఈ 'భూల్ భులయ్యా 3' వీకెండ్ వాచబుల్ మూవీ.

– ఇంటూరు హరికృష్ణ

చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు మేనేజర్‌గా హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కార్యదర్శి ఆర్. దేవ్‌రాజ్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. వచ్చే నెల 19 నుంచి జరగనున్న ఈ టోర్నీలో రోహిత్ శర్మ సారథ్యంలో భారత జట్టు బరిలోకి దిగనుంది. పాకిస్తాన్ ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో టీమిండియా ఆడే మ్యాచ్‌లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్వహించనున్నారు. 'టీమిండియాకు నన్ను మేనేజర్‌గా నియమించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆఫీస్ బేరర్లకు ధన్యవాదాలు. చాలా కాలం తర్వాత భారత జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించే అవకాశం హెచ్‌సీఏ అధికారికి లభించింది. ఇదో గొప్ప గౌరవంగా భావిస్తున్నాను' అని దేవ్‌రాజ్ అన్నారు. టీమిండియా మేనేజర్‌గా ఎంపికైన దేవ్‌రాజ్‌కు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుతోపాటు ఇతర సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



యువ భారత్ శుభారంభం

వెస్టిండీస్‌పై 9 వికెట్ల తేడాతో విజయం ● మెరిసిన జోషిత, పరుణిక ● మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్



జోషిత

కౌలాలంపూర్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన యువ భారత్ సంపూర్ణ ఆధిపత్యంతో పాయింట్ల ఖాతా తెరిచింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం జరిగిన పోరులో భారత జట్టు 9 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ మహిళల జట్టు 13.2 ఓవర్లలో 44 పరుగులకే కుప్పకూలింది. అసాబీ కలెండర్ (12), కెనికా కసర్ (15) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా... మిగతా వారు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ పరుణిక సిసోడియా 3 వికెట్లు తీయగా... జోషిత, ఆయుశి చెరో రెండు వికెట్లు పడగొట్టారు. విండీస్ ప్లేయర్లలో ముగ్గురు రనౌట్ రూపంలో వెనుదిరిగారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత జట్టు 4.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 47 పరుగులు చేసి విజయం సాధించింది. తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష (4) వేగంగా ఆడే క్రమంలో అవుట్ కాగా... కమలిని (16 నాటౌట్; 3 ఫోర్లు), సనిక (18 నాటౌట్; 3 ఫోర్లు) అజేయంగా మిగతా లాంఛనాన్ని పూర్తి చేశారు. జోషితకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. భారత్ తమ తదుపరి మ్యాచ్‌లో మంగళవారం ఆతిథ్య మలేసియాతో తలపడుతుంది.

శ్రీలంక ఘనవిజయం

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక జట్టు కూడా బోణీ కొట్టింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టు 139 పరుగుల తేడాతో మలేసియాను ఓడించింది. మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. దహమి సనేత్మ (52 బంతుల్లో 55; 5 ఫోర్లు) హాఫ్‌సెంచరీ సాధించగా... సంజన (13 బంతుల్లో 30; 6 ఫోర్లు), హస్సిక (28; 4 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం లక్ష్యఛేదనలో మలేసియా జట్టు 14.1 ఓవర్లలో 23 పరుగులకు ఆలౌటైంది. జట్టు మొత్తంలో ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేకపోయారు. దహమి సనేత్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.



భారత్ 'డబుల్' ధమాకా

ఖోఖో ప్రపంచకప్‌లో రెండు విభాగాల్లోనూ టైటిల్స్ సొంతం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన గ్రామీణ క్రీడ ఖోఖో తొలి ప్రపంచకప్ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు అదరగొట్టింది. మహిళల విభాగంతో పాటు పురుషుల విభాగంలోనూ భారత జట్టే విజేతగా అవతరించింది. తొలుత జరిగిన మహిళల ఫైనల్లో భారత జట్టు 78–40 పాయింట్ల తేడాతో నేపాల్ జట్టును ఓడించగా... పురుషుల ఫైనల్లో టీమిండియా 54–36 పాయింట్ల తేడాతో నేపాల్ జట్టుపైనే విజయం సాధించింది. భారత జట్టుకు చెందిన ప్రియాంక, ప్రతీక్ 'బెస్ట్ ప్లేయర్స్ ఆఫ్ ద టోర్నీ' అవార్డులు గెల్చుకున్నారు.



ఇంటివాడైన నీరజ్ చోప్రా

మాజీ టెన్నిస్ క్రీడాకారిణి హిమాని మోర్‌తో వివాహం



న్యూఢిల్లీ: భారత దిగ్గజ అథ్లెట్, స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఓ ఇంటివాడయ్యాడు. అత్యంత సన్నిహితుల సమక్షంలో జాతీయ మాజీ టెన్నిస్ క్రీడాకారిణి హిమాని మోర్‌తో రెండు రోజుల క్రితం నీరజ్ చోప్రా వివాహం జరిగింది. ఈ విషయాన్ని ఆదివారం నీరజ్ చోప్రా సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. పెళ్లి ఫొటోలను జతచేస్తూ 'జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభించాను' అని పోస్ట్ చేశాడు. హరియాణాకు చెందిన 27 ఏళ్ల నీరజ్ చోప్రా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించాడు. అంతేకాకుండా 2023 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, 2024 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజతం... 2018 జకార్తా, 2022 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో... 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో పసిడి పతకాలు సొంతం చేసుకున్నాడు. 2016లో ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం గెలిచి ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన నీరజ్ ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. నీరజ్ భార్య హిమాని మోర్ ప్రస్తుతం అమెరికాలోని న్యూ హాంప్‌షైర్ రాష్ట్రంలోని ఫ్రాంక్లిన్ పియర్స్ యూనివర్సిటీలో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ మాస్టర్స్ డిగ్రీ చేస్తోంది. 2012లో అండర్-14 జూనియర్ ఫెడ్ కప్‌లో భారత జట్టుకు ఆడిన హిమాని... 2017లో చైనీస్ తైపీలో జరిగిన వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లోనూ పోటీపడింది. అఖిల భారత టెన్నిస్ సంఘం నిర్వహించిన టోర్నీలలో కూడా ఆడింది. 2018లో ఆమె సింగిల్స్‌లో అత్యుత్తమంగా 42వ ర్యాంక్‌లో, డబుల్స్‌లో 27వ ర్యాంక్‌లో నిలిచింది. ఒకవైపు విద్యాభ్యాసం చేస్తూనే మరోవైపు ఆమె ప్రస్తుతం మసాచుసెట్స్‌లోని అమ్‌హెర్స్ట్ కాలేజీ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తోంది.

ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫలితాలు
తొలి టెస్టులో వెస్టిండీస్‌పై పాకిస్తాన్ ఘనవిజయం
మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'ఈడెన్'లో టీమిండియా సాధన



కోల్‌కతా: ప్రతిష్టాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత క్రికెట్ జట్టు... ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్ కోసం జోరుగా ప్రాక్టీస్ చేస్తోంది. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా బుధవారం ఈడెన్ గార్డెన్స్‌లో తొలి పోరు జరగనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం టీమిండియా హెడ్ కోచ్ గంభీర్ పర్యవేక్షణలో ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. గాయం కారణంగా ఏడాదికి పైగా జాతీయ జట్టుకు దూరమైన సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ ప్రాక్టీస్‌లో ఆకట్టుకున్నాడు. మూడు గంటలకు పైగా సాగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి, శుబ్‌మన్ గిల్, హార్దిక్‌పాండ్యా, హర్షిత్ రాణా, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ తదితరులు ప్రాక్టీస్ చేశారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఓఎన్‌జీసీలో 108 పోస్టులు

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కంపెనీ (ఓఎన్‌జీసీ).. ఇంజనీరింగ్ అండ్ జియోసైన్స్ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 108
» **పోస్టుల వివరాలు:** జియాలజిస్ట్ 05, జియోఫిజిసిస్ట్ (సర్ఫేస్) 03, జియోఫిజిసిస్ట్ (వేల్స్) 02, ఏఈఈ (ప్రొడక్షన్ మెకానికల్/ప్రొడక్షన్ పెట్రోలియం/ప్రొడక్షన్ కెమికల్/డ్రిల్లింగ్ పెట్రోలియం/మెకానికల్): 98.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో డిగ్రీ, ఎమ్మెస్సీ /ఎంటెక్, పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
» **వయసు:** జియాలజిస్ట్, జియోఫిజిసిస్ట్ జనరల్ /ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 27 ఏళ్లు, ఏఈఈ పోస్టులకు 26 ఏళ్లు ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.60,000– రూ.1,80,000
» **ఎంపిక ప్రక్రియ:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్‌దరఖాస్తు చివరి తేది:** 24.01.2025
» **పరీక్ష తేది:** 23.02.2025
» **వెబ్‌సైట్:** www.ongcindia.com

సుప్రీంకోర్టులో 90 ఉద్యోగాలు

భారత అత్యున్నత న్యాయస్థానం..సుప్రీంకోర్టు ఒప్పంద ప్రాతిపదికన లా క్లర్క్-కమ్-రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 90 » **పోస్టుల వివరాలు:** లా క్లర్క్-కమ్-రీసెర్చ్ అసోసియేట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ (లా), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.
» **వయసు:** 20 నుంచి 32 ఏళ్ల మించకూడదు
» **వేతనం:** నెలకు రూ.80,000
» **ఎంపిక ప్రక్రియ:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 07.02.2025
» **పరీక్ష తేది:** 9.03.2025
» **వెబ్‌సైట్:** www.sci.gov.in.

ఐపీపీబీలో మేనేజర్ పోస్టులు

కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఐపీపీబీ).. రెగ్యులర్/ఒప్పంద ప్రాతిపదికన అర్హులైన అభ్యర్థుల నుంచి పలు విభాగాల్లో మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

» **మొత్తం పోస్టులు:** 07
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్ 1, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ 1, సీనియర్ మేనేజర్ 3, చీఫ్ కంప్లైన్స్ ఆఫీసర్ 1, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ 1.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంసీఏ/ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.
» **ఎంపిక ప్రక్రియ:** ఆన్‌లైన్ టెస్టు, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.93,960– రూ.1,73,860.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా..
» **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 30.01.2025
» **వెబ్‌సైట్:** www.ippbonline.com.

ఎమ్ఓఈఎఫ్‌లో 22 ఉద్యోగాలు

న్యూఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ (ఎమ్ఓఈఎఫ్).. ఒప్పంద ప్రాతిపదికన అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.

» **మొత్తం పోస్టులు:** 22
» **పోస్టుల వివరాలు:** అసోసియేట్ (లీగల్-ఏ/బీ/సీ/డీ/ఈ/ఎఫ్/జీ).
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ (ఎల్ఎల్‌బీ/ఎల్ఎల్ఎం), పీజీ (ఎల్ఎల్ఎం) ఉత్తీర్ణతతో పాటు పోస్టును అనుసరించి నిర్ణీత పని అనుభవం కలిగి ఉండాలి.
» **వయసు:** 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ. 40,000– రూ.1,00,000
» **ఎంపిక ప్రక్రియ:** ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తు చివరి తేది:** 31.01.2025
» **వెబ్‌సైట్:** www.moef.gov.in

టాప్ ఇన్‌స్టిట్యూట్స్.. ఆఫర్లు అదిరే!

» ఐఐటీలు, నిట్‌లు, ట్రిపుల్ ఐటీల్లో ప్లేస్‌మెంట్స్
» గతానికి భిన్నంగా ఆకర్షణీయ పే ప్యాకేజీలు
» ఈ ఏడాది పుంజుకున్న క్యాంపస్ డ్రైవ్స్
» తొలి దశలోనే 90 శాతం మందికి ఆఫర్లు

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు.. సాంకేతిక విద్యా బోధనలో ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్స్! వీటిలో ప్రవేశం పొందితే కోర్సు చివరి సంవత్సరంలో ఉన్నప్పుడే.. క్యాంపస్ ఆఫర్లు అందుకోవచ్చు. సర్టిఫికెట్ చేతికొచ్చే సమయానికి కార్పొరేట్ కొలువులో కుదురుకోవచ్చనే అభిప్రాయం!! తాజాగా 2024-25 బ్యాచ్‌కు సంబంధించి ఐఐటీలు, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో.. క్యాంపస్ డ్రైవ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది క్యాంపస్ నియామకాల్లో సానుకూల పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు ఆకర్షణీయ ఆఫర్లు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ఈ ఏడాది టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో క్యాంపస్ డ్రైవ్స్, పే ప్యాకేజ్‌లు, టాప్ రిక్రూటర్స్, కంపెనీలు కోరుకుంటున్న నైపుణ్యాలు తదితర వివరాలు...


ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్

గతేడాది అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా.. క్యాంపస్ డ్రైవ్స్‌లో కొంత మందగమనం కనిపించింది. ఈ ఏడాది 2024-25 బ్యాచ్ విద్యార్థులకు అలాంటి ఆందోళన లేదు. ఇప్పటి వరకు కొనసాగిన డ్రైవ్స్‌లో.. అన్ని క్యాంపస్‌ల్లో ఆఫర్లు ఆశావహంగా ఉన్నట్లు ప్లేస్‌మెంట్స్ వర్గాలు చెబుతున్నాయి.

ఐఐటీ ఢిల్లీలో రూ.2.4 కోట్ల ప్యాకేజ్

✦ ఐఐటీ ఢిల్లీ క్యాంపస్ డ్రైవ్ తొలిదశలో రూ.2.4 కోట్ల ఆఫర్ అత్యధిక పే ప్యాకేజ్‌గా నిలిచింది. అంతర్జాతీయంగా పేరు గడించిన ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఈ ఆఫర్‌ను అందించినట్లు తెలుస్తోంది. ఈ క్యాంపస్‌లో మొత్తం 1,200 మంది విద్యార్థులు క్యాంపస్ డ్రైవ్స్‌కు నమోదు చేసుకోగా.. 95 శాతం మందికి ఉద్యోగాలు లభించాయి.

✦ ఐఐటీ కాన్పూర్‌లో తొలిదశ క్యాంపస్ డ్రైవ్స్‌లో 1,109 మందికి ఆఫర్లు అందాయి. ఈ క్యాంపస్‌లో కూడా గరిష్ట వేతనం రూ.1.9 కోట్లుగా నమోదైంది. అదే విధంగా సగటు వేతనం రూ.24 లక్షలుగా ఉంది.

✦ ఐఐటీ ఖరగ్‌పూర్ క్యాంపస్‌లో రూ.2.14 కోట్ల పే ప్యాకేజ్‌తో ఆఫర్ లభించింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో 2024-25 బ్యాచ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్‌తో కలిపి మొత్తం 800 మందికి ఆఫర్లు దక్కాయి.

✦ ఐఐటీ ముంబైలో అత్యధిక ప్యాకేజ్ రూ.2.2 కోట్లుగా నమోదైంది. సగటు వేతనం రూ.23.5 లక్షలుగా ఉంది.

✦ ఐఐటీ-చెన్నైలో రికార్డ్ స్థాయిలో రూ.4.3 కోట్ల ప్యాకేజ్‌తో ఆఫర్ లభించింది. అదే విధంగా మరో పది మంది విద్యార్థులకు రూ.1.4 కోట్లకు పైగా ప్యాకేజ్‌తో ఆఫర్లు దక్కాయి.

✦ ఐఐటీ రూర్కీ క్యాంపస్‌లో అత్యధిక వేతనం రూ.3.67 కోట్లుగా నమోదైంది. సగటు వేతనం రూ.23.5 లక్షలుగా ఉంది.

✦ ఐఐటీ-హైదరాబాద్, భువనేశ్వర్, రోపార్, మండిలలోనూ రూ.1.5 కోట్లు గరిష్ట వేతనంగా ఉందని, సగటు వేతనం రూ.22.5 లక్షలుగా నమోదైందని ఆయా ప్లేస్‌మెంట్ సెల్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎన్ఐటీల్లోనూ అదే హవా

✦ ఐఐటీల తర్వాత ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ ఎన్ఐటీ క్యాంపస్‌లలోనూ ఈ ఏడాది క్యాంపస్ ఆఫర్లు ఆశాజనకంగా, పే ప్యాకేజ్‌లు ఆకర్షణీయంగా ఉన్నట్లు సమాచారం.

✦ నిట్-జలంధర్‌లో అత్యధిక వేతనం రూ.52 లక్షలుగా నమోదైంది. ✦ నిట్-జైపూర్‌లో అత్యధిక వేతనం రూ.64 లక్షలుగా నమోదైంది. సగటు వేతనం రూ.13.9 లక్షలుగా ఉంది.

✦ నిట్-కురుక్షేత్ర క్యాంపస్‌లో సైతం గరిష్ట వేతనం రూ.61 లక్షలు కాగా సగటు వేతనం రూ.19.7 లక్షలుగా ఉంది.

✦ పలు నిట్ క్యాంపస్‌లలో క్యాంపస్ డ్రైవ్స్ ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని..ఫిబ్రవరి మొదటి వారానికి ఆఫర్లు,ప్యాకేజ్‌లపై స్పష్టత వస్తుందని ప్లేస్‌మెంట్ సెల్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ట్రిపుల్ ఐటీల జోరు

ట్రిపుల్ ఐటీలలోనూ ఈ ఏడాది క్యాంపస్ ఆఫర్ల జోరు కొనసాగుతోంది. ఇప్పటి వరకు నమోదైన గణాంకాల ప్రకారం-ట్రిపుల్ ఐటీ ఢిల్లీలో రూ.49 లక్షల గరిష్ట వేతనం నమోదైంది. ట్రిపుల్ ఐటీ డీఎం-కాంచీపురంలో అత్యధిక వేతనం రూ.32 లక్షలుగా, సగటు వేతనం రూ.12 లక్షలుగా ఉంది. ట్రిపుల్ ఐటీ లక్నోలో గరిష్ట వేతనం రూ.59 లక్షలుగా, సగటు వేతనం రూ.22.10 లక్షలుగా ఉంది. ట్రిపుల్ ఐటీ అలహాబాద్‌లో అత్యధిక వేతనం రూ.1.21 కోట్లుగా..సగటు వేతనం రూ.25.78 లక్షలుగా నమోదైంది.

డిమాండింగ్ జాబ్ ప్రొఫైల్స్

ఏఐ ఇంజనీర్, క్లౌడ్ ఆర్కిటెక్ట్స్, సైబర్ సెక్యూరిటీ ఎగ్జిక్యూటివ్, డేటా సైంటిస్ట్స్, అల్గారిథమ్ ఇంజనీర్స్, ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, డేటా ఇంజనీర్, డేటా లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్, ప్రొడక్ట్ మేనేజర్ వంటి పోస్ట్‌లకు డిమాండ్ నెలకొంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ సంస్థలు, ట్రేడింగ్ కంపెనీలు, ఈ-కామర్స్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్ సంస్థలు, ఐటీ కంపెనీల నుంచి ఈ ఆఫర్లు లభించాయి.

టాప్ రిక్రూటర్స్

క్యాంపస్ డ్రైవ్స్‌లో క్వాల్‌కామ్, టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, బార్‌క్లేస్, గ్రావిటేషన్ రీసెర్చ్, ఇంటెల్ ఇండియా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్, గోల్డ్‌మ్యాన్ శాచ్స్, గూగుల్, మైక్రాన్ టెక్నాలజీ వంటి అంతర్జాతీయ కంపెనీలతోపాటు బీపీసీఎస్, ఎన్‌పీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు సైతం టాప్ రిక్రూటర్లుగా నిలిచాయి.

స్కిల్స్ ఉంటేనే

కంపెనీలు కోడింగ్ నైపుణ్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టాయి. రిటెన్ టెస్ట్‌లు, టెక్నికల్ రౌండ్స్‌లో కోడింగ్ సంబంధిత స్కిల్స్‌ను పరిశీలించాయని ప్లేస్‌మెంట్ వర్గాలు పేర్కొన్నాయి. కోర్ ఇంజనీరింగ్, సర్క్యూట్ బ్రాంచ్‌లకు సంబంధించి ఏఐ, మెషిన్ లెర్నింగ్ ప్రమేయాలు, వాటిలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించాయని తెలిపారు.

కోర్ సెక్టార్.. ఓకే

ఈ ఏడాది కోర్ సెక్టార్‌లో సైతం నియామకాలు ఆశాజనకంగానే ఉన్నాయి. ఆటోమొబైల్, తయారీ, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు సంబంధించిన పలు సంస్థలు ప్లేస్‌మెంట్స్ డ్రైవ్స్‌కు వచ్చాయి. సర్వీస్ సెక్టార్ నుంచి ముఖ్యంగా బీఎఫ్ఎస్ఐ నుంచి పలు సంస్థలు క్యాంపస్ డ్రైవ్స్ చేపట్టాయి.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఐఐటీలకు దీటుగా రాణిస్తోంది.. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్.

ఈ ఇన్‌స్టిట్యూట్ అనుసరిస్తున్న బోధన, అభ్యసన విధానాలే ఇందుకు కారణమని చెబుతున్నారు. నిరంతరం లేబొరేటరీలు, రీసెర్చ్‌లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ.. ప్రాక్టికల్ నాలెడ్జ్ కల్పిస్తూ.. లెర్నింగ్ బై డూయింగ్ విధానాన్ని ట్రిపుల్ ఐటీ ,హైదరాబాద్ అనుసరిస్తోంది.

ప్లేస్‌మెంట్స్ హవా

✦ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో బీటెక్, ఎంటెక్ విద్యార్థులకు నూటికి నూరు శాతం మందికి ఆఫర్లు దక్కుతున్నాయి. ఈ ఏడాది అత్యధిక వేతనం రూ. 65 లక్షలు కాగా సగటు వేతనం రూ.31.49 లక్షలుగా ఉంది. సీఎస్ఈ బ్రాంచ్ విద్యార్థులకు రూ. 65 లక్షలు, ఈసీఈ బ్రాంచ్ విద్యార్థులకు రూ. 55.60 లక్షలతో అత్యధిక వార్షిక వేతనం లభించింది.

✦ గత మూడేళ్లలో ఇదే రీతిలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఆకర్షణీయ స్థాయిలో ప్లేస్‌మెంట్స్ నమోదయ్యాయి. 2023లో 349 మంది విద్యార్థులకు గాను 341 మందికి ఆఫర్లు లభించగా.. అత్యధిక వేతనం రూ.1.02 కోట్లుగా, సగటు వేతనం రూ.23.43 లక్షలుగా నమోదైంది. 2022లో బీటెక్ సీఎస్ఈ విద్యార్థులకు అత్యధిక వేతనం రూ.74 లక్షలు కాగా, సగటు వేతనం రూ.31 లక్షలుగా ఉంది.

బీటెక్‌తోపాటు మరెన్నో

బీటెక్ సీఎస్ఈ, బీటెక్ ఈసీఈతోపాటు బీటెక్ అండ్ ఎంఎస్ బై రీసెర్చ్ పేరుతో అయిదేళ్ల వ్యవధిలో డ్యూయల్ డిగ్రీ కోర్సులనూ ఈ ఇన్‌స్టిట్యూట్ ఆఫర్ చేస్తోంది. అదేవిధంగా లేటరల్ ఎంట్రీ విధానంలోనూ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. పీజీ స్థాయిలో ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ పద్ధతిలో ఎంఎస్ బై రీసెర్చ్, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులు ఉన్నాయి.

ప్రవేశాలు ఇలా

ఈ ఇన్‌స్టిట్యూట్ అందిస్తున్న బీటెక్, ఎంటెక్, ఎంఎస్ బై రీసెర్చ్ కోర్సుల్లో ప్రవేశానికి వేర్వేరు విధానాలను అనుసరిస్తున్నారు. బీటెక్ కోర్సులకు జేఈఈ మెయిన్ మార్కుల ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది. దీంతోపాటు అండర్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(యూజీఈఈ) పేరుతో ఇన్‌స్టిట్యూట్ సొంత ప్రవేశ పరీక్ష నిర్వహించి.. బీటెక్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. మరో విధానంలో ఇన్ఫర్మాటిక్స్, మ్యాథమెటిక్స్, సైన్స్, లింగ్విస్టిక్స్ ఒలింపియాడ్స్‌లో విజేతలు సైతం అడ్మిషన్ పొందొచ్చు. ప్రవాస భారతీయ విద్యార్థులకు డైరెక్ట్ అడ్మిషన్స్ ఫర్ స్టూడెంట్స్ అబ్రాడ్ విధానంలో ప్రవేశం కల్పిస్తారు. పీజీ కోర్సులకు ఇన్‌స్టిట్యూట్ సొంతంగా నిర్వహించే పీజీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్‌లో ర్యాంకు ఆధారంగా ప్రవేశం లభిస్తుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలంగాణ జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- సైన్స్ అండ్ టెక్నాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
423	109
76,619	23,203

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,630	△	292
డోజోన్స్	43,488	△	335
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,505	△	113
డాక్స్	20,903	△	248
షాంఘై	3,242	▽	6
నికాయ్	38,451	▽	121

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.20	87.22
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.30	107.10
€	యూరో	ఒకటి	87.92	90.53
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.21	55.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.76	54.95
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.95	65.62
SAR	సౌదీ రియాల్	ధామచుక	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	ధామచుక	22.62	24.41
¥	చైనా యువాన్	ధామచుక	10.91	12.73



బహుమతి పుచ్చుకుంటున్నారా..?

రూ.50,000కు మించితే పన్ను

సమీప బంధువులకు మినహాయింపు | యాజమాన్యం ఇచ్చే కానుకలపైనా పన్ను | ఇందుకు చట్టంలో స్పష్టమైన వివరణ

పెళ్లి, నామకరణం.. వేడుక ఏదైనా బోలెడన్ని బహుమానాలు వచ్చి పడుతుంటాయి. ఉద్యోగుల పనితీరుకు మెచ్చి యాజమాన్యాలు సైతం పలు రూపాల్లో ఉచిత కానుకలు అందిస్తుంటాయి. నగదు రూపంలో లేదా వస్తు రూపంలో లేదా పర్యటనల రూపంలో ఈ ప్రయోజనాలు ఉండొచ్చు. ఇలాంటి బహుమతులన్నీ ఆదాయపన్ను పరిధిలోకి వస్తాయన్నది వాస్తవం. ఈ విషయంలో చట్టంలో పలు మినహాయింపులు కూడా ఉన్నాయి. వీటిని తెలుసుకుంటే వచ్చిన కానుకలను చట్టబద్ధం చేసుకోవచ్చు. ఇవి తెలియకపోతే ఆదాయపన్ను విభాగం నుంచి తర్వాత సమస్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఈ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించే కథనం ఇది.

– సాక్షి, బిజినెస్‌డెస్క్

బహుమానం ఎవరి నుంచి వచ్చిందన్న దానితో సంబంధం లేదు. దాని విలువ రూ.50,000కు మించకుండా ఉంటే ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఒకవేళ ఈ బహుమానం స్నేహితులు, లేదా ఇతరుల నుంచి అందుకుంటే, దాని విలువ రూ.50,000కు మించి ఉంటే ఆ మొత్తంపై తప్పకుండా పన్ను చెల్లించాలి. ఒకవేళ ఈ బహుమానం విలువ రూ.50,000కు మించి ఉన్నా సరే.. దాన్ని సమీప బంధువుల నుంచి అందుకుంటే ఎలాంటి పన్ను వర్తించదని ఆదాయపన్ను చట్టం చెబుతోంది. రూ.50,000 వరకు పన్ను మినహాయింపు ఒక ఆర్థిక సంవత్సరానికే పరిమితం. అంటే ఒకే సారి కాకుండా, ఏటా రూ.50,000 విలువకు మించకుండా బంధువులు కాని వారి నుంచి బహుమతి స్వీకరించడం ద్వారా పన్ను లేకుండా చూసుకోవచ్చు.



ప్రత్యేక మినహాయింపులు

పెళ్లి సందర్భంగా బంధు మిత్రుల నుంచి వివిధ రూపాల్లో కానుకలు వస్తుంటాయి. విలువతో సంబంధం లేకుండా ఇలాంటి వన్నీ కూడా పన్ను మినహాయింపు కిందకే వస్తాయి. బంగారం, వస్త్రాలు, ప్రాపర్టీలు, షేర్లు, బాండ్లు.. ఇలా బహుమతి ఏదైనా, ఎంత విలువ అయినా పెళ్లి సమయంలో అందుకుంటే పన్ను పడదు. వీలు నామా ద్వారా సంక్రమించిన కానుకలు



(ఆస్తులు/మరేవైనా) లేదా వారసత్వంగా సంక్రమించిన ఆస్తులపైనా లేదా ఒకరి మరణంతో దానంగా సంక్రమించే వాటికి కూడా బహుమతి పన్ను మినహాయింపు ప్రయోజనం వర్తిస్తుంది. గిఫ్ట్ ట్యాక్స్‌ను మొట్టమొదటగా 1958 ఏప్రిల్‌లో ప్రవేశ పెట్టారు. దీన్ని 1998లో రద్దు చేశారు. అనంతరం ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 56(2) కింద బహుమతి పన్నును ప్రవేశపెట్టారు. విలువతో కూడిన ఏ బహుమానం అయినా, అది ఏ రూపంలో ఉన్నా ఈ సెక్షన్ కింద పన్ను పరిధిలోకి వస్తుంది. బహుమతి స్వీకరించిన వారికే పన్ను బాధ్యత. ఇచ్చిన వారిపై ఉండదు.

సమీప బంధువులు ఎవరు?

చట్టంలో 'రిలేటివ్' (బంధువు)కు వివరణ ఉంది. భార్య లేదా భర్త; తల్లి దండ్రులు; అమ్మ వైపు అమ్మమ్మ, తాతయ్య; నాన్న వైపు నాయనమ్మ, తాతయ్య; భార్య లేదా భర్త వైపు సహోదరులు; తల్లి, తండ్రి తోడబుట్టిన వారు.. వీరంతా బంధువు కిందకే



వస్తారు. సెక్షన్ 56 ప్రకారం మరింత వివరంగా చెప్పుకోవాలంటే..? భార్యకు భర్త, భర్తకు భార్య బంధువే. వీరిలో ఒకరి సోదరులు, సోదరీమణులు మరొకరికి బంధువే అవుతారు. సోదరుడు, సోదరుడి భార్య, అలాగే సోదరి, సోదరి భర్తను కూడా చుట్టంగానే చట్టం పరిగణిస్తోంది. తండ్రి లేదా తల్లి తోడబుట్టిన వారు, వారి జీవిత భాగస్వాములు సైతం (అత్త, మామ, బాబాయి, పిన్ని) బంధువులే అవుతారు. అలాగే భార్య తన భర్త తండ్రి (మామ), తల్లి (అత్త) నుంచి, ఆ అత్తా మామల తల్లిదండ్రుల నుంచి తీసుకునే కానుకలు.. ఇదే మాదిరి భర్త తన భార్య తల్లిదండ్రులు (అత్త, మామ), ఈ అత్తా మామల తల్లిదండ్రుల నుంచి పొందే కానుకల విలువ ఎంత ఉన్నా చట్టం పరిధిలో పన్ను చెల్లించక్కర్లేదు.

కానుకలు అన్నీ ఒక్కటేనా?

ఉచితంగా ఇచ్చేవి ఏవైనా సరే కానుకల కిందకే వస్తాయి. వాస్తవ విలువలో కొంత మొత్తాన్ని తీసుకుని ఇచ్చినా చట్ట పరిధిలో బహుమతి అవుతుంది. బంగారం కావచ్చు. లేదా భూమి, ఫ్లాట్, ఆభరణాలు, కళాకృతులు (స్థిర, చరాస్తులు), గృహోపకరణాలు, ఇతర వస్తువులు ఏవైనా సరే చట్టం పరిధిలో బహుమతే అవుతుంది. నగదు రూపంలో వచ్చే బహుమానం విషయంలో, విలువ ఎంతన్న దానిపై గందరగోళం ఉండదు. కానీ, బంగారం లేదా షేర్లు, లేదా భూములు తదితర కానుకల విలువ నిర్ణయించే విషయంలో నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. అంటే వీటికి చట్టపరిధిలో విలువను ఖరారు చేయాలి. లిస్టెడ్ కంపెనీల షేర్లు అయితే బహుమతి ఇచ్చే నాటికి ఉన్న ధరను పరిగణనలోకి తీసుకుంటారు. భూమి, ఫ్లాట్, ప్లాట్ తదితర స్థిరాస్తిని రూపాయి కూడా తీసుకోకుండా బహుమతి కింద ఇస్తే.. ఆ ప్రాపర్టీ స్టాంప్ డ్యూటీ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. ఒకవేళ స్థిరాస్తిని (భూమి/భవనం) ఉచితంగా కాకుండా, మార్కెట్ విలువ కంటే తక్కువకు బహుమతి కింద ఇచ్చారని అనుకుందాం. అటువంటప్పుడు స్వీకర్త చెల్లించిన మొత్తం, స్టాంప్ డ్యూటీ విలువ నుంచి తీసివేసిన తర్వాత, దాని విలువ రూ. 50,000 కంటే ఎక్కువ ఉంటే అప్పుడు మొత్తం స్టాంప్ డ్యూటీలో 10 శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. ఉదాహరణకు ఎక్స్ అనే వ్యక్తి వై అనే వ్యక్తికి రూ.10 లక్షల ప్రాపర్టీని రూ. 5లక్షలు తీసుకుని బహుమతి కింద ఇచ్చారని అనుకుందాం. ఆ ప్రాపర్టీ స్టాంప్ డ్యూటీ విలువ రూ.8 లక్షలు ఉంది. ఈ కేసులో మార్కెట్ విలువ రూ.8 లక్షల నుంచి, స్వీకర్త చెల్లించిన రూ.5 లక్షలు మినహాయించగా, మిగిలిన రూ.3లక్షలు.. రూ.50,000 పరిమితిని దాటింది. కనుక ఈ కేసులో స్టాంప్ ట్యూటీ విలువ రూ.8



లక్షల్లో 10 శాతం అంటే.. రూ.80,000పై పన్ను చెల్లించాల్సి వస్తుంది. ఇక ఆభరణాలు, పెయింటింగ్‌లు, శిల్పాలు తదితర చరాస్తులను బహుమతిగా పొందినప్పుడు, వాటి ఫెయిర్ మార్కెట్ ప్రైస్ (సహేతుక మార్కెట్ ధర) రూ.50,000 మించితే, ఆ మొత్తంపై పన్ను చెల్లించాలి. ఒకవేళ సహేతుక మార్కెట్ ధర కంటే తక్కువ మొత్తానికి కానుకగా పొందారనుకుంటే.. అప్పుడు సహేతుక మార్కెట్ ధర నుంచి, చెల్లించిన ధర తీసివేయగా మిగిలిన వ్యత్యాసంపై పన్ను చెల్లించాలి. స్థిరాస్తిని రూపాయి కూడా చెల్లించకుండా ఉచిత బహుమతిగా పొందితే, విడిగా ప్రతి లావాదేవీకి రూ.50,000 పరిమితి వర్తిస్తుందని ఆదాయపన్ను శాఖ జారీ చేసిన ఎఫ్ఏక్యూ స్పష్టం చేస్తుంది. దీని ఆధారంగా ఎక్స్ అనే వ్యక్తి ఒక ఆర్థిక సంవత్సరంలో మూడు స్థిరాస్తులను బహుమతిగా స్వీకరించాడని అనుకుందాం. విడిగా ప్రతి ప్రాపర్టీ స్టాంప్ డ్యూటీ విలువ రూ.50,000 మించి లేదు. ఇలాంటప్పుడు పన్ను చెల్లించాల్సిన బాధ్యత ఏర్పడదు. హెచ్‌యూఎఫ్‌లకు కూడా ఇదే వర్తిస్తుంది.

తప్పకుండా వెల్లడించాల్సిందే..

సమీప బంధువులు, బంధువులు కాని వారి నుంచి బహుమతులు అందుకున్నా కానీ, ఈ వివరాలను ఆదాయపన్ను రిటర్నుల్లో వెల్లడించాల్సిందే. 'ఎగ్జెంప్ట్ ఇన్‌కమ్' షెడ్యూల్ కింద వివరాలు తెలియజేయాలి. ఉచిత బహుమతులే అయినప్పటికీ, వీటిని భవిష్యత్తులో విక్రయించినప్పుడు మూలధన లాభాల పన్ను బాధ్యత ఎదురవుతుంది. కనుక బహుమతుల స్వీకరణను ఐటీఆర్‌లో తప్పకుండా వెల్లడించడం ద్వారా భవిష్యత్తులో సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. అంతేకాదు గిఫ్ట్ స్వీకరణకు సంబంధించి ఆధారాలను సైతం జాగ్రత్తగా పదిలపరుచుకోవాలి. భవిష్యత్తులో ఆదాయపన్ను శాఖ అధికారులు వివరాలు కోరితే ఇవ్వడానికి ఉంటుంది. విలువైన, ఖరీదైన బహుమతుల విషయంలో స్టాంప్ పేపర్‌పై గిఫ్ట్ డీడ్ రాసుకోవాలన్నది నిపుణుల సూచన. ఆదాయపన్ను శాఖ అధికారుల నుంచి పిలుపు వస్తే నిరూపించుకునేందుకు ఆధారంగా పనికొస్తుంది. ''పన్ను పరిధిలోకి రాని బహుమతుల వివరాలు వెల్లడించేందుకు ప్రస్తుత ఐటీఆర్ షెడ్యూల్స్‌లో నిబంధనల్లేవు. అయినా కానీ, రక్షణాత్మక ధోరణితో



వాటిని 'షెడ్యూల్ ఎగ్జెంప్ట్ ఇన్‌కమ్' కింద వెల్లడించడం సూచనీయం''అని ఇండస్ లా పార్ట్‌నర్ శృతి కె.పి సూచించారు. అన్ని ఐటీఆర్ పత్రాల్లోనూ షెడ్యూల్ ఈఐ ఉంటుంది. కనుక ఆదాయ వనరుల ఆధారంగా ఐటీఆర్‌ను ఎంపిక చేసుకుని, అందులో బహుమతుల వివరాలు వెల్లడించాలి. తల్లిదండ్రుల నుంచి బహుమతి తీసుకున్నప్పుడు, వారి ఆదాయ వనరుల గురించి ఆదాయపన్ను శాఖ అధికారులు ప్రశ్నించే అవకాశం లేకపోలేదు.

గిఫ్ట్ ద్వారా ఆదాయం..

- నామకరణం, ఇతర సందర్భాల్లో పిల్లల పేరిట కూడా బహుమతులు సంక్రమిస్తుంటాయి. అలాంటి బహుమతులపై వచ్చే ఆదాయం వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయానికి కలుస్తుంది.
- కొంత మంది పన్ను భారం తప్పించుకోవచ్చన్న ఉద్దేశంతో.. ప్రాపర్టీపై తమకు వస్తున్న అద్దె ఆదాయాన్ని తమ పిల్లలు లేదా మనవళ్లు/మనవరాళ్లకు (బంధువులు) ఏ నెలకానెల బహుమతి కింద ఇచ్చేస్తుంటారు. చట్టం దీన్ని బహుమతిగానే పరిగణిస్తుంది. కానీ, దీనికంటే ముందు బహుమతిగా ఇస్తున్న వ్యక్తి వార్షిక ఆదాయానికి అద్దె ఆదాయం కలుస్తుందని మర్చిపోవద్దు. అంటే చట్ట ప్రకారం సంబంధిత అద్దె ఆదాయాన్ని తమ వార్షిక రిటర్నుల్లో చూపించి, పన్ను పరిధిలోకి వస్తే పన్ను చెల్లించాల్సిందే.
- తల్లిదండ్రులు కొందరు తమ పిల్లల పేరిట బ్యాంక్ ఖాతా తెరిచి అందులో నగదు డిపాజిట్ చేస్తుంటారు. తల్లిదండ్రులు తమ ఆదాయంపై పన్ను చెల్లిస్తారు. కానీ, ఇలా మైనర్ పేరిట చేసిన డిపాజిట్‌పై వచ్చే ఆదాయం సం



బంధిత తల్లితండ్రి లేదా సంరక్షకుల వార్షిక ఆదాయానికి కలుస్తుంది. డిపాజిట్‌ను బహుమతిగా చూపించినప్పటికీ.. చిన్నారులు తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉంటారు. వారికి ఏ విధమైన ఆదాయం ఉండదు. కనుక ఆ బహుమతులపై ఆదాయం వారి తల్లిదండ్రుల ఆదాయానికే కలుస్తుంది.
- ఒకవేళ ప్రత్యేక నైపుణ్యాలు, మరేదైనా స్టార్టప్ రూపంలో చిన్నారులు సంపాదిస్తుంటే వారి వ్యక్తిగత ఆదాయమే అవుతుంది. అలాంటి కేసుల్లో చిన్నారుల తరఫున తల్లిదండ్రులు రిటర్నులు వేసి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. తల్లిదండ్రుల ఆదాయానికి కలిసే విషయంలో.. దంపతులు ఇద్దరూ సంపాదనా పరులైతే వారిలో ఎక్కువ ఆర్జించే వారికి ఇది కలుస్తుంది.
- ఉదాహరణకు షేర్లను పిల్లలకు గిఫ్ట్‌గా ఇస్తే, వాటిపై వచ్చే డివిడెండ్ తల్లిదండ్రుల ఆదాయానికే కలుస్తుంది.

యాజమాన్యం నుంచి బహుమతులు



మన దేశంలో ప్రైవేటు యాజమాన్యాలు తమ ఉద్యోగులకు పలు సందర్భాల్లో బహుమతులు ఇస్తుంటాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఇచ్చే బహుమతుల విలువ రూ.5,000 మించకపోతే, దానిపై పన్ను చెల్లించక్కర్లేదు. నగదు, గిఫ్ట్ వోచర్, ఈ–వోచర్, ప్రీపెయిడ్‌కార్డ్ ఇలా ఏ రూపంలో ఉన్నా, వాటి విలువ రూ.5,000 మించితే ఆ మొత్తం వేతన ఆదాయానికి కలిపి చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ''ఒక ఆర్థిక సంవత్సరంలో యాజమాన్యం చెల్లించే అన్ని రకాల బహుమతుల విలువ రూ.5,000 మించితే అది పూర్తిగా పన్ను పరిధిలోకి వస్తుంది''అని బీడీవో ఇండియా పార్ట్‌నర్ (ట్యాక్స్) ప్రీతి శర్మ తెలిపారు.

ఎంత పన్ను చెల్లించాలి?



ఆదాయపన్ను చట్టం ప్రకారం పన్ను మినహాయింపుల్లేని కేసుల్లో.. ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న కానుకల విలువను ఇతర ఆదాయం (ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్సెస్) కింద చూపించాల్సి ఉంటుంది. అంటే సంబంధిత ఆర్థిక సంవత్సరంలో వారి మొత్తం ఆదాయానికి ఇది తోడవుతుంది. శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఒకవేళ సంబంధిత ఆర్థిక సంవత్సరంలో వారి ఆదాయం బేసిక్ పన్ను మినహాయింపు (పాత విధానంలో రూ.2.5 లక్షలు, కొత్త విధానంలో రూ.3 లక్షలు) పరిధిలోనే ఉండి, బహుమానం విలువ కలిపిన తర్వాత కూడా బేసిక్ పరిమితి దాటకపోతే.. అప్పుడు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం రాదు. ఒక్కో బహుమతికి విడిగా రూ.50,000 పరిమితి వర్తించదని, ఒక ఆర్థిక సంవత్సరంలో అందుకున్న అన్ని బహుమతులకు (నిబంధనల మేరకు) రూ.50,000 పరిమితి వర్తిస్తుందని మనీఎడ్యుస్కూల్ వ్యవస్థాపకుడు ఆర్ణవ్ పాండా తెలిపారు.

స్మాల్‌క్యాప్ ఫండ్ పరిమాణం పెరిగితే..?

ఒక స్మాల్‌క్యాప్‌ఫండ్ పరిమాణం (నిర్వహణలోని ఆస్తులు/ఏయూఎం) పెరిగే కొద్దీ దాని పనితీరుపై ప్రభావం పడుతుందా? – ఊర్మిళా సాను

స్మాల్‌క్యాప్ పథకాలు పెద్దగా మారే క్రమంలో.. బలమైన పనితీరు కారణంగా అవి మరింత పెట్టుబడులను ఆకర్షించడం సహజంగానే చూస్తుంటాం. ఈ పరిణామం వినూత్నమైన సవాళ్లను తెచ్చి పెడుతుంది. దీనిపై ఇన్వెస్టర్లలో అవగాహన ఉండాలి. స్మాల్‌క్యాప్ ఫండ్స్ రూ.1,000–2,000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీల్లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తుంటాయి. రూ.100–200 కోట్ల ఏయూఎం నిర్వహించే స్మాల్‌క్యాప్ ఫండ్స్ తమకు ఆకర్షణీయం అనిపించిన కంపెనీల్లో చెప్పుకోతగ్గ మేర ఎక్స్‌పోజర్ తీసుకుంటాయి. కానీ, వాటి ఏయూఎం సైజు పెరుగుతున్న కొద్దీ అదే మాదిరి పెట్టుబడులు సవాలుగా మారతాయి. ఉదాహరణకు రూ.200 కోట్ల ఏయూఎం నిర్వహించే ఒక స్మాల్‌క్యాప్ ఫండ్ రూ.1,000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలో ఏకంగా 5 శాతం పెట్టుబడులు పెట్టగలదు. లేదా రూ.10 కోట్లు ఇన్వెస్ట్ చేయగలదు. ఇలా రూ.10 కోట్ల పెట్టుబడితో తన పనితీరుపై, లిక్విడిటీపై పెద్దగా ప్రభావం లేకుండా చూసుకోగలదు. ఒకవేళ స్మాల్‌క్యాప్ ఫండ్ ఏయూఎం రూ.2,000 కోట్లకు పెరిగితే, అప్పుడు ఒక కంపెనీలో 5 శాతం ఎక్స్‌పోజర్ కోసం రూ.100 కోట్లు కేటాయించాల్సి వస్తుంది. రూ.1,000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన చిన్న కంపెనీల్లో రూ.100 కోట్ల పెట్టుబడి అంటే 10 శాతానికి సమానం. అంత చిన్న కంపెనీలో 10 శాతం సమానమైన వాటాలను విక్రయించాల్సి వచ్చినప్పుడు కొనుగోలుదారులను గుర్తించడం కష్టం (లిక్విడిటీ సమస్య) కావచ్చు. ఎందుకంటే స్మాల్‌క్యాప్ కంపెనీలు తక్కువ వ్యాల్యూమ్‌తో ట్రేడ్ అవుతుంటాయి. మితిమీరిన వైవిధ్యం కనుక లిక్విడిటీ సమస్య రాకుండా ఫండ్ మేనేజర్లు మరిన్ని స్టాక్స్‌లో పెట్టుబడులను వైవిధ్యం చేస్తుంటారు. దీనివల్ల రిస్క్ తగ్గుతుంది. కానీ, మొత్తం మీద రాబడులు ప్రభావితం అవుతాయి. స్మాల్‌క్యాప్ ఫండ్స్ అసాధారణ రాబడుల పనితీరుతో ఇన్వెస్టర్ల నుంచి మరింత భారీగా పెట్టుబడులు వచ్చి పడుతుంటాయి. దీంతో ఆయా పథకాల సైజు మరింత పెరిగే రిస్క్ ఉంటుంది. ఇది భవిష్యత్ పనితీరుపై ప్రభావం చూపించొచ్చు. అదే సమయంలో స్మాల్‌క్యాప్ ఫండ్ పెట్టుబడులు రాబట్టుకోవడంలో విఫలమైతే, కోల్పోయే రిస్క్ కూడా ఉంటుంది. స్మాల్‌క్యాప్ ఫండ్ ఏయూఎం పెరగడాన్ని ప్రతికూలంగా చూడక్కర్లేదు. పెరిగిపోతున్న ఏయూఎం విషయమైన వాటికంటూ ప్రత్యేకమైన పెట్టుబడుల వ్యూహం ఉండొచ్చు. కనుక ఇన్వెస్టర్లు ఫండ్స్ ఏయూఎం కాకుండా, వాటి పనితీరుపై దృష్టి సారించడమే నయం.



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

సిప్ ద్వారా దీర్ఘకాల పెట్టుబడుల్లో 50% నుంచి 60% మేర స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా..? – ఉమేష్

ఈక్విటీల్లో దీర్ఘకాల పెట్టుబడులకు (సిప్) పదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం అనుకూలం. అయితే, 50–60 శాతం పెట్టుబడులను మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవడం సూచనీయం కాదు. దీనికి బదులు ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచిది. ఇలా చేస్తే మిడ్, స్మాల్‌క్యాప్ పెట్టుబడులు 25–30 శాతానికి పరిమితం అవుతాయి. లార్జ్‌క్యాప్ పెట్టుబడులు 70 శాతం మేర ఉంటాయి. వృద్ధికితోడు, స్థిరత్వాన్ని ప్రదర్శించే స్టాక్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. రిస్క్ ఎక్కువగా ఉండే సాధనాలకు తక్కువ కేటాయింపులు చేసుకోవాలి. మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీలు తీవ్ర అస్థిరతల మధ్య చలిస్తాయి. అధిక అస్థిరతలు ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో అధిక రాబడులు కోరుకుంటే అప్పుడు ఫ్లెక్సీక్యాప్‌తోపాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
20-1-2025	
విశాఖ	505–00
చిత్తూరు	503–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505–00
విజయవాడ	510–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	480–00
వరంగల్	482–00
రిటైల్ ధర	5.40

స్టాక్స్ వ్యూ

హెచ్‌పీ ఎలక్ట్రిక్ | బ్రోకరేజ్: ఆనంద్ రాఠీ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 517 **టార్గెట్:** రూ. 710

ఎందుకంటే: మల్టీప్రొడక్ట్ ఎలక్ట్రిక్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ హెచ్‌పీ ఎలక్ట్రిక్ అండ్ పవర్ దేశీయంగా కార్యకలాపాలు విస్తరించింది. విభిన్న లోవోల్టేజీ ఎలక్ట్రిక్ ప్రొడక్టులను రూపొందిస్తోంది. ఈ జాబితాలో మీటరింగ్ సొల్యూషన్లు, స్విచ్‌గేర్లు, లైటింగ్ ప్రొడక్టులు, వైర్లు, కేబుళ్లు, సోలార్ సొల్యూషన్లు, మాడ్యులర్ స్విచ్‌లు తదితర పలు ప్రొడక్టులున్నాయి. కంపెనీ ప్రధానంగా రెండు విభాగాలలో కార్యకలాపాలు కొనసాగిస్తోంది. మీటరింగ్ అండ్ సిస్టమ్స్, కన్జూమర్ అండ్ ఇండస్ట్రియల్ విభాగాలలో ప్రొడక్టులు,



సొల్యూషన్లు అందిస్తోంది. మీటరింగ్ బిజినెస్‌లో స్మార్ట్ మీటర్, నెట్ మీటర్, ప్రీపెయిడ్ మీటర్, ట్రివెక్టర్ మీటర్‌తోపాటు పలు ఇతర మీటర్లను క్లయింట్లకు సమకూర్చుతోంది. కంపెనీకిగల పటిష్ట ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియోకుతోడు సుప్రసిద్ధ క్లయింట్ల దన్నుతో ఆకర్షణీయ ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉంది. తద్వారా ప్రస్తావించదగ్గ స్థాయిలో లాభదాయకతను సాధిస్తోంది. ఈ సానుకూలతల కారణంగా రానున్న రెండేళ్లలో వార్షిక ప్రాతిపదికన కంపెనీ ఆదాయం 21 శాతం, నిర్వహణ లాభం 28 శాతం చొప్పున వృద్ధి చూపగలవని భావిస్తున్నాం. ఈ బాటలో నికర లాభం మరింత అధికంగా 64 శాతం చొప్పున జంప్‌చేసే వీలున్నట్లు అంచనా వేస్తున్నాం. మెరుగైన నిర్వహణ సామర్థ్యం, బలపడుతున్న రిటర్న్ రేషియోల నేపథ్యంలో కంపెనీ షేరుకి నెమ్మదిగా ఆకర్షణ పెరిగే అవకాశముంది.

శ్రీరామ్ పిస్టన్స్ | బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,960 **టార్గెట్:** రూ. 2,950

ఎందుకంటే: ఆటో విడిభాగాల కంపెనీ శ్రీరామ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ టీజీపీఈఎల్ ప్రెసిషన్ ఇంజినీరింగ్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి గతేడాది ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీ హైప్రెసిషన్ ఇంజక్షన్ మోల్డ్స్‌సహా ఇతర విడిభాగాలను సైతం రూపొందిస్తోంది. డెట్ ఫ్రీ, క్యాష్ ఫ్రీ పద్ధతిలో రూ. 220 కోట్ల ఎకనమిక్ విలువకు టీజీపీఈఎల్‌ను అనుబంధ సంస్థ ద్వారా శ్రీరామ్ సొంతం చేసుకుంది. శ్రీరామ్ ఆదాయంలో టీజీపీఈఎల్ వాటా 4 శాతమే అయినప్పటికీ వ్యూహాత్మకంగా కీలకమైన కొనుగోలుగా పేర్కొనవచ్చు. నాన్‌ఇంజిన్ విడిభాగాలను మినహాయించి ఇతర విభాగాలలో



ఆదాయ పెంపునకు దారి చూపనుంది. ఇంజినేతర విభాగ ఆదాయం ప్రస్తుత 11 శాతం నుంచి 15 శాతానికి బలపడనుంది. తేలికపాటి విడిభాగాలకు పెరుగుతున్న డిమాండ్ ద్వారా లబ్ధి పొందేందుకు వీలుంది. ఈ విభాగం అధిక వృద్ధి బాటలో సాగుతోంది. 20–23 శాతంలో నమోదవుతున్న నిర్వహణ లాభ మార్జిన్లు 20 శాతం ఆర్‌వోసీఈ కలిగిన టీజీపీఈఎల్‌ను సహేతుక ధరలో కొనుగోలు చేయడం శ్రీరామ్ పిస్టన్స్‌కు సానుకూల అంశంగా పరిగణించవచ్చు. నిలకడైన వృద్ధి అవకాశాలు, పటిష్ట క్యాష్ ఫ్లో, మెరుగైన రిటర్న్ రేషియోలు, ఆటో పరిశ్రమలో చోటుచేసుకుంటున్న డైవర్సిఫికేషన్ శ్రీరామ్ పిస్టన్స్‌కు లబ్ధిని చేకూర్చగలవు. ఐసీఈల నుంచి ఎలక్ట్రిక్ వాహనాలవైపు ఆటో పరిశ్రమ పరిగెడుతున్న సంగతి తెలిసిందే.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్‌కు కార్పొరేట్ ఫలితాలు, ట్రంప్ ప్రమాణ స్వీకారం కీలకం | ఆటో ఎక్స్‌పో.. స్పందన అదరహో

ఏజ్ ఇక్కడ జస్ట్ నంబరే

వందేళ్ల వయస్సులోనూ వ్యవసాయ పనులు.. • ఆ పల్లెల్లో ఆరోగ్య సిరులు.. సిరిధాన్యాల ఆహారమే ఆరోగ్య రహస్యం

దరి చేరని బీపీ, షుగర్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు • కొనసాగుతున్న పాత పంటల జాతర

సంగారెడ్డి జిల్లాలోని సిరిధాన్యాల సాగు గ్రామాల్లో 'సాక్షి'ఫీల్డ్ విజిట్

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి / జహీరాబాద్: జీవన విధానం, ఆహారపు అలవాట్లలో మార్పులతో నేడు మూడు పదుల వయసు వచ్చేసరికే బీపీ, షుగర్, గుండె సంబంధ ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. పట్టణాలు, నగరాల్లో ఈ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కానీ, కొన్ని గ్రామీణ ప్రాంతాలు నేటికీ ఆరోగ్య సిరులతో విలసిల్లుతున్నాయి. పది పదుల వయసు దాటిన వృద్ధులు సైతం నవయువకుల్లా పనులు చేసుకుంటున్నారు. తమ ఆహారపు అలవాట్లే అందుకు కారణమని వారు చెబుతున్నారు.

చిరు ధాన్యం మహాభాగ్యం

డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) స్వచ్ఛంద సంస్థ 4 దశాబ్దాలుగా జహీరాబాద్ ప్రాంతంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. ఝరాసంగం, రాయికోడ్, న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలాల్లోని సుమారు 40 గ్రామాల్లో 5 వేల మంది మహిళా రైతులను సంఘటితం చేసి సేంద్రియ విధానంలో చిరుధాన్యాలను సాగు చేసేలా ప్రోత్సహిస్తోంది. కొర్రలు, సామలు, అండుకొర్రలు, పచ్చ జొన్నలు, సాయిజొన్నలు, కంది, మినప, పెసర వంటి పంటలు సుమారు రెండు వేల ఎకరాల్లో సాగు చేయిస్తున్నారు. ఇందులో పోట్‌పల్లి, మోడ్ తండా గ్రామాలూ ఉన్నాయి. ఎన్నో పోషక విలువలు కలిగిన ఈ సిరిధాన్యాల (మిల్లెట్స్)ను సాగు చేయడంతో పాటు, వాటినే నిత్యం ఆహారంగా తీసుకుంటున్న ఆ గ్రామాల వాసులు సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం కొనసాగిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఏటా జరిగే పాత పంటల జాతర నేపథ్యంలో ఝరాసంఘం మండలం పోట్‌పల్లి, జహీరాబాద్ మండలం మోడ్ తండా గ్రామాల్లో 'సాక్షి'బృందం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి.

కుండలలో పలు రకాల చిరుధాన్యాలతో పాతపంటల జాతరకు హాజరవుతున్న మహిళా రైతులు



పాత పంటల జాతర

ఈ ప్రాంతంలో ఏటా నిర్వహించే పాత పంటల జాతర ఈ నెల 14న న్యాల్‌కల్ మండలంలోని వడ్డీ గ్రామం నుంచి ప్రారంభమైంది. ఫిబ్రవరి 11న ఝరాసంగం మండలం మాచ్‌నూర్‌లో ముగుస్తుంది. జాతర 24 గ్రామాల్లో జరగనుంది. ఎడ్ల బండ్లలో చిరుధాన్యాలను ప్రదర్శిస్తూ వాటి ప్రాధాన్యత గురించి ఈ జాతరలో ప్రచారం చేస్తున్నారు.

విలేజ్ ప్రొఫైల్స్..

గ్రామం: పోట్‌పల్లి (ఝరాసంఘం మండలం, సంగారెడ్డి జిల్లా)
జనాభా: **2,263**
ప్రధాన వృత్తి: వ్యవసాయం (సుమారు 90 శాతం)
బీపీ, షుగర్ ఉన్న వారు సుమారు పదిమంది లోపే..

గ్రామం: మోడ్ తండా (జహీరాబాద్ మండలం, సంగారెడ్డి జిల్లా)
జనాభా: **192**
ప్రధాన వృత్తి : వ్యవసాయం
బీపీ, షుగర్ ఉన్న వారు కేవలం ఇద్దరే.



ఈయన పేరు బోంగూరు స్వామి దాసు. సంగారెడ్డి జిల్లా పోట్‌పల్లికి చెందిన స్వామిదాసు వయసు 75 ఏళ్లు. దశాబ్దాలుగా తన పొలంలో పాత పంటలు (మిల్లెట్స్) సాగు చేస్తూ, వాటినే ఆహారంగా తీసుకుంటుండటంతో ఎలాంటి అనారోగ్యం లేకుండా ఇప్పటికీ తన పనులు తానే చేసుకుంటున్నానని చెబుతున్నారు. కొర్రబువ్వ, జొన్నరొట్టెను ఆహారంగా తీసుకుంటున్నానని చెప్పారు.



వందేళ్ల వయసు దాటిన ఈయన పేరు గర్యానాయక్. భార్య జాలీబాయికి కూడా తొంభై ఏళ్లు ఉంటాయి. మోడ్ తండాకు చెందిన ఈ దంపతులు ఇప్పటికీ స్వయంగా మేకలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్ననాటి నుంచి పచ్చజొన్న, సాయిజొన్న, సజ్జరొట్టెలు, తైద అంబలి, కంది, మినప పప్పు తినడమే తమ ఆరోగ్య రహస్యమని చెబుతున్నారు.



ఇంటి ముందు సానుపు (కల్లాపి) చల్లుతున్న ఈ వృద్ధురాలు మన్నెల్లి దానమ్మ. సుమారు 70 ఏళ్ల వయసున్న ఈమెకు సంతానం లేదు. ఇప్పటికీ తన పని తాను చేసుకుంటోంది. చిన్నప్పటి నుంచి కొర్రబువ్వ, సామలు, తైద అంబలి, సాయిజొన్న రొట్టెలు తినటం వల్లనే ఇప్పటికీ ఆరోగ్యంగా ఉన్నట్లు చెబుతోంది.

వారికి రోగాలు తక్కువే..

పోట్‌పల్లి, ఎల్గొయ్ గ్రామాల్లో వ్యాధుల బారిన పడినవారి సంఖ్య చాలా తక్కువ. వీరు నిత్యం జొన్నరొట్టె, కందిపప్పుతో పాటు, కొర్రలు, సామలు తింటుంటారు. అందుకే వయసు మీదపడినా ఆరోగ్యంగా ఉంటున్నారు.

- ఆలీస్, ఏఎన్ఎం, ఎల్గొయ్ సబ్ సెంటర్

అత్తల నుంచి కోడళ్లకు బదిలీ

చిరుధాన్యాల సాగును ముందుకు తీసుకెళ్లేందుకు అత్తల నుంచి కోడళ్లకు వ్యవసాయాన్ని బదిలీ చేయించుకున్నాము. వేయి మందికి పైగా కోడళ్ల సంఘంలో సభ్యులు ఉన్నారు. భూమి కౌలుకు తీసుకుని మూడు ఎకరాల్లో సాయిజొన్న పంట వేసుకున్నా.

-మొగులమ్మ, పోట్‌పల్లి, కోడళ్ల సంఘం అధ్యక్షురాలు



అడ్మిట్ కార్డులు రెడీ

- జేఈఈ మెయిన్స్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఈ నెల 22 నుంచి 30 వరకు పరీక్షలు.. రాష్ట్రంలోని 17 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు
- 12 లక్షల మంది వరకు హాజరయ్యే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకూ జరిగే జేఈఈ మెయిన్స్‌కు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఈ ఉమ్మడి ప్రవేశ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అందుబాటులోకి తెచ్చింది. పరీక్ష కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తొలి సెషన్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్టీఏ వెల్లడించింది. గత ఏడాది ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 12 లక్షల మంది హాజరయ్యారు. ఈసారి కూడా దాదాపుగా అంతే సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 2 లక్షల మంది ఆన్‌లైన్ విధానంలో జేఈఈ మెయిన్స్ రాయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 పట్టణాల్లో పరీక్ష ఉంటుంది. 22, 23, 24 తేదీల్లో పేపర్-1 (బీఈ, బీటెక్‌లో ప్రవేశానికి) ఉంటుంది. 28, 29, 30 తేదీల్లో పేపర్-2 (బీఆర్క్, ప్లానింగ్‌లో ప్రవేశానికి) ఉంటుంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ఒక షిఫ్ట్, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకూ మరో షిఫ్ట్ ఉంటుందని ఎన్టీఏ వెల్లడించింది. అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవచ్చని తెలిపింది. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరని స్పష్టం చేసింది.

పెరగనున్న సీట్లు

దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో ఈసారి బీటెక్ సీట్లు పెరిగే వీలుంది. కొత్త కోర్సులు, ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తేనుండటంతో కనీసం 5 వేల సీట్లు పెరుగుతాయని అధికార వర్గాలు అంటున్నాయి. దేశంలోని 31 ఎన్ఐటీల్లో ప్రస్తుతం 24 వేల సీట్లున్నాయి. ట్రిపుల్ ఐటీల్లో 8,500 సీట్లు ఉన్నాయి. ఎన్ఐటీల్లోని 50% సీట్లు సొంత రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో చేరాలంటే మెయిన్స్ కీలకం. ఇక మెయిన్స్ ర్యాంక్ ఆధారంగా మే 18న జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ సంఖ్య 2.5 లక్షలుగా ఉంటుంది. జాతీయ ఇంజనీరింగ్ సంస్థల్లో సీట్లు పెరుగుతున్న నేపథ్యంలో రెండో దఫా పరీక్షకు ఈసారి విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ఈసారి చాయిస్ ఎత్తివేత

బీఆర్క్‌కు ఏటా 50 వేలకు మించి దరఖాస్తులు రావడం లేదు. కరోనా సమయం నుంచి సెక్షన్ 'బీ'లో చాయిస్ ఇస్తున్నారు. కానీ ఈసారి చాయిస్ ఉండదు. ఈ సెక్షన్‌లో ఐదు ప్రశ్నలే ఇస్తారు. సెక్షన్ ఏ, బీలో మైనస్ మార్కులు ఉంటాయని ఎన్టీఏ తెలిపింది. ఇద్దరు అంతకన్నా ఎక్కువ మందికి సమాన స్కోర్ వస్తే తక్కువ మైనస్ మార్కులు వచ్చిన వ్యక్తికి ప్రాధాన్యత ఇస్తారు.

అడ్మిట్ కార్డులు కీలకం

విద్యార్థులకు ఎన్టీఏ కొన్ని సూచనలు చేసింది. జామెట్రీ బాక్స్, పెన్సిల్ బాక్స్, హ్యాండ్‌బ్యాగ్, పర్సు, పేపర్, పుస్తకాలు, మొబైల్, మైక్రోఫోన్, ఇయర్ ఫోన్స్, కెమెరా, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచీలు, స్కేల్, ఆల్గారిథమ్ బుక్, మెటల్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష పూర్తయ్యాక ఇన్విజిలేటర్ నుంచి అనుమతి వచ్చే వరకూ గదిలోనే ఉండాలి. కీలకమైన అడ్మిట్ కార్డులో మూడు పేజీలుంటాయి. సెంటర్ వివరాలు, సెల్ఫ్ డిక్లరేషన్ ఫారమ్, ముఖ్యమైన సూచనలు, ఇతర వివరాలు మూడో పేజీలో ఉంటాయి.

కిటకిటలాడిన ఎన్‌హెచ్ 65



చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు సెలవులు ముగియడంతో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ ఏర్పడింది. చౌటుప్పల్‌లో ఆదివారం వారాంతపు సంత కూడా ఉండడంతో హైవేపై మరింతగా రద్దీ ఏర్పడింది. దీంతో ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు జంక్షన్ల వద్ద ప్రత్యేకంగా పోలీసులను నియమించారు.

చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై బారులుదీరిన వాహనాలు

తెలుగు సంస్కృతిని పరిరక్షించుకోవాలి

త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పిలుపు

మణికొండ (హైదరాబాద్): తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలను పరిరక్షించుకోవటంతో పాటు వాటిని ప్రోత్సహించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి అన్నారు. మన యువతరాన్ని తెలుగు మార్గదర్శకులుగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో తెలుగు సంగమం వ్యవస్థాపకుడు, బీజేపీ జాతీయ నాయకుడు పి.మురళీధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు సంగమం సంక్రాంతి సమ్మేళనం-2025లో ఆయన మాట్లాడారు. సొంతూళ్లకు దూరంగా స్థిరపడిన వారు తిరిగి తమ మూలాలను తెలుసుకోవటం, సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వెళ్లడం మంచి పద్ధతని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. వాటిని ప్రోత్సహించేలా తెలుగు సంగమం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.





కార్యక్రమంలో పాల్గొన్న ఇంద్రసేనారెడ్డి, మురళీధర్, రాజేంద్రప్రసాద్, కిషన్‌రెడ్డి

రాబోయే తరాలు తమ భాషను నిలబెట్టుకునేందుకు, ప్రోత్సహించేందుకు తెలుగు సమాజం సమష్టి బాధ్యత తీసుకోవాలన్నారు. చిత్ర పరిశ్రమలో తన ప్రయాణానికి తెలుగు భాష మూల స్తంభంగా నిలిచిందని నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఫుల్ రష్

సాక్షి, హైదరాబాద్: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏటేటా ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరుగుతోంది. గతేడాది శంషాబాద్ విమానాశ్రయం ద్వారా 2.78 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు చేశారు. అత్యధికంగా డిసెంబర్‌లో 27.05 లక్షల మంది దేశ, విదేశాలకు ప్రయాణాలు చేశారు. రాకపోకల్లో ఏటా 20 శాతం వృద్ధి నమోదవుతున్నట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ డేటా తెలిపింది. నెలవారీ ప్రయాణికుల రద్దీ డైనమిక్ ట్రెండ్‌ను గమనిస్తే... జనవరిలో 21.81 లక్షల మంది, ఫిబ్రవరిలో 20.77 లక్షలు, మార్చిలో 22.16 లక్షలు, ఏప్రిల్‌లో 21.96 లక్షలు, మేలో 23.91 లక్షలు, జూన్‌లో 22.23 లక్షలు, జూలైలో 22.66 లక్షలు, ఆగస్టులో 23.30 లక్షలు, సెప్టెంబర్‌లో 22.61 లక్షలు, అక్టోబర్‌లో 24.95 లక్షలు, నవంబర్‌లో 25.32 లక్షల మంది ప్రయాణించినట్లు వెల్లడైంది. డిసెంబర్‌లో 27.05 లక్షల మంది ప్రయాణికులతో శంషాబాద్ విమానాశ్రయం రికార్డు సృష్టించింది..

అడవిలో ఒక రోజు

ఉత్సాహంగా బర్డ్‌వాక్



సర్పెంట్ ఈగల్



ఉల్‌నెక్‌డ్ బర్డ్స్

జన్నారం: అపురూపమైన జంతువులు.. అరుదైన విహంగాలను తిలకిస్తూ.. అందమైన అడవిలో అణువణువూ కలియతిరుగుతూ.. ప్రకృతి సోయగాల్ని కెమెరాల్లో బంధిస్తూ సాగిపోయారు పక్షి ప్రేమికులు. మంచిర్యాల జిల్లా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో ఆదివారం బర్డ్ వాక్ ఉత్సాహంగా సాగింది. జిల్లా అటవీశాఖ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు రేంజ్ అధికారి సుష్మారావు బర్డ్‌వాక్ నిర్వహించారు. హైదరాబాద్, వరంగల్, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల పక్షి ప్రేమికులు, పర్యావరణవేత్తలు, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లు కార్యక్రమానికి హాజరయ్యారు. జన్నారం డివిజన్‌లోని బైసన్‌కుంట, నీలుగాయి కుంట, మల్యాల వాచ్ టవర్ తదితర ప్రాంతాలను సందర్శించారు.

టీటీడీకి రూ.6 కోట్ల విరాళం



తిరుమల: చెన్నైకి చెందిన దాత వర్ధమాన్‌జైన్ ఆదివారం టీటీడీ ట్రస్టులకు రూ.6 కోట్లు విరాళంగా అందించారు. తిరుమల ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆయన ఎస్వీబీసీ కోసం రూ.5 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కోసం రూ.కోటి విలువైన డీడీలను టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరికి అందజేశారు. ఆయన టీటీడీ ట్రస్టులకు గతంలోనూ అనేక మార్లు విరాళం ఇచ్చారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
సోమవారం । 20-1-2025

నాగోబా జాతరకు వేళాయె



అతి ప్రాచీనమైన గోండి ధర్మం..

అతి ప్రాచీనమైన గోండి ధర్మాన్ని ఆచరించే మెస్రం వంశస్తుల మూల పురుషుడు పడియోర్. 'పాతాళ్ శ్రీ శేకు నాగోబా' వెలిసిన పుణ్య క్షేత్రం కేస్లాపూర్‌లో తరతరాల నుంచి ధర్మ ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలను కాపాడుతూ.. ముందు తరాలకు సంస్కృతిని అందించే కేంద్రంగా విరజిల్లుతోంది. కొన్ని వందల సంవత్సరాల నుంచి ఆదివాసీ గోండు తెగలోని మెస్రం వంశీయులకు ప్రత్యేక స్థానం ఉంది. ఏటా పుష్యమాసం ప్రారంభం నుంచి కఠోర దీక్షలు, నియమనిష్ఠలు పాటిస్తూ ఎంతో భక్తి శ్రద్ధలతో పవిత్ర గంగాజలం కోసం తెల్లని వస్త్రాలు ధరించి వరుస క్రమంలో కాలినడకన వందల కిలోమీటర్లు పయనిస్తారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామానికి దగ్గర గోదావరిలోని హస్తినమడుగు నుంచి కలశంలో గంగాజలం సేకరించి తిరుగు పయనమవుతారు. పుష్యమాసం అమావాస్య రోజు నాగోబా మహాదేవుడి అభిషేకం, మహాపూజ కార్యక్రమం నిర్వహిస్తారు.


నాగోబా జాతరకు తరలి వస్తున్న మెస్రం వంశీయులు (ఫైల్)

- ఈనెల 28 నుంచి ప్రారంభం
- ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ వేదికగా..
- మెస్రం వంశీయుల ఆచార సంప్రదాయాలకు ప్రతీక
- ఏటా పలు రాష్ట్రాల నుంచి భక్తుల ఆగమనం
- పుష్యమాస అమావాస్య నుంచి ప్రక్రియ షురూ
- జాతర ముగిసే వరకు పవిత్రతకు పెద్దపీట

సాక్షి, ఆదిలాబాద్: నాగోబా జాతరను ఈనెల 28 నుంచి ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయం వేదికగా.. ఏటా నిర్వహించే ఈ జాతర ప్రసిద్ధి చెందింది. ఆదివాసీల్లోని మెస్రం వంశీయుల ఆచార సంప్రదాయాలు ఇందులో ప్రతిబింబిస్తాయి. పుష్యమాస అమావాస్య నుంచి ప్రక్రియ మొదలవుతుంది. ఇప్పటికే ప్రచార రథయాత్ర పూర్తి చేసిన వంశీయులు.. ప్రస్తుతం గంగా జల సేకరణ పాదయాత్రను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో మేడారం తర్వాత నాగోబా జాతరను పెద్దఎత్తున నిర్వహిస్తుంటారు. ప్రభుత్వం ఈ జాతరను అధికారికంగా నిర్వహిస్తోంది. రాష్ట్రం నుంచే కాకుండా పలు రాష్ట్రాల భక్తులు జాతరకు పెద్ద ఎత్తున తరలివస్తారు.


నూతన ఆలయం ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన మెస్రం వంశీయులు (ఫైల్)

మెస్రం వంశీయుల ఆరాధ్య దైవం..

గిరిజనుల్లోని ఆదివాసీ తెగకు చెందిన మెస్రం వంశీయులకు నాగోబా ఆరాధ్య దైవం. ఏటా పుష్య మాసంలో నాగోబా మహాపూజ, జాతర నిర్వహిస్తారు. నెలవంక కనిపించిన మర్నాడు గంగాజల సేకరణ పాదయాత్రను వంశీయులు చేపడతారు. కలశాల్లో సేకరించిన జలంతోనే నాగోబాకు మహాపూజ రోజు అభిషేకం నిర్వహిస్తారు. అంతకు ముందు ఆలయానికి సమీపంలోని ఇంద్రాదేవికి పూజలు చేసి అక్కడి మర్రిచెట్టు వద్ద బస చేస్తారు. మూడు రోజుల పాటు అక్కడే ఉండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆలయానికి చేరుకుని నాగోబాను అభిషేకించడంతో జాతర మొదలవుతుంది. జాతరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలి వస్తారు.

నూతన ఆలయంలో..

తొలినాళ్లలో మెస్రం వంశీయులు నాగోబా దేవత వెలిసిన పుణ్య స్థలాన్ని (పుట్ట) మాత్రమే పూజించేవారు. తర్వాత కాలంలో 1956లో గడ్డి పోరకలతో చిన్న గుడిసెను నిర్మించి పూజించేవారు. 1995లో సిమెంట్ ఇటుకలతో చిన్న మందిరాన్ని నిర్మించి పూజలు చేశారు. 2000 సంవత్సరంలో ఆధునికతను జోడిస్తూ ప్రభుత్వ సహకారంతో మందిరాన్ని నిర్మించారు. రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ఈ ఆలయాన్ని పూర్తి స్థాయిలో నూతనంగా నిర్మించి 2022 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఈ ఆలయం గర్భగుడి ద్వారమే నాగదేవత పడగ. మెస్రం వంశీయుల ఆచారాలు, సంస్కృతి, పద్ధతులు కళ్లకు కట్టేలా ఆలయ మండపంలోని స్తంభాలపై శిల్పాలు చెక్కారు. ఒకప్పటి గోండ్వానా రాజ్యం చిహ్నాలు కూడా ఇక్కడ కనిపిస్తాయి.

నిర్మాణ విశిష్టత..

నాగోబా ఆలయ నిర్మాణంలో ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. మెస్రం వంశస్తులు ఎవరిపై ఆధారపడకుండా డబ్బులు జమ చేసి రూ.5 కోట్లతో ఈ దేవస్థానాన్ని నిర్మించారు. 2017 నుంచి ఏటా డబ్బులు పోగుచేసి.. ఈ నిర్మాణాన్ని 2022లో పూర్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ ప్రాంతానికి చెందిన శిల్పి తలారి రమేశ్ అక్కడే రాతిపై శిల్పాలు చెక్కిచ్చారు. వాటిని కేస్లాపూర్‌కు తీసుకొచ్చి ఆలయ నిర్మాణంలో ఉపయోగించారు. కాగా ఆలయం చుట్టూ ప్రాకారం, నాలుగు దిక్కుల్లో రాజగోపురాల నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి అప్పట్లో రూ.6 కోట్లు మంజూరు చేసింది. ఆ నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన ఆలయంలోనే మూడేళ్లుగా జాతర నిర్వహిస్తున్నారు.

గిరిజన దర్బార్‌కు ప్రాధాన్యం

నాగోబా జాతరలో గిరిజన దర్బార్‌కు ప్రాధాన్యం ఉంది. 1940లో గిరిజన పోరాట యోధుడు కుమురంభీం వీరమరణం తర్వాత.. అప్పటి నిజాం సర్కార్ గిరిజనుల్లో అసంతృప్తి, తిరుగుబాటుకు కారణాలపై పరిశోధన కోసం మానవ పరిణామ శాస్త్రవేత్త, లండన్‌కు చెందిన హైమన్‌డార్ఫ్‌ను నియమించారు. ఆయన అప్పట్లో తన సతీమణి బెట్టి ఎలిజబెత్‌తో ఇక్కడికి వచ్చి జైనూర్ మండలం మార్లవాయిలో స్థిరపడ్డారు. ఆయన ఆదివాసీ జీవితాలను పరిశోధించడమే కాకుండా వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. గిరిజన ప్రజల కోసం వివిధ విద్య, ఇతర పథకాల అమలుకు కృషి చేశారు. అన్ని దేశీయ సంస్కృతులు, భాషలను సంరక్షించడం కోసం ప్రభుత్వాలకు సూచనలు చేశారు. గిరిజనులు అత్యధికంగా కేస్లాపూర్‌లో కలుస్తారని, 1942 కాలంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో అక్కడ గిరిజన దర్బార్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ దర్బార్‌లో గిరిజనులు తమ సమస్యలను ప్రస్తావిస్తారు. అప్పట్లో నిజాం సర్కార్ వరకు ఇవి చేరేవి. దీంతో గిరిజన దర్బార్‌కు అధిక ప్రాధాన్యం ఏర్పడింది. దేశం కాని దేశం వచ్చి ఇక్కడి గిరిజనుల కోసం విశేషంగా కృషి చేసిన దివంగత హైమన్‌డార్ఫ్, ఆయన సతీమణి బెట్టి ఎలిజబెత్ దంపతుల విగ్రహాలను మార్లవాయి గ్రామంలో ఏర్పాటు చేశారు. ఏటా ఆ దంపతుల వర్ధంతిని గిరిజనులు నిర్వహిస్తున్నారు.



భవిష్యత్తు తరాలకు తెలియజేస్తాం




"నాగోబా ప్రాశస్త్యాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేస్తాం. పవిత్రమైన ఈ జాతర నిర్వహణలో మెస్రం వంశీయులం పాల్గొంటాం. మూడేళ్ల క్రితం నూతన ఆలయాన్ని ప్రారంభించాం. వంశీయులమంతా డబ్బులు జమ చేసుకుని సొంతంగా ఈ ఆలయాన్ని నిర్మించుకున్నాం."

- మెస్రం వెంకట్‌రావు, పీఠాధిపతి, నాగోబా ఆలయం

నిన్నటి ఇంద్రపురి.. నేటి ఇంద్రపాలనగరి


చిట్యాల-భువనగిరి రోడ్డును ఆనుకున్న విశాలమైన పెద్దచెరువు


పంచలింగేశ్వరాలయం ఎదుట రెండంతస్తుల మంటపం


ఇంద్రపాలగుట్టను ఆనుకొని ప్రవహిస్తున్న మూసీ నది



- ఆంధ్రుల ఔన్నత్యాన్ని చాటిన ప్రాచీన మహానగరాలలో ఇంద్రపురి
- విష్ణుకుండినుల రాజధానిగా పాలన
- శిథిలావస్థలో అపురూప కట్టడాలు

రామన్నపేట: ఆంధ్రుల ఔన్నత్యాన్ని చాటిన ప్రాచీన మహానగరాలలో ఇంద్రపురి ఒకటి. విష్ణుకుండినులు ఇంద్రపురిని రాజధానిగా చేసుకొని పరిపాలన సాగించారు. నాడు ఇంద్రపురిగా వెలుగొందిన నగరాన్ని.. నేడు ఇంద్రపాలనగరంగా పిలుస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రానికి ఏడు కిలోమీటర్ల దూరంలో చిట్యాల–భువనగిరి రోడ్డును ఆనుకొని ఇంద్రపాలనగరం (తుమ్మలగూడెం) ఉంది. ఇంద్రపాలనగర పరిసరాల్లో బయటపడిన తామ్ర శాసనం, శిలాశాసనం ద్వారా గ్రామచరిత్ర వెలుగులోకి వచ్చింది.

ఇంద్రపాలనగరం రాజధానిగా..

ఆంధ్రదేశ చరిత్రలో గొప్ప పరిపాలకులుగా పేరొందిన రాజవంశీయుల్లో విష్ణుకుండినులు ఒకరు. శాలంకాయనుల వంశీయుల అనంతరం విష్ణుకుండినుల రాజ్యస్థాపకుడైన మహారాజేంద్రవర్మ (ఇంద్రవర్మ) ఇంద్రపాలనగరాన్ని రాజధానిగా చేసుకొని పాలన ప్రారంభించాడు. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో పాలనను ప్రారంభించి కృష్ణా, గోదావరి మధ్య ప్రాంతాలను ఆక్రమించారు. 5, 6 శతాబ్దాల్లో విష్ణుకుండినులు.. ప్రజారంజకంగా పరిపాలించారు. ఆ రోజుల్లో తమ రాజ్యానికి దక్షిణ, పశ్చిమోత్తరాల్లో శక్తివంతులైన వాకాటక వంశీయుల రాజకుమార్తెను విష్ణుకుండినుల రాజు మాధవవర్మ వివాహమాడి.. వారితో సత్సంబంధాలను కొనసాగించినట్లు చరిత్ర చెబుతోంది. తామ్ర శాసనాల ద్వారా.. విష్ణుకుండినులకు దక్షిణాపథపతి, త్రికూట మలయాధిన వంటి బిరుదులు ఉన్నాయని తెలుస్తోంది. మూసీ నదిని ఆనుకొని సువిశాలమైన ఇంద్రపాలగుట్ట ఉంది. గుట్టపై గిరి దుర్గంపై విష్ణుకుండినుల కాలంలో కట్టిన కోట ఉంది. కోటకు 12 బురుజులు ఉన్నాయి. కోటకు దగ్గరలోని కోనేరును ఏనుగుల బావి అంటారు. అక్కడ గల పెద్దపెద్ద మట్టి ఇటుకలు, రాళ్లు, పునాదులు, పెద్దగోడలు, శిథిలమైన గదుల బట్టీ.. రాజభవనాలు ఉన్నట్లు తెలుస్తోంది. పన్నెండు స్తంభాల మంటపం ఉంది. గుట్టపైన ఎల్లమ్మగుడి, పరశురాముడి పాదాలు ఉన్నాయి.


సహజసిద్ధమైన శివాలయం

గుట్టపైన సహజసిద్ధమైన శివాలయం ఉంది. ఒకరాతి గుండుపై మరో రాతిగుండు నిలిచి ప్రకృతి సిద్ధమైన దేవాలయంగా రూపు దిద్దుకుంది. రెండు అడుగుల శివలింగాన్ని నల్లరాతితో మలిచారు. శివాలయ పరిసరాల్లోని శిలాశాసనాలు శిథిలమయ్యాయి. గుట్ట నుంచి మూసీనదిలోకి దిగేదారిలో పరుపు బండపై శివలింగాలను చెక్కారు.

జీర్ణోద్ధరణకు చేరిన పంచలింగేశ్వర ఆలయం



శిథిలమైన పంచలింగేశ్వరాలయం

ఇంద్రపాలనగరం చెరువుకు సమీపంలో రాతితో నిర్మించిన పంచలింగేశ్వరాలయం ఉంది. గోపురం మాత్రం ఇటుక, సున్నంతో నిర్మితమైంది. ఇందులో 5 ఆలయాలు, 40 స్తంభాలున్న గర్భగుడి ఉంది. ఆలయానికి ఎదురుగా రెండంతస్తుల మండపం ఉంది. ఆలయం పూర్తిగా శిథిలమైంది. ఆలయం పూర్వీకుల శిల్పకళానైపుణ్యానికి నిదర్శనంగా నిలిచింది.


ఇంద్రపాలగుట్టపై కోట, బురుజుల గల గిరిదుర్గం

ప్రజల కల్పతరువు పెద్దచెరువు

ఇంద్రపాలనగరంలో సుమారు 1,200 ఎకరాల విస్తీర్ణంలో సువిశాలమైన చెరువు ఉంది. దీనిని పెద్ద చెరువు అని పిలుస్తారు. మూసీనదిపై నెమలి కాలువ వద్ద నిర్మించిన కత్వనుంచి ఆసిఫ్‌నహర్ కాలువ ద్వారా చెరువులోకి నీరు వస్తుంది. పెద్దచెరువు తూముల నుంచి ఆసిఫ్‌నహర్ కాలువ దిగువకు నీటిని వదులుతారు. చెరువు ద్వారా సుమారు 800 ఎకరాల పొలాలకు నేరుగా సాగునీరు అందుతుంది. ఎగువన గల వేలాది ఎకరాలు చెరువు నీటితోనే సాగవుతున్నాయి. 500కు పైగా మత్స్య కార్మికుల కుటుంబాలు చేపల పెంపకం ద్వారా జీవనోపాధి పొందుతున్నాయి. ఇది చిట్యాల–భువనగిరి రోడ్డును ఆనుకొని ఉంటుంది. చెరువుకట్ట సుమారు 2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది.


ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి దేవాలయం

ప్రజల ఇలవేల్పు ఇంద్రపాల ముత్యాలమ్మ

గ్రామప్రజల ఇలవేల్పు ఇంద్రపాల ముత్యాలమ్మ తల్లి. పంచలింగేశ్వర ఆలయ సమీపంలో ముత్యాలమ్మ తల్లి దేవాలయం ఉంది. ఆలయానికి నిత్యం భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. బోనాలు సమర్పిస్తుంటారు. ఇతర ప్రాంతాల్లో నివసించే వారు ఏటా ఒకసారైనా దర్శనానికి వస్తుంటారు. గ్రామప్రజలు అమ్మవారిని తమ ఇలవేల్పుగా భావిస్తుంటారు.


ఇంద్రపాలగుట్టపై శివాలయం

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



ఇంద్రపాలనగరం చారిత్రక నేపథ్యం కలిగిన గ్రామం. విష్ణుకుండినుల కాలంనాటి కట్టడాలు, శాసనాలు దేవాలయాలు జీర్ణోద్ధరణ దశకు చేరుకున్నాయి. చారిత్రక సంపదను కాపాడే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ప్రధాన రహదారిని ఆనుకున్నందున సందర్శకులు అధికంగా వస్తే.. ఇంద్రపాలనగరానికి పూర్వవైభవం వస్తుంది.

- తవుటం భిక్షపతి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు

డీవైఈవో ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంలో వివక్ష

సాక్షి, అమరావతి: ఉప విద్యాశాఖాధికారులుగా ఇన్‌చార్జ్ బాధ్యతలను కేవలం ప్రభుత్వ యాజమాన్య ఎంఈవోలకే అప్పగించడం సరికాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్. చిరంజీవి తప్పుబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ, పంచాయతీరాజ్ విభాగాలకు చెందిన ఎంఈవో-1, 2 ఉండగా, కేవలం డీవైఈవో ఇన్‌చార్జ్ బాధ్యతలను ప్రభుత్వ యాజమాన్యానికి చెందిన ఎంఈవో-1లకు మాత్రమే అప్పగించారని పేర్కొన్నారు.

పూర్తి సర్వీస్‌ను పరిగణించాలి

జీవో నం.50 ప్రకారం ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తూ యాజమాన్యాల అంగీకారం మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విలీనమైన ఉపాధ్యాయల పూర్తి సర్వీసును పరిగణనలోకి తీసుకుని పదోన్నతులు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ గిల్డ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ప్రక్రియలో 2022 మార్చి నాటికి 3,258 మంది ఎయిడెడ్ టీచర్లు ప్రభుత్వ సర్వీసులో విలీనమయ్యారని గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు శాశ్వత పరిష్కారం చూపాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించే శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అవసరమైన తక్షణ సాయంగా కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటించడం తాత్కాలిక ఉపసమనం మాత్రమేనని పేర్కొన్నారు. ప్యాకేజీ పేరుతో సిబ్బంది కుదింపును ఆమోదించరాదని, వీఆర్ఎస్ ఉపసంహరించాలని, కాంట్రాక్టు వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చార్జీల పెంపుపై ఉద్యమిస్తాం: సీపీఐ

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఇళ్ల స్థలాల సమస్య, విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఉద్యమిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆయన ఆదివారం మాట్లాడారు. టీడీపీ ఎన్నికల హామీ అయిన పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలిచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసి.. పెంచిన విద్యుత్ భారాలను తగ్గించాలని కోరారు. అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. సంక్రాంతి సెలవులు ముగింపు రోజు కావడంతో వేలాది మంది భక్తులు శ్రీవారి ఆలయాన్ని సందర్శించారు. దీంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పు రాజగోపుర ప్రాంతం, కల్యాణ కట్ట ఇలా అన్ని విభాగాలూ భక్తులతో పోటెత్తాయి. అనివేటి మండపంలో పలు కోలాట భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వేల సంఖ్యలో భక్తులు స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం వరకు క్షేత్రంలో రద్దీ కొనసాగింది.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో ..

కైకలూరు:పెద్దింట్లమ్మా.. నీ చల్లని చూపులు మాపై ప్రసరించవమ్మా.. అంటూ భక్తులు ఆర్తితో అమ్మను వేడుకున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలంలోని కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తులు ఆదివారం బారులు తీరారు. అనేక కుటుంబాలు వేడి నైవేద్యాలను అమ్మకు అందించారు. సర్కారు కాల్వపై సిమెంటు వంతెన నిర్మాణం పూర్తి కావడంతో ప్రతి ఆదివారం భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ సందర్భంగా ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండనశాల, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదులు, అమ్మ చిత్రాలు, విరాళాల ద్వారా మొత్తం రూ.98,017 ఆదివారం ఒక్కరోజు ఆదాయంగా వచ్చిందని తెలిపారు.

హరిణి.. హరివిల్లులా!



తూర్పు కనుమల్లో భాగమైన నల్లమల అడవులంటేనే జీవ వైవిధ్యానికి పెట్టింది పేరు. ఏనుగు, సింహం తప్ప తక్కిన జంతువులన్నింటికీ ఈ అడవి ఆవాస ప్రాంతంగా నిలిచింది. 17 రకాల కార్నివోర్స్ (మాంసాహార జంతువులు), 8 రకాల హెర్బివోర్స్ (శాకాహార జంతువులు)తో పాటు పలు రకాల పక్షులు, సరీసృపాలు, చేపలు, ఉభయచర జీవులు, కీటకాలు తదితర జంతుజాలం ఈ అడవిలో సహజీవనం చేస్తూ బయోడైవర్సిటీకి ప్రతిరూపంగా నిలుస్తున్నాయి. 8 రకాల హెర్బివోర్స్‌లో ఏడు రకాలు జింకలే ఉండటం విశేషం. వీటిల్లో 300 కేజీల బరువు తూగే కణితి (సాంబర్), నీల్‌గాయ్ వంటి భారీ జింకలతో పాటు కుందేలు కంటే కాస్త చిన్నదిగా కనిపించే మౌస్‌డీర్ సైతం ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని నాగార్జున సాగర్–శ్రీశైలం అభయారణ్యం పరిధిలోని ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఇవి అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి.

– ఆత్మకూరు రూరల్

- నల్లమలలో అరుదైన జింకల సంచారం
- ఏడురకాల జింకలతో అలరారుతున్న జీవవైవిధ్యం
- పెద్ద పులి మెనూలో ఇవి ప్రధానం



అడవికే అందం..

పొడ దుప్పి (స్పాటెడ్ డీర్).. దీనిని చుక్కల దుప్పి అని కూడా అంటారు. జింకలలో అత్యంత అందమైనది. బంగారు వర్ణం చర్మంపై తెల్లటి మచ్చలతో అత్యంత లావణ్యంగా కనిపిస్తుంది. వీటిలో కూడా మగ వాటికి పంగలతో కూడిన కొమ్ములు ఉంటాయి. దుప్పులు కూడా తమ కొమ్ములను వదులుతుంటాయి. మగ దుప్పి అరిచే శబ్దాన్ని బట్టి వర్లుపోతు అనికూడా పిలుస్తారు. ఇవి అడవుల్లో అన్ని ప్రదేశాల్లో సంచరిస్తుంటాయి. పులి ఆహారంలో ఇది కూడా ఉంది.

మనిమేగం.. ప్రత్యేకం

నల్లమలలో ప్రధానంగా కనిపించే మరో ఆంటిలోప్ మనిమేగం (నీల్‌గాయ్). ఇది కూడా భారీ శరీరాన్ని కలిగి ఉంటుంది. కొంత మేర గుర్రాన్ని పోలి ఉండే మగ మనిమేగాలు వయస్సుకు వచ్చాక నల్లటి పైకప్పుతో కనిపిస్తాయి. అందుకే వీటిని నల్లపోతు అనికూడా అంటారు. కృష్ణజింకలు, మనిమేగాలు ఎక్కువగా సంచరిస్తున్నాయంటే అది అటవీ క్షీణతకు సంకేతంగా భావిస్తారు. ఎందుకంటే ఈ రెండు జింకలు పెద్దపెద్ద గడ్డి మైదానాల్లో మాత్రమే మనగలుగుతాయి.





జంగిల్ మే సవాల్..


గడ్డి మైదానాల్లో గుంపులుగా జీవించే జింకల్లో కృష్ణజింక (బ్లాక్ బక్) ప్రధానమైనది. మగ జింకలకు పొడవాటి కొమ్ములు ఉంటాయి. పురి తిరిగినట్లుండే ఈ కొమ్ములపైన ఉన్న పురులను బట్టి వాటి వయస్సును నిర్ధారిస్తారు. ఇవి బాగా వయస్సుకు వచ్చాక వాటి చర్మం నల్లటి కప్పును కలిగి అందంగా తయారవుతుంది. ఇలా బలంగా నల్లటి కప్పుతో కనిపించే కృష్ణజింక.. జింకల గుంపుకు నాయకత్వం వహిస్తుంది. అత్యంత వేగంగా పరిగెత్తే వీటిని వేటాడే మాంసాహార జంతువు నల్లమలలో లేదు అంటే అతిశయోక్తి కాదు. గంటకు 100 కి.మీ పైగా వేగంతో పరిగెత్తే చీతాలు దేశంలో కనుమరుగు కావడంతో వీటికి పోటీపడి పరిగెత్తే జంతువులు లేకుండా అయ్యాయి. తోడేల్లు, హైనాలు మాటువేసి వీటిని చంపుతుంటాయి. కృష్ణ జింక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారిక జంతువుగా ఉంది.

కొమ్ములతో కుమ్మేస్తూ..



తలపై రెండు, పనపై మరో రెండు చిన్న కొమ్ములు కలిగి ఉండడమే కొండ గొర్రె ప్రత్యేకత. ఈ కారణంగానే కొండగొర్రెను చౌసింగా అని కూడా పిలుస్తారు. నల్లమలలోని కొండ తిప్పలపై నివసించే ఈ వన్యప్రాణి ఉనికి దట్టమైన పచ్చటి అడవికి గుర్తుగా చెప్పుకోవచ్చు. కొండగొర్రె తనను తాను మాంసాహార జంతువుల నుంచి రక్షించుకునేందుకు కొండకొమ్ముల ఏటవాలును వీలుగా ఉపయోగించుకుంటుంది. కొండగొర్రె మాంసం రుచిగా ఉంటుందన్న కారణంగా ఇవి ఎక్కువగా వేటగాళ్ల చేతిలో బలి అవుతుంటాయి.

ప్రమాదం అంచున..



కొండ గొర్రె కంటే కాస్త భారీగా, కణుతుల కంటే కాస్త చిన్నగా ఉండే మరో ఆంటిలోప్.. బుర్రజింక. చింకారా అనికూడా పిలిచే ఈ జింక తలపై రెండు కొమ్ములు కృష్ణజింకను పోలి పురి తిరిగి ఉంటాయి. కానీ వాటి అంత పొడవు పెరగవు. నల్లమలలో వీటి సంఖ్య బాగా తగ్గిపోయింది. అరుదుగా మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి. రైతులు వ్యవసాయ ఉపకరణాలలో చింకారా కొమ్ములను అందంగా వినియోగిస్తుంటారు. చర్నాకోల పిడిగా, మోకులు, పగ్గాలు తయారు చేసేందుకు ఉపయోగపడే పరికరంగా కూడా వీటి కొమ్ములను రైతులు సేకరించే వారు.

సాంబర్ డీర్..



జింకలలో అతి పెద్దది కణితి(సాంబర్ డీర్). దట్టమైన అటవీ ప్రాంతంలోని పర్వత ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా జీవిస్తుంటాయి. ఇవి పెద్ద పంగల కొమ్ములు కలిగి ఉంటాయి (మగవాటికి మాత్రమే కొమ్ములుంటాయి). ఈ కొమ్ములను అవి నిర్దీత సమయంలో విసర్జిస్తుంటాయి. కొన్ని సార్లు ఆడ కణితి కోసం జరిగే పోరాటంలో అవి ఊడి పోతుంటాయి. నల్లమలలో ప్రధాన రక్షిత వన్యప్రాణి అయిన పెద్దపులికి ఆహార జంతువులుగా జింకలు పర్యావరణ సమతుల్యానికి తమవంతు కృషి చేస్తున్నాయి. జింకలతో పాటు అడవి పంది, ముల్ల పంది, కుందేలు వంటి జంతువులు కూడా పులి ఆహార మెనూలో ఉన్నాయి. కణుతులు ఎక్కువగా ఉండే ప్రాంతాన్ని పెద్ద పులులకు చక్కటి ఆవాసంగా గుర్తిస్తారు.

నేనూ జింకనే..



జింకకాని జింక ఈ మౌస్ డీర్. నిజానికి ఇది జింకజాతి వన్యప్రాణి కాదు. కాని రూపం బట్టి దీన్ని మూషిక జింకగా చెబుతారు. ఇది పంది జాతికి చెందిన ప్రాణి. వెనక కాళ్లు కాస్త బలహీనంగా కనిపించే ఈ జింక పూర్తిగా దట్టమైన వర్షారణ్యాలను పోలిన అడవుల్లో కనిపిస్తుంది. పెద్ద కుందేలు పరిమాణంలో ఉండే మూషిక జింక నల్లమలలోని గుండ్లబ్రహ్మేశ్వరం, రుద్రకోడు, పెచ్చెర్వు వంటి దట్టమైన పర్వతప్రాంత అడవుల్లో కనిపిస్తుంది. ఇది సాధారణంగా రాత్రుళ్లు మాత్రమే తిరుగాడుతుంది. చెట్టు తొర్రల్లో నివాసముంటుంది. నల్లమలలో ఇది అంతరించి పోయింది అనుకున్న సమయంలో తిరిగి కనిపిస్తుండటం శుభపరిణామం.

జీవవైవిధ్యంలో జింకలు కీలకం



నల్లమలలో ముఖ్య రక్షిత వన్యప్రాణి పెద్దపులి, ఆతరువాతి స్థానాల్లో ఉన్న చిరుత వంటి మాంసాహార జంతువులకు ఆహార సమృద్ధి కలిగిస్తూ మొత్తం పర్యావరణ సంరక్షణలో జింకలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. పెద్దపులికి నల్లమల ఆవాసంగా మారడంలో ఈ జింకలు కూడా ప్రధాన కారణం. నల్లమలలో జీవ వైవిధ్యంలో ఇవి కీలకంగా ఉన్నాయి.

– పట్టాభి, ఎఫ్ఆర్‌వో, ఆత్మకూరు రేంజ్

'లైవ్' కోడి స్పెషల్!

లైవ్ లింక్ ద్వారా నిర్వాహకుల బెట్టింగ్‌లు
దేశ విదేశాల్లోని పందెంరాయుళ్లకు ఎర

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: సంక్రాంతి సంబరాలకు కూటమి సర్కారు కొత్త భాష్యం చెప్పింది. పండుగ సంప్రదాయం ముసుగులో ప్రైవేట్ సైన్యాల పహారాలో యథేచ్ఛగా కోడి పందేలు, లైవ్‌లో బెట్టింగ్‌లు, ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో క్యాసినోలను తలదన్నే రీతిలో నిర్వహించిన జూద క్రీడలు, బెల్టు షాపులు పచ్చ ముఠాలకు కాసులు కురిపించాయి. ఇసుక నుంచి మద్యం దాకా ప్రజలను పిండేస్తున్న కూటమి నేతలు సంపాదనే లక్ష్యంగా బరి తెగించి వ్యవహరించారు. మునుపెన్నడూ లేని విధంగా ఊరూవాడా కోడి పందాలు, పేకాట, గుండాటలను యథేచ్ఛగా నిర్వహించారు. పండుగ 3 రోజుల్లో రూ.ఐదు వేల కోట్ల మేర దందా సాగింది. పలుచోట్ల కోడి పందేలను కూటమి ప్రజాప్రతినిధులు, మంత్రులు ప్రారంభించడంతోపాటు వారి ఫొటోలతో బరుల వద్ద పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం.

నిశ్చింతగా వచ్చేయండి...

సంక్రాంతికి ముందు కూడా కూటమి నేతల కనుసన్నల్లో, పోలీసుల సహకారంతో బాపట్ల, కృష్ణా, భీమవరం, కోనసీమ తదితర జిల్లాల్లో కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో కోడి పందేలు, జూద శిబిరాలు కొనసాగాయి. కొద్ది నెలల ముందు నుంచే పందేలు కాసేవారికి ఆహ్వానాలు అందాయి. 'మా మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే కనుసన్నల్లోనే బరులు ఏర్పాటవుతున్నందున ఇబ్బందులేమీ ఉండవు. 3 రోజులు ఉండేలా మీరు నిశ్చింతగా వచ్చేయండి. హోటళ్లలో గదులు కూడా సిద్ధం చేశాం' అని ఆహ్వానాలు పంపారు.

కొత్త వారికి గేలం..

పందెంరాయుళ్లతో ఉన్న పాత పరిచయాలను బలోపేతం చేసుకుంటూనే కొత్తవారిని రప్పించేందుకు నిర్వాహకులు పలు మార్గాలు అనుసరించారు. సోషల్ మీడియాలో ప్రచారంతో హైప్ సృష్టించారు. విదేశాల్లో ఉన్నవారితో పాటు హైదరాబాద్ తదితర నగరాల్లో గేటెడ్ కమ్యూనిటీల్లో నివసిస్తున్న వారు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను ఆకర్షించేందుకు నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు.



కోనసీమ జిల్లా మురమళ్లలో ఏర్పాటు చేసిన డిజిటల్ పే ప్లాట్‌ఫాంల ఏటీఎం

ముందే గెట్ టు గెదర్‌లు

ఉభయ గోదావరి జిల్లాల్లో పెద్ద బరుల సంఖ్య ఈదఫా పెరిగాయి. 2 నెలల క్రితమే సమాచారమిచ్చి రహస్యంగా గెట్ టు గెదర్‌లు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లోని కూటమి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులను రప్పించారు. మందు, విందు భోజనాలతో జరిగిన ఈ పార్టీల్లోనే సంక్రాంతి బరుల్లో కోడి పందేలపై పందెంరాయుళ్లు అవగాహనకు వచ్చారు. బరుల విస్తీర్ణం, పోటీ జోడీలు, తేదీలు, సమయాలు, వ్యయం తదితరాలు అప్పుడే ఖరారైపోయాయి. రాజకీయ, సినీ, పారిశ్రామిక రంగాల నుంచి ఎవరెవరిని ఆహ్వానించాలనేది నిర్ణయించి ఆ మేరకు అమలు చేసేలా ప్రణాళిక రూపొందించారు.

ప్రొఫైల్స్ సిద్ధం..

బరులు నిర్వహించిన వారు భవిష్యత్తులో నిర్వహించబోయే ఆటలకు మంచి లాబీయింగ్ ఏర్పాటు చేసుకున్నారు. సంపన్న వర్గాల నుంచి కొత్తగా వచ్చిన పందెంరాయుళ్ల బలాలు, బలహీనతలను అంచనా వేసుకుని ప్రొఫైల్స్ సిద్ధం చేసుకున్నారు. రానున్న రోజుల్లో నిర్వహించబోయే జూద కార్యకలాపాలకు ఆహ్వానాలు పంపి జేబులు నింపుకునేలా రూట్‌మ్యాప్‌ల తయారీలో నిమగ్నమయ్యారు. శ్రీలంక, థాయ్‌లాండ్, నేపాల్ తదితర దేశాల్లో జరిగే పేకాట, క్యాసినో శిబిరాలకు కూడా వీరిని తరలించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. భీమవరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారితోపాటు ఆక్వా రంగంలోని పలువురు ప్రముఖులు హైదరాబాద్, విశాఖ, విజయవాడలకు చెందిన వారిని కోళ్ల పందేలకు ఆహ్వానించి పండుగ మూడు రోజులు రాచమర్యాదలు చేసి పంపడం గమనార్హం.

లైవ్‌లో బెట్టింగ్‌లు...

ఈసారి భారీ బరుల వద్ద పందేలను లైవ్ టెలికాస్ట్ చేయడం ద్వారా క్రికెట్ తరహాలో బెట్టింగ్‌లు నిర్వహించారు. లైవ్ లింక్ ద్వారా దేశ విదేశాల్లోని పందెంరాయుళ్లు కోడిపందేలపై బెట్టింగ్‌లు కాయడం గమనార్హం. ఇదివరకెన్నడూ లేని విధంగా డేగాపురం, వెంకట్రామన్నగూడెం, సీసలి, ఎస్.యానాం, కొయ్యలగూడెం, వీరవాసరం, మురుముళ్ల తదితర ప్రాంతాల్లో పెద్దపెద్ద బరులు ఏర్పాటయ్యాయి. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఏకంగా 'కోడిపందెం లీగ్ (కేపీఎల్)' పేరిట బరి నిర్వహించడం విశేషం. బీచ్ ఫెస్టివల్ పేరిట సంగీత విభావరి ముసుగులో విభిన్న రకాల జూదాలను కొనసాగించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు ఇతరచోట్ల బరులు ఏర్పాటు కాకుండా, తమ బరివద్దకే పందెం రాయుళ్లు వచ్చేలా గుత్తాధిపత్యం చలాయించారు. ఇక మహిళా బౌన్సర్లు ఈసారి ప్రత్యేకం. పందెంరాయుళ్ల ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేస్తే అయిదు నుంచి పది శాతం కమీషన్ తీసుకుని నగదు అందించేలా బరుల వద్ద ఏర్పాట్లు చేశారు.

ఇదీ విశ్వాస బంధం..



అతనికి బూట్ పాలిష్ చేస్తే కానీ పూట గడవదు. అయినా తాను తినే దాంట్లో తనతో ఉండే శునకానికి కొంత వేస్తుండటంతో ఆ మూగజీవి అతడికి అలవాటుగా మారింది. అతనితో పాటుగా రోజూ ఇలా రోడ్డు పక్కనే కునుకు తీస్తుంది. -మొహమ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

అదుర్స్...ఆదివాసీల సంబరాలు!



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం గిరిజన ఆదివాసి సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో లంబాడీ మహిళలు చేపట్టిన నృత్య ప్రదర్శనలు పలువురిని విశేషంగా అలరించింది.

- ఎన్. కిషోర్, సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉపాధికి కత్తెర

క్షురకుల పొట్టకొడుతున్న ఆధునిక సెలూన్లు

నాయీబ్రాహ్మణుల ఉపాధిపై 'కత్తెర' పడింది. ఏళ్ల తరబడి నమ్ముకున్న సంప్రదాయ వృత్తిపై ఆధునిక సెలూన్ 'కత్తి'కట్టింది. నాడు వైఎస్ జగన్ క్షురకుల కత్తికి వరాల సాన పట్టగా.. నేడు చంద్రబాబు సంక్షేమాన్ని అటకెక్కించి 'మొండికత్తి'గా మార్చేశారు. ఫలితంగా ఓ వైపు రాబడి లేక.. మరోవైపు ప్రభుత్వాల నుంచి చేయూత దొరక్క నాయీ బ్రాహ్మణుల బతుకుబండి ముందుకు కదలనంటోంది.

- భారీగా తగ్గిన రోజువారి రాబడి
- వృత్తిని వదులుకోవాల్సిన దుస్థితి
- ఇతర మార్గాల అన్వేషణలో పలువురు

కడప సెవెన్‌రోడ్స్: ఆధునిక సెలూన్స్ వచ్చి సంప్రదాయ వృత్తినే నమ్ముకున్న క్షురకుల జీవనోపాధిని ఛిద్రం చేస్తున్నాయి. దీంతో ఎంతోమంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో సంక్షేమ పథకాల వల్ల వీరికి ఆర్థిక భరోసా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం డీబీటీ పథకాలు ఎత్తివేయడంతో ఉపాధి లేక..ప్రభుత్వం నుంచి చేయూత కానరాక క్షురకులు అష్టకష్టాలు పడుతున్నారు.

- వైఎస్సార్ జిల్లాలో నాయీ బ్రాహ్మణులు చాలా మంది సాంప్రదాయంగా వస్తున్న తమ కుల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. కొందరు అద్దె గదుల్లో క్షౌరశాలలు ఏర్పాటు చేసుకుని బతుకుతుంటే... మరికొందరు వీధుల్లో బంకులు ఏర్పాటు చేసుకుని పొట్టపోసుకుంటున్నారు. ఇలాంటి వారు ఒక్క కడపలోనే 400 కు పైగా ఉంటారు. వీరు క్షౌరానికి రూ. 70–100 తీసుకుంటారు. షేవింగ్‌కు రూ. 20 అడుగుతారు. తల వెంట్రుకలకు రంగు వేసేందుకు రూ. 50 వసూలు చేస్తారు.




కడప అక్కాయపల్లెలోని బంకులో కటింగ్ చేస్తున్న క్షురకుడు వరదయ్య

పేదలు, దిగువ మధ్యతరగతి వర్గాలు వీరి వద్దకు వెళుతుంటారు. క్షౌర వృత్తితో పాటు వాయిద్యం తెలిసిన వీరు వివాహాలు, ఉత్సవాలు, చావులకు వెళుతుంటారు. కులవృత్తిని నమ్ముకున్న వీరికి రోజుకు సగటున రూ. 600 రాబడి ఉంటుంది. నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, విద్యుత్ ఛార్జీలు, ఆరోగ్యం, పిల్లల చదువులు ఇలా జీవన వ్యయం రోజురోజుకు పెరుగుతున్న పరిస్థితుల్లో వచ్చే రాబడితో కష్టంగా కుటుంబాలను నెట్టుకొచ్చేస్తున్నామని చెబుతున్నారు.

జగన్ సంక్షేమ పథకాలతో నాడు భరోసా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేయూత కింద ఏడాదికి రూ.10 వేలు ఉచితంగా ఇస్తుండేవారని, ఆ డబ్బులు విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చులకు ఉపయోగపడేదని చెబుతున్నారు. అలాగే జగన్ అమలు చేసిన ఇతర సంక్షేమ పథకాల ద్వారా తాము లబ్ధి పొందేవారమని చెబుతున్నారు. అలాగే తమ సామాజిక వర్గానికి టీటీడీ పాలక మండలిలో స్థానం కల్పించిన ఘనత కూడా ఆయనకే దక్కిందని పలువురు గుర్తు చేశారు. వీటితోపాటు దేవస్థానాల్లో తమకు ఉపాధి ఏర్పాటు చేశారని చెబుతున్నారు. దీంతో తమకు ఎంతో ఆర్థిక భరోసా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఈ పథకాలన్నీ రద్దు చేయడంతో తమలాంటి వారి బతుకు దుర్భరంగా మారిదంటూ క్షురకులు వాపోతున్నారు.

హంగుల వైపే మొగ్గు..



ఆధునికత అంటూ ఇటీవల వైఎస్సార్ జిల్లాలో కొత్తకొత్త పేర్లతో సెలూన్లు ఏర్పాటవుతున్నాయి. ముఖ్యంగా కడప నగరంతో పాటు ప్రధాన పట్టణాల్లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన పెట్టుబడిదారులు ఏసీలతో కూడిన భారీ సెలూన్లు ఏర్పాటు చేశారు. గ్రీన్ ట్రెండ్స్, మోజ్, (బీ)యూ, డబల్ సెవెన్ తదితర సెలూన్ల పేర్లు ప్రముఖంగా వినబడుతున్నాయి. కొత్త కొత్త హంగులతో ఇవి యువతను ఆకర్షిస్తున్నాయి. బుల్లెట్ కటింగ్, మిడ్ ఫేడ్, లోఫేడ్ వంటి పేర్లతో కటింగ్, షేవింగ్, హెడ్ వాష్ చేసి రూ. 500 చొప్పున రాబడుతున్నారు. తల వెంట్రుకలకు రంగు వేయాలంటే రూ. 300 అదనంగా చెల్లించుకోవాల్సి ఉంటుంది. రకరకాల క్రీముల పేరిట డబ్బులు బాగానే గుంజుతున్నారు. వీరి వద్దకు వెళ్లాలంటే ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సి ఉంటుంది. వీధి బంకుల నిర్వాహకులు కూడా రకరకాల రీతుల్లో కటింగ్, షేవింగ్స్ చేయగలరు. హంగు ఆర్భాటాలు ఉండవు గనుక యువత వెళ్లడం లేదు. దీంతో రాబడి నామమాత్రంగా ఉంటోందని బంకు నిర్వాహకులు వాపోతున్నారు. బంకు ఏర్పాటు చేసుకున్నందుకు మున్సిపాలిటీకి పన్ను చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

● ససాన్ గిర్



సింహం... సౌమ్యరాజు






ససాన్ గిర్... గుజరాత్‌లో ఉంది. తెల్ల వారు జామున సోమనాథుడిని దర్శనం చేసుకుని, ఆ తర్వాత ప్రయాణం మొదలు పెడితే మధ్యాహ్నానికి అడవి మధ్యలో సింహాలు సంచరించే చోటుకు చేరుకోవచ్చు. ఈ అడవికి వెళ్లేది ప్రధానంగా సింహాలను చూడడం కోసమే. సింహం అంటే అడవికి రాజని, గర్జిస్తుందని, దాడి చేస్తుందని, దాని కంట్లో పడితే ఇక మన పని అంతే... పై ప్రాణాలు పైనే పోతాయన్నంతగా సెవెన్టీ ఎమ్ఎమ్ స్క్రీన్ మీద ఓ ఫుల్ లెంగ్త్ సినిమా మన కళ్ల ముందు మెదలుతుంది. కానీ ఇక్కడ సింహాలను చూస్తుంటే దగ్గరకెళ్లి జూలుతో ఆడుకోవచ్చా అన్నంత సౌమ్యంగా ఉంటాయి. సింహాలేంటి... ఇంత చక్కగా మచ్చిక జంతువుల్లా ఉండడమేంటి అని ఆశ్చర్యమేస్తుంది. కానీ వాటికి ఆకలి వేస్తే తప్ప వాటిలోని రౌద్రరసం బయటకు రాదు, మరో ప్రాణి మీద దాడి చేయవు. ఆకలి వేయనంత వరకు అవి సౌమ్యరాజులే. అంతేకాదు వాటికి ఆకలి రోజూ ఉండదు. ఒకసారి కడుపు నిండా ఓ యాభై కిలోల మాంసం తింటే మరో వారం రోజులు ఆహారం జోలికి వెళ్లవు. బద్ధకంగా నిద్రపోతాయి. వీటికి ఆకలైతే తన పిల్లలను కూడా తింటాయి కాబట్టి చిన్న పిల్లల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన గదిలోకి పెద్ద సింహాలు వెళ్లడానికి వీల్లేనంత చిన్న ద్వారం ఉంటుంది.

ఇదే సరైన సమయం

ససాన్ గిర్ ఫారెస్ట్ టూర్‌కి నవంబర్ నుంచి మార్చి వరకు అనుకూలం. సంక్రాంతి తర్వాత చలి తగ్గుతూ వాతావరణం సాధారణ స్థితికి చేరుతున్న ఈ సమయమే దక్షిణాది వాళ్లకు అనుకూలం. జూన్ నుంచి అక్టోబర్ వరకు గిర్ ఫారెస్ట్ టూర్‌కి వెళ్లకపోవడమే మంచిది. సింహాల బ్రీడింగ్ సమయం అది. ఆ సమయంలో అటవీప్రాంతంలో సింహాలు ఎక్కువగా సంచరించే కోర్ జోన్‌లోకి అనుమతించరు. వర్షాకాలం కూడా కావడంతో అడవిలో మిగిలిన ప్రదేశంలో కూడా రోడ్లు కొట్టుకుపోయి ప్రయాణం కష్టంగా ఉంటుంది. వర్షాలు తగ్గిన తర్వాత అడవి కొత్త చిగుళ్లతో పచ్చగా అలరిస్తుంది. కారులో ప్రయాణం నెమ్మదిగా సాగుతూ మనకు పరిచయం లేని కొత్త చెట్లను, తీగలను, పక్షులను, జంతువులను చూస్తూ ఉంటే చందమామ కథల్లో అడవి గుర్తు వస్తుంది. అడవిలోకి వెళ్లే వరకు పర్యాటకుల వాహనాలను అనుమతిస్తారు. సింహాలున్న జోన్‌లోకి వెళ్లడానికి అటవీశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో మాత్రమే వెళ్లాలి. ఆ వాహనం పర్యాటకులను సింహాలు, ఇతర వన్యప్రాణులు సంచరించే ప్రదేశాలకు తీసుకెళ్తుంది. సింహాలు నీటి మడుగులో ఈదుతున్న జంతువులు, చెట్ల కింద నిద్రపోతున్న సింహాలు, నిద్రలేచి బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటున్న సింహాలు కనువిందు చేస్తాయి. పర్యాటకులను ఏ మాత్రం ఆసక్తిలేనట్లు చూస్తుంటాయి. సింహాలు పులిలాగ భారీ కాయులు కావు. దేహం పలుచగా, నడుము సన్నగా స్లిమ్‌గా ఉంటాయి. లయన్ షోలో సింహాల కదలికల వీడియోలను ప్రదర్శిస్తారు. అడవిలో అమర్చిన సీసీ కెమెరాల్లో సింహాల కదలికలు, నేలమీద పాదముద్రలతోపాటు సింహాలు వేటాడే దృశ్యాలను కూడా చూడవచ్చు. మసక చీకట్లో రికార్డయిన ఆ దృశ్యాలు భయం గొలుపుతాయి. మనకు లైవ్‌లో సౌమ్యంగా కనిపించిన సింహాలేనా ఇవి అని భయమేస్తుంది. సింహం కాళ్ల కింద నలుగుతున్న ఆకుల చప్పుడుకి జంతువులు బెదిరి పోతున్న దృశ్యాలు అడవి అసలు స్వరూపాన్ని బయటపెడతాయి. మొత్తానికి గిర్ ఫారెస్ట్ టూర్ సింహంలాంటి టూరనే చెప్పాలి.



నిశ్శబ్ద రవళి

దేవాలియా సఫారీ పార్క్‌లో జీప్ సఫారీ చేస్తే దాదాపుగా గిర్ ఫారెస్ట్‌ని ఆసాంతం చూసేసినట్లే. ఈ జోన్‌లో సింహాలతోపాటు రకరకాల జింకలు, ఎద్దులు, చింకారా, నక్కలు, బాతులు, కృష్ణజింకలు, గేదెల వంటి నలభై రకాల ప్రాణులను చూడవచ్చు. మొసళ్లు ఉన్న నీటి మడుగుల దగ్గర బోర్డులుంటాయి. పక్షులైతే రంగురంగుల రెక్కలతో మూడు వందల రకాలుంటాయి. కానీ కిలకిల రవాలు పెద్దగా వినిపించవు. పక్షులు నిశ్శబ్దంగా ఉండడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. అరుదుగా నెమళ్ల ఘీంకారాలు మాత్రం వినిపిస్తాయి. వాహనాల మోటార్ల శబ్దం తప్ప ఇతర ఏ శబ్దమూ ఉండదు. ఇక్కడ సింహాల సంరక్షణ జరుగుతోంది. కాబట్టి అరవై ఏళ్ల కిందట రెండు వందల లోపు ఉన్న సింహాల సంఖ్య ఏడు వందలకు దగ్గరవుతోంది. సింహం ఉన్న అడవిని చూడడం, అడవిలో సింహాన్ని చూడడం ఆనందమే మరి.



– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



సేఫ్ లడకీ దేశాన్ని చుట్టేస్తోంది!

కాళ్లకు చక్రాలుంటే బావుణ్ను. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా దేశమంతా చుట్టేయవచ్చు. ఈ కోరిక చాలామందికే ఉంటుంది. తమిళనాడుకి చెందిన సరస్వతి అయ్యర్ మాత్రం ఈ మాటను నిజం చేస్తోంది. నిజం చేయడమంటే కాళ్లకు చక్రాలు కట్టుకోలేదు కానీ కాళ్లకు పని చెప్తోంది, చక్రాలున్న వాహనాల్లో హిచ్‌హైకింగ్ (ఆ దారిలో వెళ్లే వాహనాల్లో లిఫ్ట్ అడుగుతూ వెళ్లడం) చేస్తూ పర్యటిస్తోంది. దేశంలో ఆ మూల నుంచి ఈ మూలకు ఈ మూల నుంచి ఆ మూలకు అటూ ఇటూ పర్యటించేసింది. ఉమన్ సోలో ట్రావెల్ ఒక ట్రెండ్‌గా మారిన ఈ రోజుల్లో సోలో ట్రావెల్‌తోపాటు జీరో బడ్జెట్ ట్రావెల్ కూడా సాధ్యమేనని నిరూపించింది సరస్వతి అయ్యర్.

జీవితాన్ని చదివేస్తోంది!

సరస్వతి అయ్యర్ రెండేళ్ల కిందట ఉద్యోగం నుంచి విరామం తీసుకుంది. ఉద్యోగం చేయడానికి పుట్టలేదు, ఇంకా ఏదో సాధించాలనుకుంది. దేశమంతా చుట్టి వచ్చిన తర్వాత తన గురించి తాను సమీక్షించుకోవాలనుకుంది. అనుకున్నదే తడవుగా ప్రయాణం కట్టింది. ఇంటి నుంచి బయలుదేరినప్పుడు ఆమె దగ్గర ఉన్నది రెండు జతల దుస్తులు, ఒక గుడారం, ఫోన్ చార్జింగ్ కోసం ఒక పవర్ బ్యాంక్. ఈ మాత్రం పరిమితమైన వనరులతో ఆమె పర్వత శిఖరాలను చూసింది. మారుమూల గ్రామాలను పలకరించింది. దేవాలయాల్లో ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించింది. బస కోసం ఆలయప్రాంగణాలు, ఆశ్రమాలు, ధర్మశాలలను ఎంచుకుంది. భోజనం కూడా అక్కడే. ఎక్కడైనా శ్రామికులు పని చేస్తూ కనిపిస్తే వారితో కలిసి పని చేస్తోంది. వారితో కలిసి భోజనం చేస్తోంది. పొలంలోనే గుడారం వేసుకుని విశ్రమిస్తోంది. ఈ పర్యటన ద్వారా ఆమె ఇస్తున్న సందేశం మహిళలు సోలో ట్రావెల్ చేయగలరని నిరూపించడం మాత్రమే కాదు. మనదేశంలో మహిళలకు ఉన్న భద్రతను చాటుతోంది. ఒక సాహసం చేయాలంటే అది అంత ఖరీదైనదేమీ కాదని. అలాగే... ఒక పర్యటన జీవిత దృక్పథాన్ని మార్చేస్తుందనే జీవిత సత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది సరస్వతి అయ్యర్.



నృత్యం



అస్సాం సత్రియా చారిత్రాత్మక అరంగేట్రం

ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళాలో అస్సాం సత్రియా సంస్కృతిని ప్రదర్శించనున్నారు. మజులిలోని ఔనియాతి సత్రం నుండి 40 మంది సభ్యుల బృందం సాంప్రదాయ సత్రియా నృత్యం, సంగీతం, నాటకాన్ని ప్రదర్శిస్తుంది, ఇది రాష్ట్ర ఆధ్యాత్మిక, కళాత్మక వారసత్వంలోకి ఒక ప్రత్యేకమైన విండోను అందిస్తుంది. ఈ ప్రదర్శనలలో శ్రీమంత శంకరదేవుని భక్తి నాటకం రామ్ విజయ్ భావోనా, దిహా నామ్ (సామూహిక గానం), సాంప్రదాయ బోర్గీత్, ఖోల్, సింబల్స్, ఫ్లూట్, వయొలిన్, దోతర వంటి వాయిద్యాలతో కూడిన నృత్యం ఉంటుంది.

ఈ బృందం పురుష (పౌరశిక్ భాంగి), స్త్రీ (స్త్రీ భాంగి) నృత్య శైలులను ప్రదర్శిస్తుంది. 2000 సంవత్సరంలో భారతదేశ శాస్త్రీయ నృత్య రూపాలలో ఒకటిగా గుర్తింపు పొందిన సత్రియాను 15వ శతాబ్దంలో శ్రీమంత శంకరదేవుడు నృత్యం, నాటకం, సంగీతం ద్వారా శ్రీకృష్ణుని బోధనలను వ్యాప్తి చేయడానికి భక్తి మార్గంగా ప్రవేశపెట్టారు. కుంభమేళాలో ప్రదర్శనలు సత్రియాకు కేంద్రంగా ఉన్న గొప్ప కథ చెప్పడం, ఆధ్యాత్మిక ఇతివృత్తాలను ప్రతిబింబిస్తాయి. ఔనియాతి సత్రం సత్రాధికార్ పీతాంబర్ దేవ్ గోస్వామి, అస్సాం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిష్ఠాత్మక వేదికపై ప్రాతినిధ్యం వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ బృందం జనవరి 31 నుండి ఫిబ్రవరి 10, 2025 వరకు ప్రయాగ్‌రాజ్‌లో ఉంటుంది. భగవత్ పఠనాన్ని నిర్వహిస్తుంది. ఈ భాగస్వామ్యం అస్సాంకు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఇది జనవరి 13 నుండి ఫిబ్రవరి 26, 2025 వరకు జరిగే పవిత్ర కుంభమేళాలో ప్రపంచ ప్రేక్షకులతో దాని సాంస్కృతిక సంప్రదాయాలను పంచుకోవడానికి వీలు కల్పిస్తుంది.

గణతంత్ర దినోత్సవం



మన ఇంటి గోడలకు భారతీయ కళాత్మక వారసత్వం

ఇటీవల కాలంలో వివిధ సాంప్రదాయ భారతీయ కళారూపాలు గృహాలంకరణ ద్వారా కొత్త వ్యక్తీకరణ, గుర్తింపును పొందాయి. ఇవి మన దేశీయ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'లైఫ్ ఎన్ కలర్స్' దేశం గుర్తింపుతో రూపొందించిన విభిన్న కళారూపాలను అందిస్తోంది. భారతదేశ కళాత్మక వారసత్వాన్ని తిరిగి ఊహించుకోవడానికి ప్రసిద్ధి చెందిన ఈ బ్రాండ్స్ బెస్పోక్ వాల్‌పేపర్‌లు, వాల్ ఆర్ట్, ప్రాచీన వారసత్వ కట్టడాలు కళ్లకు కడతాయి. గతాన్ని వర్తమానంతో అనుసంధానిస్తాయి. భారతీయ కళాత్మకతకు ప్రపంచవ్యాప్త ప్రశంసను అందిస్తున్నాయి.

రాజస్థాన్ రాజభవన కుడ్యచిత్రాలు, క్లిష్టమైన పెయింటింగ్స్ చాలా కాలంగా మన దేశీయ సంపదకు పర్యాయపదంగా ఉన్నాయి. ఈ పెయింటింగ్స్ గంభీరమైన కోట గోడలను అలంకరించాయి. శౌర్యం, శృంగారం, ఆధ్యాత్మికత కథలను కళ్లకు కడుతున్నాయి. ఉదాహరణకు.. మేవార్ ఇండియన్ ఎంబ్రాయిడరీ వాల్ ఆర్ట్ తీసుకుంటే ఇది రాజ్‌పుత్ పెయింటింగ్స్ శైలిలో పచ్చని ప్రకృతి దృశ్యాల మధ్య రాజ ఊరేగింపుల స్పష్టమైన చిత్రణతో ఉంటుంది. క్లిష్టమైన ఎంబ్రాయిడరీ, సాంప్రదాయ రాజస్థానీ కళాత్మకత కాలాతీత ఆకర్షణను కలిగిస్తుంది. ఇవి ఏ ఇంటికి అయినా అందమైన వెలుగును నింపుతున్నాయి.

పహారీ కళ.. ప్రతి స్ట్రోక్‌లో ప్రశాంతత

పహారీ (కాంగ్రా) మినియేచర్ పెయింటింగ్ స్కూల్ వివరణాత్మక ప్రకృతి దృశ్యాలు, రాధా–కృష్ణ ఇతివృత్తాల భావోద్వేగ చిత్రణలకు ప్రసిద్ధి చెందింది. ఈ సున్నితమైన కళాత్మకత లైఫ్ ఎన్ కలర్స్ సృష్టిలో సజీవంగా కనిపిస్తుంది. ఈ డిజైన్‌లో ప్రకృతి, పహారీ కళ ప్రశాంతత ఏ గదినైనా స్వర్గధామంగా మారుస్తుంది.

సంప్రదాయాల కోల్లెజ్

భారతీయ మినియేచర్ పెయింటింగ్‌లు, వాటి శక్తివంతమైన రంగులు, సంక్లిష్టమైన వివరాలతో, చాలా కాలంగా రాజ న్యాయస్థానాలు, దైవిక ప్రేమ, ప్రకృతి సౌందర్యం కథలను చెబుతున్నాయి. మొఘల్, రాజ్‌పుత్, ఇతర ప్రాంతీయ కళా పాఠశాలల నుండి ఉద్భవించిన ఈ మినియేచర్ కళాఖండాలు, వాటి గొప్ప షేడ్స్‌తో ఆధునిక డిజైన్‌ను ప్రేరేపిస్తాయి. లైఫ్ ఎన్ కలర్స్ ఈ గొప్ప సంప్రదాయాలను దాని శుద్ధి చేసిన సేకరణల ద్వారా జీవం పోస్తున్నాయి. షాన్, ఇండియన్ సీనిక్ డిజైన్ కస్టమైజ్డ్ వాల్‌పేపర్ మొఘల్ మినియేచర్‌ల సున్నితమైన ఆకర్షణ నుండి తీసిన పచ్చని ప్రకృతి దృశ్యాల మధ్య రాజ ఊరేగింపు చిత్రణను అద్భుతంగా అందిస్తుంది.

రికార్డ్ ఆర్ట్

నృత్యం చిత్తరువు అయితే..!

ఒక ఆర్ట్ షోను సందర్శించినప్పుడు మన మనస్సులో కొన్ని ప్రశ్నలు మెదలుతాయి. అవేంటంటే.. 'నేనేం చూస్తున్నాను? ఈ ఆర్ట్ నాకు ఎలాంటి అనుభూతిని కలిగిస్తుంది? నేను ఏ సందేశాన్ని నాతో పాటు ఇంటికి తీసుకువెళుతున్నాను? ఆర్ట్‌వర్క్ నాతో మాట్లాడుతుందా లేదా నన్ను ఆకర్షిస్తుందా?' ఇలాంటి ప్రశ్నల సముదాయానికి 'గ్రేస్‌ఫుల్ స్ట్రోక్స్' సరైన సమాధానం చెబుతుంది.

అక్కడ మనం ఏ మూల నుండి చూసినా ప్రతి పెయింటింగ్ మనతో మాట్లాడుతున్నట్టే ఉంటుంది. నృత్యకారుల కళారూపాన్ని పెయింటింగ్స్ చూపి, వాటితో చెన్నయ్‌లో ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

భరతనాట్యకారులు వారాంతంలో వివిధ కళాకృతులలో, భంగిమల ద్వారా భావోద్వేగాలను తిరిగి సృష్టించడానికి ప్రయత్నించారు. చెన్నయ్‌లోని 'గ్రేస్‌ఫుల్ స్ట్రోక్స్' అనే ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన పెయింటింగ్స్ జాకీ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి నమోదయ్యాయి. ఈ రికార్డు కోసం మొత్తం 170 మంది కళాకారులు కలిసి వచ్చారు. వీరికి ప్రముఖ కళాకారుడు – చిత్రకారుడు మణియం సెల్వం, కళాకారుడు–నటుడు–ఫ్యాషన్ ఎక్స్‌పర్ట్ శ్యామ్, సెయింట్ పాల్స్ మహాజన హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మార్టిన్ సగాయార్జ్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు.




పెయింటింగ్ భంగిమలు

ఇండియన్ ఆర్ట్ ఫ్యాక్టరీ సీఇవో సెల్వకన్నన్ 'యువతను కళలోకి తీసుకురావడానికి ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామ'ని చెప్పారు. సెల్వకన్నన్ మాట్లాడుతూ 'భారతీయ కళారూపాలు ఎల్లప్పుడూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. చాలా మంది ఆర్టిస్టులు తమ జీవితంలో ఏదో ఒక సమయంలో ఒక నృత్యకారుడి భంగిమను చిత్రించి ఉండాలి. ఈ ప్రదర్శనల ద్వారా రెండు నేపథ్యాల నుండి ప్రేక్షకులు వస్తారు. ఒకరు నృత్యకారులు, రెండు చిత్రకారులు. దీని వల్ల సంబంధిత కళారూపాలు వృద్ధి చెందుతాయి. ప్రేక్షకులలో మూడేళ్ల నుండి 80 ఏళ్ల వయస్సు గలవారుంటే ఎనిమిది నుంచి 70 ఏళ్ల మధ్యలో కళాకారులు ఉన్నారు. ఇక్కడ ప్రదర్శనలో పాల్గొన్న ఆర్టిస్ట్ గౌరి, ఒక ఉపాధ్యాయురాలు నుండి కళాకారిణిగా మారింది. కేవలం మూడు నెలల్లో ఆమె 36గీ36 కాన్వాస్‌పై తన కళను చిత్రించింది. నేను నృత్య రూపంలో మూడు ముఖ కవళికలను చూపించాను. కథాకళికి వేర్వేరు రంగులు, ఆకారాలు, అల్లికలు ఉన్నాయి కాబట్టి నేను ఈ పెయింటింగ్‌ను ఒక నెల కంటే తక్కువ సమయంలోనే సృష్టించాను' అని వివరించారు.

అమూల్యమైన ఆస్తి

ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశ్యం లక్ష్యం వైపు వేసే మొదటి అడుగు. 'ప్రజలు కళను పెట్టుబడిగా చూస్తున్నారు. ప్రతి ఇంటిలోనూ ఒక కళాకృతి ఉండటం గుర్తించదగింది. ''ఒక ఇంట్లో ఒక చెట్టు లాగా, ఇంటి ఇంటిలో మా పెయింట్ ఉండాలని కలలు కంటున్నాను. ఇది ఒక భారీ పెట్టుబడి. బంగారం తర్వాత, పెయింటింగ్ అనేది అత్యున్నతమైన పెట్టుబడి మార్కెట్. సాధారణ ప్రజలు ఇంకా దానిని అర్థం చేసుకోలేదు' అని సెల్వకన్నన్ తన అభిప్రాయాలను వెలిబుచ్చారు.



పాఠాలు నేర్చుకోవాలి

కళాకారుడు రామలింగం మాటల్లో.. ''ఏదైనా కళారూపంలో, ప్రసిద్ధి చెందిన వారిచే కళను వివరించకుండా, సృష్టించకుండా సృజనాత్మకంగా మారలేరు. సాధారణంగా మనం 'ఫలానా వారు నా కళను కాపీ చేశారు లేదా దానిని నాశనం చేసారు' అని నిందిస్తుంటారు. కానీ ఇప్పటికే ఉన్న దానిని చూడకుండా, కాపీ చేయకుండా, సాధన చేయకుండా ఉండటం అసాధ్యం. మీరు ఒక ప్రత్యేక కళాకారుడిగా ఉండాలనుకుంటే, ఇతర రచనల అందాన్ని నేర్చుకోవాలి. అప్పుడే అభినందించేలా మీ భావాలను ప్రకటిస్తారు.'గ్రేస్‌ఫుల్ స్ట్రోక్స్' అంతా నేర్చుకోవడం గురించే. సీనియర్ల నుండి అనుభవాన్ని సమతుల్యం చేసుకోవాలి, సృజనాత్మకంగా ఉండాలి, వర్ధమాన కళాకారుల నుండి కొత్తవాటిని అన్వేషించాలి. అందుకు కొత్త పాఠాలు నేర్చుకోవాలి. అన్నింటికంటే ముఖ్యమైనది 'కళ అందంగా ఉండాలి. విమర్శకులు మాత్రమే అర్థం చేసుకునేలా సంక్లిష్టంగా ఉండి, సామాన్యులు భయపడేలా అసాధారణంగా ఉండనవసరం లేదు' అని సెల్వకన్నన్ ఈ సందర్భంగా తెలియజేశారు.



మనం గెలిచినట్లు చెప్పాల్సింది..
మన కస్టమర్ ... మనకి మనం కాదు...
- మేరీ బర్రా, జనరల్ మోటార్స్ సీఈవో



భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో లెక్సస్ కారుతో ఒక మోడల్ పోజు

ఆటో ఎక్స్‌పో.. స్పందన అదరహో

పెద్ద ఎత్తున సందర్శిస్తున్న వాహనప్రియులు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తమ ఫేవరెట్ కొత్త కార్లు, బైక్‌లను చూసేందుకు వాహన ప్రియులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆదివారం నుంచి సాధారణ ప్రజానీకాన్ని కూడా అనుమతిస్తుండటంతో ఎంట్రీ పాయింట్లు, సెక్యూరిటీ చెక్ పాయింట్ల దగ్గర ప్రజలు బారులు తీరారు. సమీప ప్రాంతాల నుంచి కూడా వాహన ప్రియులు పెద్ద సంఖ్యలో వస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారీ జన సందోహాన్ని



ఊహించిన కంపెనీలు కూడా డిస్‌ప్లే ఏరియాల్లో మరింత మంది సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నాయి. పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు వాహనాల తయారీ సంస్థల సమాఖ్య డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సత్వరం స్పందించేందుకు పెద్ద ఎత్తున ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, వైద్య సదుపాయాలు మొదలైనవి ఏర్పాటు చేసినట్లు వివరించారు. జనవరి 17 నుంచి 22 వరకు జరిగే ఆటో ఎక్స్‌పోలో తొలి రెండు రోజులు మీడియా, వ్యాపార వర్గాలకు కేటాయించగా.. మిగతా రోజుల్లో సందర్శకులను అనుమతిస్తున్నారు. ఆటోమొబైల్ కంపెనీలు తొలి రెండు రోజుల్లో 90 పైచిలుకు కొత్త వాహనాలను ఆవిష్కరించాయి. పలు కాన్సెప్ట్‌లు, సరికొత్త ఆటోమోటివ్ టెక్నాలజీల మొదలైన వాటిని కూడా ప్రదర్శిస్తున్నాయి.

భారత్‌లో తయారీకి సిద్ధం: బీవైడీ



అన్నీ కలిసి వస్తే భారత్‌లో తయారీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చైనాకి చెందిన బీవైడీ ఇండియా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల విభాగం హెడ్ రాజీవ్ చౌహాన్ తెలిపారు. ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని వివరించారు. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తమ ప్రీమియం ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ సీలయన్7ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. భారత్‌లో తమకు ప్రస్తుతం ఏ కంపెనీతోనూ తయారీ కాంట్రాక్టులు లేవని ఆయన చెప్పారు. దేశీయంగా కంపెనీ కార్యకలాపాలు సాగించడానికి సంబంధించి చైనీయులపై భారత్ వీసా ఆంక్షల ప్రభావమేదేనా ఉందా అనే ప్రశ్నకు స్పందిస్తూ.. అలాంటిదేమీ లేదని చౌహాన్ చెప్పారు.

అడుగు పెట్టిన చోటల్లా.. ఆధిపత్యం!

ప్రతి విభాగంలో దిగ్గజంగా అవతరిస్తాం: ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి



న్యూఢిల్లీ: తాము కార్యకలాపాలు నిర్వహించే ప్రతి విభాగంలోనూ దిగ్గజంగా అవతరించడమే లక్ష్యమని ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి ప్రకటించారు. 'ఐటీసీ నెక్ట్స్ స్ట్రాటజీ' కింద పోటీతత్వాన్ని పెంచుకోవడం, ఆవిష్కరణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెట్టినట్టు చెప్పారు. భవిష్యత్‌కు అనుగుణంగా సంస్థను మార్చడం కోసం ఈ విధానాన్ని కంపెనీ చేపట్టడం గమనార్హం. డిజిటలైజేషన్, సుస్థిరత, ఆవిష్కరణలు, సరఫరా వ్యవస్థ సామర్థ్యం పోటీతత్వం పెంపునకు కీలకంగా గుర్తించినట్టు, వీటిలో ప్రత్యేక జోక్యం అవసరమని సంజీవ్ పురి తెలిపారు. ''మా వరకు ఐటీసీ నెక్ట్స్ స్ట్రాటజీ అన్నది ఓ ప్రయాణంలో అడుగు మాత్రమే. ఎన్నో విభాగాల్లో చెప్పుకోతగ్గ పురోగతి సాధించాం. ఈ ప్రయాణం ముగింపు దశలో ఉందని చెప్పడం లేదు. మేము పనిచేసే ప్రతి విభాగంలో పెద్ద సంస్థగా అవతరించడమే లక్ష్యం. కొన్ని విభాగాల్లో మేము ఇప్పటికే ప్రముఖ సంస్థగా ఉన్నాం''అని వివరించారు.

చురుగ్గా ఉండాల్సిందే..

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాతావరణ సంక్షోభాల నేపథ్యంలో ప్రపంచం ఇప్పుడు అనిశ్చిత వాతావరణంలో ఉన్నట్టు సంజీవ్ పురి చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఐటీసీ మాదిరి బడా సంస్థలు చురుకుగా, వినియోగదారు కేంద్రీకృతంగా మసలుకోవడం అవసరమన్నారు. ''భారత్‌లో తలసరి ఆదాయం, తలసరి వినియోగం దృష్ట్యా భారీ అవకాశాలున్నాయి. మా ప్రధాన వ్యాపారాన్ని పెంచుకుంటూనే, అనుబంధ వ్యాపారాల్లోకి విస్తరించడంతోపాటు, భవిష్యత్ విభాగాలను సృష్టించాల్సి ఉంది''అని తమ వ్యూహాలను వెల్లడించారు. ప్రస్తుతం ఐటీసీ వ్యాపారంలో 70 శాతం మేర ఒక్క సిగరెట్ల నుంచే వస్తుండడం గమనార్హం. నెక్ట్స్ స్ట్రాటజీలో భాగంగా వివిధ వ్యాపారాలపై మధ్య కాలానికి రూ.20,000 కోట్లను ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఐటీసీ ఇప్పటికే ప్రకటించింది. పేపర్ బోర్డ్ తయారీ సామర్థ్యాన్ని గత కొన్నేళ్లలో 33 శాతం మేర పెంచుకుంది. పేపర్ బోర్డ్‌తో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాల తయారీ అవకాశాలను గుర్తించినట్టు సంజీవ్ పురి తెలిపారు. మొక్కల ఆధారిత మౌల్డెడ్ ఫైబర్‌తో సుస్థిర ప్యాకేజింగ్ నూతన వృద్ధి విభాగంగా పేర్కొన్నారు. రూ.8,000 కోట్ల విలువైన ఆశీర్వాద్ బ్రాండ్ పోర్ట్‌ఫోలియో కింద.. ఆశీర్వాద్ ఫ్రోజెన్ ఫుడ్, ఫ్రోజెన్ స్నాక్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు పురి చెప్పారు.

క్యూ3 ఫలితాలు, ట్రంప్‌పైనే దృష్టి

- జాబితాలో బ్యాంకింగ్ దిగ్గజాలు, హెచ్‌యూఎల్, అల్ట్రాటెక్..
- యూఎస్ ప్రెసిడెంట్‌గా నేడు ట్రంప్ ప్రమాణ స్వీకారం
- ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై నిపుణుల అంచనాలు



ముంబై: ప్రపంచ దేశాలన్నీ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న అమెరికా ప్రెసిడెంట్ ప్రమాణ స్వీకారానికి నేడు(20న) తెరలేవనుంది. రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ రెండోసారి యూఎస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించనుండటంతో కొంతకాలంగా వాణిజ్య వర్గాలు అధికంగా ప్రభావితం కానున్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. వాణిజ్యంతోపాటు ఫైనాన్షియల్ మార్కెట్లపైనా ట్రంప్ ఎఫెక్ట్ ఉండబోతున్నట్లు మరోపక్క ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. ఇప్పటికే ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో యూఎస్ డాలరు నిరవధికంగా బలపడుతూ 109ను అధిగమించింది. అంతేకాకుండా 10ఏళ్ల ట్రెజరీ ఈల్డ్స్ 4.6 శాతాన్ని తాకాయి. ఈ ప్రభావంతో పలు ఆసియా కరెన్సీలతోపాటు రూపాయి సైతం డీలా పడుతోంది. డాలరుతో మారకంలో గత వారం దేశీ కరెన్సీ విలువ 86.62కు పడిపోయింది. వెరసి ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను 47వ యూఎస్ ప్రెసిడెంట్‌గా నున్న ట్రంప్ నిర్ణయాలు అత్యధికంగా ప్రభావితం చేయనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

బ్లూచిప్స్ జోరు

టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, ఆర్‌ఐఎల్, యాక్సిస్ బ్యాంక్‌తో ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభమైంది.

ఈ వారం మరికొన్ని దిగ్గజాలు అక్టోబర్–డిసెంబర్(క్యూ3) పనితీరు వెల్లడించనున్నాయి. జాబితాలో బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, సెంట్రల్ బ్యాంకుతోపాటు ఎఫ్ఎంసీజీ బ్లూచిప్ హిందుస్తాన్ యూనిలీవర్, డాక్టర్ రెడ్డీస్, అల్ట్రాటెక్ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, వన్97 కమ్యూనికేషన్స్(పేటీఎమ్), జొమాటో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లు ఆటుపోట్లను చవిచూడవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సరీ్వసెస్, వెల్త్‌మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు. ఆయా కంపెనీల పనితీరు ఆధారంగా స్టాక్స్‌లో యాక్టివిటీ నమోదయ్యే వీలున్నదని తెలియజేశారు.

బడ్జెట్‌పై కన్ను

క్యూ3 ఫలితాలతోపాటు వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌పై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ విశ్లేషకులు ప్రవేశ్ గౌర్ పేర్కొన్నారు. ఆదాయపన్నుసహా పలు రంగాల నుంచి సంస్కరణలకోసం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతులు అందుతున్న విషయం విదితమే. ద్రవ్య విధానాలు, ఆర్థిక వృద్ధి చర్యలు, పెట్టుబడుల కేటాయింపు, కీలక రంగాలలో సంస్కరణలు వంటి పలు అంశాలకు ప్రాధాన్యత ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఇదేవిధంగా దేశ, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, ముడిచమురు ధరలు సైతం మార్కెట్లలో సెంటిమెంటుకు కీలకంగా నిలవనున్నట్లు వివరించారు.

గత వారమిలా

దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో వారంలోనూ క్షీణపథంలోనే ముగిశాయి. 17తో ముగిసిన గత వారం సెన్సెక్స్ నికరంగా 760 పాయింట్లు(1 శాతం) నీరసించి 76,618 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 228 పాయింట్లు(1 శాతం) నష్టపోయి 23,203 వద్ద ముగిసింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ నామమాత్ర నష్టంతో నిలవగా.. స్మాల్‌క్యాప్ 0.8 శాతం డీలా పడింది.

ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలంగా భారత్..

సీఐఐ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా సవాళ్లతో కూడుకున్న పరిస్థితులు నెలకొన్న తరుణంలో భారత్ ప్రకాశవంతమైన కాంతిపుంజంగా నిలుస్తోందని పరిశ్రమల సమాఖ్య సీఐఐ ఒక సర్వే నివేదికలో వెల్లడించింది. ప్రైవేట్ పెట్టుబడులకు దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత అనుకూలంగా ఉందని పేర్కొంది. గత ముప్పై రోజులుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ సర్వే ఫిబ్రవరి తొలి వారంలో పూర్తవుతుందని. ఇప్పటివరకు అందిన వివరాల ఆధారంగా మధ్యంతర నివేదికను రూపొందించినట్లు వివరించింది. మొత్తం 500 సంస్థలు సర్వేలో పాల్గొంటుం



డగా.. 300 సంస్థల అభిప్రాయాల ఆధారంగా ప్రస్తుత నివేదిక రూపొందింది. దీని ప్రకారం 79 శాతం సంస్థలు గత మూడేళ్లలో మరింత మంది ఉద్యోగులను తీసుకున్నట్లు వివరించాయి. 75 శాతం సంస్థలు ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు .. ప్రైవేట్ పెట్టుబడులకు అనుకూలంగా ఉన్నాయని విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో తాము ఇన్వెస్ట్ చేస్తామంటూ 70 శాతం సంస్థలు వెల్లడించిన దాన్ని బట్టి చూస్తే వచ్చే కొద్ది త్రైమాసికాల్లో ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకునే సూచనలు కనిపిస్తున్నాయని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ వివరించారు. కీలక వృద్ధి చోదకాలైన ప్రైవేట్ పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన సానుకూలంగా కనిపిస్తున్నందున ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు స్థిరంగా 6.4–6.7 శాతం స్థాయిలో, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7 శాతం మేర ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

మిగతా విశేషాలు..

- రాబోయే సంవత్సరకాలంలో వచ్చే పెట్టుబడుల ప్రణాళికలతో తయారీ, సేవల రంగాల్లో ప్రత్యక్ష ఉద్యోగాల కల్పన సగటున వరుసగా 15 నుండి 22 శాతంగా ఉండొచ్చని అంచనా. ఈ రెండు రంగాల్లో పరోక్ష ఉద్యోగాల కల్పన దాదాపు 14 శాతం పెరగవచ్చనే అంచనాలు నెలకొన్నాయి.
- సర్వేలో పాల్గొన్న సంస్థల ప్రకారం సీనియర్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్/సూపర్‌వైజరీ స్థాయిలోని ఖాళీల భర్తీ కోసం 1 నుండి 6 నెలల సమయం పడుతోండగా, రెగ్యులర్.. కాంట్రాక్ట్ వర్కర్లను భర్తీ చేసుకోవడానికి తక్కువ సమయం పడుతోంది.
- గత ఆర్థిక సంవత్సరం తరహాలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోను సీనియర్ మేనేజ్‌మెంట్, మేనేజీరియల్/సూపర్‌వైజరీ ఉద్యోగులు, రెగ్యులర్ వర్కర్లకు వేతన వృద్ధి సగటున 10 నుండి 20 శాతంగా ఉంటుందని 40–45 శాతం సంస్థలు తెలిపాయి.

ఏథర్ ఇండస్ట్రీస్ లాభం రెట్టింపు

క్యూ3లో రూ. 43 కోట్లు

న్యూఢిల్లీ: స్పెషాలిటీ కెమికల్స్ తయారీ కంపెనీ ఏథర్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం రెట్టింపునకుపైగా జంప్‌చేసి రూ. 43 కోట్లను అధిగమించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 17 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 166 శాతం దూసుకెళ్లి రూ. 233 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 166 కోట్ల టర్నోవర్ మాత్రమే నమోదైంది. గుజరాత్ కాలుష్య నియంత్రణ బోర్డ్ గతంలో ఇచ్చిన మూసివేత ఆదేశాలను



ఈ నెల 9న రద్దు చేయడంతో సూరత్–2 యూనిట్ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో ప్రారంభించినట్లు కంపెనీ వెల్లడించింది. 2023 నవంబర్ 29న అగ్ని ప్రమాదం నేపథ్యంలో ప్లాంటు మూసివేత ఆదేశాలు జారీ అయిన సంగతి తెలిసిందే.

ఎన్ఎస్ఈలో ఏథర్ ఇండస్ట్రీస్ షేరు 4.6 శాతం పతనమై రూ. 815 వద్ద ముగిసింది.

వినియోగం, కనెక్టివిటీకి డిమాండ్

- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఫండ్ మేనేజర్ ప్రియాంక



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దశాబ్దాలుగా అంతంతమాత్రంగానే ఉంటున్న గ్రామీణ ఎకానమీ క్రమంగా పుంజుకుంటోందని, రాబోయే రోజుల్లో ఇది మరింత వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ ఫండ్ మేనేజర్ ప్రియాంక ఖండేల్వాల్ తెలిపారు. దేశ జీడీపీలో దాదాపు సగ భాగం వాటా ఉన్నప్పటికీ, ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతున్నప్పటికీ వ్యవసాయం మీదే ఎక్కువగా ఆధారపడటం వల్ల గ్రామీణ ప్రాంతాలవారి ఆదాయాలు పెద్దగా మారటంలేదని ఆమె పేర్కొన్నారు. దీనితో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ఆదాయాల మధ్య వ్యత్యాసం గణనీయంగా పెరిగిపోయిందని తెలిపారు. అయితే తయారీ రంగం, నిర్మాణ రంగాలు మెరుగ్గా రాణిస్తుండటం, నైపుణ్యాల అభివృద్ధి.. స్వయం ఉపాధిపై ప్రభుత్వం ఫోకస్ చేస్తుండటం వల్ల వ్యవసాయేతర ఉపాధి పెరగనుందని, గ్రామీణ ప్రాంతాల వారికి వచ్చే దశాబ్ద కాలం మరింత సానుకూలంగా ఉండగలదని ప్రియాంక చెప్పారు.

గ్రామీణ ఆదాయాలు పెరగడం వల్ల వినియోగం, కనెక్టివిటీకి డిమాండ్ నెలకొంటుందని ఆమె చెప్పారు. కన్జూమర్ డ్యూరబుల్స్, రవాణా, సౌకర్య సంబంధ ఉత్పత్తుల వినియోగం పెరుగుతుందని తెలిపారు. అలాగే, మెరుగైన మౌలిక సదుపాయాలు, చౌకగా టెక్నాలజీ అందుబాటులోకి వచ్చి కనెక్టివిటీ పెరగడం వల్ల టెలికం, ఆటో, కన్జూమర్ ఫైనాన్సింగ్ తదితర విభాగాలు రాణించగలవని వివరించారు. అటు ఆదాయాల పెరుగుదలతో పొదుపు, అలాగే బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సేవలకు డిమాండ్ నెలకొంటుందని ప్రియాంక చెప్పారు. అక్షరాస్యత, కొత్త నైపుణ్యాలతో గ్రామీణ యువత సంప్రదాయ సాగు ధోరణులకు భిన్నంగా కొత్త విధానాలను అమలు చేసే కొద్దీ వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతుందని వివరించారు. ఇలా, గ్రామీణాభివృద్ధి, వినియోగం ఆధారిత రంగాలతో ముడిపడి ఉండే సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆయా రంగాల వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ రూరల్ ఆపర్చ్యూనిటీస్ ఫండ్ ఇదే లక్ష్యంతో పని చేస్తోందని ఆమె చెప్పారు. దీనికి నిఫ్టీ ఇండియా రూరల్ ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుందని వివరించారు.

ఇంటి అద్దె చెల్లిస్తున్నారా.. ప్లాన్ చేసుకోండి..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

మీరు ఉద్యోగస్తులైతే, మీకిచ్చే జీతభత్యాల్లో బేసిక్, డీఏ, ఇంటద్దె అలవెన్సులు, ఇతర అలవెన్సులు ఉంటాయి. గవర్నమెంటు, పబ్లిక్ సంస్థల్లో అయితే, వారి వారి రూల్స్/ఒప్పందం ప్రకారం ఉంటాయి. అలాగే చెల్లిస్తారు. మీ ప్రమేయమే ఉండదు. ఇచ్చింది .. ఇచ్చినట్లు తీసుకోవాలి. ప్రైవేట్ సంస్థల్లో కొంచెం వెసులుబాటు ఉండొచ్చు. అక్కడ కూడా బలమైన ఉద్యోగ సంస్థలుంటే మన పప్పులుడకవ్! మీరు ఆ సంస్థలో ఎంతో ముఖ్యమైన వ్యక్తులైతే, ఉద్యోగిగానే కొనసాగుతుంటే బేరసారాలతో పాటు అలవెన్సుల సంగతిలోనూ వెసులుబాటు అడగవచ్చు. ఆ గొడవలన్నీ పక్కన పెడితే, యజమాని ఇచ్చే 'ఇంటద్దె అలవెన్సు' జీతంలో ఒక అంశం. మొత్తం జీతభత్యాలతో కలిసి ఉంటుంది. ఈ అలవెన్సును ఆదాయంగా పరిగణిస్తారు. పన్నుకి గురి అవుతుంది. అయితే, అద్దె ఇంట్లో ఉంటూ, మీరు అద్దె ఇచ్చినట్లయితేనే చట్టప్రకారం మినహాయింపు లభిస్తుంది. ఈ అలవెన్సు ఉద్దేశం, మీరు ఆ మొత్తం ఇచ్చి అద్దె ఇంట్లో ఉండటం. అద్దె కోసం ఆ మొత్తాన్ని వినియోగించడం జరగాలి.

ఈ మినహాయింపు పొందాలంటే కొన్ని షరతులు ఉన్నాయి.

- మీరు ఆ సంస్థలో ఉద్యోగిగానే ఉండాలి.
- మీరు అద్దె ఇంట్లోనే ఉంటూ అద్దె చెల్లిస్తుండాలి.
- అద్దె చెల్లిస్తున్నట్లు కాగితాలు, రుజువులు ఉండాలి.
- సొంత వ్యాపారస్తులకు, వృత్తి ఉన్నవారికి ఇది వర్తించదు.
- అద్దె అంటే వసతి కోసం ఇచ్చే అద్దె, నిర్వహణ ఖర్చులు మాత్రమే. కరెంటు చార్జీలు, నీటి చార్జీలు మొదలైనవి కావు.
- స్వంత ఇంట్లో ఉంటూ ఈ మినహాయింపు పొందకూడదు. కుటుంబ సభ్యులతో ఉంటూ అద్దె చెల్లించకపోతే ఈ మినహాయింపు ఇవ్వరు.
- ఇచ్చే జీతభత్యాల్లో ఈ అలవెన్సు లేకపోతే ఎటువంటి మినహాయింపు ఇవ్వరు.
- ఈ మూడింట్లో తక్కువ దాన్నే మినహాయిస్తారు.
  (a) వచ్చిన అలవెన్సు
  (b) చెల్లించిన అద్దెలో నుంచి 10 శాతం జీతం తీయగా, మిగిలిన మొత్తం
  (c) మెట్రో నగరాల్లో జీతంలో 50 శాతం, ఇతర ప్రాంతాల్లో జీతాల్లో 40 శాతం
- చెల్లించినట్లు రుజువు కావాలి. అవసరమైతే అగ్రిమెంటు, మీ బ్యాంకు అకౌంటు, ఓనర్ పాన్ కార్డు, ఓనర్ బ్యాంకు అకౌంటు, రశీదులు మొదలైనవి కావాలి.
- ఆ ప్రాంతంలో సొంత ఇల్లు ఉండకూడదు.
- మీరు ఎక్కడ పని చేస్తున్నారో ఆ ప్రాంతంలో అద్దె చెల్లించాలి.

అయితే, ఈ విధంగా మీరు ప్లాన్ చేసుకోవచ్చు.

- భార్యభర్తలు ఒకే ఇంట్లో కాపురం ఉంటూ ఇద్దరూ మినహాయింపు పొందకండి. ఇద్దరూ వేర్వేరు అగ్రిమెంటు ద్వారా పెద్ద ఇల్లు తీసుకుంటే ఎక్కువ అద్దె అయితే, అగ్రిమెంట్లు వేరు, చెల్లింపులు వేరు, రశీదులు వేరు, లెక్కలు వేరు.
- ఒక్కరే ఉద్యోగి అయి, మిగతావారు ఓనర్ అయితే, అగ్రిమెంటు రాసుకోండి. చెల్లింపులు సక్రమంగా చేయండి. పాన్ తీసుకోండి. అటు పక్క వ్యక్తికి సంబంధించిన ఇన్‌కంట్యాక్స్ లెక్కల్లో ఆదాయంగా చూపించండి.
- అలాగే తల్లిదండ్రుల దగ్గర ఉన్నా, మావగారింట్లో చూరు పట్టుకు వేళ్లాడుతున్నా.. అగ్రిమెంట్లు ముఖ్యం. చెల్లింపులు, రశీదులు, లెక్కలు పక్కాగా ఉండాలి.
- దొంగ ఇంటి నంబర్లు వేసి క్లెయిమ్ చేయకండి.
- మీ ఇంటికి మీరే ఓనర్ అని ఎడమ చేత్తో సంతకం పెట్టి క్లెయిమ్ చేయకండి.
- హైదరాబాదులాంటి మహానగరంలో స్వంత ఇల్లు ఉండగా అద్దె ఇంట్లో ఉండే పరిస్థితి ఏర్పడవచ్చు. స్వంత ఇల్లు మీద అద్దె ఆదాయంగా చూపిస్తూ, క్లెయిమ్ చేయండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.


దీర్ఘకాలంలో మోస్తరు రాబడులు

ఎస్‌బీఐ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్

దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్ కరెక్షన్లు మంచి పెట్టుబడుల అవకాశాలు తెచ్చిపెడతాయి. ఇప్పుడు మార్కెట్లో స్మాల్, మిడ్ క్యాప్ స్టాక్స్ చెప్పుకోతగ్గ స్థాయిలో దిద్దుబాటుకు గురయ్యాయి. ప్రస్తుతం లార్జ్‌క్యాప్ వ్యాల్యూషన్లు ఆరోగ్యకర స్థాయిలో ఉన్నాయి. ఈ ఏడాది లార్జ్ క్యాప్ కంపెనీలు మంచి పనితీరు చూపిస్తాయన్నది విశ్లేషకుల అంచనా. కానీ, దీర్ఘకాలంలో లార్జ్‌క్యాప్‌తో పోల్చినప్పుడు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌లో కొంత అదనపు రాబడి అందుకోవచ్చు. అందుకని దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేసే వారికి లార్జ్ అండ్ మిడ్‌క్యాప్‌లో ఇన్వెస్ట్ చేసే పథకాలు అనుకూలంగా ఉంటాయి. ఈ విభాగంలో ఎస్‌బీఐ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ దీర్ఘకాలంలో మోస్తరు, స్థిరమైన రాబడుల చరిత్ర కలిగి ఉంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.

రాబడులు

ఈ పథకం గడిచిన ఏడాది కాలంలో 14.43 శాతం రాబడిని ఇచ్చింది. మూడేళ్లలో చూస్తే వార్షిక రాబడి 14 శాతంగా ఉంది. ఐదేళ్లలో 19 శాతం, ఏడేళ్లలో 14 శాతం, పదేళ్లలో 14 శాతానికి పైనే వార్షిక ప్రతిఫలాన్ని ఇన్వెస్టర్లకు తెచ్చిపెట్టింది. అంటే దీర్ఘకాలలో 14 శాతం, అంతకంటే ఎక్కువ



రాబడులు అందించినట్టు తెలుస్తోంది. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్ విభాగం పనితీరుతో పోల్చి చూస్తే ఐదు, ఏడు, పదేళ్ల కాలంలో ఈ పథకంలోనే రాబడి ఎక్కువగా ఉంది. ఇక బీఎస్ఈ లార్జ్ మిడ్ క్యాప్ టీఆర్ఐ పనితీరుతో పోల్చి చూస్తే అన్ని కాలాల్లోనూ ఎస్‌బీఐ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ ఎక్కువ రాబడిని అందించింది.

పెట్టుబడుల విధానం/పోర్ట్‌ఫోలియో

ఈ పథకం వివిధ రంగాల్లో మెరుగైన అవకాశాలను గుర్తించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. వృద్ధి, వ్యాల్యూ ఇన్వెస్టింగ్ రెండూ ఈ పథకం పెట్టుబడుల విధానంలో భాగం. వృద్ధి అవకాశాలతో, ఆకర్షణీయమైన విలువల వద్ద ట్రేడ్ అవుతున్న స్టాక్స్‌ను గుర్తించి పెట్టుబడులు పెడుతుంది. టాప్ డౌన్, బోటమ్ అప్ విధానంలో స్టాక్స్‌ను ఎంపిక చేసుకుంటుంది. గత మార్కెట్ల నష్టాల సమయాల్లో ఎన్ఏవీ క్షీణతను తక్కువకు పరిమితం చేసింది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.29,268 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 98.48 శాతం పెట్టుబడులను ఇప్పటికే ఇన్వెస్ట్ చేయగా, 1.41 శాతం నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడుల్లో 65 శాతం లార్జ్ క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీలకు 30 శాతం పెట్టుబడులు కేటాయించింది. అంతేకాదు, స్మాల్‌క్యాప్ కంపెనీల్లోనూ 4 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. పెట్టుబడుల పరంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ప్రాధాన్యం ఇచ్చింది. 24 శాతం పెట్టుబడులు ఈ రంగాలకు చెందిన కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత టెక్నాలజీ కంపెనీలకు 14 శాతానికి పైనే పెట్టుబడులు కేటాయించింది. మెటీరియల్స్ కంపెనీల్లో 12 శాతం, హెల్త్ కేర్ కంపెనీలకు చెరో 11 శాతం, ఇండస్ట్రియల్ కంపెనీలకు 11 శాతానికి పైనే కేటాయింపులు చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.97
ఐసీఐసీఐ బ్యాంక్	3.24
రిలయన్స్ ఇండస్ట్రీస్	3.16
కోఫోర్జ్	3.04
ఎస్‌బీఐ	2.99
అబాట్ ఇండియా	2.79
హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ	2.74
ఇన్ఫోసిస్	2.44
కోటక్ బ్యాంక్	2.26
ఆల్కెమ్ ల్యాబ్	2.12

సబలెంకా సాఫీగా...

మ్యాచ్ మ్యాచ్‌కూ తన రాకెట్ పదును పెంచుతున్న బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకా ధాటికి ప్రత్యర్థులు తేలిపోతున్నారు. కచ్చితంగా గట్టిపోటీ ఇస్తారనుకుంటే... సబలెంకా ముందు వారు ఎదురు నిలువలేకపోతున్నారు. దాంతో సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా నాలుగో విజయంతో డిఫెండింగ్ చాంపియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఒక్క సెట్ కూడా కోల్పోకుండా నెగ్గిన సబలెంకాకు క్వార్టర్ ఫైనల్లో రష్యా సీనియర్ ప్లేయర్ అనస్తాసియా పావ్లీచెంకో ఏమేరకు పోటీనిస్తుందో వేచి చూడాలి. వరుసగా 17వసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆడుతున్న 27వ సీడ్ పావ్లీచెంకోవా ఇప్పటి వరకు మూడుసార్లు క్వార్టర్ ఫైనల్ చేరుకొని ముందంజ వేయలేకపోయింది. ఈ టోర్నీలో ఆమె తొలిసారి సెమీఫైనల్ బెర్త్ దక్కించుకోవాలంటే అత్యుత్తమ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది.



సబలెంకా

క్వార్టర్ ఫైనల్లోకి డిఫెండింగ్ చాంపియన్

- మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 14వ సీడ్ ఆంద్రీవాపై గెలుపు
- కేవలం మూడు గేమ్‌లు కోల్పోయిన బెలారస్ స్టార్
- శ్రమించి గెలిచిన కోకో గాఫ్

మెల్‌బోర్న్: 'హ్యాట్రిక్' టైటిల్ లక్ష్యం దిశగా ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా ఇంకో అడుగు వేసింది. 2023, 2024లలో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన సబలెంకా ఈసారీ టైటిల్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా 6-1, 6-2తో రష్యా రైజింగ్ స్టార్, 14వ సీడ్ మిరా ఆంద్రీవాపై అలవోకగా గెలిచింది. 62 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా కేవలం మూడు గేమ్‌లు మాత్రమే కోల్పోయింది. మూడు ఏస్‌లు సంధించిన సబలెంకా ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. 15 విన్నర్స్ కొట్టిన ఆమె 11 అనవసర తప్పిదాలు చేసింది. ఆంద్రీవా సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసిన సబలెంకా తన సర్వీస్‌ను ఒక్కసారీ చేజార్చుకోలేదు. నెట్ వద్దకు దూసుకొచ్చిన నాలుగుసార్లూ సబలెంకా పాయింట్లు నెగ్గడం విశేషం. మరోవైపు ఆంద్రీవా మూడు డబుల్ ఫాల్ట్‌లు, 18 అనవసర తప్పిదాలు చేసింది. సబలెంకాతోపాటు మూడో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), 11వ సీడ్ పౌలా బదోసా (స్పెయిన్), 27వ సీడ్ పావ్లీచెంకోవా (రష్యా) కూడా క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో కోకో గాఫ్ 5-7, 6-2, 6-1తో బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)పై కష్టపడి గెలుపొందగా... బదోసా 6-1, 7-6 ((7/2)తో ఓల్గా డానిలోవిచ్ (సెర్బియా)పై, పావ్లీచెంకోవా 7-6 (7/0), 6-0తో 18వ సీడ్ డోనా వెకిచ్ (క్రొయేషియా)పై వరుస సెట్‌లలో నెగ్గారు.

బోపన్న జోడీకి 'వాకోవర్'



మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న-షుయె జాంగ్ (చైనా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. బోపన్న-షుయె జాంగ్‌లతో ప్రిక్వార్టర్ ఫైనల్లో ఆడాల్సిన నాలుగో సీడ్ ద్వయం హ్యూగో న్యాస్ (మొనాకో)-టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా) గాయం కారణంగా బరిలోకి దిగలేదు. దాంతో బోపన్న-షుయె జాంగ్ కోర్టులో అడుగు పెట్టకుండానే క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నారు. తిమియా బాబోస్ (హంగేరి)-మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్); ఒలివియా గడెస్కీ-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జోడీల మధ్య మ్యాచ్ విజేతతో క్వార్టర్ ఫైనల్లో బోపన్న-షుయె జాంగ్ జంట తలపడుతుంది. తొలి రౌండ్‌లో బోపన్న-షుయె జాంగ్ 6-4, 6-4తో క్రిస్టినా మ్లాడెనోవిచ్ (ఫ్రాన్స్)-ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా)లపై గెలిచారు.

గత ఏడాది పురుషుల డబుల్స్ విభాగంలో ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి టైటిల్ నెగ్గిన బోపన్న ఈ ఏడాది మాత్రం కొత్త భాగస్వామి బారింటోస్ (కొలంబియా)తో కలిసి పోటీపడి తొలి రౌండ్‌లోనే ఓడిపోయాడు.

జొకోవిచ్ 15వసారి...



పురుషుల సింగిల్స్ విభాగంలో 10 సార్లు చాంపియన్, సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ 15వసారి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. చెక్ రిపబ్లిక్ ప్లేయర్, 24వ సీడ్ జిరీ లెహెస్కాతో ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 6-3, 6-4, 7-6 (7/4)తో విజయం సాధించాడు. 2 గంటల 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ తొమ్మిది ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. లెహెస్కా 11 ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 27 విన్నర్స్ కొట్టిన జొకోవిచ్ 21 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు జొకోవిచ్‌కంటే ఎక్కువ విన్నర్స్ (39) కొట్టిన లెహెస్కా ఏకంగా 44 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. లెహెస్కా సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసిన జొకోవిచ్ తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయాడు. నెట్ వద్దకు జొకోవిచ్ 18 సార్లు వచ్చి 16 సార్లు పాయింట్లు సాధించగా... లెహెస్కా 26 సార్లు ముందుకొచ్చి 18 సార్లు పాయింట్లు నెగ్గాడు.

క్వార్టర్ ఫైనల్లో అల్కరాజ్‌తో 'ఢీ'

రికార్డుస్థాయిలో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి పెట్టిన జొకోవిచ్‌కు క్వార్టర్ ఫైనల్లో అసలు సిసలు పరీక్ష ఎదురుకానుంది. గత ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ టోర్నీలు నెగ్గిన స్పెయిన్ స్టార్, మూడో సీడ్ కార్లోస్ అల్కరాజ్‌తో క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ తలపడనున్నాడు. అల్కరాజ్‌తో ముఖాముఖిగా ఏడుసార్లు పోటీపడ్డ జొకోవిచ్ నాలుగుసార్లు నెగ్గి, మూడుసార్లు ఓడిపోయాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాత్రం వీరిద్దరు తొలిసారి తలపడనున్నారు. ఆదివారమే జరిగిన ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 2-6, 6-3, 6-2తో 14వ సీడ్ ఉగో హంబెర్ట్ (ఫ్రాన్స్)పై, 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా) 6-1, 6-1, 6-1తో డేవిడోవిచ్ ఫొకీనా (స్పెయిన్)పై నెగ్గారు. 15వ సీడ్ జేక్ డ్రేపర్ (బ్రిటన్)తో జరిగిన మ్యాచ్‌లో అల్కరాజ్ 7-5, 6-1తో రెండు సెట్‌లు గెలిచాక అతని ప్రత్యర్థి గాయం కారణంగా వైదొలిగాడు.



రజతం నెగ్గిన జ్యోతి సురేఖ

సాక్షి, హైదరాబాద్: ఇండోర్ వరల్డ్ కప్ సిరీస్‌లో భాగంగా ఫ్రాన్స్‌లో జరిగిన నిమెస్ ఆర్చరీ టోర్నమెంట్‌లో భారత స్టార్ వెన్నం జ్యోతి సురేఖ రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో విజయవాడకు చెందిన జ్యోతి సురేఖ 146-147తో అలెజాండ్రా ఉస్కియానో (కొలంబియా) చేతిలో ఓడిపోయింది. క్వాలిఫయింగ్‌లో జ్యోతి సురేఖ 600 పాయింట్లకుగాను 592 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచింది.

షకీబ్‌పై అరెస్టు వారెంట్

జారీ చేసిన ఢాకా న్యాయస్థానం



ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌పై అరెస్టు వారెంట్ జారీ అయింది. అవామీ లీగ్ ఎంపీగానూ వ్యవహరించిన షకీబ్‌పై చెక్ బౌన్స్‌కు సంబంధించిన కేసులో ఢాకా న్యాయస్థానం చర్యలు తీసుకుంది. 'అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జైదుర్ రహమాన్.. షకీబ్ అల్ హసన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేశారు. మార్చి 24 నాటి ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని పోలీసులకు ఆదేశించారు' అని కోర్టు వర్గాలు వెల్లడించాయి. రాజకీయ అనిశ్చితి కారణంగా గతేడాది బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగగా... ప్రధానమంత్రి షేక్ హసీనా దేశం వీడారు. ఆ సమయంలో జరిగిన గొడవల్లో షకీబ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కాగా... అప్పటి నుంచి షకీబ్ బంగ్లాదేశ్‌కు తిరిగి రాకుండా విదేశాల్లో ఉంటున్నాడు. స్వదేశంలో చివరి టెస్టు ఆడాలని షకీబ్ ఆశించినా... భద్రత ఏర్పాట్ల విషయంలో హామీ లభించకపోవడంతో అతడు వెనక్కి తగ్గాడు. ప్రస్తుతం సందేహాస్పద బౌలింగ్ యాక్షన్ కారణంగా సస్పెన్షన్ ఎదుర్కొంటున్న షకీబ్‌ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చాంపియన్స్ ట్రోఫీకి పరిగణించలేదు.

రంజీ బాటలో జడేజా

సౌరాష్ట్ర తరఫున బరిలోకి దిగనున్న ఆల్‌రౌండర్



జడేజా

న్యూఢిల్లీ: జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలంటే... దేశవాళీల్లో తప్పక ఆడాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) చేసిన హెచ్చరికలు ఫలితాన్నిస్తున్నాయి. గతంలో అంతర్జాతీయ షెడ్యూల్ లేని సమయంలో కూడా దేశవాళీ మ్యాచ్‌లకు దూరంగా ఉన్న టీమిండియా ఆటగాళ్లు ఇప్పుడు... రంజీ ట్రోఫీలో ఆడేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో పేలవ ప్రదర్శన చేసిన భారత కెప్టెన్ రోహిత్ శర్మ ముంబై జట్టు తరఫున బరిలోకి దిగనున్నట్లు స్పష్టం చేయగా... ఇప్పుడు ఆ జాబితాలో స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా చేరాడు. చివరిసారిగా రెండేళ్ల క్రితం సౌరాష్ట్ర తరఫున బరిలోకి దిగిన జడేజా... ఈ నెల 23 నుంచి ఢిల్లీతో జరగనున్న మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఆదివారం రాజ్‌కోట్‌లో సౌరాష్ట్ర జట్టు సభ్యులతో కలిసి జడేజా ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. 'జడేజా ప్రాక్టీస్‌లో పాల్గొన్నాడు. ఢిల్లీతో జరగనున్న మ్యాచ్‌లో అతడు బరిలోకి దిగుతాడు' అని సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జయ్‌దేవ్ షా తెలిపారు. గతేడాది టి20 ప్రపంచకప్ అనంతరం ఆ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన ఈ స్పిన్ ఆల్‌రౌండర్... చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నాడు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి గాయం కారణంగా రంజీ మ్యాచ్ ఆడలేనని వెల్లడించగా... రిషభ్ పంత్, శుబ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ కూడా తమ తమ జట్ల తరఫున రంజీ మ్యాచ్‌లు ఆడనున్నారు. దీంతో ఢిల్లీ, సౌరాష్ట్ర మధ్య జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున రిషభ్ పంత్, సౌరాష్ట్ర తరఫున జడేజా ఆడనున్నారు.

విదర్భతో పోరుకు సిరాజ్

భారత పేసర్ మొహమ్మద్ సిరాజ్ హైదరాబాద్ తరఫున రంజీ మ్యాచ్ ఆడనున్నాడు. ఆస్ట్రేలియాతో 'బోర్డర్-గావస్కర్ ట్రోఫీ'లో ఐదు టెస్టు మ్యాచ్‌లాడిన సిరాజ్... పని భారం కారణంగా ఈ నెల 23 నుంచి హిమాచల్ ప్రదేశ్, హైదరాబాద్ మధ్య జరగనున్న మ్యాచ్‌కు ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. అయితే గ్రూప్ దశలో హైదరాబాద్ ఆడే చివరి మ్యాచ్‌లో సిరాజ్ బరిలోకి దిగనున్నట్లు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) వర్గాలు వెల్లడించాయి. 'వర్క్‌లోడ్ కారణంగా హిమాచల్ ప్రదేశ్‌తో మ్యాచ్‌లో సిరాజ్ ఆడటం లేదు. విదర్భతో పోరులో మాత్రం అతడు జట్టులో ఉంటాడు' అని ఓ హెచ్‌సీఏ అధికారి తెలిపారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో సిరాజ్‌కు చోటు దక్కని విషయం తెలిసిందే. కొత్త బంతితో పాటు పాత బంతితోనూ మెరుగైన ప్రదర్శన చేయగలడనే నమ్మకంతో సెలెక్టర్లు సిరాజ్‌ను కాదని అర్ష్‌దీప్ సింగ్‌ను ఎంపిక చేశారు.

తిప్పేసిన పాకిస్తాన్

- స్పిన్నర్లకే మొత్తం 20 వికెట్లు
- వెస్టిండీస్‌తో తొలి టెస్టులో 127 పరుగుల తేడాతో విజయం



సాజిద్ ఖాన్

ముల్తాన్: సొంతగడ్డపై చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభానికి ముందు పాకిస్తాన్ క్రికెట్ జట్టు చక్కటి ప్రదర్శన కనబర్చింది. వెస్టిండీస్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా మూడు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో పాకిస్తాన్ 127 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. పూర్తిగా స్పిన్‌కు సహకరించేలా రూపొందించిన పిచ్‌పై... సాజిద్ ఖాన్, అబ్రార్ అహ్మద్, నోమాన్ అలీ కలిసి ప్రత్యర్థి 20 వికెట్లు పడగొట్టడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 109/3తో ఆదివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ జట్టు 46.4 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షాన్ మసూద్ (52; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే అర్ధశతకం సాధించగా... మిగతా వాళ్లంతా విఫలమయ్యారు. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (5), సౌద్ షకీల్ (2), మొహమ్మద్ రిజ్వాన్ (2), ఆఘా సల్మాన్ (14) ఒకరి వెంట ఒకరు పెవిలియన్ బాటపట్టారు. కరీబియన్ బౌలర్లలో లెఫ్టార్మ్ స్పిన్నర్ వారికన్ 7 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 93 పరుగులతో కలుపుకొని వెస్టిండీస్ ముందు 251 పరుగుల లక్ష్యం నిలిచింది. బంతి గింగిరాలు తిరుగుతున్న పిచ్‌పై వెస్టిండీస్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 36.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌటైంది. అలిక్ అథనాజె (68 బంతుల్లో 55; 7 ఫోర్లు) ఒక్కడే హాఫ్‌సెంచరీ చేయగా... మిగిలిన వాళ్లు నిరాశపరిచారు. పాక్ బౌలర్లలో ఆఫ్‌స్పిన్నర్ సాజిద్ ఖాన్ 5 వికెట్లు పడగొట్టగా... అబ్రార్ అహ్మద్ 4 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 9 వికెట్లు తీసిన సాజిద్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య శనివారం నుంచి ముల్తాన్‌లోనే రెండో టెస్టు ప్రారంభంకానుంది.

చాంపియన్స్ ట్రోఫీతో అజింక్య రహానే, దయానా ఎడుల్జీ, వెంగ్‌సర్కార్, సచిన్ టెండూల్కర్, సునీల్ గావస్కర్, రవిశాస్త్రి, రోహిత్ శర్మ



చాంపియన్స్ ట్రోఫీతో వాంఖడేలో మరోసారి సంబరాలు

50వ వార్షికోత్సవ వేడుకల్లో రోహిత్ శర్మ వ్యాఖ్య ● 'వాంఖడే'తో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సచిన్, గావస్కర్, రవిశాస్త్రి

ముంబై: ప్రఖ్యాత వాంఖడే క్రికెట్ మైదానానికి భారత క్రికెట్‌తో ప్రత్యేక అనుబంధం ఉందని... టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. గతేడాది టి20 ప్రపంచకప్ అనంతరం వాంఖడే మైదానంలో జరిగిన వేడుకలను తానెప్పటికీ మరవలేనని... ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నెగ్గి మరోసారి అలాంటి సంబరాలు చేసుకోవాలనుందని రోహిత్ శర్మ వెల్లడించాడు. వాంఖడే స్టేడియం నిర్మించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఆదివారం ముంబై క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు స్టార్ క్రికెటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత కెప్టెన్ రోహిత్ మాట్లాడుతూ... '2024లో టి20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత తిరిగి ముంబైకి చేరుకున్న రోజు వచ్చిన స్పందన అనూహ్యం. సాగరతీరం మొత్తం అభిమానులతో నిండిపోవడాన్ని చూసి ఆశ్చర్యపోయా. మనవాళ్లతో కలిసి సంబరాలు చేసుకోవడంలో ఉన్న ఆనందమే వేరు. అది ఎలా ఉంటుందో ఒకటికి రెండుసార్లు చూశాను. 2007లో తొలిసారి టి20 ప్రపంచకప్ గెలిచినప్పుడు కూడా వాంఖడే స్టేడియంలో వేడుకలు నిర్వహించారు. అప్పుడు కూడా అభిమానులు బ్రహ్మరథం పట్టారు. 2011 వన్డే ప్రపంచకప్ గెలిచినప్పుడు కూడా అదే జరిగింది. త్వరలో చాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఈ మెగా టోర్నీ ఆడే సమయంలో 140 కోట్ల మంది భారతీయుల ఆశలు మా మీద ఉంటాయని తెలుసు. మరో ఐసీసీ ట్రోఫీని తీసుకువచ్చి ఇక్కడ సంబరాలు చేసుకునేందుకు ప్రయత్నిస్తాం' అని పేర్కొన్నాడు. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ మాట్లాడుతూ... వాంఖడేకు వస్తే ఇంటికి వచ్చినట్లే ఉంటుందని అన్నాడు. వాంఖడేలో ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన సచిన్ టెండూల్కర్ మాట్లాడుతూ... '2013లో కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించాలని నిర్ణయించుకున్నప్పుడు అప్పటి బీసీసీఐ అధ్యక్షుడు శ్రీనివాసన్‌తో చివరి టెస్టు వాంఖడేలో ఆడాలని ఉందని చెప్పా. నా అభ్యర్థనను అంగీకరించిన బోర్డు అందుకు అనుమతిచ్చింది. అప్పటి వరకు నేను మైదానంలో ఆడుతున్నప్పుడు మా అమ్మ ప్రత్యక్షంగా ఎప్పుడూ చూడలేదు. దీంతో కుటుంబ సభ్యుల సమక్షంలో ఇక్కడ కెరీర్ చివరి మ్యాచ్ ఆడా. ఆరోజు మైదానంలో అడుగు పెట్టినప్పుడు ఎలాంటి భావన కలిగిందో ఇప్పటికీ అదే అనిపిస్తుంది. ఇక నా జీవితంలో అత్యంత మధుర క్షణాలకు కూడా వాంఖడే వేదికగా నిలిచింది. 1983లో కపిల్‌దేవ్ సారథ్యంలోని టీమిండియా వన్డే ప్రపంచకప్ గెలిచినప్పుడు ఎంతో సంతోషించా. ఆ స్ఫూర్తితోనే ఆటపై మరింత దృష్టి పెట్టా. అయితే ఆ తర్వాత ఎన్నో ప్రయత్నాలు చేసినా వరల్డ్‌కప్ చేతికి చిక్కలేదు. ఎట్టకేలకు 2011లో నా కల వాంఖడే మైదానంలోనే నెరవేరింది' అని అన్నాడు. తాను ఇదే మైదానంలో 6 బంతులకు 6 సిక్స్‌లు కొట్టిన విషయాన్ని భారత మాజీ ఆటగాడు, మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి గుర్తు చేసుకున్నాడు. వాంఖడే 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు.



ఇది ముంబైలోని బాంద్రా-వర్లి సముద్ర సేతువు. దీనిపై పరుగెడుతున్న వారంతా పరుగుపందెం వీరులు. ఆదివారం జరిగిన టాటా ముంబై మారథాన్-2025 దృశ్యమిది.



ఈ ఫొటోలో దూకుతున్న చెవుల పిల్లిలా కనిపిస్తున్నది నిజానికి స్టార్లింగ్ పక్షుల సమూహం. ఇవి అనేక ఆకారాల్లో గుంపుగుంపులుగా సంచరిస్తుంటాయి. వీటిని ప్రఖ్యాత డెన్మార్క్ ఫొటో గ్రాఫర్ సొరెన్ సొల్కర్ తన కెమెరాలో ఇలా బంధించారు.



అమెరికాలోని హవాయి దీవిలో ఉన్న క్లాయియా అగ్ని పర్వతం నుంచి లావా పెల్లుబుకుతున్న దృశ్యమిది. డిసెంబర్ 23వ తేదీ నుంచి దఫాలుగా ఫౌంటెయిన్ మాదిరిగా ఏకంగా 100 మీటర్ల ఎత్తున లావాను విరజిమ్ముతోంది.

30 లక్షల కుక్కల హతం!

- ఫిఫా వరల్డ్ కప్ కోసం మొరాకో నిర్వాకం
- ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఆగ్రహం

2030 ఫిఫా వరల్డ్ కప్‌కు స్పెయిన్, పోర్చుగల్‌తో కలిసి ఆతిథ్యం ఇవ్వనున్న మొరాకో ఆ లోపు దేశంలో వీధికుక్కల బెడదను వదిలించుకోవాలని ప్రయత్నిస్తోంది. అందుకోసం ఏకంగా 30 లక్షల కుక్కలను చంపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం! విషం పెట్టడం మొదలుకుని నానారకాలుగా వాటి ఉసురు తీస్తోంది. రక్తపు మడుగులో నిస్సహాయ స్థితిలో ఉన్న కుక్కలను ట్రక్కుల్లోకి విసిరేస్తున్న హృదయ విదారక దృశ్యాలు షాక్‌కు గురి చేస్తున్నాయి. దీనిపై ఇంటర్నేషనల్ యానిమల్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కోలిషన్ (ఐఏడబ్ల్యూపీసీ) ఆందోళన వ్యక్తం చేసింది. 'మొరాకోస్ అగ్లీ సీక్రెట్' పేరుతో ప్రచారాన్నే ప్రారంభించింది. ఇంజక్షన్లు, ఆహారం ద్వారా విషమిచ్చి కుక్కలను అమానవీయంగా చంపుతున్నారని పేర్కొంది. దీనిపై తక్షణమే జోక్యం చేసుకోవాలంటూ ఫిఫాకు లేఖలు వెల్లువెత్తుతున్నాయి. లేదంటే ఫిఫా ప్రతిష్ఠ మసకబారుతుందని పర్యావరణ ప్రముఖులు హెచ్చరిస్తున్నారు.

భయానకం...

మొరాకో వీధుల్లో వీధి కుక్కలు నొప్పితో కేకలు వేస్తున్న వీడియోలు వైరలవుతున్నాయి. కుక్క పిల్లను తలకిందులుగా వేలాడదీసి, భయభ్రాంతులకు లోనై చూస్తున్న కుక్కల ట్రక్కులోకి విసిరేయడం కనిపించింది. మరో వీడియోలో రెండు కుక్కలు రక్తమోడుతూ నేలపై పడున్నాయి. ఇదంతా పిల్లల ముందే జరుగుతుండటంతో వారు తీవ్ర దిగ్భ్రాంతికి లోనవుతున్నారని ఐఏడబ్ల్యూపీసీ తెలిపింది. దాంతో మొరాకోపై అంతర్జాతీయంగా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



నడుస్తున్న కారు ముందు భాగాన్ని ఓ గద్ద వేగంగా వచ్చి ఢీకొట్టింది. బోయ్‌నెట్ దిగువ నుండే గ్రిల్‌లో ఇలా ఇరుక్కుపోయింది. అనంతరం ఆ వాహనం డ్రైవర్ దానిని సురక్షితంగా వెలుపలికి తీసి, వదిలేశారు. అమెరికాలోని మసాచుసెట్స్‌లో ఇటీవల జరిగిందీ ఘటన.

ఆధ్యాత్మిక మేళాలో యువ తరంగాలు

కుంభమేళాకు పోటెత్తుతున్న యూత్


నవతరం యువత ఆధ్యాత్మిక బాట పడుతోంది. మహా కుంభమేళాలో ఎక్కడ చూసినా యువోత్సాహం వెల్లివిరుస్తోంది. పీఠాధిపతులు, సన్యాసులు, నాగా సాధువులు, పెద్దవాళ్లకు దీటుగా జెన్ జెడ్ (కొత్త తరం) యువతీ యువకులు కూడా మేళాకు పోటెత్తుతున్నారు. చేతిలో స్మార్ట్ ఫోన్, చంకన లాప్‌టాప్‌తోనే తమదైన శైలిలో ఆధ్యాత్మికాన్వేషణలో మునిగి తేలుతున్నారు. తీర్థయాత్రలు, ఆధ్యాత్మిక వేడుకలు మధ్య వయస్కులు, వృద్ధులకు మాత్రమే పరిమితం కాదని నిరూపిస్తున్నారు.

ఎందుకొస్తున్నారు?

గత కుంభమేళాతో పోలిస్తే ఈసారి యువత రాక బాగా పెరగడం విశేషం. తమను పలకరించిన మీడియాతో వారు ఆసక్తికరమైన విషయాలు పంచుకుంటున్నారు. ''చిన్నప్పటి నుంచి అమ్మమ్మలు, తాతయ్యల నోట పంచతంత్ర కథలతోపాటు ఆధ్యాత్మిక విషయాలు, మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్ల గురించి ఎంతో విన్నాం. వాటినే స్వయంగా వచ్చి పాటిస్తున్నామంతే'' అని త్రివేణి సంగమం వద్ద కొందరు యువతీ యువకులు చెప్పారు. ''మా తాత, అమ్మమ్మ, నాన్నమ్మ కుంభమేళా గొప్పతనం గురించి ఎంతగానో చెప్పారు. ప్రత్యక్షంగా తెలుసుకుందామని వచ్చాం'' అని సంస్కృతి మిశ్రా అనే యువతి చెప్పింది. ''గంటగంటకు లక్షలాది మంది వచ్చిపోయే సంగమ స్థలిలో పేరుకుపోయే చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తూ పరిశుభ్రతను కాపాడుతున్న తీరు అద్భుతం. ఈ వేస్ట్ మేనేజ్‌మెంట్ పాఠాలను ప్రత్యక్షంగా నేర్చుకునేందుకు వచ్చా'' అని అమీషా అనే అమ్మాయి చెప్పింది.

అక్షరాలా అద్భుతమే

''కుంభమేళా గురించి ఎవరో చెబితే వినడం వేరు. ఆ భక్తి పారవశ్యాన్ని కళ్లారా చూడడం వేరు. నాకు ఇన్‌స్టాలో 18,000 మంది ఫాలోవర్లున్నారు. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఇతరులను ప్రభావితం చేయడానికి ముందు నేనే స్వయంగా చూడాలని వచ్చా. అప్పుడే మహా కుంభమేళా మహిమ ప్రత్యక్షంగా తెలిసి వచ్చింది. ఈ ఆధ్యాత్మికతను, కోట్లమందితో కలిసి పుణ్యస్నానం చేస్తే వచ్చే అనుభూతి, ప్రశాంతతను మాటల్లో వర్ణించలేం. కుంభమేళా విషయంలో ప్రయాగ్‌రాజ్ నిజంగా సాంస్కృతిక రాజ్యమే'' అని 23 ఏళ్ల జ్యోతి పాండే చెప్పారు. ''ఇంతమందిని ఒక్కచోట చూస్తే ఎంతో సుందరంగా ఉంది. ప్రజల విశ్వాసాలు, నమ్మకాలు గొప్పవి. నాకైతే ఇక్కడి కొస్తున్న వాళ్లలో సగం మంది యువతే కనిపిస్తున్నారు. మేళాకు వచ్చి సనాతన భారతీయ సంస్కృతిలో భాగమైనందుకు సంతోషంగా ఉంది'' అని అక్షయ్ అనే 20 ఏళ్ల హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి అన్నాడు. అతను ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ క్యాంప్‌లో భాగస్వామిగా పనిచేస్తున్నాడు.



''తల్లిదండ్రులతో కలిసి మూడ్రోజులు ఇక్కడే మేళా మైదానంలో ఉండేందుకు వచ్చా. తెల్లవారుజామునే చలిలో పుణ్యస్నానాలు చేసేందుకు అంతా ఆసక్తి చూపిస్తున్నారు. భక్తుల అచంచల విశ్వాసం కుంభమేళాలో అణువణువుగా కనిపిస్తుంది'' అని 23 ఏళ్ల ఢిల్లీ వర్సిటీ సైకాలజీ విద్యార్థిని సంస్కృతి చెప్పారు. ''భక్తుల గేయాలు, నినాదాలతో సంగమ క్షేత్రమంతా హోరెత్తిపోతుంది. ఢిల్లీలాంటి కాంక్రీట్ వనం నుంచి ఇలాంటి పుణ్యతీర్థాలకు వచ్చినప్పుడే మన మూలాలేమిటో స్మరణకు వస్తాయి'' అన్నారు. ''కోట్లాది మంది ఒకే విశ్వాసంతో ఒక్కచోట చేరడాన్ని 144 ఏళ్లకొకసారి వచ్చే ఇలాంటి కుంభమేళాలోనే చూడగలం. ఇది నిజంగా అరుదైన విషయమే. నేను చిత్రలేఖనం చేస్తా. పసుపు, కుంకుమ, విభూతి, రంగులతో అలరారే మేళా పరిసరాలను చిరకాలం నిలిచిపోయేలా సప్తవర్ణ శోభితంగా నా కుంచెతో చిత్రిస్తా'' అని దరాబ్ చెప్పాడు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అనుభవైకవేద్యమే

''ఎవరో చేసే వీడియోలో, రీల్స్‌లో కుంభమేళాను చూడడం కాదు. మీరే స్వయంగా వచ్చి పుణ్యస్నానం ఆచరించి దాన్ని వీడియోలు, రీల్స్ చేసి చూడండి. ఈ స్థలం విశిష్టతేమిటో అప్పుడు తెలుస్తుంది! యువతకు ఆధ్యాత్మిక కనువిందే కాదు, కడుపునిండా భోజనమూ ఉచితంగా అందిస్తారు. ఇక్కడ రెండు నెలలపాటు ఉచిత భండార్‌లు అందుబాటులో ఉంటాయి. ఆధ్యాత్మికత, ఆనందాల మేళవింపు ఈ మేళా'' అని 'ది లలన్‌టాప్' వార్తా సంస్థ ఉద్యోగి అభినవ్ పాండే చెప్పారు.

ఓట్ల చీలికపై బీజేపీ ఆశలు!

కాంగ్రెస్ ఓట్లు పెరిగితేనే లాభమని కాషాయ పార్టీ అంచనాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌తో జరుగుతున్న హోరాహోరీ పోరులో బీజేపీ అంచనాలు వేరుగా ఉన్నాయి. ఈ ఎన్నికల్లో తన ప్రత్యర్థి కాంగ్రెస్ బలం పుంజుకోవాలని కోరుకుంటోంది. అలా కాంగ్రెస్ పార్టీ ఓట్లను చీల్చ గలిగితే తమకు లాభమని లెక్కలు వేస్తోంది. ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ మెజార్టీ ఓట్లను కొల్లగొడితే ఓట్లు చీలి, తమకు అనుకూలమవుతుందన్నది కాషాయ పార్టీ అంచనాగా ఉంది. గత ఎన్నికల అనుభవాలను ఇందుకు ఉదాహరణగా చూపుతోంది.

1993లో జరిగిందిదే..

ఓట్ల చీలికతో కలిగే లాభంపై బీజేపీ వ్యూహకర్తలు 1993 ఎన్నికలను గుర్తు చేస్తున్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు నువ్వానేనా అన్నట్లు పోరాడ గా జనతాదళ్ పుంజుకొని కాంగ్రెస్ ఓట్లను చీల్చింది. అప్పటి ప్రధాని వీపీ సింగ్ రాజకీయాల ప్రభావంతో ఢిల్లీలో 12 శాతం ఓట్లతో 4 స్థానాలను జనతాదళ్ గెలుచుకుంది. దీంతో కాంగ్రెస్ ఓట్ల శాతం 35 శాతం పడిపోగా, బీజేపీ ఓట్లు 43 శాతం పెరిగాయి. దీంతో 70 స్థానాలకుగాను 49 సీట్లను గెలుచుకుని బీజేపీ అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో బీఎస్పీ సైతం 2 శాతం ఓట్లు సాధించి చాలా చోట్ల కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీసింది. ప్రస్తుతం బలంగా ఉన్న ఆప్‌ను దెబ్బతీయాలంటే గత రెండు ఎన్నికల్లో ఏమాత్రం ప్రభావం చూపని కాంగ్రెస్ బలం పుంజుకోవాలన్నది బీజేపీ కోరిక. 2008లో 48 శాతం ఓట్లతో 43 సీట్లు సాధించిన కాంగ్రెస్ 2013లో 24.70 శాతం ఓట్లతో 7 సీట్లకు పరిమితమైంది. ఆ తర్వాత 2015 ఎన్నికల్లో 9.7 శాతం, 2020లో 4.3 శాతం ఓట్లతో కాంగ్రెస్ ఒక్క సీటూ గెలుచుకోలేకపోయింది. ఇదే సమయంలో బీజేపీ మాత్రం 2015లో 32.3 శాతం ఓట్లతో 3 స్థానాలు, 2020లో 38.7 శాతం ఓట్లతో 8 సీట్లను గెలుచుకుంది. ప్రస్తుతం తన బలాన్ని 38.7 శాతం నుంచి 50 శాతం వరకు పెంచుకుంటూనే, ఆప్ బలాన్ని తగ్గించాలని చూస్తోంది. 2015 ఎన్నికల్లో ఆప్ 54.5 శాతం ఓట్లతో 67, 2020లో 53.8 శాతం ఓట్లతో 62 స్థానాలను రాబట్టుకుంది. ఆప్‌ను నిలువరించాలంటే తన బలాన్ని పెంచుకోవడంతో పాటు, ఆప్ ఓట్లను గణనీయంగా తగ్గించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంతబలంగా ఆప్‌పై పోరాడుతుందన్నది కీలకంగా మారనుంది. మొన్నటి హరియాణా ఎన్నికల్లో సుమారు 10 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లను ఆప్, బీఎస్పీలు చీల్చడంతో ఆ పార్టీ అధికారంలోకి రాకుండా బీజేపీ అడ్డుకోగలిగింది. ఇదే తరహాలో ఢిల్లీ ఎన్నికల్లోనూ జరగాలని బీజేపీ భావిస్తోంది.

ఇలాంటి హింసను ఎన్నడూ చూడలేదు

ఓటమి భయంతోనే బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది • తన కాన్వాయ్‌పై రాళ్ల దాడిపై కేజ్రీవాల్ ఆరోపణలు

ఇది బీజేపీ గూండాల పనేనన్న సీఎం ఆతిశీ • ప్రశ్నిస్తే దళితులను చంపేస్తారా?: పర్వేశ్ వర్మ ఫైర్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌పై రాళ్లదాడి ఘటన ఎన్నికల వేడిని మరింత పెంచింది. బీజేపీ, ఆప్‌లు ఈ ఘటనకు కారణమంటూ పరస్పరం దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. ఢిల్లీ ప్రజలు ఇలాంటి హింస గతంలో ఎప్పుడూ చూడలేదంటూ కేజ్రీవాల్ మండిపడగా ఇది బీజేపీ గూండాల పనేనంటూ సీఎం ఆతిశీ నిప్పులు చెరిగారు. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే దళితులను చంపేస్తారా? అంటూ బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ ఎదురుదాడికి దిగారు.

వాళ్ల ఓటమి భయం: కేజ్రీవాల్

ఢిల్లీలో గతంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నడూ ఇలాంటి హింసాత్మక ఘటనలను ప్రజలు చూడలేదని



ఆదివారం కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'బీజేపీ వాళ్లు ఓడిపోతున్నారు. ఈ పద్ధతిలోనే ఎన్నికల్లో పోటీ చేయడం వాళ్లకు తెలుసు' అని ఆయన చెప్పారు.

బీజేపీ గూండాల పనే: ఆతిశీ: బీజేపీకి చెందిన గుండాలే కేజ్రీవాల్‌పై దాడి చేశారని ఢిల్లీ సీఎం ఆతిశీ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీకి చెందిన రాహుల్ అలియాస్ శాంకి, రోహిత్ త్యాగి, సునీల్ అనే ముగ్గురు పర్వేశ్ వర్మ అనుయాయులని చెప్పారు. వీరిపై దోపిడీలు, చోరీలు, హత్యాయత్నం కేసులున్నాయని తెలిపారు.

ప్రశ్నిస్తే దళితులను చంపేస్తారా?: పర్వేశ్ వర్మ

గతంలో ఆప్ ఇచ్చిన హామీలు, ఉపాధి, ఉద్యోగాల గురించి ప్రశ్నించిన పాపానికి దళితులను చంపేస్తారా? అంటూ బీజేపీ న్యూఢిల్లీ అభ్యర్థి పర్వేశ్ వర్మ నిలదీశారు. కేజ్రీవాల్ కాన్వాయ్ దాడి ఘటనలో గాయపడిన రోహిత్ త్యాగి, శాంకి, వాల్మీకి సంఘం ప్రతినిధులతో కలిసి పర్వేశ్ వర్మ విలేకరులతో మాట్లాడారు. కేజ్రీవాల్ కారు ఘటనలో గాయపడిన ముగ్గురూ వాల్మీకి సామాజిక వర్గానికి చెందినవారని తెలిపారు. ఆరోజు వాళ్లను తొక్కేయ్, చంపేయ్ అంటూ చేయితో కేజ్రీవాల్ డ్రైవర్‌కు ఆదేశాలిచ్చారన్నారు. కేజ్రీవాల్‌పై దాడి జరిగింది అనేది పెద్ద అబద్ధమన్నారు. వాల్మీకి లను గూండాలు, క్రిమినల్ అంటే సహించేది లేదన్నారు.

ఇంటికన్నా జైలే పదిలం

జైల్లో ఉండేందుకే మొగ్గు చూపుతున్న జపాన్ వృద్ధ మహిళలు

అక్కడంతా.. చేతులు ముడతలు పడిపోయి, నడుములు ఒంగిపోయి.. కొందరు వాకర్ల సహాయంతో.. ఇంకొందరు సహాయకుల ఆసరాతో కారిడార్లలో నెమ్మదిగా తిరుగుతూ ఉంటారు. భోజనం, మందులు ఇచ్చేది కూడా సహాయకులే. అది కచ్చితంగా వృద్ధాశ్రమం అని అనుకుంటే మీరు పొరపాటు పడ్డట్టే. ఎందుకంటే అది జపాన్ రాజధాని టోక్యోలోని అతి పెద్ద మహిళా జైలు. వృద్ధ మహిళలు నేరాలు చేసి మరీ ఈ జైలుకు వస్తున్నారు. ఇంటి దగ్గర కంటే వారు జైలులో ఉండటానికే ఇష్టపడటానికి కారణం తెలియాలంటే ఇది చదవాల్సిందే!

వినడానికి వింతగా ఉన్నా.. జపాన్‌లోని వృద్ధ మహిళలు జైళ్లలో ఉండేందుకే ఇష్టపడుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఒంటరితనం. బయట వారికి లేని సాంగత్యం జైళ్లలో దొరుకుతోంది. అంతేకాదు క్రమం తప్పకుండా ఆహారం, ఉచిత ఆరోగ్య సంరక్షణ, వృద్ధాప్యంలో కావాల్సిన ఆసరా ఇక్కడ లభిస్తోంది. దీంతో జైలుకు వచ్చేందుకే ఇష్టపడుతున్నారు. యోకో అనే 51 ఏళ్ల మహిళ గత 25 ఏళ్లలో ఐదు సార్లు జైలు శిక్ష అనుభవించారు. తాను వచ్చిన ప్రతిసారీ జైలు జనాభా పెరిగినట్లు కన్పిస్తోందని చెబుతున్నారు.

ఒంటరితనానికి తోడు పేదరికం..

జైలులోకి రావడానికి అత్యధిక మంది చేసే నేరం దొంగతనం. వృద్ధ ఖైదీలు, ముఖ్యంగా మహిళల్లో దొంగతనం సర్వసాధారణమైన నేరం. 2022లో దేశవ్యాప్తంగా 80 శాతానికి పైగా వృద్ధ మహిళా ఖైదీలు దొంగతనాలకు పాల్పడి జైళ్లలో ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. కొందరు ఒంటరిగా ఉండలేక దొంగతనాలకు పాల్పడుతుంటే మరికొంత మంది మనుగడ కోసం చేస్తున్నారు. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) ప్రకారం.. జపాన్‌లో 65 ఏళ్లు పైబడిన వారిలో 20% మంది పేదరికంలో నివసిస్తున్నారు. సంస్థలో ఉన్న 38 సభ్య దేశాలలో ఈ సగటు 14.2% శాతం ఉండగా.. జపాన్‌దే అత్యధికం. పేదరికంలో ఉన్న పిల్లలు సైతం.. తమ తల్లిదండ్రులు ఆకలితో ఉండే కంటే ఇలా దూరంగా వెళ్లిపోవడమే మంచిదని కోరుకుంటున్నారు. ఇదే జైలులో ఉన్న 81 ఏళ్ల అకియో పేదరికం, ఒంటరితనం రెండింటితో బాధపడుతున్నారు. రెండు నెలలకోసారి వచ్చే నామమాత్రపు పెన్షన్ ఆమెకు జీవనాధారం. ఆర్థిక స్థిరత్వం, సౌకర్యవంతమైన జీవనశైలి ఉంటే కచ్చితంగా ఇలా చేసి ఉండేదాన్ని కాదని చెబుతారామె. గతంలో ఆహారాన్ని దొంగిలించిన కేసులో జైలు శిక్ష అనుభవించిన అకియో.. జైలుకు రావడం ఇదిరెండోసారి.



ఉచిత వైద్యం..

అనారోగ్యానికి గురైన వారు జైలులో ఉంటే వారికి ఉచిత వైద్యం అందుతుంది. బయటికి వెళ్తే దానికోసం ఎక్కువ డబ్బు చెల్లించాల్సి వస్తోంది. దీంతో కొంతమంది సాధ్యమైనంత ఎక్కువకాలం ఇక్కడ ఉండాలని కోరుకుంటారని జైలు గార్డు షిరానాగ తెలిపారు. ఇప్పటికీ జైళ్లు తెల్ల వెంట్రుకలు కలిగిన ఖైదీలతో నిండిపోయాయి. టోచిగిలో ఉన్న జైలులో ఐదుగురు ఖైదీలలో ఒకరు వృద్ధులు. ఇక్కడ ఒక్కచోటే కాదు.. జపాన్ అంతటా, 2003 నుంచి 2022 వరకు 65 లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గల ఖైదీల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగింది. ఇది జైలు స్వభావాన్ని మార్చింది. ఇప్పుడవి వృద్ధాశ్రమాల్లా ఉన్నాయి. ఇక్కడ వారికి సహాయకులు ఖైదీలు తినడానికి, వారి స్నానానికి, డైపర్లు మార్చడానికి కూడా సహాయపడాలని షిరానాగ చెప్పారు. అది దోషులతో నిండిన జైలు కంటే నర్సింగ్ హోమ్ లాగా అనిపిస్తుందని చెబుతారాయన.

సహాయక సిబ్బంది కొరత..

జపాన్‌లో వయోవృద్ధుల జనాభా చాలా వేగంగా పెరుగుతోంది. దీంతో సహాయక సిబ్బంది కొరత కూడా పెరుగుతోంది. 2040 నాటికి 21 లక్షల మంది సంరక్షణ కార్మికులు అవసరమవుతారని ప్రభుత్వం తెలిపింది. జనాభా మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయడానికి విదేశాల నుంచి ఉద్యోగులను తీసుకోవడానికి తంటాలు పడుతోంది. ఇక జైలులో నర్సింగ్ అర్హతలు ఉన్న ఖైదీలను ఇతర వృద్ధ ఖైదీలకు నర్సింగ్ సంరక్షణను అందించమని అధికారులు కోరుతున్నారు. దీంతో వృద్ధ ఖైదీలను చూసుకోవడానికి తగినంత మంది జైలు సిబ్బంది లేనప్పుడు వారు సహాయపడుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

మంచు గుప్పెట్లో అమెరికా

7 కోట్ల మందిపై ప్రభావం

బోస్టన్: అమెరికా తూర్పు తీర ప్రాంత రాష్ట్రాల్లో ఏకంగా ఏడు కోట్ల మంది భారీ మంచు, అతి శీతల వాతావరణ పరిస్థితులతో అల్లాడుతున్నారు. న్యూ ఇంగ్లండ్, మసాచుసెట్స్, న్యూహ్యాంప్‌షైర్, మైన్, కనెక్టికట్‌లలో ఆదివారం ఏకంగా 25 సెంటీమీటర్ల మంచు కురిసింది. ఫిలడెల్ఫియా, న్యూయార్క్, బోస్టన్ తదితర మహా నగరాల్లో సోమ, మంగళవారాల్లో ఏకంగా 15 సెంటీమీటర్ల మేర మంచు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ విభాగం హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు ఏకంగా మైనస్ 34 డిగ్రీల సెల్సియస్ నుంచి మైనస్ 48 డిగ్రీలకు పడిపోతాయని తెలిపింది. మంచు కారణంగా రహదారులపై ప్రయాణం ప్రమాదకరమని తెలిపింది.

నాగ సాధువుల దీక్షా కార్యక్రమం ప్రారంభం

మహాకుంభ్ నగర్(యూపీ): వేర్వేరు అఖాడాల్లో నాగ సాధువులుగా మారాలనుకున్న వ్యక్తుల దీక్షా కార్యక్రమాలు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేని సంగమం సమీప ప్రాంతాల్లో ఆదివారం మొదలయ్యాయి. 13 అఖాడాల్లో ఏడు శైవ అఖాడాలుకాగా ఆరింటిలో కొత్త వ్యక్తులు నాగ సాధువులుగా మారాలంటే తొలుత దీక్ష చేపట్టాల్సి ఉంటుంది. నిరంజనీ, ఆనంద్, మహా నిర్వాణీ, అతల్, జునా, ఆవాహన్ అఖాడాల్లో దీక్షలు మొదలయ్యాయి. నిరంజనీ అఖాడాలో దాదాపు 400 మంది దీక్ష తీసుకున్నట్లు నిరంజనీ అఖాడా మహంత్ రవీంద్రపూరీ చెప్పారు. అగ్ని అఖాడాలో నాగసాధువులు ఉండరు.

బెంగళూరు టెకీకి రూ.11 కోట్ల బురిడీ

ఈడీ, కస్టమ్స్ అధికారుల పేరుతో మోసం

బెంగళూరు: సైబర్ మోసగాళ్ల వలలో తాజాగా మరో టెకీ పడిపోయాడు. కేటుగాళ్లు ఇతడి నుంచి ఏకంగా రూ.11 కోట్లు కొట్టేశారు. బెంగళూరుకు చెందిన విజయ్ కుమార్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడులతో తన వద్ద ఉన్న రూ.50 లక్షలతో రూ.12 కోట్లు ఆర్జించారు. ఈ విషయం తెలిసిన మోసగాళ్లు పోలీసులు, ఈడీ, కస్టమ్స్ అధికారులమంటూ ఫోన్లు చేసి, మనీ లాండరింగ్ కేసు పెట్టి, అరెస్ట్ చేస్తామంటూ విజయ్ కుమార్‌ను బెదిరించారు. దీంతో, వారడిగినట్లుగానే తన ఆధార్, పాన్ కార్డు, కేవైసీ సమాచారం తదితర వివరాలన్నిటినీ వారికి చెప్పేశాడు. ఎలాంటి కేసులు లేకుండా చేయాలంటూ డబ్బు ఖర్చవుతుందని చెప్పి, బాధితుడి నుంచి కొన్ని నెలల్లోనే రూ.11 కోట్ల వరకు తమ 9 బ్యాంకు ఎకౌంట్లలోకి మళ్లించుకున్నారు. చివరికి ఇదంతా మోసమని తెలుసుకున్న బాధితుడు బెంగళూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అంతేకాదు, మోసగాళ్ల అలహాబాద్‌లోని బ్యాంకు ఎకౌంట్‌లో రూ.7.5 కోట్లున్నట్లు గుర్తించారు. దుబాయి కేంద్రంగా పనిచేసే స్కామర్ ఇదంతా చేయించినట్లు కూడా వెల్లడైంది. మొత్తమ్మీద ధావల్ సింగ్, తరుణ్ నతానీ, కరణ్ అనే వారిని అరెస్ట్ చేసి, మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సాక్షి ప్లస్
సోమవారం। 20-1-2025

'రాజకీయ పార్టీ' ఏ షెడ్యూల్‌లో ఉంది?

రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్

రాజ్యాంగం పనితీరును సమీక్షించడానికి ఎన్డీఏ ప్రభుత్వం 2000 ఫిబ్రవరి 22న జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన 10 మంది సభ్యులతో భారత రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.

ఈ కమిషన్ సభ్యుడు పి.ఎ. సంగ్మా కమిషన్ నివేదిక సమర్పించక ముందే రాజీనామా చేశారు. ఈ కమిషన్‌కు కార్యదర్శిగా డా.రఘువీర్‌సింగ్ వ్యవహరించారు. ఈ కమిషన్ రచనా సంఘం 2001 సెప్టెంబర్‌లో డా.సుభాష్ సి.కశ్యప్ అధ్యక్షతన ఇద్దరు సభ్యులతో ఏర్పడింది. రచనా సంఘంలో కె.పరాశరన్, డా. అబిద్ హుస్సేన్‌లను సభ్యులుగా నియమించారు. ఈ రాజ్యాంగ సమీక్ష సంఘం 18 పర్యాయాలు సమావేశమై 46 రోజులు సంప్రదింపులు జరిపింది. రాజ్యాంగ సమీక్ష కమిషన్ 2002 మార్చి 11న తన అధ్యయన నివేదికను ఆమోదించింది. 2002 మార్చి 31న అధ్యయన నివేదికను నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయికి సమర్పించింది. ఈ కమిషన్ 249 సిఫారసులతో 11 శీర్షికలుగా నివేదికను రూపొందించింది.

సూచనలు:

- ఏడాదిలో కనీసం 80 రోజులు వేతనం అందేలా గ్రామాల్లో ఉపాధి పొందే హక్కును కల్పించడం.
- భారత రాజ్యాంగంలోని 4వ భాగం శీర్షిక- రాజ్యాంగ విధాన 'ఆదేశిక సూత్రాలు' అనే చర్యగా సవరించాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గురించి, ప్రాథమిక విధులకు సంబంధించి పౌరులకు తగిన అవగాహన, పరిజ్ఞానం కల్పించే చర్యలు చేపట్టాలి.
- ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల వ్యయాన్ని ప్రభుత్వమే భరించేలా సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలి.
- రాజకీయ పార్టీలన్నీ మహిళలకు 30 శాతం స్థానాలు కేటాయించాలి.
- పార్లమెంటు ఏడాదికి 120 రోజులు సమావేశం కావాలి. రాజ్యసభ 100 రోజులు సమావేశం కావాలి. రాష్ట్రాల శాసన సభలు కూడా ఏడాదికి 90 రోజులు సమావేశం కావాలి.
- కార్యనిర్వహణ శాఖ, ప్రభుత్వ పాలన, అధికారుల్లో బాధ్యత, జవాబుదారీతనం పెంపొందించడానికి సామాజిక తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలంగా ఉండాలి, అంతర్రాష్ట్ర మండలి ద్వారా కేంద్ర ప్రభుత్వం వైయుక్తికంగా, సమష్టిగా రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి.
- న్యాయశాఖలో మార్పులు చేపడుతూ, జాతీయ న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.
- అధికార వికేంద్రీకరణ,స్వావలంబన, గ్రామ పంచాయతీలను స్వయం పాలనా సంస్థలుగా ప్రకటించి వాటికి ప్రత్యేక అధికారాలు కేటాయించాలి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

- వ్యవస్థీకృతమైన మార్పులు జరగాలి. సాంఘిక, ఆర్థిక మార్పులతో పాటు అభివృద్ధి క్రమం విస్తరించాలి. మైనారిటీ వర్గాల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి చర్యలు చేపట్టాలి.

లక్ష్యాలు

- దేశంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతమైన, జవాబుదారీతనం, పారదర్శకత, నీతివంతమైన పాలన కోసం ఏ మేరకు రాజ్యాంగపరమైన అంశాలు దోహదపడతాయనే అంశాలను సునిశితంగా పరిశీలించి సూచనలు చేయడం.
- రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలగకుండా రాజ్యాంగపరమైన అంశాల్లో అవసరమైన క్రమానుగత మార్పులను సూచించడం.
- పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంవిధానం మేరకు ఆధునిక భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ అభివృద్ధి సాధనకు సవివరమైన సూచనలు చేయడం.

జిల్లా కలెక్టర్

దేశంలో జిల్లా కలెక్టర్ పదవిని 1772లో వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్‌గా ఉన్నప్పుడు ప్రవేశపెట్టారు. స్వాతంత్ర్యానంతరం ఐఏఎస్‌కు చెందిన అధికారి జిల్లా కలెక్టర్‌గా నియమితులవుతున్నారు. జిల్లా కలెక్టర్ హోదాను ఫ్రాన్స్ లోని ప్రిఫెక్ట్ అనే పదవితో పోల్చుతారు.

అధికారాలు-విధులు

1) రెవెన్యూ విధులు
2) న్యాయపరమైన విధులు
3) ఎన్నికల నిర్వహణ
4) ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయినవారిని ఆదుకోవడం
5) అభివృద్ధి కార్యక్రమాల అమలు
6) జనాభా లెక్కల సేకరణ
7) స్థానిక సంస్థలపై పర్యవేక్షణ.

నోట్: జిల్లా కలెక్టర్‌కు అనేక అంశాలతో జిల్లా పరిషత్‌లకు సంబంధం ఉంటుంది. జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలకు శాశ్వత ఆహ్వానితుడి హోదాలో కలెక్టర్ హాజరవుతాడు. జిల్లా పరిషత్ పనితీరు గురించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాడు. జిల్లా పరిషత్‌లోని వివిధ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తాడు.



జాతీయ న్యాయ మండలి

న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తెచ్చే దిశగా న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. న్యాయమూర్తులపై వచ్చే ఆరోపణలపై విచారణ చేయడానికి, దోషులుగా తేలిన న్యాయమూర్తులను తొలగించడానికి వీలుగా ఉండే 'The Judges Bill - 2006ను తీసుకురావాలని అప్పట్లో కేంద్ర మంత్రి మండలి నిర్ణయించింది. 2006 నవంబర్ 9న నాటి ప్రధాని అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఒక విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. న్యాయవ్యవస్థ పనితీరులో పారదర్శకత, జడ్జీలను జవాబుదారీ చేయడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. న్యాయమూర్తులపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను విచారించడానికి జాతీయ న్యాయ మండలి (ఎన్‌జేసీ) ఏర్పాటు చేయాలని ఈ బిల్లు పేర్కొంటుంది. దీనికోసం 1968 జడ్జీల చట్టానికి సవరణ తీసుకొస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మినహా ఇతర జడ్జీల్లో ఎవరిపై ఆరోపణలు వచ్చినా ఎన్‌జేసీ విచారిస్తుంది. జాతీయ న్యాయ మండలిలో భారత ప్రధాన న్యాయమూర్తితో పాటు సుప్రీంకోర్టులోని ఇద్దరు సీనియర్ న్యాయమూర్తులు, మరో ఇద్దరు సీనియర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సభ్యులుగా ఉంటారు. ఒకవేళ సుప్రీంకోర్టులోని జడ్జిపై ఫిర్యాదును విచారించాల్సివస్తే హైకోర్టు న్యాయమూర్తుల స్థానంలో మరో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ప్రధాన న్యాయమూర్తి నామినేట్ చేస్తారు. జడ్జీలపై తప్పుడు ఆరోపణలు చేస్తే అతడికి ఏడాది జైలు, రూ. 25 వేల వరకు జరిమానా విధిస్తారు. ఈ న్యాయ మండలి నేరుగా లేదా లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్‌పర్సన్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తుంది. ఫిర్యాదుదారు, జడ్జి ఎవరనేది రహస్యంగా ఉంచేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా నెల పాటు శిక్ష, రూ. 500 జరిమానా లేదా రెండూ అమలు చేయవచ్చు. ఫిర్యాదులను ఎన్‌జేసీ రహస్యంగా విచారిస్తుంది. జడ్జి దుష్ప్రవర్తన, అసమర్థతతో వ్యవహరించినట్లు రుజువైతే.. అతడ్ని తొలగించాల్సిన అవసరం లేదని న్యాయ మండలి భావిస్తే, ఈ కింది చర్యలు తీసుకోవచ్చు.

- సలహాలు ఇవ్వడం.
- హెచ్చరికలు చేయడం
- స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని కోరడం.
- బహిరంగంగా లేదా రహస్యంగా మందలించడం లేదా అభిశంసించడం చేస్తుంది.

ఒకవేళ న్యాయమూర్తి తొలగింపు తప్పదని భావిస్తే, ఆ మేరకు రాష్ట్రపతికి న్యాయ మండలి సిఫారసు చేస్తుంది. దీన్ని స్వీకరించిన రాష్ట్రపతి మండలి గుర్తించిన అంశాలు, సంబంధిత నివేదికలను, సిఫారసులను పార్లమెంటు ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని కోరతాడు. అప్పుడు జడ్జి తొలగింపు కోసం రాష్ట్రపతికి అభ్యర్థన చేస్తూ సభలో ప్రభుత్వం తీర్మానం ప్రవేశ పెడుతుంది. ఆ తీర్మానం ఆమోదం ద్వారా తొలగింపునకు గురైన న్యాయమూర్తి వివిధ రకాల విధులకు అనర్హుడవుతారు. లా కమిషన్ 195వ నివేదికలో చేసిన సిఫారసుల ప్రాతిపదికన ఈ నూతన బిల్లును రూపొందించారు. జస్టిస్ వెంకటాచలయ్య కమిటీ, జాతీయ లా కమిషన్‌లు న్యాయమూర్తులను జవాబుదారీ చట్రంలోకి తీసుకురావాలని సిఫారసు చేశాయి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

పదవి, డబ్బులకోసం సభ్యులు పార్టీలు మారడం 1967 తర్వాత ఎక్కువగా జరిగాయి. దీన్నే ఫ్లోర్ క్రాసింగ్ అంటారు. పార్టీ ఫిరాయింపులను నివారించడానికి 1985లో 52వ రాజ్యాంగ సవరణ చేశారు. పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం ఈ కింది కారణాలతో సభ్యులను తొలగించవచ్చు.

- పార్టీ సభ్యుడు తాను ఎన్నికైన పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు.
- పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా సభలో తన ఓటు హక్కును వినియోగించినప్పుడు, ముందుగా అనుమతి తీసుకోకుండా ఓటింగ్‌కు గైర్హాజరైనప్పుడు.

రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్	ఎం.ఎన్. వెంకటాచలయ్య (అధ్యక్షుడు)
సభ్యులు..	❖ కె.పరాశరన్ (మాజీ అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా)
❖ జస్టిస్ బి.పి.జీవన్‌రెడ్డి (ఛైర్మన్ లా కమిషన్ ఆఫ్ ఇండియా)	❖ డాక్టర్. సుభాష్ సి.కశ్యప్ (లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్)
❖ జస్టిస్ ఆర్.ఎస్.సర్కారియా (సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి)	❖ సి.ఆర్.ఇరానీ (ది స్టేట్స్‌మన్ పత్రిక చీఫ్ ఎడిటర్)
❖ జస్టిస్ కె.పున్నయ్య (ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి)	❖ అబిద్ హుస్సేన్ (యూఎస్ఏలో భారత మాజీ రాయబారి)
❖ పి.ఎ.సంగ్మా (లోక్‌సభ మాజీ స్పీకర్)	
❖ సోలీ జె.సొరాబ్జీ (అటార్నీ జనరల్)	❖ శ్రీమతి సుమిత్ర జి.కులకర్ణి (మాజీ ఎంపీ)

అయితే అత్యవసర కారణాల వల్ల సభకు రాలేకపోయాడని గైర్హాజరైన 15 రోజుల లోపు పార్టీ గుర్తిస్తే పార్టీ ఫిరాయింపు చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. 1942లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పార్టీలు జారీ చేసే విప్.. విశ్వాస, అవిశ్వాస తీర్మానాలకు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. స్వతంత్రంగా ఎన్నికైన సభ్యుడు ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు. నామినేటేడ్ సభ్యుడు ఆరు నెలల తర్వాత ఏదైనా పార్టీలో చేరితే సభ్యత్వం కోల్పోతాడు.

ముఖ్యాంశాలు:

- భారత రాజ్యాంగంలో రాజకీయ పార్టీ అనే పదం 10వ షెడ్యూల్‌లో మాత్రమే ఉంది. రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలో 52వ రాజ్యాంగ సవరణ చేసి ఫిరాయింపుల చట్టానికి సంబంధించి 102(2), 191(2) అధికరణలను చేర్చారు.
- దేశంలో రాజకీయ పార్టీలు రాజ్యాంగ బద్ధమైనవి కావు. అవి కేవలం చట్టబద్ధంగా ఎన్నికల కమిషన్ ద్వారా గుర్తింపు పొంది ఏర్పాటయ్యాయి.

వర్తించని సందర్భాలు:

- పార్టీలలో చీలిక ఏర్పడి మూడో వంతు సభ్యులు గ్రూప్‌గా ఏర్పడితే ఫిరాయింపుల నిరోధక చట్టం పరిధిలోకి రాదు.
- పార్టీ సభ్యుల్లో 2/3వ వంతు సభ్యులు వేరే పార్టీలో చేరినప్పుడు కూడా ఈ చట్టం పరిధిలోకి రాదు.
- లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌లు తమ పదవులు వదిలి వారి పార్టీల్లో చేరినప్పుడు వారికి ఈ చట్టం వర్తించదు. రాష్ట్రాల్లో కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది.
- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం అమలు విషయంలో చైర్మన్, స్పీకర్‌దే అంతిమ నిర్ణయం.
- రాజకీయ పార్టీల్లో చీలికలను నిరోధించడానికి, రాష్ట్రాల్లో మంత్రివర్గ పరిమాణాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన 97వ రాజ్యాంగ సవరణ బిల్లు, 91వ రాజ్యాంగ సవరణ చట్టం 2003గా అమల్లోకి వచ్చింది. ఈ బిల్లు ప్రకారం పార్టీ నుంచి ఎంతమంది ఫిరాయించినా వారు అనర్హులవుతారు. తిరిగి పోటీ చేసి గెలిచే వరకూ వారు ప్రతిఫలాన్నిచ్చే ఏ పదవీ చేపట్టడానికి వీలులేదు.
- పార్టీ అధ్యక్షుడి ఫిర్యాదు మేరకు స్పీకర్ వారి సభ్యత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంటుంది.

సభ్యత్వం రద్దు-సుప్రీంకోర్టు తీర్పు

1993లో కివోటో ఉలాహన్ వర్సెస్ జాచి లు కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ.. సభ్యుడి సభ్యత్వం రద్దుపై స్పీకర్(సభాధ్యక్షుడు)ది తుది నిర్ణయం కాదని వారి నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని పేర్కొంది.

ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ

క్రిమినల్ కేసుల్లో కోర్టు దోషులుగా నిర్ధారించిన వ్యక్తులు శిక్ష అనుభవిస్తున్న కాలం తర్వాత మరో ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే వీలు లేకుండా ప్రజాప్రాతినిధ్యం చట్టం (సవరణ) బిల్లును లోక్‌సభ ఆమోదించింది. నేర చరితులను చట్ట సభలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ ప్రజాప్రాతినిధ్య చట్టానికి సవరణ చేస్తున్నారు. గతంలో దీర్ఘకాలం శిక్షపడిన వ్యక్తులు తొలి ఆరేళ్లలో పోటీ చేయలేకపోయినా తర్వాత జైలులో ఉండి పోటీ చేసే అవకాశం ఉండేది. ఇప్పుడు అలాంటి అవకాశం లేకుండా చేశారు. అవినీతి నిరోధక చట్టం , తీవ్రవాద నిరోధక చట్టం కింద శిక్షపడిన వారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. అవినీతి నిరోధక చట్టం కింద కనీసం రెండు సంవత్సరాలు శిక్షపడినా అనర్హత వర్తిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. రాజ్యాంగ సమీక్ష కోసం ఏర్పాటైన జాతీయ కమిషన్‌కు అధ్యక్షత వహించిన వారు?
   ఎ) పి.ఎ సంగ్మా బి) జస్టిస్ బి.పి జీవన్‌రెడ్డి
   సి) జస్టిస్ ఎంఎన్. వెంకటాచలయ్య
   డి) సీఆర్ ఇరానీ
2. జిల్లా కలెక్టర్ వ్యవస్థను ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 1771 బి) 1772 సి) 1773 డి) 1774
3. ఎన్నికల ప్రక్రియలో వ్యయాన్ని ప్రభుత్వమే భరించాలని సిఫారసు చేసిన కమిషన్?
   ఎ) వీరప్ప మొయిలీ కమిటీ
   బి) రాజ్యాంగ సమీక్ష జాతీయ కమిషన్
   సి) సర్కారియా కమిషన్ డి) పైవేవీ కావు

సమాధానాలు

1) సి; 2) బి; 3) బి.

నిజాం కాలంలోనే రోడ్డు రవాణాకు బీజం!

రవాణా సౌకర్యాలు

ఒక దేశంలోని ప్రజల ఆర్థిక, సాంఘిక, రాజకీయ, జీవన స్థితిగతులు ఆ దేశంలోని రవాణా సౌకర్యాల అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయి. వస్తువులను, ప్రయాణికులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి చేర్చడాన్ని 'రవాణా' అంటారు. ప్రాథమిక, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధిలో రవాణా సౌకర్యాల పాత్ర అత్యంత కీలకం.

రాష్ట్రంలో ప్రధానంగా మూడు రకాల రవాణా సౌకర్యాలు ఉన్నాయి.

అవి:

1. రోడ్డు రవాణా
2. రైల్వే రవాణా
3. వాయు రవాణా

తెలంగాణకు సముద్ర తీర ప్రాంతం లేదు కాబట్టి రాష్ట్రంలో జల రవాణాకు తగిన ప్రాధాన్యం లేదు.

రోడ్డు రవాణా

తెలంగాణ రాష్ట్రంలో 'నిజాం స్టేట్ రైల్వే'లో భాగంగా 1932లో భారతదేశంలోనే మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏర్పాటు చేశారు. దీని పేరు 'నిజాం రాష్ట్ర రైల్ అండ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్' (ఎన్ఎస్ఆర్-ఆర్‌టీడీ).

- రాష్ట్రంలోని మొదటి రోడ్డు రవాణా సంస్థ 27 బస్సులు, 166 మంది కార్మికులతో ప్రారంభమైంది.
- నిజాం రాజ్య ప్రధానమంత్రి సాలార్జంగ్ చొరవతో హైదరాబాద్ - షోలాపూర్ రహదారిని నిర్మించారు.
- 1932లో రహదారులను జాతీయం చేసి ప్రభుత్వమే బస్సులను నడిపింది.
- 1936 నాటికే హైదరాబాద్ నుంచి తెలంగాణలోని అన్ని జిల్లాలకు బస్సులు నడపటం ప్రారంభమైంది.
- ఎన్ఎస్ఆర్-ఆర్‌టీడీ సంస్థను హైదరాబాద్ రాష్ట్రంలో విలీనం చేసిన తేదీ 1951 నవంబర్ 1.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1965లో 'రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బీ)'ను ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం రాష్ట్రంలోని రోడ్లు 'తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ' పరిధిలో ఉన్నాయి.
- రాష్ట్రంలో 80 శాతానికి పైగా సరకులు, ప్రయాణికుల రవాణా రోడ్డు మార్గాలపైనే ఆధారపడి ఉంది.

రోడ్లు - రకాలు

రాష్ట్రంలోని రోడ్లను 'ఆర్ అండ్ బీ నెట్ వర్క్' కింద ఉన్న రోడ్లు, 'పంచాయతీ రాజ్' రోడ్లు అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

ఆర్ అండ్ బీ నెట్‌వర్క్ కింద ఉన్న రోడ్లను తిరిగి జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), రాష్ట్ర రహదారులు (ఎస్‌హెచ్), ప్రధాన జిల్లా రహదారులు, గ్రామీణ రోడ్లుగా విభజించవచ్చు.

రాష్ట్రంలో రహదారుల నెట్‌వర్క్:

- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల విస్తీర్ణం 2,592 కి.మీ.
- రాష్ట్ర రహదారుల పొడవు 3,152 కి.మీ.
- ప్రధాన జిల్లా రహదారుల పొడవు 12,079 కి.మీ.
- గ్రామీణ రహదారుల పొడవు 9,014 కి.మీ.
- జాతీయ రహదారులు మినహాయించి రాష్ట్ర రహదారుల మొత్తం పొడవు 24,245 కి.మీ.

జాతీయ రహదారులు

ఇవి సెంట్రల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉంటాయి.

- తెలంగాణ రాష్ట్రంలో జాతీయ రహదార్లు అధికంగా (266 కి.మీ.) ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్నాయి. అతి తక్కువగా హైదరాబాద్‌లో (36 కి.మీ.) ఉన్నాయి.
- రాష్ట్రంలో జాతీయ రహదారుల సాంద్రత100 చ.కి.మీ. ప్రాంతానికి 2.25 కి.మీ.గా ఉంది.
- దేశంలో జాతీయ రహదారుల సాంద్రత 100 చ.కి.మీ. ప్రాంతానికి 2.82 కి.మీ.
- రాష్ట్రంలో అతి పొడవైన జాతీయ రహదారి 'ఎన్‌హెచ్-44', అతి చిన్న జాతీయ రహదారి 'ఎన్‌హెచ్-61'.
- రాష్ట్రంలోని మొత్తం జాతీయ రహదారుల పొడవు 2,592 కి.మీ. ఇందులో..
  - నాలుగు లేన్ల జాతీయ రహదారుల పొడవు 964 కి.మీ.
  - రెండు లైన్ల జాతీయ రహదారుల పొడవు 1264 కి.మీ.
  - మధ్య తరహా (ఇంటర్మీడియెట్) లైన్ జాతీయ రహదారుల పొడవు 153 కి.మీ.
  - సింగిల్ లైన్ జాతీయ రహదారుల పొడవు 211 కి.మీ.

రాష్ట్రంలోని జాతీయ రహదారులు

1. **జాతీయ రహదారి నంబర్ - 44**
   ఇది వారణాసి నుంచి కన్యాకుమారి వరకు ఉంది. దీని పాత నంబర్ - 7. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి ఆదిలాబాద్, నిర్మల్, రామాయంపేట, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో ఈ రహదారి పొడవు 519.64 కి.మీ.
2. **జాతీయ రహదారి నంబర్ - 65**
   దీని పాత నంబర్ -9. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జహీరాబాద్, హైదరాబాద్, సూర్యాపేట్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 291.74 కి.మీ.
3. **జాతీయ రహదారి నంబర్ - 63**
   దీని పాత నంబర్ -16. ఇది నిజామాబాద్ నుంచి ఆర్మూర్, జగిత్యాల, లక్సెట్టిపేట, చెన్నూర్ మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 235.15 కి.మీ.
4. **జాతీయ రహదారి నంబర్ - 167**
   ఇది నూతన రహదారి. ఇది కర్ణాటక సరిహద్దు నుంచి జడ్చర్ల (మహబూబ్‌నగర్) మీదుగా ఎన్‌హెచ్-44ను కలుస్తుంది.
5. **జాతీయ రహదారి నంబర్ - 163**
   దీని పాత నంబర్-202. ఇది హైదరాబాద్ నుంచి జనగాం, వరంగల్, వెంకటాపురం మీదుగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. తెలంగాణలో దీని పొడవు 306 కి.మీ.
6. **జాతీయ రహదారి నంబర్ - 30**
   దీని పాత నంబర్-221. ఇది ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నుంచి పెనుబలి,కొత్తగూడెం,పాల్వంచ, భద్రాచలం మీదుగా ఛత్తీస్‌గఢ్‌లోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 100 కి.మీ.
7. **జాతీయ రహదారి నంబర్ - 61**
   దీని పాత నంబర్ - 222. ఇది రాష్ట్రంలో మహారాష్ట్ర సరిహద్దు నుంచి నర్సాపూర్ మీదుగా నిర్మల్ వరకు ఉంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 53.6 కి.మీ.
8. **జాతీయ రహదారి నంబర్ - 161**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది సంగారెడ్డి మీదుగా మహారాష్ట్రలోకి ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 140.5 కి.మీ.
9. **జాతీయ రహదారి నంబర్ - 363**
   ఇది నూతన జాతీయ రహదారి. ఇది మహారాష్ట్ర సరిహద్దు నుంచి మహాదేవ్‌పూర్, పరకాల, ఆత్మకూరు ద్వారా ఎన్‌హెచ్-163తో కలుస్తుంది.
10. **జాతీయ రహదారి నంబర్ -365**
    ఇది నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి తుంగతుర్తి, మహబూబాబాద్, నర్సంపేట మీదుగా మల్లంపల్లి వద్ద ఎన్‌హెచ్-163తో కలుస్తుంది.
11. **జాతీయ రహదారి నంబర్ - 565**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది నకిరేకల్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశిస్తుంది.

- 363, 365, 565 నంబర్ జాతీయ రహదార్ల మొత్తం ఉమ్మడి పొడవు 330 కి.మీ.

12. **జాతీయ రహదారి నంబర్ - 563**
    ఇది నూతన జాతీయ రహదారి. ఎన్‌హెచ్-63పై ఉన్న మంచిర్యాల మీదుగా కరీంనగర్-వరంగల్ ద్వారా ఎన్‌హెచ్-163తో కలుస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 136 కి.మీ.
13. **జాతీయ రహదారి నంబర్ - 365ఎ**
    ఇది కూడా నూతన జాతీయ రహదారి. ఇది ఎన్‌హెచ్-65పై ఉన్న కోదాడ మీదుగా ఖమ్మం - మహబూబాబాద్ ద్వారా ఎన్‌హెచ్ -365తో కలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో దీని పొడవు 75 కి.మీ.
14. **జాతీయ రహదారి నంబర్ - 765**
    ఇది నూతన జాతీయ రహదారి. హైదరాబాద్ నుంచి అమన్‌గల్, వెల్దండ,కల్వకుర్తి,వంగూర్, అచ్చంపేట మీదుగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తుంది. రాష్ట్రంలో దీని పొడవు 196 కి.మీ.

- నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో 768 కి.మీ. పొడవైన జాతీయ రహదారులను 'నేషనల్ హైవేస్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు' కింద నాలుగు లైన్ల రహదారులు గా అభివృద్ధి చేస్తోంది.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలంగాణ జాగ్రఫీ

రాష్ట్ర రహదారులు

రాష్ట్ర రహదారులు ప్రధానంగా జిల్లాల ప్రధాన కేంద్రాలను రాష్ట్ర రాజధానితో అనుసంధానం చేస్తాయి.

- రాష్ట్ర రహదారులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా ఉన్నాయి.

జిల్లా రహదారులు

తాలూకా కేంద్రాలతో; జిల్లా కేంద్రాలతో; ప్రధాన ఉత్పత్తి ప్రాంతాలు, మార్కెట్ కేంద్రాలను రాష్ట్రీయ రహదారులతో; రైల్వేస్టేషన్‌లతో కలిపే రహదారులను 'జిల్లా రహదారులు' అంటారు.

పంచాయతీరాజ్ రహదారులు

పంచాయతీరాజ్ రహదారుల నిర్మాణం, నిర్వహణను రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షిస్తుంది. ఈ శాఖ గ్రామీణ ప్రాంత రోడ్లు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, బిల్డింగ్‌లు, కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తుంది.

ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)

ఇది హైదరాబాద్ చుట్టూ విస్తరించి ఉంది. ఈ రింగ్ రోడ్డు పొడవు 158 కి.మీ. దీన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) నిర్మించింది. ఈ రింగ్ రోడ్డుకు మరో పేరు 'నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు'.

- పంచాయతీ రాజ్ రోడ్లు అధికంగా ఉన్న జిల్లా - ఉమ్మడి మహబూబ్ నగర్
- పంచాయతీ రాజ్ రోడ్లు అత్యల్పంగా ఉన్న జిల్లా ఉమ్మడి రంగారెడ్డి (హైదరాబాద్ కాకుండా).
- అన్ని రకాల రోడ్లను కలిపి చూసినప్పుడు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రోడ్ల విస్తీర్ణం అధికంగా, హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం రోడ్లను అధికంగా కలిగి ఉన్న ఉమ్మడి జిల్లా ఏది?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) రంగారెడ్డి 4) మహబూబ్ నగర్
2. రాష్ట్ర రహదారులు అధికంగా ఏ జిల్లాలో ఉన్నాయి?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) నల్లగొండ
3. తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఏది?
   1) NH - 65 2) NH - 63
   3) NH - 44 4) NH - 163
4. 16వ నంబర్ జాతీయ రహదారి కొత్త నంబర్ ఏది?
   1) 63 2) 163
   3) 61 4) 65
5. తెలంగాణలో మొట్టమొదటి రోడ్డు రవాణా సంస్థను ఏ సంవత్సరంలో స్థాపించారు?
   1) 1936 2) 1932
   3) 1951 4) 1956
6. నెహ్రూ రింగ్ రోడ్డు మొత్తం పొడవెంత?
   1) 168 కి.మీ. 2) 196 కి.మీ.
   3) 158 కి.మీ. 4) 3152 కి.మీ.

సమాధానాలు

1) 4; 2) 2; 3) 3; 4) 1;
5) 2; 6) 3;

- హైదరాబాద్ - కర్నూలు, హైదరాబాద్ - మచిలీపట్నం రహదారులను నిజాం కాలంలోనే నిర్మించారు.
- 1936 నాటికే తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో బస్ డిపోలను ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాలకు బస్సులు నడిపారు.
- తెలంగాణ రాష్ట్రం మీదుగా 14 జాతీయ రహదార్లు వెళుతున్నాయి.
- తెలంగాణలో అతి పొడవైన జాతీయ రహదారి ఎన్‌హెచ్-44.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్ఎంపీలో ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు

కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టు (ఎస్ఎంపీ)లో రెగ్యులర్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న మేనేజీరియల్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఇంజనీర్, డ్రాఫ్ట్‌మెన్, ప్రాజెక్ట్ మేనేజర్, ప్రాజెక్ట్ ఇంజనీర్, ఆఫీస్ అసిస్టెంట్ తదితరాలు.
» **అర్హతలు:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,ఇంజనీరింగ్ డిగ్రీ (మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/సివిల్), ఎంఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** నెలకు రూ.26,000-రూ.90,000.
» **ఎంపిక ప్రక్రియ:**రాత పరీక్ష,ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 11.02.2025
» **వెబ్‌సైట్:** https://smp.smportkolkata.in/smpk/en

సాక్షి ప్లస్
సోమవారం। 20-1-2025

రావత్ భట్టా అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సైన్స్ అండ్ టెక్నాలజీ



మాదిరి ప్రశ్నలు

1. భూమిపై నుంచి ఒక పౌనపున్యం ఉన్న సమాచారాన్ని స్వీకరించి మరొక పౌనపున్యం ఉన్న సమాచారాన్ని భూమికి పంపడాన్ని ఏమంటారు?
ఎ) ట్రాన్స్‌మిషన్
బి) ట్రాన్స్‌పాండర్
సి) డౌన్‌లింకింగ్
డి) రిసీవింగ్ పౌనపున్యం
2. తిరుపతి సమీపంలోని ఎంఎస్‌టీ -రాడార్ కింది ఏ ఆవరణంపై పరిశోధన చేయదు?
ఎ) మీసో స్ఫియర్
బి) స్ట్రాటోస్ఫియర్
సి) ట్రోపోస్ఫియర్
డి) ఎక్సోస్ఫియర్
3. టాటా స్కై, డిష్ టీవీ ప్రసారాలు కింది ఏ శాటిలైట్ నుంచి లభిస్తాయి?
ఎ) ఇన్‌శాట్ - 4 సీఆర్
బి) ఇన్‌శాట్ - 6 ఆర్
సి) జీశాట్ - 6
డి) ఇన్‌శాట్ - 1 ఎ
4. టెలీ మెడిసిన్ - వైద్యయోజన్‌ను మొదట ఏ రాష్ట్రంలో ప్రారంభించారు?
ఎ) తెలంగాణ
బి) కర్ణాటక
సి) ఒడిశా
డి) తమిళనాడు
5. దేశంలోనే మొదటి ఎలక్ట్రానిక్ నాలెడ్జ్ ఆధారిత పంచాయతీ?
ఎ) మెదక్‌లోని రామచంద్రాపురం
బి) విజయవాడలోని మొఘల్రాజపురం
సి) రంగారెడ్డిలోని మియాపూర్
డి) కడపలోని ఓబులవారి పల్లి
6. అంతరిక్ష కార్యక్రమాల్లో వివిధ భాగాల్లో అవసరమైన పరికరాలు తయారీ ఎక్కడ జరుగుతోంది?
ఎ) ముంబయి
బి) హైదరాబాద్
సి) పింప్రీ
డి) కోయంబత్తూర్
7. మనదేశంలోని ఎత్తయిన రాకెట్?
ఎ) సింథటిక్ అపర్చర్ రాడార్
బి) ఎస్ఏఆర్ఏఎల్
సి) పీఎస్ఎల్‌వీ చాప్టర్-2
డి) కేఐటీ శాట్
8. ఇస్రో చరిత్రలో 'సువర్ణ సంవత్సరం'గా పేర్కొనదగిన ఏడాది?
ఎ) 1969
బి) 2008
సి) 2014
డి) 2003
9. కిందివాటిలో చంద్రయాన్ లక్ష్యం కానిది?
ఎ) చంద్రుడి ఉపరితలాన్ని 3-డిలో ఫొటోలు తీసి మ్యాపింగ్ చేయడం
బి) ఖనిజాలు, రసాయనిక పరిశోధనలు
సి) నీటి ఉనికి గుర్తింపు
డి) మానవ జాడ అన్వేషణ
10. ప్రధానంగా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు ఉపయోగించుకునే సమాచార ప్రసార సాంకేతికత?
ఎ) ఇ-మెయిల్
బి) వి-శాట్ నెట్‌వర్క్
సి) కార్డోశాట్
డి) మొబైల్‌ఫోన్ - వాట్సప్
11. 1995లో మనదేశంలో ఏ సంస్థను ప్రారంభించడం ద్వారా ఇంటర్నెట్ సేవలు ప్రారంభమయ్యాయి?
ఎ) ఐఎస్‌డీఎన్
బి) వీఎస్ఎన్ఎల్
సి) బీఎస్ఎన్ఎల్
డి) ఫ్లిప్‌కార్ట్
12. మనదేశంలో ఏర్పాటు చేసిన మొదటి జల విద్యుత్ ప్రాజెక్ట్?
ఎ) శివ సముద్రం
బి) కృష్ణ రాజసాగర్
సి) నాగార్జునసాగర్ డి) జంఝావతి
13. జతపర్చండి.
1. కల్పకం ఎ) కర్ణాటక
2. కాక్రపారా బి) తమిళనాడు
3. కైగా సి) గుజరాత్
ఎ) 1-ఎ, 2-బి, 3-సి
బి) 1-సి, 2-బి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-ఎ
డి) 1-ఎ, 2-సి, 3-బి
14. కల్పకం రియాక్టర్‌ను 'ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' అంటారు. ఇందులో వాడే ఇంధనం?
ఎ) ప్లుటోనియం
బి) యురేనియం
సి) సీసం కలిసిన పెట్రోలు
డి) ద్రవ హైడ్రోజన్
15. తారాపూర్ అణు విద్యుత్ కేంద్రంలో వాడే ఇంధనం?
ఎ) ప్లుటోనియం
బి) యురేనియం
సి) కార్బన్‌డై ఆక్సైడ్
డి) మిక్స్‌డ్ ఆక్సైడ్
16. రావత్ భట్టా అణు రియాక్టర్ ఎక్కడ ఉంది?
ఎ) మహారాష్ట్ర బి) రాజస్థాన్
సి) తమిళనాడు డి) తెలంగాణ
17. మణుగూరు(ఖమ్మం)లో ఏ ప్లాంటు ఉంది?
ఎ) అణువిద్యుత్ కేంద్రం
బి) భార జల ప్లాంట్
సి) యురేనియం శుద్ధి
డి) అణుబాంబు తయారీ
18. ఖాదీ గ్రామీణ పరిశ్రమల కమిషన్ 1962లో వేటిపై అవగాహన కల్పించింది?
ఎ) బయోగ్యాస్ బి) ఖాదీ దుస్తులు
సి) సిమెంట్ వాడకం
డి) కాలుష్య నియంత్రణ
19. దేశంలో పవనశక్తి ఉత్పత్తిలో మొదటిస్థానంలో ఉన్న రాష్ట్రం?
ఎ) తెలంగాణ బి) తమిళనాడు
సి) కేరళ డి) హిమాచల్‌ప్రదేశ్
20. ప్రపంచంలో అత్యంత సామర్థ్యం ఉన్న గాలిమర ఎక్కడ ఉంది?
ఎ) పెరంబూర్ బి) పనాజీ
సి) మంగుళూరు డి) పెరంబుడి
21. గాలి మరలను రూపొందించే సంస్థ?
ఎ) బీహెచ్ఈఎల్ బి) ఈసీఐఎల్
సి) హెచ్ఏఎల్ డి) మిథాని
22. సుజ్లాన్ కంపెనీకి సంబంధమున్న అంశం?
ఎ) పవనశక్తి
బి) సముద్ర అలల శక్తి
సి) జీవ ఇంధనం
డి) ఉదజని ఇంధనం
23. టైడల్ ఎనర్జీ ఉత్పత్తికి కావలసిన అలల ఎత్తు?
ఎ) 5 – 12 మీటర్లు
బి) 10 –15 మీటర్లు
సి) 2 – 3 మీటర్లు
డి) 12 – 16 మీటర్లు
24. భూగర్భోష్ణశక్తి కేంద్రం ఎక్కడ ఉంది?
ఎ) గంగాలోయ
బి) సబర్మతి లోయ
సి) తాతావని డి) మణికారన్
25. భారతదేశంలో పెట్రోల్‌ను మొదట కనుగొన్న ప్రాంతం?
ఎ) మఖుమ్ - అసోం
బి) డిగ్బాయ్ - అసోం
సి) బాంబే హై - మహారాష్ట్ర
డి) కృష్ణపట్నం- ఆంధ్రప్రదేశ్
26. ద్రవరూప సోడియంను మితకారిగా ఏ రియాక్టర్లలో వాడతారు?
ఎ) లైట్ వాటర్ రియాక్టర్
బి) ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్
సి) హెవీ వాటర్ రియాక్టర్
డి) ఎలక్ట్రిక్ రియాక్టర్
27. మిశ్రమ ఆక్సైడ్‌లో ఉండే పదార్థాలు?
ఎ) సీసం, యురేనియం
బి) సీసం, సెలీనియం
సి) యురేనియం, ప్లుటోనియం
డి) యురేనియం, ప్లుటోనియం ఆక్సైడ్‌లు
28. కెనడా సహకారంతో స్థాపించిన అణు రియాక్టర్ ఏది?
ఎ) సిరస్ బి) అప్సర
సి) జెర్లీనా డి) ధ్రువ
29. కల్పకంలోని మినీ రియాక్టర్?
ఎ) పూర్ణిమ బి) ధ్రువ
సి) కామిని డి) టోక్‌మాక్
30. భారజలం రసాయనిక నామం?
ఎ) డ్యుటీరియం ఆక్సైడ్
బి) డ్యుటీరియం హైడ్రాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్
డి) సల్ఫ్యూరస్ ఆమ్లం
31. ప్లాస్మా స్థితిని ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పరికరం ఏది?
ఎ) టోక్‌మాక్ బి) ప్లాస్మోట్రోమ్
సి) టోరోడియల్ డి) ట్యూరమ్ థీ
32. 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్' ఎక్కడ ఉంది?
ఎ) అలహాబాద్ బి) కోల్‌కతా
సి) గాంధీనగర్ డి) భువనేశ్వర్
33. మనదేశంలో ఎనర్జీ స్టేట్‌గా పిలిచే రాష్ట్రం?
ఎ) మేఘాలయ
బి) హిమాచల్‌ప్రదేశ్
సి) న్యూఢిల్లీ డి) కేరళ
34. సెంట్రల్ షీప్ బ్రీడింగ్ ఫార్మ్ ఎక్కడ ఉంది?
ఎ) సింగూరు - పశ్చిమబెంగాల్
బి) అనంతపురం - ఆంధ్రప్రదేశ్
సి) నిర్మల్ - తెలంగాణ
డి) హిస్సార్ - హర్యానా
35. 'అమ్రపాలి' ఏ మొక్కల్లోని ఒక రకం?
ఎ) అరటి బి) మామిడి
సి) పెసర డి) వరి
36. కిందివాటిలో అధిక దిగుబడిని ఇచ్చే బాతులు?
ఎ) కాకి కాంబెల్
బి) ఇండియన్ రన్నర్
సి) బకర్‌వాల్ డి) గొడ్డి
37. జీవ ఎరువుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జాతీయ సంస్థ ఎక్కడ ఉంది?
ఎ) భువనేశ్వర్ బి) హిస్సార్
సి) ఘజియాబాద్ డి) నాగపూర్

సమాధానాలు

1) బి;	2) డి;	3) ఎ;	4) సి;
5) ఎ;	6) బి;	7) సి;	8) బి;
9) డి;	10) బి;	11) బి;	12) ఎ;
13) సి;	14) ఎ;	15) డి;	16) బి;
17) బి;	18) ఎ;	19) బి;	20) డి;
21) ఎ;	22) ఎ;	23) ఎ;	24) ఎ;
25) ఎ;	26) బి;	27) డి;	28) ఎ;
29) సి;	30) ఎ;	31) ఎ;	32) సి;
33) బి;	34) డి;	35) బి;	36) ఎ;
37) సి.			

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్ఎంఎఫ్‌డబ్ల్యూ, ఏపీలో 142 పోస్టులు

ఆంధ్రప్రదేశ్‌లోని హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్.. ఒప్పంద/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో టెక్నీషియన్, ఆఫీస్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» మొత్తం పోస్టుల సంఖ్య :142
» ఖాళీలున్న విభాగాలు: మెడికల్, రేడియోలాజికల్, రేడియోథెరపీ, మౌల్డ్ రూమ్, కార్డియాలజీ, సీటీ, క్లినికల్, సీ-ఆర్మ్, స్పీచ్, డయాలసిస్, అనస్థీషియా, ఎమర్జెన్సీ, మెడికల్, ఆడియోమెట్రీ తదితరాలు.
» అర్హత: పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఆయా పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, బీఎస్సీ, ఎంసీఏ, పీజీతోపాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 42 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీల కు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» ఎంపిక : విద్యార్హతల్లో సాధించిన మార్కులు తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 23.01.2025
» వెబ్‌సైట్ : https://krishna.ap.gov.in/

సీఎన్‌సీఐలో సీనియర్ రెసిడెంట్ పోస్టులు

కోల్‌కతాలోని చిత్తరంజన్ నేషనల్ క్యాన్సర్ నేషనల్(సీఎన్‌సీఐ) తాత్కాలిక ప్రాతిపదికన ఖాళీగా ఉన్న సీనియర్, జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య : 33(సీనియర్ రెసిడెంట్-14, జూనియర్ రెసిడెంట్ -19)
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభా గంలో పీజీ, ఎండీ(ల్యాబ్ మెడిసిన్/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ) ఉత్తీర్ణత ఉండాలి.
» వయసు: సీనియర్ రెసిడెంట్‌కు 45 ఏళ్లు, జూనియర్ రెసిడెంట్‌కు 37ఏళ్లు ఉండాలి.
» వేతనం: సీనియర్‌కు నెలకు రూ.67వేలు, జూనియర్‌కు నెలకు రూ.56,100
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 07.02.2025
» వెబ్‌సైట్: https://cnci.ac.in/doctors-faculties-positions-1

First electronic computer in the world?

BANK EXAMS
COMPUTER AWARENESS

COMPUTER GENERATIONS

Generation in computer terminology is a change in technology a computer is/was being used. Initially, the generation term was used to distinguish between varying hardware technologies. But nowadays, generation includes both hardware and software, which together make up an entire computer system. There are totally five computer generations known till date.

FIRST GENERATION

The period of first generation was 1942-1954.
- First generation of computer started with using vacuum tubes as the basic components for memory and circuitry for CPU (Central Processing Unit).
- In this generation mainly batch processing operating system were used.
- In this generation Punched cards, Paper tape, Magnetic tape Input & Output device were used.

The main features of First Generation are:
- Supported Machine language only.
- Very costly. ❖ Generate lot of heat.
- Slow Input/output device.
- Huge size. ❖ Need of A.C.
- Non portable.
- Consumed lot of electricity.

Some computers of this generation were:
- ENIAC, EDVAC, UNIVAC, IBM-701, IBM-650

SECOND GENERATION

- The period of second generation was 1952-1964.
- This generation using the transistor was cheaper, consumed less power, more compact in size, more reliable and faster than the first generation machines made of vacuum tubes.
- In this generation, magnetic cores were used as primary memory and magnetic tape and magnetic disks as secondary storage devices.
- In this generation assembly language and high level programming language were used.
- There was Batch processing and Multiprogramming Operating system used.

The main features of Second Generation are:
- Reliable as compared to First generation computers.
- Smaller size as compared to First generation computers.
- Generate less heat as compared to First generation computers.
- Consumed less electricity as compared to First generation computers.
- Faster than first generation computers.
- Still very costly. ❖ A.C. needed.

Some computers of this generation were:
- IBM 1620, IBM 7094, CDC 1604, CDC 3600, UNIVAC 1108

THIRD GENERATION

- The period of third generation was 1964-1972.
- The third generation of computer is marked by the use of Integrated Circuits (IC's).
- This development made computers smaller in size, reliable and efficient.
- In this generation Remote processing, Time-sharing, Real-time, Multi-programming Operating System were used.
- High level languages were used during this generation.

The main features of Third Generation are:
- More reliable. ❖ Smaller size.
- Generate less heat.
- Faster. ❖ Lesser maintenance.
- Still costly. ❖ A.C needed.
- Consumed lesser electricity.
- Support high level language.

Some computers of this generation were:
- IBM-360 series, Honeywell-6000 series, PDP (Personal Data Processor), IBM-370/168, TDC-316

FOURTH GENERATION

- The period of Fourth Generation was 1972-1990.
- The fourth generation is made of Very Large Scale Integrated (VLSI) circuits.
- Fourth Generation computers became more powerful, compact, reliable, and affordable. As a result, it gave rise to personal computer (PC) revolution.
- In this generation Time sharing, Real time, Networks, Distributed Operating System were used.
- All the Higher level languages like C and C++, DBASE etc. were used in this generation.

The main features of Fourth Generation are:
- VLSI technology used.
- Very cheap.
- Portable and reliable.
- Use of PC's. ❖ Very small size.
- Pipeline processing.
- No A.C. needed.
- Concept of internet was introduced.
- Great developments in the fields of networks.
- Computers became easily available

Some computers of this generation were:
- DEC 10, STAR 1000, PDP 11, CRAY-1(Super Computer), CRAY-X-MP (Super Computer)

FIFTH GENERATION

- The period of Fifth Generation is 1990-till date.
- In the fifth generation, the VLSI became ULSI (Ultra Large Scale Integration) technology.
- This generation is based on parallel processing hardware and AI (Artificial Intelligence) software.
- All the Higher level languages like C and C++, Java, .Net etc. are used in this generation.

The main features of Fifth Generation are:
- ULSI technology.
- Development of true artificial intelligence.
- Development of Natural language processing.
- Advancement in Parallel Processing.
- Advancement in Superconductor technology.
- More user friendly interfaces with multimedia features.
- Availability of very powerful and compact computers at cheaper rates.

MODEL QUESTIONS

1. The first microprocessor built by the Intel Corporation was called _____
1) 8008 2) 8080 3) 4004
4) 8800 5) None of these
2. Daisy wheel printer is a type of_______
1) Matrix primer
2) Impact printer
3) Laser printer
4) Manual printer
5) None of these
3. The first electronic computer in the world was________
1) UNIVAC 2) EDVAC
3) ENIAC 4) All of above
5) None of these
4. Before a disk can be used to store data it must be _____
1) Formatted 2) Reformatted
3) Addressed 4) Readdressed
5) None of the above
5. _____is network operating system
1) DOS 2) Win-95 3) Win-98
4) WIN-2000 server 5) None
6. Orkut was officially launched _____
1) 20-jan-2004 2)15- jan-2004
3) 26-jan-2006 4)24-jan -2004
5) None
7. Malicious Hacker known as _____
1) White hat hacker
2) Hacker 3) Cracker
4) Ethical 5) None
8. AltaVista, Google and Bing are the example of_____
1) Search engine
2) Brand name 3) Virus name
4) Antivirus program
5) None
9. What is the Transmission rate of fiber optics cable?
1) 10 mbps 2) 1000 mbps
3) 100 mbps 4) 1000 bps
5) None
10. _____ is a search engine introduced by MICROSOFT?
1) Google 2) Khoj.com
3) Bing 4) Yahoo
5) None
11. Tally is __________
1) Open S/W 2) System S/W
3) Application S/W
4) Closed S/W 5) None
12. Keyboard Converts typed in character to __________code
1) Binary 2) ASCII
3) Decimal 4) EBCIDIC
5) None
13. Which of the following sequence is correct?
1) Source code -linker - object code- compiler - executable code
2) Source code - compiler - object code - linker - executable code
3) Object code - compiler - source code - linker - executable code
4) Object code -linker - source code - compiler - executable code
5) None
14. Who developed the language C#?
1) Dennis Ritchie
2) Brian Kernighan
3) Anders Hejlsberg
4) John McCarthy 5) None
15. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ____
1) ISDN 2) Cable modem
3) Microwave 4) DSL
5) DSN
16. Codes consisting of lines of varying widths or lengths that are computer readable are known as____
1) an ASCII code
2) a magnetic tape
3) a bar code
4) an OCR scanner
5) None of these
17. Time required by a sector to reach below the head is known as_____
1) Seek time 2) Latency time
3) Access time
4) Disk time
5) None of these
18. IP-Address 192.5.48.3 belong to_____
1) Class A 2) Class B
3) Class C 4) Class D
5) None of these
19. Internet-like networks within an enterprise known as_______
1) Intranet 2) Internet
3) Extranet 4) Network
5) None of these
20. What is standard Layout of keyboard?
1) QWERTY 2) DVORAK
3) AZERTY 4) 1 and 2
5) None
21. Most powerful computer in a typical network is________
1) Desktop 2) Network client
3) Network server
4) Network 5) None
22. ________Viruses are often transmitted by a floppy disk left in the floppy drive
1) Trojan horse 2) Boot sector
3) Script 4) Logic bomb
5) None of these
23. ________is a combination of black hat and white hat hacker.
1) White hat 2) Grey hat
3) Blue hat 4) Red hat
5) None
24. The ability to recover and read deleted or damaged files from a criminal's computer is an example of a law enforcement specialty called_______
1) Robotics
2) Simulation
3) Computer forensics
4) Animation
5) None of these
25. How many types of database objects are there in MS Access?
1) 5 2) 6 3) 7
4) 8 5) None of these

KEY

1) 3	2) 2	3) 3	4) 1
5) 4	6) 4	7) 3	8) 1
9) 2	10) 3	11) 3	12) 2
13) 2	14) 3	15) 4	16) 3
17) 2	18) 3	19) 1	20) 1
21) 3	22) 2	23) 3	24) 3
25) 3			